# THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY

OU_206247

UNIVERSAL LIBRARY

Osmania University Library

T5903

Call No, T83·01 K92B

Accession No. T 5903

Author కృష్ణారావు, వి. వి

Title బాలమేధావి,

This book should be returned on or before the da
marked below.

# క థా క్ర మ ము

పేజీ


1. బాలమేధావి . 1

2. పెన్సెన్‌డన్ సృష్టించిన విశ్వం .. 49

3. గాంధీలోకం .... 74

# బాలమేధావి

— సి. ఎం. కాన్‌బ్లత్

నేనిప్పుడు వయోవృద్ధుణ్ణి కాబట్టి, యీ తరం వైజ్ఞానికులంటే నాకెంత ఏవగింపో చెప్పడానికి వెనుకాడను. వంటింట్లో తినుబండారాలు తయారుచేసి వడ్డించినట్టే "కొత్త రకం అణువుబాంబు— కోబాల్టు 60 తో సహా యిలా ఒకటి వెయ్యి" అనగానే, తడుముకోకుండా తయారుచేసి అందిస్తున్నారు. ఈ మారణాయుధాల్ని యింత అవలీలగా తయారుచేసి అందించడంలో బాగోగుల్ని, మంచి చెడ్డల్ని, దుష్పరిణామాల్ని గూర్చి, కొంచెం కూడా ఆలోచించని అవివేకులు.

ఈ విషయాన్ని గురించి పెద్ద ఆర్భాటం చేసేవారు కొందరుండేవారు — వెయినర్, యూరే, జిలార్డు, మారిజన్ మొదలైన వారు— వారంతా చచ్చిపోయారు— మనం వారిని మర్చిపోయాం. వారందరికంటె అసలు పెద్ద మరొకడుండేవాడు. అతన్ని గురించి మీరు విని వుండరు. ఎడ్మిరల్ మాక్డొనాల్డు అతని కథని బయటపెట్టలేదు. అసలే

## 2

జూలియా గోమేజ్. అతని భార్య రోజా వ్రాసిన ఉత్తరం ద్వారా అతను న్యూమోనియా వ్యాధితో చనిపోయిన దుర్వార్త నిన్ననే తెలిసింది. "తను జీవించినది 39 సంవత్సరాలే అయినా, దేనికీ లోటు లేకుండా, సుఖంగా, సంతోషంగా మంచితనంతో జీవించినట్లు మీకు తెలియజేయాలని జూలియో అభిప్రాయం." అని కూడా రోజా ఆ లేఖలో బాధపడ్తూ వ్రాసింది.

ఇప్పటికైనా నా తన కథ నలుగురికీ తెలుస్తూ వున్నదంటే. అతను ఎక్కడవున్నాగాని సంతోషించి తీరుతాడని నా తలంపు.

అది ఇరవై రెండు సంవత్సరాలనాటి మాట; — అక్టోబరు నెలలో ఒకనాటి వుదయం, — నా కార్యక్రమం యథాప్రకారం ప్రారంభమైంది. కళాశాలలో భౌతిక శాస్త్ర శాఖకు ముఖ్య అధ్యాపకుడైన డాక్టరు సుగర్మెన్‌ను చూడవలసివుంది. అది ఒక వార్షికోత్సవ సందర్భం — పరమాణు పరిశోధనలలో ఒక ముఖ్యమైన అంశాన్ని కనుగొన్న దినం. మొత్తానికి అది ఏదో అంత స్పష్టంగా నాకు గుర్తురాలేదు, — సన్డే ట్రిబ్యూన్ సంపాదకుడు ఆ విషయాన్ని గూర్చి ప్రత్యేకంగా ఒక పుట పూర్తిగా నింపాలని అనుకున్నారు. అందుకు గాను నలుగురు ముగ్గురు కళాశాల అధ్యాపకుల్ని సంప్రదించి, తగినంత విషయాన్ని సేకరించడం నా పని. సుగర్మెన్ తన భౌతికశాస్త్రశాఖ ఆఫీసులోనే కూర్చుని, కిటికీగుండా, మబ్బులేకుండా ప్రకాశిస్తూ వున్న శరత్కాలపు ఆకాశాన్ని తదేక దృష్టితో చూస్తూ, ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయి ఉన్నారు. ఆయన కొంచెం లావాటి మనిషి. చాలా సరదా అయినవారు. రెండు సంవత్సరాలుగా అక్కడక్కడ విందుల్లోనూ, సమావేశాల్లోనూ కలుసుకుంటూ ఉండేవాళ్ళం. ఆ కొంచెం పరిచయంతో ఆయన నన్ను చూడగా

గుర్తించారు. గుర్తించడమే కాకుండా నా పేరును కూడా జ్ఞాపకం పెట్టుకున్నారు. నన్ను చూచి నవ్వుతూ పలకరించారు.

"ట్రిబ్యూన్ విలేఖరి విల్ సకర్సు కదూ," అంటూ ఆహ్వానించారు.

"అవునండి- డాక్టర్ సుగర్మెన్. అంతా క్షేమమేనా?"

"ఓ- అంతా క్షేమం.—ఏమిటి విశేషం ఇలా దయచేశారు?"

"ఏమీ లేదండి, డాక్టర్ సుగర్మెన్! అణుశక్తిని గురించి, అణు బాంబు నిరోధాన్ని గురించి, మీ అభిప్రాయమేమిటో తెలుసుకోవాలని వచ్చాను. ఈ సమస్యలన్నింటికి ముఖ్య కారణం ఏమిటంటారు?"

ఆయన కళ్ళు ఒకసారి మిలమిల మెరిశాయి. ఏదో ఒక వింత విషయం చెప్పబోతున్నట్లు నావంక చూచారు. "విద్యలేకపోవడం" అని ఒక్క-మాట అని, ఆయన మాటకు నేను ఆశ్చర్యపడతానో లేదో అన్నట్లు నావంక చూచారు. నిజానికి నేను ఆశ్చర్యచకితుణ్ణైనాను.

"మీ దృక్పథం కొంచెం చిత్రంగా వుంది, డాక్టర్! మీరు దీన్ని ఎలా సమర్థిస్తారు?" అని ప్రశ్నించారు.

తన అభిప్రాయాన్ని పునరుద్ఘాటిస్తూ ఆయన గట్టిగా చెప్పారు. "విద్య- సాంకేతిక విద్య-విరివిగా వ్యాపించాలి. అప్పుడుగాని మన సమస్యలు పరిష్కారం కావు, ప్రజాబాహుళ్యం యొక్క అజ్ఞానం చూస్తుంటే నాకు ఎంతో విచారంగా వుంటుంది. సామాన్య మానవునికి శాస్త్ర విజ్ఞానం అంటే పూర్తిగా తెలియదు. శాస్త్ర విజ్ఞానం వల్ల మనం ఏమి సాధించామో అసలే తెలియదు. వారి అజ్ఞానం కారణంగా-వైజ్ఞానికులంటే చులకనగా చూస్తారు; విజ్ఞానశాస్త్రాన్నే హేళన చేస్తున్నారు. నీకొక ఉదాహరణ చూపుతాను ఉండు-" అంటూ, బల్లమీద చిందరవందరగా పడివున్న కాగితాలలో వెతకి

పిచ్చిగీతలు గీసినట్టున్న రూళ్ళ కాగితాన్ని నా చేతిలో పెట్టి "ఈ ఉత్తరం చూడు," అన్నారు. కోడికెక్కిరింపునుపోలిన కనీకనపడని పెన్సిల్ వ్రాతను, అతి కష్టంమీద ఇలా చదవ గలిగాను:

"మహాశయా అక్టోబరు 12

అణుశాస్త్ర వైజ్ఞానికులైన మీకు నేను సవినయంగా విన్నవించుకొనేదేమిటంటే, నేను 17 ఏండ్ల యువకుణ్ణి. భౌతికశాస్త్ర గణిత విభాగంలో ప్రవీణుణ్ణి కావాలన్న కోర్కెతో పని చేస్తున్నాను. నాకు యింగ్లీషు భాష అంతగా తెలియదు. ఎందుకంటే నేను న్యూయార్క్‌లో ఒకే సంవత్సరం వున్నాను. నా తల్లిదండ్రులు బీద వాళ్ళు. అందువల్ల హోటళ్లలో గిన్నెలు కడగటానికి చేరాను. నేను వ్రాసే తప్పులకు క్షమార్పణ కోరుతున్నాను.

వైజ్ఞానికులైన మీ యొక్క అమూల్యమైన కాలాన్ని పాడు చేస్తానేమోనని సంకోచిస్తున్నాను. అయినా నా ఉత్సాహాన్ని మన్నించి కొన్ని నిమిషాలు నాపనికై వినియోగిస్తారని ఆశిస్తున్నాను. రియాక్టర్లలో బోరన్‌స్టీల్ యొక్క వినియోగాన్ని గురించి, ఒక సిద్ధాంతం రూపొందించడాన్కి గణితం చేస్తున్నాను. బ్రీడరు రియాక్టరులో కావలసింది:

$$U = \frac{X}{1} + \frac{X^5}{1} + \frac{X^{10}}{1} + \frac{X^{15}}{1} + \text{———}$$

బోరన్‌స్టీల్ పై న్యూట్రాన్ పరిగ్రహణం శక్తి ఎంతంటే—.

$$V = \frac{X^{\frac{2}{3}}}{1} + \frac{X}{1} + \frac{X^2}{2} + \frac{X^3}{1} + \text{———}$$

పై రెంటినీ జతచేస్తే ఏమొస్తుంది?—

$$V^5 = U\,\frac{1-2U+4U^2-3U^3+U^4}{1+3U+4U^2+2U^3+U^4}$$

అంటే ప్రీసిటులో శక్తి నాలుగురెట్లు పెరగాలి. ఎందుకో నాకు పెరుగుదల సంతృప్తిగా లేదు. మీరు దీన్ని పరీక్షించి నేను ఎక్కడ పొరబాటు చేశానో, సూచించవలసినదని నా కోర్కె. మీకు నా అభినందనలు.

మీ,
జె. గోమేజ్
c/o ఆస్ట్రియల్ భోజన శాల,
నెం. 124, వ వీధి,
సెయింట్ నికొలస్ ఎవెన్యూ
న్యూయార్కు."

నేను నవ్వుతూ డాక్టర్ సుగిర్తన్‌తో అన్నాను, "అద్భుతం, ఇలాంటి ప్రశంసాపత్రాలు మీరు రాసే ఉత్తరాలు మాకు రాస్తే బాగుంటుంది, రాయి లే! నా ఆఫీసులోకి చొరబడి సంపాదకుణ్ణి చూడాలంటారు. చూడండి. ఈ ఉత్తరం ప్రకటించాలనుంది నాకు, ఏమంటారు? జనానికి తెలియాలండీ ఇలాంటివి."

ఆయన కొంచెం సంకోచిస్తూ అన్నారు. "కావలిస్తే, పత్రికలో వేస్తే వేయొచ్చుకాని, నా పేరు మాత్రం బయటపెట్టకు. ఎవరో ఒక భౌతిక శాస్త్రజ్ఞుడని వ్రాయి. ఇదంత పెద్ద హాస్యాస్పదమైన విషయమని నేననుకోలేదు సుమా. కాని నీ అభిప్రాయం బోధపడింది. ఆ పత్రవాడు బహుశః పిచ్చివాడేనేమో. అయితే వాడి నమ్మకం ఉందే. ఏదీ?— భౌతిక శాస్త్రమంటే ఆయిమాయి గారడీ అనీ, ప్రతి సమస్యకూ గాని అంకె పట్టవచ్చుననీ— ఆ నమ్మకం ఉన్నవాళ్లు ఎంతో మందున్నారు."

అట్లా కొంచెంసేపు ఆయనతో గడిపి నేను ఆఫీసుకి వెళ్ళేను, జరిగిన విషయమంతా వ్రాయడానికి ఒక 20 నిమిషాలు పట్టింది.

# 6

గోమేజ్ లేఖను అణుశాస్త్ర వార్షికపుటలో ప్రత్యేక శీర్షిక క్రింద ప్రచురించాలని సంపాదకుణ్ణి ఒప్పించడాన్కి మరి కొంత సేపు పట్టింది. కాని దాన్ని తిరిగి టైపు కొట్టి యివ్వవలసి వచ్చింది—అలాగే దాన్ని పంపిస్తే పనివాళ్లు సమ్మెచేసేవాళ్ళే.

ఆదివారం వుదయం—ఆరుగంటల పదిహేనునిమిషాలకు, నేను వున్న హోటలు గది తలుపులు ఎవరో దబదబా బాదడం విని లేచాను. చెప్పులు తొడిగి, భుజాన తువాలు వేసుకొని తలుపు తీయడాన్కి వెళ్ళేను. నేను గడియ తీసేంతవరకూ కూడా వాళ్ళు ఆగలేదు. వాళ్ళ దెబ్బలకు గడియవూడి తలుపు తెరుచుకుంది. హోటలు గుమాస్తా, సన్డేపత్రిక సంపాదకుడు నా ముందు ప్రత్యక్షమయ్యారు. వారితోపాటు ముగ్గురు మోటు మనుష్యులు, ఒక వృద్ధుడు వున్నారు. ఆ వృద్ధుని ముఖం ఎందుకో వెలవెలబోయివుంది. హోటలు గుమాస్తా ఏదో గొణుగుతూ వెళ్ళిపోయాడు. మిగతావారు గదిలో జొరబడ్డారు. "ఏమిటిదంతా" అని నేను సంపాదకుణ్ణి అడిగాను. ఆ ముగ్గురిలో ఒకడు గుమ్మాన్కి అడ్డంగా నిలబడ్డాడు. ఇంకొకడు కిటికీకి అడ్డంగా నిలబడ్డాడు. మూండవవాడు స్నానాలగదికి అడ్డంగా నిలబడ్డాడు. ఆ వృద్ధుడు నా మాటకు అడ్డం తగిలి సంపాదకుడిని అడిగాడు "ఇతనేనా విల్ షక్?" అని. సంపాదకుడు అవునన్నట్లు తల వూపాడు. "వెతకండి" అన్నాడు వృద్ధుడు అధికారం సూచిస్తూ. కిటికీ దగ్గరవున్న వ్యక్తి నావద్దకు జరిగి ఆయుధాలకొరకు నా దుస్తులన్నీ వెతికాడు. నేను వెర్రివాడిలా ఏమిటో తెలియక చూస్తున్నా. సంపాదకుడు నా ముఖం చూడలేక యింకోప్రక్కకు చూస్తూ నిలుచున్నాడు.

వెతకడం అయ్యాక వృద్ధుడన్నాడు.

# 7

"నేను రియర్ ఎడ్మిరల్‌ని. నా పేరు మాక్డొనాల్డు. అమెరికా అణుశక్తి పరిషత్ రహస్య రక్షణశాఖకు సహాయ నిర్వాహకుడిగా యిక్కడకు వచ్చాను. విల్‌షక్! యిది నీవేనా వ్రాసింది?" అంటూ అతను నా ముఖాన్కి ఒక వార్తాపత్రిక విసిరికొట్టాడు.

నేను చదివాను.

"హోటల్లో చెప్పులు తుడిగే కుర్రవాడికి అర్థం కానిది అణుశాస్త్రంలో మాత్రం ఏముంటుంది?"

వైజ్ఞానికులు ఎంత కష్టపడి పనిచేస్తారో, సామాన్య ప్రజ గుర్తించలేకున్నారని డాక్టరు సుగర్మెన్ యొక్క అభిప్రాయం. ఇటీవల యీ వూరిలోవున్న ఒక ప్రముఖ అణుశాస్త్ర వైజ్ఞానికునికి అందిన లేఖ మూలంగా యీ అభిప్రాయం నిజమని రుజువైంది, ఆ లేఖను అందులోవున్న గణిత సూత్రాలతో సహా ఇందు పొందుపరుస్తున్నాము.
"మహాశయా!

అణుశాస్త్ర వైజ్ఞానికులైన మీకు నేను సవినయంగా మనవి చేసుకొనేదేమిటంటే నేను ఒక 17 ఏండ్ల యువకుణ్ణి, భౌతిక శాస్త్ర గణిత విభాగంలో ప్రవీణుణ్ణికావాలన్న కోర్కెతో పనిచేస్తూ వున్నాను............"

"ఔను ఆ శీర్షిక తప్ప మిగతా విషయమంతా నేనే వ్రాశాను. ఏం? అందులో ఏం తప్పు?" అన్నాను.

అతడు నా మాటకు అడ్డుతగిలి "న్యూయార్కులో వుండే ఎవరో ఒక పిల్లవాడు ఏదో విషయం తెలుసుకోవాలని యీ వుత్తరం వ్రాశాడు. అయితే అసలు విలాసం ఇందులో లేదు. ఎంచేత?" అని గట్టిగా అడిగాడు. నేను బహుశాంతంగానే బదులు చెప్పాను. "నేను అచ్చు వేయడాన్కి యిచ్చినప్పుడు విలాసం వదిలివేశాను. ఇది మా వార్తా పత్రికలో ఎప్పుడూ మామూలే. దాన్కి ఎందుకింత గొడవ

అతను నా ప్రశ్న వినిపించుకోనట్లుగా "ఏది అసలు లేఖ ఎక్కడుంది?" అని అడిగాడు.

నేను జ్ఞాపకం తెచ్చుకొని "నా లాంగు జేబులో పెట్టుకొని ఉంటాను, తీస్తానుండండి." అంటూ కుర్చీమీదనున్న లాగును అందుకోబోయాను.

"దాన్ని అల్లాగే పట్టుకోవయ్యా" అన్నాడు ప్రసంగవేదిక్క నిలుచున్న యువకుడు. నేను అల్లాగే పట్టుకొన్నా. అతను జేబులన్నీ వెతికాడు. గోమేజ్ లేఖ నా కోటు జేబులో దొరికింది. దానిని తీసి ఎడ్మిరల్ కు యిచ్చాడు. అతను కవరులోవున్నదాన్ని, పుస్తకంలో వున్నదాన్ని పోల్చిచూచుకొని రెండింటినీ జేబులో పెట్టుకొన్నాడు.

అతను ట్రిబ్యూను పంపించినట్లే, నవ్వాపుకొని నిష్ఠూరంగా అన్నాడు, "మీ సహకారానికి అభినందనాలు—— అయితే జాగ్రత్త! యీ విషయాన్ని మూడోకంటివాడికి తెలుపకూడదు. తెలుసా? దీన్ని గూర్చి వ్రాయకూడదు. దేశ రక్షణకు సంబంధించిన పెద్దరహస్యం ఇది. జాగ్రత్త! నమస్తే!"

అతను, మిగతా ముగ్గురు, గుమ్మందగ్గిరకు వెళ్ళేరు. సంపాదకుడు ధైర్యం తెచ్చుకొని "ఇది వినండి ఎడ్మిరల్! రేపుదయం ట్రిబ్యూన్ పత్రికలో యీ వృత్తాంతాన్ని మొట్టమొదటి పుటలో పెద్దక్షరాల్లో ప్రకటించబోతున్నాము!!" అన్నాడు. ఎడ్మిరల్ తెల్లబోయాడు. కొంచెంసేపు వూరుకొని అన్నాడు.

"ఏక్షణానైనా ప్రపంచయుద్ధం రావచ్చుననీ, ఈ దేశం అందులోకి దూకక తప్పదనీ మీకు తెలుసు. సరిహద్దు సంఘర్షణలలో ప్రతిరోజూ అమెరికన్ యువకులు ఆహుతి అయిపోతున్నారు. ఎందుకు?

దేశరక్షణ విషయంలో ఇటువంటి చిన్న సహకారాన్ని నిరాకరించే మీబోటి పౌరులను రక్షించడానికా?"

సంపాదకుడు నా పక్కమీద ఒక మూల కూచుని సిగరెట్టు ముట్టించాడు. "ఇది అంతా నాకు పూర్తిగా తెలుసునండి ఎడ్మిరల్, ఇది స్వతంత్రదేశమని నాకు తెలుసు. ఇక్కడి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఎట్లా కాపాడుకోవాలో కూడా నేను ఎరుగుదును. చట్టవిరుద్ధంగా యిట్లా యిల్లు జొరబడి వెతకడం, పత్రాలు స్వాధీనంచేసుకోవడాన్ని గురించి పత్రికాముఖంగా ఎట్లా బయటపెట్టాలో కూడా నే నెరుగుదును!" అని నెమ్మదిగా అన్నాడు.

"నా ఉద్యోగధర్మంమీద ఆనపెట్టి చెపుతున్నా. మీరు యీ విషయాన్ని ప్రకటించడంవల్ల దేశానికి చాలా ముప్పు కలుగుతుంది!" అని ఎడ్మిరల్ చెప్పేడు.

"మీ ఉద్యోగధర్మమా?" వారంటులేకుండానే యీ గదిలో జొరబడ్డారు, ఇది న్యాయవిరుద్ధమని మీకు తెలియదా? మీ భటులు విల్‌షక్ కాలు కదిపితే తుపాకి పేల్చడానికి సిద్ధంగా నిలబడ్డారే ఇదేనా మీ మర్యాద?" అని సంపాదకుడన్నాడు. ఆ మాటలు విన్న నాకు కొంచెం చెమటలు పోశాయి.

ఎడ్మిరల్ కొంచెం కుదుటపడి అన్నాడు "నేను క్షమార్పణ కోరుతున్నాను. నేను అకస్మాత్తుగావచ్చి మీ ఎడల అగౌరవంగా ప్రవర్తించినమాట వాస్తవం. అందుకు నేను క్షమార్పణ వేడుకుంటున్నాను. ఒక అతిముఖ్యమైన కారణంవల్ల నేనిట్లా చేయవలసి వచ్చింది. రక్షణకు సంబంధించిన అతి ప్రధానమైన సమస్య యిందులో వుంది, దీన్నిగురించి ఏవిధమైన ప్రచారము చేయమని, పెద్దమనుష్యులుగా నాకు మీరు మాట యివ్వండి."

# 10

"అయితే మీరు ఒక షరతుకు ఒప్పుకోవాలి. గోమేజ్ కథను ప్రచురించడానికి సర్వాధికారం ట్రిబ్యూన్ పత్రికదే, అందుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించడానికి విల్ పెక్‌కు మీ పూర్తి సహకారం కావాలి. ఆ పక్షంలో మీ అనుమతి పొందేవరకూ ఆ విషయాలేవీ ప్రకటించం.

"సరే" అన్నాడు అడ్మిరల్, అనిష్టంగానే. ట్రిబ్యూన్ సంపాదకుడు ఇంతసేపూ ఇటువంటి ఒప్పందంకోసమే ఎదురుచూస్తున్నాడని, అకస్మాత్తుగా అతనికి అర్థమైంది.

ఎడ్మిరల్ న్యూయార్కుకు బయలుదేరిన విమానంలో నన్ను కూడా ఎక్కించుకున్నాడు. అతను సుఖంగాలేడు. జరిగిన అసందర్భాన్ని ఎలాగైనా సద్దుకోవాలన్న కృత నిశ్చయంతో, నాతో సుస్తి సరిగా అన్నాడు."

"సరిగా తెల్లవారుఝామున మూడుగంటలకు—టెలిఫోన్ మోగడంతో మెలకువవచ్చింది. అణుశక్తి పరిషత్ధ్యక్షుడు మాట్లాడాడు. వైజ్ఞానిక సలహా సంఘసభ్యుడైన డాక్టర్ మన్రో అతని కొకవార్త చెప్పాడట. డాక్టర్ మన్రో అర్ధరాత్రివరకూ పని చూచుకుని నిద్రపోవడానికి—ముందు ట్రిబ్యూన్ పత్రిక చదివాడట. అందులో గోమేజ్ లేఖ చదివి ఉగ్రుడైపోయాడట: కారణం—గోమేజ్ లేఖలో వివరింపబడ్డ సిద్ధాంతంపైన డాక్టర్ మన్రో ఎంతోకాలంనుంచి కృషిచేస్తున్నాడట. పరమాణుశక్తిని గూర్చిన అతి ముఖ్యమైన సిద్ధాంతం ఇది. అంతే కాదు, జాతి రక్షణకు సంబంధించిన విషయం, ఇన్నాళ్ళూ దీన్ని ఎంతో రహస్యంగా అట్టిపెట్టారు. గోమేజ్ అన్న కుఱ్ఱవాడు ఈ రహస్యాన్ని ఎలాగో సంగ్రహించి, తానొక అణుశాస్త్రవేత్తగా చలామణి అవాలని ప్రయత్నించాడు."

# 11

మాసిన గడ్డం తడుముకుంటూ ఇలా అన్నా:

"ఎడ్మిరల్! నాకు టోకరాకొట్టడం లేదుగదా? ఈ మూడు పంక్తుల అంకెల్లో అణురహస్యం అంతా ఉందంటే నమ్మకం ఎలా?"

ఎడ్మిరల్ నెమ్మదిగా సంకోచిస్తూ చెప్పాడు, "బ్రీడర్ రియాక్టరుకు సంబంధించిన రహస్యం అది. ఇంతకన్నా నేను ఏమీ చెప్పలేను."

"ఆ మాటేదో ఆ లేఖలోనే ఉన్నదిగదా! గోమెజ్ ఈ సమీకరణాల్ని, అంకెల్ని దొంగిలించటమే కాకుండా ఇవి బ్రీడర్ రియాక్టరుకు సంబంధించినవని కూడా గ్రహించాడని అంటావా?" అని తిరిగి అడిగాను.

"ఎక్కడో ఏదో పెద్ద పొరపాటే జరిగింది. ఇది రష్యాలో కపిట్జా లాంటి శాస్త్రజ్ఞుడైనా- ఈ సిద్ధాంతంలోని యథార్థాన్ని గ్రహించడానికి అతనికి ఎంతో కాలం పట్టును. ఎంత సునాయాసంగా ఈ విజ్ఞాన రహస్యం రష్యావారి హస్తగతమైపోయింది." విచారాన్ని వ్యక్తపరుస్తూ ఎడ్మిరల్ బరువుగా మాట్లాడాడు.

నాకు ఏమీ పాలుపోక ఆలోచనలో పడ్డాను. అంతలో విమానం న్యూజెర్సీ దాటింది- "ఇంకో ఐదు నిమిషాల్లో గమ్యస్థానం చేరుకుంటాం. న్యూయార్కులో మన విమానం ముందుగా దింపడానికి అనుమతి యిచ్చారు." అని విమాన చోదకుడు చెప్పాడు.

"మంచిది! అక్కడ దిగినతరువాత ఆలస్యం కాకుండా ప్రయాణీకుల కారు నొకదాన్ని సిద్ధంగా ఉంచమని రేడియోలో చెప్పు" అని ఎడ్మిరల్ ఆదేశించాడు.

"ప్రయాణీకుల కారా?" అని ఆశ్చర్యంతో అడిగాను.

"అవును మామూలు ప్రయాణీకుల కారే. మనం ఏమీ ఎక్కువ ఆర్భాటం చేయకూడదు. గోమెజ్‌ను గురించిగాని, అతని లేఖలోని అంశాన్ని గురించిగాని ఎవరి మనస్సుల్లోనూ ఏవిధమైన సందేహాలూ

కలిగించకుండా మనం అతి జాగ్రత్తగా ప్రవర్తించాలి. అమెరికన్ వార్తా పత్రికలు, వార పత్రికలు, రష్యాలో తప్పని సరిగా చదువుతూ వుంటారు. ఇప్పటికప్పుడే ట్రిబ్యూన్ పత్రిక కూడా రష్యాకు రవాణా అయివుంటుంది. ఈ రవాణాను మనం ఆపుచేస్తే, ఇందులో ఏదో ప్రత్యేక వార్తలున్నాయన్న సందేహాన్ని వారి మనస్సులో రేకెత్తించిన వారమౌతాము." అని ఎడ్మిరల్ నా మాటకు సమాధానం చెప్పాడు.

విమానాశ్రయం చేరుకున్నాము. మేమయిదుగురం విమానం నుండి దిగాం. మా కొరకు సిద్ధంచేయబడ్డ కారులో ఎక్కాం. ఆ కారు అంత పాతడొక్కు కారూ కాదు, మరీ అంత కొట్టొచ్చేటంత కొత్తదీ కాదు. కారు డ్రైవర్‌ను దింపేసి, ఎడ్మిరల్ తో వచ్చిన ఒక భటుడు తానే కారును నడప నారంభించాడు. విమానాశ్రయంనుండి స్పానిష్ హార్లెం చేరేటంతవరకూ మేమెవ్వరమూ ఆట్టే మాట్లాడలేదు. మధ్యలో ఎడ్మిరల్ మాత్రం ఒకసారి సిగరెట్టు వెలిగించి కంగారు కంగారుగా రెండు దమ్ములుపీల్చి దాని సగాల పారవేశాడు.

పోర్ట్‌బెల్ హోటల్ చేరుకున్నాము. ఇరుకుగా ఉన్న సందుల్లో ఇళ్ళమధ్య ఉన్నది ఆహోటల్. అందులో ముందు భాగం సరుకులకొట్టు, వెనుకభాగం భోజనశాల. మా కారు ఆగే ఆగటంతోటే అక్కడ ఆడుకుంటూవున్న చిన్నపిల్లలంతా కళ్లు పెద్దవిచేసుకొని కారు చుట్టూ మూగి "కారుకి కాపలా కావాలా?" అని వినయంగా అడిగారు. ఎడ్మిరల్ స్పానిష్ భాషలో ధారాళంగా వాళ్ళను బెదరించడం నేను విని ఆశ్చర్యపోయాను. పిల్లలు కూడా బెదరిపోయి వాళ్ళపాటికి వాళ్లు గోటీ బిళ్ళలు ఆడుకోవడానికి వెళ్ళిపోయారు.

"ఎడ్మిరల్ తనతో వచ్చిన హొగ్గిన్స్‌ను పిలిచి ఆ హోటల్‌కి వెనుక పక్కనుండి దారిఉన్నదేమో చూచిరమ్మన్నాడు. హొగ్గిన్స్ కారుదిగి

# 11

మాసిన గడ్డం తడుముకుంటూ ఇలా అన్నా:

"ఎడ్మిరల్! నాకు బోకరాకొట్టడం లేదుగదా? ఈ మూడు పంక్తుల అంకెల్లో అణురహస్యం అంతా ఉందంటే నమ్మడం ఎలా?"

ఎడ్మిరల్ నెమ్మదిగా సంకోచిస్తూ చెప్పాడు, "బ్రీడర్ రియాక్టరుకు సంబంధించిన రహస్యం అది. ఇంతకన్నా నేను ఏమీ చెప్పలేను."

"ఆ మాటేదో ఆ లేఖలోనే ఉన్నదిగదా! గోమేజ్ ఈ సమీకరణాల్ని, అంకెల్ని దొంగిలించడమే కాకుండా ఇవి బ్రీడర్ రియాక్టరుకు సంబంధించినవనికూడా గ్రహించాడని అంటావా?" అని తిరిగి అడిగాను.

"ఎక్కడో ఏదో పెద్ద పొరపాటే జరిగింది. ఇది రష్యాలో కపిట్జా 'ంటుప ట్టేనా-ఈ సిద్ధాంతంలోని యథార్థాన్ని గ్రహించడానికి అతనికి ఎంతో కాలం పట్టదు. ఎంతో సునాయాసంగా యీ విజ్ఞాన రహస్యం రష్యావారి హస్తగతమైపోతుంది, "విచారాన్ని వ్యక్తపరుస్తూ ఎడ్మిరల్ బరువుగా మాట్లాడాడు.

నాకు ఏమీ పాలుబోక ఆలోచనలో పడ్డాను. అంతలో విమానం న్యూజెర్సీ దాటింది- "ఇంకో ఐదు నిమిషాల్లో గమ్యస్థానం చేరుకుంటాం. న్యూయార్కులో మన విమానం ముందుగా దింపడాన్కి అనుమతి యిచ్చారు." అని విమాన చోదకుడు చెప్పాడు.

"మంచిది! అక్కడ దిగినతరువాత ఆలస్యం కాకుండా ప్రయాణీకుల కారు నొకదాన్ని సిద్ధంగా ఉంచమని రేడియోలో చెప్పు" అని ఎడ్మిరల్ ఆదేశించాడు.

"ప్రయాణీకుల కారా?" అని ఆశ్చర్యంతో అడిగాను.

"అవును మామూలు ప్రయాణీకుల కారే. మనం ఏమీ ఎక్కువ ఆర్భాటం చేయకూడదు. గోమెజ్‌ను గురించిగాని, అతని లేఖలోని అంశాన్ని గురించిగాని ఎవరి మనస్సుల్లోనూ ఏవిధమైన సందేహాలూ

# 14

గోమేజ్ వయస్సు పదిహేడు సంవత్సరాలు. అయితే పదిహేను సంవత్సరాల కుర్రవాడిలాగా అగుపడతాడు; పొట్టిగా, సన్నగా ఉన్నాడు. వర్జీనియా పొగాకువలె మెరసిపోయే శరీరచ్ఛాయ, వంపులులేకుండా తిన్నగా నల్లగా మెరుస్తూ ఉండే జుట్టూనూ. మాటి మాటికీ అంగవస్త్రానికి చేతులు తుడుచుకుంటూ చెమటలు కక్కుతూ ఉన్న ముఖము మీదకు జారిన జుట్టును వెనక్కు నెట్టుకుంటూ, ఒక్క నిమిషమయినా విరామంలేకుండా కడిగే పళ్ళాలు కడుగుతూ, తుడిచేవి తుడుస్తూ ఒక యంత్రంలాగా పనిచేస్తున్నాడు. ఆవగింజంత విసుగ్గాని కోపంగాని కనబర్చటంలేదు. అతని ముఖంలో ఏదో అస్పష్టమయిన మందహాసం—ఆ సుఖం ఎప్పుడూ అలాగే ఉంటుందని తరవాత తెలుసుకున్నా— అతని చూపులా వంట ఇంటిని చూడ్డంలేదు; ఎక్కడో దూరతీరాలమీద లగ్నమై వున్నాయి. వంటవాడు తన రాజ్యాన్ని కొల్లగొట్టుకు పోతాంమేమో నన్నట్లు మమ్మల్ని చూడగానే సుఖం ముడుచుకొని చీదరించుకున్నాడు. గోమేజ్ మాత్రం తన లోకంలో తను ఉన్నాడు. మేమక్కడ ఉన్నామన్న మాటే ఆతను గుర్తించినట్టులేదు. హఠాత్తుగా నాకొక వెఱ్ఱి ఊహ తట్టింది—

ఎడ్మిరల్ స్పానిష్ భాషలో గోమేజ్‌ను పలకరించాడు. అతని ఊరూ, పేరూ అన్నీ అడిగాడు. గోమేజ్ కూడా, పళ్ళాలు కడగడం ఆపుచేసి, ఎడ్మిరల్ అడిగిన ప్రశ్నలన్నింటికీ నదురు బెదురు లేకుండా జవాబులు చెప్పాడు. "న్యూయార్క్ ఆరోగ్యశాఖ", అన్నాడు ఎడ్మిరల్, అంటువ్యాధే అనుమానంలేదు." ఎడ్మిరల్ అంతటితో ఆగక, గోమేజ్ రెండుచేతులు పట్టుకుని, పైకి కిందకు ఊపి, విమర్శగా పరిశీలించాడు. బల్లలదగ్గర భోజనాలు చేస్తున్నవారు గుసగుసలు ప్రారంభించారు. వంటయింట్లో గొడవ ప్రారంభమైంది. తన హోటల్లో ఎడ్మిరల్ చేస్తూవున్న రభస హోటల్ ప్రతిష్ఠకు భంగకరమని

యజమానురాలు ఘుసరుసలాడింది. తీరా - గోమేజ్‌ను పట్టుకుపోతే తనకు అంట్లు కడిగేవాడు ఉండడేమో అని ముసిలి వంటవాడు బాధ పడ్డాడు. ఈ సంభాషణలవల్ల తన పని ఆగిపోతూవున్నదని గోమేజ్ ఒంగరపడ్డాడు.

ఎడ్మిరల్ మాత్రం వీరి మాట లేపీ లక్ష్యపెట్టకుండా తన మాటే నెగ్గించుకున్నాడు. మరొక ఐదు నిమిషాల్లో మేము గోమేజ్‌తో సహా హోటలునుండి బయలుదేరాం- ఏ కారణంవల్లో గోమేజ్‌ను రక్షక భటులు తీసుకుపోతున్నారని అక్కడివారనుకున్నారు, గల్లాపెట్టి దగ్గర కూర్చున్న పిల్లమాత్రం-"గోమేజ్!" అని భయంతో అరిచింది. ఆ అరుపేదీ అతని చెవిని బడలేదు.

గోమేజ్ కారులో కూర్చున్నాడు. అతని పెదవులమీద ఆ చిరునవ్వే. అతని కళ్లలో అనంతంలోకి చూస్తున్న ఆ దూరపు చూపులే. ఊళ్లోకి వెళ్ళి, ఫోలిస్క్వేర్ దగ్గర కారు నిలిపాము. ఎడ్మిరల్ ఏమంటాడో అన్న భయంతో నేను అంతసేపూ నోరు మెదపలేదు. ప్రభుత్వ భవనం దగ్గర మేమంతా కారు దిగాము. గోమేజ్ అప్పుడు మాత్రం ఆశ్చర్యంతో అన్నాడు, "ఇదేమిటి? ఇది హాస్పిటల్ కాదే!" అని. మే మెవరం బదులు చెప్పలేదు. మెల్లిగా మెట్లెక్కనిచ్చి లిఫ్ట్ గదికి తీసుకు వెళ్లాం. లిఫ్ట్‌మీద అతని చుట్టూ నిలబడి పై అంతస్తుకు వెళ్లాము. అలా తీసుకుపోతే ఎవరైనా గాభరాపడిపోతారు-నేనైనాసరే. ఏ తప్పుచెయ్యని మనిషే ఉండడు. ఆ పాపభీతి అతన్ని పట్టుకు పీడిస్తుంది, కాని ఆ కుర్రవాడిదేమీ పట్టించుకున్నట్టేలేదు. వట్టి మట్టి బుర్ర అయి ఉంటాడని నిర్ణయించుకున్నాను. లేక ఒకవేళ? మళ్లీ వెనకటి వెర్రి ఊహ మనసులో మెరిసింది.

"అమెరికా సంయుక్త రాష్ట్రాల అణుశక్తి పరిషత్తు-రక్షణ రహస్య శాఖల కార్యాలయం" అని ఒక గదిముందు అద్దాల తలుపు

మీద వ్రాసివుంది. ఎడ్మిరల్ తోసహా మేమంతా అకస్మాత్తుగా ప్రవేశించడం చూచి అక్కడున్నవారు తెల్లబోయారు. అక్కడ అధికారిని అవతలికి పంపించి, ఎడ్మిరల్ అతని కుర్చీలో కూర్చున్నాడు. గోమేజ్ అతనికి ఎదురుగ్గా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. మేమంతా ఏమీ తోచకుండా తలొక మూలా సర్దుకున్నాము.

సంభాషణ ప్రారంభమైంది. ఎడ్మిరల్ తన జేబునుండి గోమేజ్ లేఖను తీసి, దాన్ని అతనికి అందనంతదూరంలో చూపిస్తూ "ఇది వ్రాసింది నీవేనా" అని ప్రశ్నించాడు.

"ఓస్–అదా, పోయినవారం నేనే దాన్ని వ్రాశాను, అయితే, మీరన్నట్టు నాకు అనారోగ్యం ఏమీ లేదన్నమాట. ఏలే!" తన గుండె మీద ఉన్న పెద్దభారం దిగిపోయినట్లుగా అన్నాడు గోమేజ్.

"మాకు, ఆ సమాచారాన్ని నీవు ఎక్కడనుండి సంగ్రహించావో చెప్పు."

"వాటిని నేనే స్వంతంగా వ్రాశాను," అని గర్వంగా అన్నాడు గోమేజ్.

ఎడ్మిరల్ ఎటకారంగా నవ్వుతూ అన్నాడు, "నా కాలం వృథా చెయ్యొద్దు. నిజం చెప్పు – నీవు వీటిని ఎక్కడనుండి సంగ్రహించావో."

గోమేజ్ కొంచం కోపంగా అన్నాడు, "నేను అబద్ధాలు ఆడుతున్నానని అనడానికి మీరెవరండీ? "పెద్ద శాస్త్రవేత్తల్లా చురుకైన వాణ్ణి కానుగానేను. ఏమున్నా తప్పులు చేశానేమో. డాక్టర్ సుగర్మెన్ గారికి విసుగుపుట్టించానేమో! అంతమాత్రాన్ని నన్నాయన పోలీసుల కప్పగిస్తాడా? నా ఉత్తరంలో స్పష్టంగా రాశానే ఆయన కిష్టం లేకపోతే జవాబు రాయనక్కర్లేదని. నేనే నేరం చెయ్యలేదు, నన్ను పట్టుకోడానికి మీ కధికారం లేదు."

# 17

ఈ మాటలు విసుగ్గా విని ఎడ్మిరల్ "అయితే పోనీ చెప్పు- నీవు ఈ సమీకరణాల్ని ఎలా వేశావో!-" అన్నాడు.

"అల్లాగే" అని ముఖం ముడుచుకునే గోమేజ్ ప్రారంభించాడు. "ఐదుసంవత్సరాలక్రితం, ప్రొఫెసర్ ఓపెన్‌హామ్ మ్యాట్రిక్స్ మెకానిక్స్‌లో న్యూట్రాన్ పరిభ్రమణాల్నిగూర్చి ఏం వ్రాశాడో మీకు తెలుసునా ? ఆయన కొన్ని సమీకరణాల్ని వేసి చూపించాడు. ఆయన వ్రాసింది ఒక నడకకు సంబంధించిన యు-సూత్రాలు. వీటి నుండి నేను మరొక నడకకు సంబంధించిన వి- సూత్రాలను లెక్కించి, యు- వి- సూత్రాలకుగల అనుబంధాన్ని నిర్ణయించే సమీకరణాలను వ్రాశాను."

ఎడ్మిరల్ విసుగ్గానే, "అంతా వ్రాసుకున్నావా లేదా ?" అని ప్రక్కనున్నవాణ్ణి అడిగాడు. "వ్రాశానండి" అన్ని ఆ సంక్షిప్తలేఖకుడు బదులుచెప్పాడు.

ఎడ్మిరల్ ఫోన్ అందుకుని, "నేనే, మాక్డొనాల్డ్‌ని-మాట్లాడుతున్నా. బ్రూక్‌హెవెన్‌లోవున్న డాక్టర్ మైన్స్‌తో వెంటనే మాట్లాడాలి," అని చెప్పి గోమేజ్ వంకతిరిగి, "డాక్టర్ మైన్స్- అణుశాస్త్ర పరిషత్తుకు ప్రధానాధికారి. నీ విషయం అంతా అతనికి యిప్పుడే చెప్పి, నీవు చేసిన లెక్కల్నిగూర్చి అతని అభిప్రాయం ఏమిటో అడుగుతాను. ఇదంతా ఉత్తబూటకం అని అతను ఎలాగో అంటాడు. అప్పుడు గాని అసలుగుట్టు నీవు బయటపెట్టేటట్టు లేవు." అని బెదిరించాడు. గోమేజ్‌కి ఇదంతా అయోమయంగా ఉంది. ఎడ్మిరల్ తిరిగి ఫోన్ అందుకుని," డాక్టరు మైన్సేనా ? నేను- ఎడ్మిరల్ మెక్డొనాల్డును, రక్షణశాఖ. ఒకవిషయాన్ని గూర్చి మీ అభిప్రాయం తక్షణం కావలసి వచ్చింది," అంటూ సంక్షిప్తలేఖకుని చేతినుండి

పుస్తకాన్ని గభాలున లాక్కుని, "ఒకతను ఒకకొత్త సూత్రాన్ని కనుక్కున్నానని చెప్తున్నాడు. దాన్ని చదువుతాను వినండి!" అని ఆ పుస్తకంలో లేఖకుడు వ్రాసిందాన్ని అతి జాగ్రత్తగా ఫోనులో చదివి డాక్టర్ మైన్సుకు వినిపించాడు. డాక్టర్ మైన్సు మాటలాడు తున్నట్లు టెలిఫోన్‌లో అస్పష్టమైన ధ్వని వినవచ్చింది. గదిలో అంతా నిశ్శబ్దం. ఎడ్మిరల్ ముఖం క్రమంగా ఎఱుపెక్కింది. డాక్టర్ మైన్స్ మాటలు ముగించాక, కొంచం సర్దుకుని, విస్మయాన్ని దిగ మింగి," మెల్లిగా మాట్లాడాడు. "అబ్బే, ఫెర్మీకాదు, జిల్లార్డు కాదు-అతనెవరో వెంటనే చెప్పడాన్కి వీలులేదు. న్యూయార్కులోని ప్రభుత్వరక్షణశాఖా భవనాన్కి తక్షణం బయలుదేరి రాగలరా! ఈ క్షణంలో నాకు మీ సహాయం అత్యవసరం, అతి ప్రధానమైన సమస్య. "అంటూ ఫోన్ క్రింద పెట్టి, "అతి ప్రధానసమస్య, అతి ప్రధాన సమస్య," అంటూ తనలో తానే తలపంకించుకున్నాడు. విస్మయ చకితుడై గది వెలుపలికి వెళ్ళాడు.

మిగతా వారంతా ఆశ్చర్యంతో ఒకరిముఖం ఒకరు చూచు కున్నారు. "ఐదు సంవత్సరాలు —"అని ఒకడు నోరు మెదపగానే, మరొకడు "ఉష్" అని అదిలించి నావంక సూటిగా చూశాడు. "ఏమిటి ఈ గొడవ? ఇదంతా నాకు చిత్రంగా కనబడుతోంది!" అన్నాడు గోమేజ్.

"భయపడకు అబ్బాయి! కొంచం సేపటిలో అంతా...." అని నేను సముదాయించబోయి, భటుడు తిరిగి 'ఉష్' అని అదిలించే టప్పటికి సగంలో ఆపుచేశాను.

అంతలో ఎవరో కాఫీ ఫలాహారం తెచ్చిపెట్టారు. మేమంతా పుచ్చుకున్నాము. కొద్దిసేపటిలో ఎడ్మిరల్ డాక్టర్ మైన్సుతో కలిసి

గదిలోపలికి వచ్చాడు. డాక్టర్ మైన్సు వయస్సుమళ్ళినవాడు. తలనెరిసింది. ముఖం ముడుతలుపడింది. అతన్నిగురించి నాకు ఎక్కువ తెలియదు. ఒకానొకప్పుడు 'ప్రపంచప్రభుత్వ' స్థాపన విషయంలో అమెరికన్ కాంగ్రెసుతో తగాదా కొనితెచ్చుకున్నట్టూ, కనబడకూడని కొన్ని ఉత్తరాల్లో అతనిపేరు కనబడినట్టూ విన్నాను. కాని అతను పదహారణాల శాస్త్రవేత్త అనీ, కుట్రలూ కుతంత్రాలూ అతని రక్తం లోనే లేవనీ తరవాత తెలుసుకున్నాను.

అతను చిరునవ్వుతో గోమేజ్‌ను సమీపించి, ఇటు చూడు అబ్బాయి! ఎడ్మిరల్ ఏమంటున్నాడో విన్నావా? చక్కగా తర్ఫీదు పొంది, ఆరితేరిన రష్యన్ గూఢచారివైనా అయిఉండాలి నీవు, లేక పోతే- దైవదత్తమైన సహజబుద్ధిబలంచేత అణుశాస్త్ర విజ్ఞానాన్నంతా ఆపోసనం పట్టిన మహామేధావివైనా అయివుండాలి. ఈ రెంటిలో నీ వెవరివో తెలుసుకోడానికే ఎడ్మిరల్ నన్నిక్కడకు రప్పించింది!" అని అన్నాడు.

గోమేజ్ ఒళ్లుమండినంత కోపంతో అరిచాడు, "ఛీ-మీకేం మతులు పోలేదుకదా? నేను రష్యన్ గూఢచారినా! నేను పదహార ణాల అమెరికన్ పౌరుణ్ణి తెలిసిందా?"

"అయితే కావచ్చు యు-వి అనుబంధం అతి సులభమైనదని ఎడ్మిరల్‌తో చెప్పావుట కదూ! సామాన్య బుద్ధికి అందుబాటులో లేని అతిక్లిష్టమైన గణితసిద్ధాంతాలు తెలిస్తేనేగాని అది అవగాహనకాని విషయం అని నేను అనుకుంటున్నాను" అని డాక్టరు మైన్సు అన్నాడు.

ఏమి జవాబు చెప్పాలో తోచక గోమేజ్ ఒకింతసేపు తడ బడ్డాడు. వెంటనే అతనికి ఒక ఊహాతట్టింది. అతని కండ్లు ఒక్కసారి మెరిసాయి. "దయచేసి ఒక కాగితం, కలం, ఇలా ఇస్తారా?" అని అడి

గాడు. ప్రక్కనున్న వాళ్ళు కాగితం కలం తెచ్చిఅతనికి అందించారు.

రెండు గంటలసేపు, నిలుపు లేకుండా, డాక్టరు మైన్సు, గోమేజ్ మాట్లాడుకుంటూ, తర్కించుకుంటూ వ్రాస్తూ, అంకెలతో ఎన్ని పుటలు నింపారో లెక్కలేదు. చుట్టూ మేమంతా వున్నామన్న గుర్తే లేదు. డాక్టర్ మైన్సు మాత్రం, ఆ పరధ్యాన్నంలోనే ఒకసారి కోటు విప్పినట్టు, టై సర్దినట్టు, కాలు కదిపినట్టు, కొంచం చలనం చూపేవాడు. గోమేజ్‌లో ఆ చలనంకూడా లేదు. అతని పై ఖరిచూస్తే వంటిమీద స్పృహవున్నట్టు లేదు, కోటు విప్పలేదు. టై తీయలేదు. అటుకాలు ఇటైనా కదపలేదు. ఒక పూనకం పూనిన వ్యక్తిలో ఒక అంకె తరువాత మరొక అంకె, ఒక సమీకరణం తరువాత మరొక సమీకరణం ఒక సూత్రం తరువాత మరొక సూత్రం వ్రాస్తూపోయాడు. డాక్టర్ మైన్సు కుర్చీ అటూ ఇటూ జరిపేవాడు. మధ్యమధ్య ఆవేశంతో అరిచేవాడు. కాని గోమేజ్ మాత్రం-చలనంలేని ఏకాగ్రతతో వ్రాస్తూపోయాడు. మధ్యమధ్య నెమ్మదిగా ఒక మాటచెప్పి డాక్టరు మైన్సు కండ్లలోకి తేరిపార చూచేవాడు. విప్ఫారిన అతనికండ్లు, దూరస్తమై, సామాన్య వైజ్ఞానికులకు అందుబాటులో లేని ఏ విజ్ఞానపు పరిధిలోనో సంచరిస్తున్నట్లున్నాయి. అంతర్లీనమైన అతని మనస్సు బాహ్యాస్మృతులకు అతీతమై, ఆ అంకెల ప్రపంచంలో చిందులు తొక్కింది.

మేమంతా ఆశ్చర్యంతో కళ్లప్పగించి చూచాము.

డాక్టరు మైన్సు లేచాడు, "ఇప్పటికి ఆపుచేద్దాం, గోమేజ్! ఈ విషయాలు నేనింకా తీరుబాటుగా ఆలోచించాలి," అంటూ అతను దుస్తులు చేతబట్టుకుని, పరధ్యానంగా బయటకు వెళ్లిపోయాడు. వెంటనే మేమంతా చుట్టూ ఉన్నట్టు గ్రహించాడు.

# 21

"మీ అభిప్రాయం ఏమిటి ?" అని ప్రశ్నించాడు ఎడ్మిరల్ గంభీరంగా.

పొరపాటే నన్నట్లు ఒక చిరునవ్వు నవ్వి. "నిస్సందేహంగా ఈ కుఱ్ఱవాడికి భౌతికశాస్త్ర జ్ఞానం చాలావుంది," అని డాక్టరు మైన్సు చెప్పాడు. ఈ మాటవిన్న గోమేజ్ ఆశ్చర్యచకితుడై తల ఎత్తాడు. "హిగ్గిన్స్, ఇవన్నీ అలా ఆ ప్రక్కగదిలో బీరాల్పో పెట్టండి!" అని ఎడ్మిరల్ ఆదేశం యిచ్చాడు. నిద్రలో నడుస్తున్నట్లు గోమేజ్ నిశ్శబ్దంగా వారి వెనుక నడిచి వెళ్ళాడు.

ఇది చూచిన డాక్టరు మైన్సు చిన్నగా నవ్వి, "సైనిక-రహస్యం -అంచు కేనా ?" అన్నాడు. ఎడ్మిరల్ కుపితుడయ్యాడు. "దయచేసి, ఈ విషయంలో మీరు కల్పించుకోకండి, డాక్టరు మైన్సు. అమెరికన్లు సంపాదించుకున్న శాస్త్ర విజ్ఞానాన్ని రష్యన్లు దొంగిలించకుండా కాపాడడమే నా బాధ్యత. నా శక్తివంచన లేకుండా నాబాధ్యతను నేను నిర్వహిస్తున్నాను. ఆ పిల్లవాడేమో యీ గణితాన్ని స్వంతంగా వేశానంటున్నాడు. అది ఎంతవరకు నిజమో తెలుసుకుని చెప్పేటంత వరకే మీ బాధ్యత- మిగతా విషయాలు మీకు అనవసరం!" అని డాక్టరు మైన్సుని మందలించాడు ఎడ్మిరల్.

ఆ మందలింపును గ్రహించిన డాక్టరు మైన్సు "అవును నిస్సంశయంగా యీ గణితాన్నంతా అతనే వేశాడు. నిజం చెప్పాలంటే-అతని వేగాన్ని అందుకుని, అతను వ్రాసిదంతా అర్థంచేసు కోడానికి నాకేచాలా కష్ట మనిపించింది!" అని నెమ్మదిగా బదులు చెప్పాడు.

"అయితే యిదంతా నిజమేనంటారా !" విభ్రాంతితో కూడిన చిరునవ్వుతో ఎడ్మిరల్ అన్నాడు. "అయినా, ఇంత అసాధ్య విష

యాన్ని ఆ పిల్లవాడు ఎలా గ్రహించి వుంటాడు? నా బుద్ధికి ఏమీ పాలుపోవడం లేదు. ఇది ఎల్లాజరిగివుంటుందని మీ ఉద్దేశం ?"

ఇల్లాంటి అసాధారణ ప్రజ్ఞ ఇంతకు ముందుకూడా కొంత మందికి కలిగింది. మీరు రామానుజాన్ని గూర్చి వినలేదా?

"విన లేదే."

"శ్రీనివాస రామానుజమ్?"

"ఊహూ— వినలేదు."

"అయితే చెప్తా వినండి. రామానుజమ్ 1887-వ సంవత్సరంలో పుట్టాడు. 1920 లో చనిపోయాడు. అతనొక పేద హైందవ బ్రాహ్మణుడు. రెండుసార్లు కళాశాల పరీక్షల్లో తప్పడంతో చదువు చాలించి ప్రభుత్వశాఖలో గుమాస్తాగా చేరాడు. ఒకే ఒక లెక్కల పుస్తకం ఆరోజుల్లో అతనికి అందుబాటులో ఉండేది. ఆ పాతపుస్తకాన్ని ఆధారంచేసుకుని, తనస్వంతకృషితో కొన్ని గణిత సిద్ధాంతాలను రూపొందించాడు.

1913 లో ఆ సిద్ధాంతాలను కేంబ్రిడ్జి విశ్వకళాపరిషత్తులో ఒకానొక గణితశాస్త్రాచార్యుని పర్యవేక్షణకై పంపించాడు. వెంటనే అతడు ఇంగ్లాండులో నిరుపమానుడైన మేధావిగా ప్రజ్ఞావంతుడుగా. గణనకెక్కాడు. అతనికి రాయల్ సొసైటీలోనూ, ట్రినిటీలోనూ. సభ్యత్వమిచ్చి ఆంగ్లేయులు సత్కరించారు."

"అలాగా!" అని ఎడ్మిరల్ విస్మయంతో తలపంకించాడు.

"ఇలాంటి విచిత్రాలు జరుగుతూనే వుంటాయి. ఇందులో సందేహం ఏమీ లేదు. ఆరోజుల్లో రామానుజాన్కి ఆధారం అంతా

ఒక పాతలెక్కల పుస్తకం. కాని, ఈరోజుల్లో, అందులోనూ యీ న్యూయార్కు మహా పట్టణంలో, గోమేజ్‌కు కావలసినన్ని గణిత శాస్త్ర గ్రంథాలు, పరమాణువులకు సంబంధించిన రకలకాల వివరాలు- అందుబాటులో ఉంటాయి.

అదే కాదు- అతనిలో దైవదత్తమైన ప్రజ్ఞ కనబడుతుంది. అతనికి సూత్రాలూ, సిద్ధాంతాలూ మనస్సుకు వాటంతట అవే స్ఫురిస్తాయి! ఒక సూత్రానికీ మరొక సూత్రానికీ గల సంబంధం అతనికి మనస్సులో మెరుపులాగా స్ఫురిస్తుంది. నాబోటివారు అంచనాలవారీగా పది అంగల్లో చేయగలిగిన క్రోడీకరణ అతను అమాంతంగా ఒక అంగలో చేస్తాడు. అతని యీ అసాధారణశక్తి నాకే అసూయ కలిగిస్తుంది. రామానుజం కూడా ఇలాగే వుండేవాడు. ఇది చదువువల్ల పరిశ్రమవల్ల కలిగే ప్రజ్ఞ కాదు. ఇది కేవలం దైవదత్తమైన ప్రజ్ఞ. అందుకు సందేహంలేదు!" అని డాక్టరు మైన్సు సవిస్తరంగా చెప్పాడు.

అంతవరకూ తన వెస్ట్‌కోటు, నెక్‌టై చేతిలోనే వుండడం గ్రహించి కోటు తొడుక్కుంటూ, "ఇంకా మీ కేమైనా సందేహాలున్నాయా? అని ఎడ్మిరల్‌ను అడిగాడు.

"అయితే- ఈ కుర్రవాడు నిన్ను మించిన వైజ్ఞానికు డంటావు- అంతేనా?"

"అందుకు సందేహం ఎంత మాత్రమూ లేదు. అతను గొప్ప ప్రజ్ఞావంతుడు!" అంటూ డాక్టరు మైన్సు నిష్క్రమించాడు.

ఎడ్మిరల్ నిర్విణ్ణుడై, చాలాసేపు బల్లదగ్గర చలనంలేకుండా కూర్చొన్నాడు. చివరికి "ఎవరైనా ఫోన్‌చెయ్యండి-జనరల్ మేనేజర్

-కాదు పరిషత్తు అధ్యక్షుణ్ణి మాట్లాడమనండి" అన్నాడు. అక్కడ ఉన్నవారిలో ఒకరు ఫోన్ చేయడాన్కి వెళ్లారు.

"ఎడ్మిరల్-ఇప్పుడు మనం చేయవలసిం దేమిటి?" అని అడిగాను.

"ఓహో నీవు యిక్కడే వున్నావు కదూ-ఈ విషయంలో ఇక నా బాధ్యత ఏమీలేదు. ఎందుకంటే-రక్షణ నిబంధనలకు వ్యతిరేకంగా ఏమీ జరుగలేదు. ఈ పిల్లవాడు ప్రస్తుతం నా అధీనంలో వున్నాడు కనుక, అణుశక్తి పరిషత్తువారికి ఇతణ్ణి ఒప్పగిస్తాను. జాతి అభ్యుదయానికి ఇతణ్ణి ఏలా వుపయోగించుతారో, ఇకమీద వారిపని."

"అంటే—ఒక యంత్రంలాగ?" అని నేను చిరాకుగా అన్నాను.

"ఒక ఆయుధం లాగా," అని బెణుకు బెణుకు లేకుండా బదులు చెప్పాడు. ఆతను నావంక తీక్షణంగా చూచాడు.

అతను చెప్పింది నిజమే. అప్పుడు యుద్ధం జరుగుతూ వున్నదని నాకు తెలియదా మరి? ఎందుకు తెలియదు? బాగా తెలుసు. నాకే కాదు. అందరికీ తెలుసు. పన్నులు పెరిగిపోయాయి. ఉండడాన్కి ఇళ్లు దొరకడంలేదు. కొరియా రంగంలో ఎవరో ఒకరు చచ్చిపోయినట్లు వార్తలు వింటూనే ఉన్నాం. అన్న వస్త్రాలు అవసర వస్తువు ధరలు పెరిగిపోయి ఆకాశన్నందుకుంటుయిన్నా-చిన్నా పెద్ద అంతా చెమటోడిస్తే తప్ప సంసారం గడవడం దుర్లభంగా ఉంది. ఇవన్నీ యుద్ధం వల్ల కలిగే దుష్ఫలితాలేగా! ఇలాంటి ఆలోచనలతో బరువుగా కిటికీ దగ్గరకు వెళ్లాను. ఆదివారం గనక ఫారీస్క్వేర్ రద్దీలేకుండా నిశ్శబ్దంగా ఉంది. ఒకే ఒక అమ్మాయి ఆవీథిలో ఒక చివరినుండి ఇంకో చివరికి తిరగడం చూచాను. మూర్తీభవించిన శోకదేవతలాగ, నిస్పృహతో తిరుగుతూ వుంది.

ఆ అమ్మాయిని గుర్తుపట్టాను. పోర్టుపెల్ హోటలులోని పరిచారిక ఆమె. పినజూలియోను మేము తీసుకొచ్చామని, వేరే బండిలో మా వెనకనే వచ్చింది కాబోలు, నాలో నేనే ఆమె నుద్దేశించి మౌనంగా అనుకున్నా.

"ఇంక లాభంలేదు చెల్లాయి- పినజూలియో నీకు దక్కడు. అతనింకా ఒక దక్కనికిరాడే ననుకుంటున్నావేమో. అతను ఆయుధశాఖకి వెన్నెముక కాబోతున్నాడు.

రక్షణశాఖవారు అతన్ని ప్రభుత్వానికి ఒప్పగిస్తున్నారు. ఇక నేను తిన్నగా ఇంటికి తిరిగివెళ్ళడం మేలు. నా మనసులో మాటలు ఆమెవిందేమో! చటుక్కున ముఖం జేబురుమాలుతో కప్పుకుని గుడ్డిగా నిస్పృహతో పరుగెత్తింది. ఆ భవనం అంచున ఉన్న రైల్వేస్టేషన్ సొరంగంలోకి అదృశ్యమైంది.

టెలిఫోన్ మోగింది.

"నేను - మాక్డొనాల్డ్‌ను మాట్లాడుతున్నాను. గోమేజ్‌ను గూర్చిన నివేదిక సిద్ధంగా వుంది!" అన్నాడు ఎడ్మిరల్.

గోమేజ్ యింకా మైనర్. అతని తల్లిదండ్రులు ఉద్యోగ పత్రంమీద సంతకాలు చేశారు. ఉద్యోగం ఫలానా అని చెప్పలేము గాని-ప్రభుత్వస్థాయిలో పెద్ద జీతం, భత్యం గోమేజ్‌కు ఏర్పాటు చేశారు.

అక్కడే సమాచార శాఖలో నాకూ ఒక ఉద్యోగం ఇచ్చారు. నిజానికి నాకక్కడ నిర్ణీతమైన కార్యక్రమంలేదు. పొదుపు సాకుతో నన్నక్కడనుండి పంపివేయాలని అధికార్లు సూచించినప్పటికీ, తన వాగ్దానం నిలుపుకోడానికి ఎడ్మిరల్ నేనక్కడ ఉండితీరాలని పట్టు

పట్టాడు. నేనుండి పోయాను, అది నా జీవితంలో మరుపురాని మంచి అనుభవం.

మాది పేరులేని. ఆఫీసు - న్యూజెర్సీలో మిల్ ఫ్రెడ్ నగరం వెలుపల ఒక పెద్ద యిల్లు, దానిలో 15 పెద్దగదులు-అందులో మా ఆఫీసు. మేము చూడబోతే ఏడుగురం. పై అంతస్థులో పుస్తకాలు. సాంకేతిక పత్రికలు, వ్రాతబల్లలు, కాగితాలు చుట్టూ వేసుకుని గోమేజ్ ఒంటరిగా ఉండేవాడు. వారానికొకసారి డాక్టర్ మైన్సు అతన్ని చూచి మాట్లాడి వెళ్తుండేవాడు. క్రింద అంతస్థులో కావలి వారు-హిగ్గిన్సు. వల్ హాస్, లెట్జర్ - వంతులవారీగా వారం కాస్తూండేవారు, ఈ మధ్యలో మిగిలింది నేను.

అప్పుడప్పుడు డాక్టర్ మైన్సు చెప్పిన నాల్గు పంక్తులు డైరీలో వ్రాసుకునే వాణ్ణి. అందుమూలంగా జరిగిన విషయమంతా నేను గ్రహించానని మీరు భ్రమపడకండి. యుద్ధరంగానికి వెళ్ళిన విలేఖర్లు వీను అయోమయావస్థను గురించి ఎన్నోమార్లు మొరపెట్టు కునే వారు.

"జనవరి 15 నుండి ఇన్ని విమాన దాడులు ఇంతకుముందు జరగలేదు. ....అనుకున్న దానికన్న 15శాతం తక్కువమంది మరణించారు. విరోధి బలాలు ఎక్కువగా ఉన్నా ఎదిరిస్తూ పట్టుదలతో ముందుకు పోతున్నాం...." ఇలాంటి రూపూ, రేఖా తేల్చని వార్తల్ని అధికార్లు చెప్పడం, వారు ప్రకటనకు పంపడం.

కొంచం ఇంచుమించు అలానేవుంది నా పరిస్థితికూడా. కావా లంటే నా డైరీ చూడండి- "డాక్టర్ మైన్సు సలహాపై రియాక్టర్ తయారీకి కావలసిన గణితం వేస్తున్నాడు గోమేజ్. బ్రూక్ హేవెన్ జాతీయ ప్రయోగశాలలో దీనిమీద పని ప్రారంభిస్తారు. ఇంచుమించు

70 పైగా డిఫరెన్షియల్ సమీకరణాలతో కూడిన పని ఇది."........
"లో ఆలోస్ ప్రయోగశాలలో ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలకు ఆరంభ సూత్రమే తప్పంటున్నాడు గోమేజ్. ఈ పొరపాటు ప్రాతిపదికగా, ఇతఃపూర్వం అంగీకరించిన సిద్ధాంతాలు, తీసుకున్న నిర్ణయాలు నిరుపయోగమౌతాయి. ఈ విషయం ఆ ప్రయోగశాలకు తెలియపరుస్తాము."........"రేడియోధార్మికతకు సంబంధించిన ఒక గడ్డు సమస్యకు పరిష్కార సూత్రాన్ని యీరోజే కనుగొన్నాడు." ఇదీ వరుస.

"ఇదంతా అయోమయంగావుంది. మీరు వివరంగా చెప్పే పోతే ఒప్పుకోను." అని నేనొకమారు డాక్టరు మైన్నుతో తగువులాడాను. నా తగువులాట విని అతను కోపగించనట్లు నెమ్మదిగా జవాబుచెప్పాడు. "విల్ షెక్ నామాటనమ్ము! నీవు అర్థంచేసుకోగలిగినంత విషయం నేను చెప్తూనేవున్నా. ఇంతకన్నా వివరంగా చెప్పినాగాని నీకు మరీ అగమ్యగోచరం అవుతుంది తప్ప లాభంలేదు. పైగా- విలువైన శాస్త్ర విజ్ఞానం మన ప్రకటనలద్వారా విదేశాలకు విరోధి రాజ్యాలకు అందించిన వారమౌతాం."

"ఆటంబాంబు విలేఖరి బిల్ లారెన్సుకు వారు రహస్యాలన్నీ ఎందుకు చెప్పారు మరి ?" అని నేను నిష్ఠురంగా అడిగాను.

డాక్టర్ మైన్ను నవ్వుతూ నన్ను సమాధానపరిచాడు- "కాను మరి- అది ఆరంభదశ. రహస్యంగా ఉంచనక్కర్లేని కొన్ని పైపై అంశాల్ని ప్రకటించడంతో ప్రజల్లో ఉబలాటం పెరుగుతుందేగాని మనకు నష్టంలేదు. ఉదాహరణకు- ఒకింత పరిమాణంగల ప్లూటోనియమ్ బంతిగాని U-235 ముద్దగాని- కొన్ని సందార్భల్లో పేలి దూరంగా పడ్తుందని వ్రాయడంవల్ల రహస్యం బయటపెట్టామని

అనుకోకూడదు. అది ఎంతపరిమాణంగల ముద్దో తెలుసుకోడానికి ఎంతోవుంది. ఎన్నో సంవత్సరాలు కృషిచెయ్యాలి.''

ఇక వారు మాట్లాడక అతను చెప్పిన విషయాలు చెప్పినట్టుగా డైరీలో వ్రాసుకునేవాణ్ణి. ఇవేగాక, సామాన్యదృష్టిలో- ముందు ముందు ప్రకటించడానికి ఉపయోగపడ్తాయన్న అంశాలు కూడా కొన్ని జ్ఞాపకార్థం డైరీలో వ్రాసేవాణ్ణి. గోమేజ్ ఇంగ్లీషుభాష ఎలాలో నేర్చుకునేవాడో, అతనికి బియ్యపు పాయసం, కోడి కుర్మా అంటే ఎంత ఇష్టమో, తనపనులన్నీ అతను ఎలా స్వంతగా చేసుకునే వాడో. ముసలిదానికన్నా ఎక్కువ చాదస్తంగా తనగది ఎలా చిమ్మి తుడిచి, వస్తువులన్నీ ఎక్కడవక్కడ పరిశుభ్రంగా సర్దేవాడో- ఇలాంటి విషయాలన్నమాట. "ఏమిటయ్యా- ఇంత చాదస్తం అంటే చాలు- "నీవుకూడా చిన్నప్పుడొక 15 సంవత్సరాలు ఒక పాడు గుడిసెలో కాపురంచేసివుంటే తెలుస్తుంది! వస్తువులన్నీ ఎక్కడివక్కడ పరిశుభ్రంగా తుడిచి అమర్చుకోవడంలో గల అందం, ఆనందమూను," అంటూ సమర్థించేవాడు గోమేజ్. ఒక్కొక్కప్పుడు గోమేజ్ తన సామాన్లు సర్దుకుంటూనే డాక్టర్ మైన్సుతో శాస్త్ర సంబంధమైన అంకెలభాష మాట్లాడడం డాక్టర్ మైన్సు అతనివెనువెంటనే తిరుగుతూ, అతనుచెప్పిందంతా ఆలకించడం నా కండ్లతో నేను చూచే వాణ్ణి.

అంకెల ప్రపంచలో కూర్చుంటే గోమేజ్ రెండు రాత్రులు రెండు పగళ్ళూ ఏకదీక్షతో కదిలేవాడు కాదు. మరి మధ్యలో ఏమైనా తినేవాడో లేదో- తరువాత రెండు రోజులు వరుసగా మనలోకంలో ఉన్నట్లు మాటలాడుతూ, నిద్రపోతూ వుండేవాడు. మధ్యమధ్య హిగ్గిన్సు మొదలైనవారితో బంతి ఆడుతూ కాలక్షేపం చేసేవాడు.

నాదగ్గరకూర్చుని చిన్ననాటి ముచ్చట్లన్నీ నెమరువేసేవాడు. నాకు స్పానిష్ భాష నేర్పేవాడు. ఇంగ్లీసు మాట్లాడుతూ, తప్పులు దిద్దమని నన్ను కోరేవాడు.

"నీకు యిక్కడనుండి వెళ్ళిపోవాలని లేదా ?" అని ఒకనాడు గోమేజ్‌ను అడిగాను.

"వెళ్ళిపోవడం ఎందుకు ? నేనిక్కడ తృప్తిగా భోజనంచేస్తూ సుఖంగా కాలక్షేపంచేస్తున్నా. మా అమ్మకూ నాన్నకూ నెల నెలా డబ్బుపంపుతున్నా. గొప్ప గొప్ప వైజ్ఞానికులు చేసేపరిశోధనలూ, చర్చించే విషయాలూ నాకు ఎప్పటికప్పుడు తెలుస్తూవుంటాయి. మరొకచోట వుంటే నాకిది సాధ్యంకాదు. ఒక్కొక్క విషయం తెలుసుకోడానిక్కి ఎంతో శ్రమపడి, ఎన్నో ఏళ్ళు గడుపుకోవలసివచ్చేది!" అని బదులుచెప్పాడు.

"అయితే నీవు పెళ్ళి చేసుకోవా ?"

ఈ నా ప్రశ్నకు ఏమిబదులు చెప్పాలో తెలియనట్టు తడబడ్డాడు. మాటతప్పించడానిక్కి తిరిగి గొప్ప గొప్ప శాస్త్రవేత్తలనుగూర్చి చెప్పనారంభించాడు.

అంతలో డాక్టర్ మైన్స్, తన కారు డ్రైవరుతో సహా ఎకాఎకిని పైకివచ్చాడు. అతనిచేతిలో మామూలుగా వుండే లావాటి కాగితాల దస్తరంవుంది. లాంఛనానికి నన్నొకమారు పలకరించి, గోమేజ్‌ను పై అంతస్థుకు తీసుకువెళ్ళాడు.

సుమారు 5 గంటలసేపు వారిరువురు అలా పైనే ఉన్నారు. అంతకుముందెన్నడూ అలా జరుగలేదు. డాక్టర్ మైన్స్ దిగిరాగానే నాకేమైనా చెప్తాడనుకున్నాను.

"క్రొత్త విశేషాలేమీ లేవు. ఇటీవల అతను సూచించిన కొన్ని అభిప్రాయాలమీద కొంత చర్చ సాగించాము. తన పద్ధతి ప్రకారమే ముందుకు సాగిపొమ్మని చెప్పాను. ఎందుకంటే – ఇంత వరకూ జరిగిన పద్ధతి వేరు. మేమేదో ప్రారంభించడం, సగందారికి వెళ్ళి మాకు అంతుచిక్కని సందర్భంలో అతనికి ఒప్పగించి దాన్ని ముగించమనడం, కొంచెం ఇంచుమించు లెక్కలుచేసే యంత్రంలాగా అతన్ని ఉపయోగించుకున్నాము. ఇక ఇప్పుడు జరిగే పద్ధతి వేరుగా వుంటుంది. అతనికి స్వతంత్రంగా పరిశోధనలు చేయాలన్న కుతూహలం కలిగింది. అసాధారణమైన అతని మేధాశక్తినుండి సృజనాత్మకమైన సత్ఫలితాలు కలుగవచ్చు." అని నాల్గుమాటలు చెప్పి వెళ్ళిపోయాడు.

నేను విని ఊరుకున్నాను.

గోమేజ్ ఆ రాత్రి భోజనానికి దిగిరాలేదు. అర్ధరాత్రి మేడ మీద ఏదో దభాలున పడ్డ శబ్దంతో మెలకువ వచ్చింది. పైజమా అయినా మార్చుకోకుండా ఆ చీకట్లో అలాగే పైకి పరుగెత్తాను. గోమేజ్ నేలమీద నిలువునా బోరగిలపడివున్నాడు. అక్కడొక పీట తగిలిపడ్డాడు కాబోలు–పడికూడా అతడు పడ్డట్టు గ్రహించుకోలేదు. పెదవులు కదులుతున్నాయి. తనలో తను ఏదో మాట్లాడుకుంటు న్నాడు. నావంక చూస్తూనే వున్నాడుగాని, నేనక్కడ ఉన్నట్లు మాత్రం గ్రహించలేదు.

"దెబ్బ తగలలేదుగదా, గోమేజ్," అంటూ అతన్ని లేవ దీయబోయాను. అప్పటికికూడా అతనికి తెలివిరాలేదు. అంకెలు, లెక్కలు ఏవో గొణుగుతూనే వున్నాడు. "ఏమిటిదంతా?" అని గట్టిగా కసిరాను. అప్పటికి పరధ్యానం పోయి, "ఇక్కడికి ఎలా వచ్చావు? అప్పుడే భోజనం సైము అయిందా?" అని అడిగాడు.

"ఇప్పుడు గంట ఏమైందో తెలుసా? తెల్లవారు ఝాము నాల్గు గంటలు—నీకు నిద్ర రావటం లేదూ?" అని అడిగాను. అతను మన లోకంలో వుంటేగా? అతనికి పని చాలా వున్నదట—నిద్ర రాదట. నేను దిగివెళ్ళి పడుకున్నా, మెళకువగా ఉన్నంతసేపూ మేడమీద నుండి గోమేజ్ అడుగుల చప్పుడు వినవస్తూనేవుంది. అలా వింటూనే నేను నిద్రపోయాను.

ఈసారి యీ స్థితి రెండు రోజుల్లో ముగియలేదు. రమారమి వారం రోజులు గుణిస్తున్నవాడు గుణిస్తున్నట్టే, వ్రాస్తున్నవాడు వ్రాస్తున్నట్టే కూచున్నాడు. భోజనం స్వయంగా నేనే దగ్గరపెట్టే వాణ్ణి. తిన్నప్పుడు తినేవాడు. లేనప్పుడు లేదు. ఒక్కొక్కప్పుడు ఆ పరధ్యానంలోనే ఒక చేత్తో తింటూ, ఒక చేత్తో ఆ పచ్చపుస్తకంలో వ్రాస్తూ పోయేవాడు. తట్టుకోలేనప్పుడు అలా కూర్చున్న కుర్చీ మీదే ఒక కునుకు తీసేవాడు. వారం పొడుగునా మాసిన గడ్డం. క్షవరం చేసుకోలేదు—అతనికి ఏ పనికీ తీరికలేదు. మాట్లాడడానికి, తినడానికి, నిద్రపోవడానికి, దేనికీ తీరిక లేదు.

ఈ ఉన్మాదావస్థను చూస్తూవుంటే నాకు భయం కలిగింది. ఆలస్యం చేసినకొద్దీ అతనికి ఆరోగ్యం చెడిపోతుంది. గత్యంతరం ఏమిటని లెష్టర్‌తో సంప్రదించాను. అత్యవసర సమయాల్లో అతను పై అధికార్లకు ఫోన్ చేసి మాట్లాడడాన్కి అనుమతి వుంది. కాని—స్వయంకృతాపరాధం వల్ల గోమేజ్ ఆరోగ్యాన్ని పాడుచేసుకోవడం అనేది, ఆ అత్యవసర పరిస్థితుల జాబితాలోకి ఎక్కలేదు. అందువల్ల లెష్టర్ ఏమీ చేయలేక పోయాడు.

డాక్టర్ మైన్సు మధ్యలో ఒకసారి వచ్చాడు. అతడైనా పెద్ద వైద్యుణ్ణి పిలుస్తాడేమోనని ఆశపడ్డాను. కనీసం గోమేజ్‌కైనా

నచ్చచెప్పి, ఆరోగ్యం పాడుచేసుకోవద్దని సలహా చెప్తాడనుకున్నా. సర్దిచెప్పి ఎలాగో గోమేజ్ తలమీద ఉన్న భారాన్ని దింపుతాడేమో అనుకున్నా. అలా జరుగలేదు. అతను పైకి వెళ్ళాడు. రెండుగంటలసేపు గోమేజ్‌తో కూర్చున్నాడు. తరువాత పరధ్యానంగా వెళ్ళిపోతూంటే నేను పిలిచి "ఏమిటిదంతా" అనిగట్టిగా అడిగాను.

"విషయం మంచి పట్టులో వుంది. ఇప్పుడతన్ని ఆపుచేయడం సబబుకాదు!" అని తన నిశ్చయాన్ని స్పష్టంగా చెప్పాడు.

డాక్టర్ మైన్సు చాలామంచివాడు. అతనిది చాలా ఔదార్యం గల మనస్సు. అయినా, అధిక పరిశ్రమవల్ల ఆ పిల్లవాడు రాత్రింబవళ్ళు అలా నలిగిపోతూవుంటే, కొంచం విశ్రాంతి తీసుకోమని మాటమాత్రానికైనా చెప్పడట. డాక్టర్ మైన్సుకు మనుష్యులంటే దయా దాక్షిణ్యానికీ అభిమానానికీ కొరతలేదు. అయితే శాస్త్ర విజ్ఞానంమీద అతనికిగల అభిమానం. మమకారం, సహజమైన దయా దాక్షిణ్యాలను త్రోసిపుచ్చాయి.

"ఆపుచేస్తే కొంప మునిగిపోతుందా?" అన్నాను.

విసుగుతో బదులుచెప్పాడు– "కొంతమంది వైజ్ఞానికులు ఇదే విధంగా పరిశ్రమచేస్తారు. న్యూటన్ ఇలానే చేసేవాడు. సర్ విలియమ్ రోవన్ హామిల్టన్ కూడా ఇంతే........"

"హామిల్టన్నూ– హామిల్టనూ– ఇదేమి కర్మయ్యా! నిద్ర, ఆహారంలేకపోతే మనిషి ఎందుకైనా పనికొస్తాడా?"

"నీ కిదేమీ అర్థంకాదులే."

"అవును లెండి," అన్నాను. నా కింక కోపం ఆగలేదు. "నేనొక చచ్చు పత్రికా విలేఖరిని. నాకెలా అర్థమౌతుంది? అయితే పండితోత్తమా! తమకైనా అర్థమైందా అని."

మైన్సు కొంతసేపు నిశ్శబ్దంగా ఆలోచించి చెప్పనారంభిచాడు. "చెప్తా విను. ఆ పిల్లవాడు మంచి ఏకాగ్రతతో ఆలోచిస్తున్నాడు. ఒక మంచి దిట్టమైన చదరంగపుటాటగాణ్ణి తలుచుకో. అతను కళ్ళకు గంతలుకట్టుకుని, నూరుమందితో నూరు ఆటలు ఒకేసారి ఆడుతాడు. నూరు అట్టలమీద పేర్చిన పావులు, నూరుమంది ఎదుటి వారు వేసిన ఎత్తులు, నూరు ఆటల్లోనూ తను వేయవలసిన ఎదురెత్తులు ఒకే క్షణంలో తన మనోవీథిలో చూడగలుగుతాడు. అది మనం ఒక గొప్ప ప్రజ్ఞ అనుకుంటాం. అంతకు మించిన ప్రజ్ఞతో గోమేజ్ మేధస్సు ప్రస్తుతం పనిచేస్తూంది".

"భౌతికశాస్త్రానికి సంబంధించిన సిద్ధాంతాలూ, సూత్రాలూ, సమీకరణలూ, గణితాలూ, అత్యధిక సంఖ్యలో ఒకే క్షణంలో అతని మనోవీథిలో తాండవిస్తూవున్నాయి. వాటిని పేర్చి, పోల్చి, మార్చి, చేర్చి, క్రొత్త క్రొత్త సూత్రాలూ, సంబంధాలూ కనుగొంటు న్నాడు. అందులో కొన్ని ఒప్పులని నిర్ణయించి మరికొన్ని తప్పులని త్రోసిపుచ్చి, తను ఏ ఫలితాన్ని కాంక్షిస్తున్నాడో దాన్ని అందుకో డానికి గాను వాటిని మనస్సులోనే క్రోడీకరిస్తున్నాడు." అని ఆపాడు, ఇంక చెప్పవలసిందేమీ లేనట్టు. అడగడానికి సిగ్గుపడ్తూనే – "అతను కాంక్షిస్తూ ఉన్న లక్ష్యం ఏమిటంటారు?" అన్నాను.

"యూనిఫైడ్ ఫీల్డ్ సిద్ధాంతం అని నాకు తోస్తోంది." దానితో నాకు అంతా అర్థమైపోతుందని డాక్టర్ మైన్సు అభిప్రాయ పడ్డట్టు న్నాడు. అర్థం కాలేదని నేనే చెప్పాను. నాకు విషయం ఎలా బోధ పరచాలో ఆలోచిస్తూ ఆయన చెప్పాడు. "నామాటలకు కోపగించుకో వద్దుగాని, విల్ పెక్, నీకెలా చెప్తే బోధపడ్తుందో నాకు తెలియడం లేదు. అయినా విను. గణితశాస్త్రం అంచనాలవారిగా అభివృద్ధి

చెందుతూ ఉండడం చూస్తున్నావు కదూ. ఒక్కొక్క మెట్టు ఎక్క-గానే, ఆ గణితాన్ని విజ్ఞాన శాస్త్రంలో ప్రయోగాత్మకంగా వినియోగించుకోవడం కూడా చూస్తున్నావు. మధ్య యుగంలో సాంకేతిక గణితం అభివృద్ధి అయింది. దాన్ని ఆధారం చేసుకుని, నౌకాయానం, తుపాకీలు-మొదలైనవానిటని గురించిన శాస్త్రం పుట్టుకొచ్చింది. తరువాత కాలుక్యులస్ గణితం పుట్టింది. దానితోపాటు ఆవిరిశక్తి, విద్యుచ్ఛక్తి, వాటిని ఉపయోగించే ఆవిరియంత్రాలు, విద్యుద్యంత్రాలూ-కనుగొనబడ్డాయి. ఆధునిక గణితం అంటే 1875 నుండి అనుకో- మనకు పరమాణుశక్తిని ప్రసాదించింది. ఇప్పుడు గోమేజ్ పరిశ్రమవల్ల మరొక క్రొత్త గణితసిద్ధాంతం ఫలించి, మరొక శాస్త్ర యుగం ప్రారంభం కావచ్చు." అంటూ టోపీ చేపట్టుకుని వెళ్ళిపో పోయాడు.

"ఒకే ఒక నిమిషం ఆగండి. దీన్నించి ఏం పుట్టుకొస్తుంది? భూమ్యాకర్షణను అదుపులో పెట్టడమా. మానవ ప్రవృత్తులను వశం చేసుకోవడమా, రేడియోతరంగాలతో మానవుల్ని రవాణాచేయడమా?'' అని కోపం ఉగ్గబట్టుకుని అడిగాను.

డాక్టర్ మైన్సు నా వంక చూడలేకపోయాడు. ఆ క్షణంలో ఆయన కృంగిపోయిన వృద్ధుడిలా అయిపోయాడు. "గోమేజ్‌ను గురించి చింతించకు!" అంటూ వెళ్ళిపోయాడు. నేను ఇంక ఆయన్ను ఆపలేదు. ఆ సాయంత్రం గోమేజ్‌కు కోడిపలావు, గుడ్డు పాయసం ఇచ్చాను. పాయసం గుటగుటా త్రాగి, ఒక వెకిలి నవ్వు నవ్వి, తన వ్రాత తిరిగి ప్రారంభించాడు. దిగులుతో క్రిందకు వెళ్ళాను.

ఆ మరునాటి మధ్యాహ్నానికి అతని దీక్ష అకస్మాత్తుగా ఆఖరయింది. ఉపవాసాలతో కృశించిన ఒక ముసిలి రిక్షావాని లాగా

భోజనం వెతుక్కుంటూ దిగివచ్చాడు గోమేజ్. "తినడానికి ఏమైనా పెట్టూ, బిల్!" అంటూనే, గుదిటిమీద జుత్తు పైకి తీసుకుని సొమ్మసిలి నేల మీద ఒరిగిపోయాడు. నా కేకలువిన్న లెస్టర్ పైకివచ్చాడు అంతా తెలుసన్నట్లు గోమెజ్ నాడిని పరీక్షచేసి, అతన్ని కంబళీలో చుట్టివేసి, మరొక కంబళీని పైన కప్పి, "భయం లేదు కొంచం మూర్ఛ పోయాడు. అంతే మంచం పైన పడుకోపెడ్దాం," అన్నాడు. "డాక్టరుకు కబురుచెయ్యనా?" అన్నాను.

"డాక్టర్ వచ్చి మాత్రం ఏమిచేస్తాము? ఇవన్నీ ప్రకృతి నిబంధనలు – వాటిని మనం అతిక్రమించకూడదు. అలా పట్టుకోండి" అంటూ లెస్టర్ రెండవవైపు ఎత్తాడు. ఇద్దరంకలిసి గోమేజ్‌ను పైకి మోసుకువెళ్ళి పడుకోపెట్టాము. అంతలో అతనికి స్పృహవచ్చింది, స్పానిష్‌లో ఏమో గొణిగాడు. "మిమ్ము చాలా శ్రమకలిగించాను. ఇంత ఇలా నిద్రాహారాలు మానుకోటం తప్పు!" అని క్షమార్పణ చెప్పుకున్నాడు.

"తినడానికి ఏమైనా తెస్తాను," అన్నాను. పెట్టింవంతా తృప్తిగా తిన్నాడు. తీరుబడిగా వెనక్కి జేర్లబడి "ఏమిటి విశేషాలు?" అన్నాడు.

"విశేషాలు ఏమున్నాయో నీవే చెప్పాలి" నీ పని ఎంతవరకు సాగింది?"

"ఏదో ఒక రూపానికి వచ్చింది. కష్టమైనభాగం పూర్తి అయినట్టేలే!" అంటూ లేచికూర్చున్నాడు.

"అదే వద్దనేది? అప్పుడే ఏమి మించిపోయిందని లేస్తున్నావు?"

"ఇప్పుడు నాకేమీలేదు. బాగానే ఉన్నా. అయితే కొంపతీసి జరిగినదాన్ని నీడైరీలో వ్రాయకేం! అందరూ నన్నుచూచి ఆడదానికన్నా అన్యాయం అని నవ్వగలరు!" అని నవ్వుతూ అన్నాడు.

తేచి తనగదిలోకి వెళ్ళి వాలు కుర్చీమీద కూర్చున్నాడు. నేను కూడా అతనితో వెళ్ళాను. అక్కడ వ్రాతబల్లమీద లెక్కలు వేసి వున్నాయి వాటివంక తదేకదీక్షతో చూడనారంభించాడు. అతని ముఖంమీద నవ్వు మాయమైంది. మళ్ళీ ఎప్పటి పూనకం అతన్ని ఆవేశించింది.

"నీవేదో గొప్పపరిశోధనలో వున్నావని డాక్టరు మైన్సు చెప్పారు!" అన్నాను.

"గొప్ప పరిశోధనా ?"

"ఔను. గొప్ప పరిశోధనే. యూనిఫైడ్ ఫీల్డ్ సూత్రం కదూ?"

"అదే. అదే!"

"అదిమంచికా- చెడ్డకా ? అంటే దానివల్ల వచ్చేఫలితాలు...."

అమాయికంగా ఉన్న అతనిముఖం కొంచెం గంభీరమైంది. "అందంతా నాపని కాదు. నేను అమెరికాదేశ పౌరుణ్ణి." అంటూ తిరిగి వ్రాసుకోవడం ప్రారంభించాడు. అతను వ్రాసేవి నేనూ చూశాను. నిజంగా ఒక్కసారే నేను చూసింది. చూస్తూవుంటే విస్మయం కలిగింది. లెక్కలు నాకు అంతగా రావనుకోండి. అయినా, తెలిసినంతలో, చూచినంతలో, లెక్కలంటే అంకెలభాష అని నాఊహ. ఇంగ్లీషు, గ్రీకు, హీబ్రూ అక్షరాలూ, అంకెలూ, చిన్న బ్రాకెట్లూ పెద్ద బ్రాకెట్లూ అన్నీ కలగాపులగంగా కలిసి, పైకి వెళ్ళిన కొద్దీ ఒక పద్మవ్యూహంలా వుంటుందని ఊహించుకునేవాణ్ణి. ఇప్పుడు గోమేజ్ వేస్తూవున్న లెక్కలు అలాలేవు. అంతా మొత్తం ఐదే ఐదు అక్షరాలూ, రెండే రెండు కొంకెల్లాంటి గుర్తులు, ఒకటి కుడివైపుకీ,

రెండోది ఎడమవైపుకి వంపులు తిరిగి. ఇంకా. ఇవి కొద్దుమీద మార్చి మార్చి వ్రాసి వున్నాయి.

"దీని అర్థం ?" అని ఒక అక్షరాన్ని చూపి అడిగాను.

"నేను పెట్టుకున్న గుర్తు. ఆ అక్షరాలన్నీ కొన్ని భావాలకి సంకేతాలు," ఏదో తప్పుచేసిన వాడివలె జంకుతూ చెప్పాడు.

"ఏ భావాలకి ?"

మెరుస్తున్న అతని కళ్లలో ఏదో ఆందోళన ఉంది. అతను జవాబు చెప్పలేదు.

"చూస్తే ఇది చాలా సులభంగా కనబడుతుందే. మూలవిషయాలు తెలుసుకో నంతవరకేగాని, తెలిసిన తరువాత అవి చాలా సులభంగా వుంటాయని ఎందులోనో చదివాను. అంతేనా ?"

"అంతే!" అని పెదవులతోనే అతి మెల్లగా అన్నాడు, "సులభమైనదే బీల్, అతి సులభమైనది. ఇది నా బుర్రలో దాచుకోవటమే మంచిదనుకుంటాను." అతను బల్ల దగ్గరకు వెళ్ళి అంతా చెరిపేశాడు. అతన్ని వారించాలని అనుకోకుండానే సగం లేచాను కుర్చీలో. అతను నన్ను చూసి నవ్వాడు. అది అతని మామూలు నవ్వు కాదు. అందులో ఎంతో విషాదం, బాధా ఉన్నాయి, "భయపడకు!" అన్నాడు. "నేనది మరచిపోను, మరిచిపోలేను." నుదుటిమీద వేలితో మీటుతూ అన్నాడు. అతని ముఖంమీద తాండవించిన ఆవేదన నేను చూడలేకపోయాను.

"జూలియో!" అన్నాను ఆత్రంతో.

"ఇదిగో జూలియో, నా మాటవిని నీవు కొన్నాళ్ళు సెలవుపెట్టి న్యూయార్కు వెళ్ళరాదూ. అక్కడ నీబంధువులతో స్నేహితులతో

కొంతకాలం సరదాగా కాలక్షేపం చేసి తిరిగి వద్దువుగాని. నీస్తా వెళ్తానంటే వీళ్ళేమీ పట్టి కట్టిపెయ్యలేరు."

నేను వెళ్ళకూడదని అన్నానేమోనా?" అని సందేహించాడు. తరువాత మనసు గట్టి చేసుకుని, "నిజమే బిల్, మనం యుద్ధానికి వెళ్దాము. నేనేమో దుస్తులు మార్చుకుంటాను! ఇంటిలో నీవు లెష్టర్‌కు చెప్పి ఒప్పించు!" అంటూ గదిలోకి వెళ్ళాడు. చేప వేరిన దకునట్లు లెష్టర్ అతనితో మాట్లాడడానికి గోమెజ్ జంకాడు.

నేను లెష్టర్‌తో ఈ మాట చెప్పేసరికి, కప్పు ఎగిరిపోయేటట్టు అరిచాడు. అసలుసంగతి- నేనుగాని, గోమెజ్‌గాని వెళ్ళిపోవడం అతనికి ససేమిరా యిష్టంలేదు. "మిమ్మల్ని యుద్ధం చెయ్యమన్నామా జైలులో నిర్బంధించామా?" అని సమర్థించబోయాడు. అతనిమాటలు విని విని నాకు ఒళ్ళుమండింది. నేను తిరగబడ్డాను. "మేము వెళ్ళి తీరుతాము. నీచేతనైంది చేసుకో!" అని నా నిశ్చయాన్ని గట్టిగా చెప్పాను. గత్యంతరంలేక తన స్వంత ఫోనులో న్యూయార్కులో ఉన్న అధికార్లతో సంప్రతించాడు. వారు మాత్రం ఏమి చెయ్యగలరు? ఒప్పుకున్నారు.

నాల్గుగంటల ఐదునిమిషాలకు న్యూజెర్సీలో బండి ఎక్కాము. పింగ్గిన్సు, డల్‌హౌసీ, కనుచూపుదూరంలో మమ్మల్ని వెంబడిస్తూనే వున్నారు. గోమేజ్‌కు యీ విషయం తెలియదు. అతను మహా కులాసాలో వున్నాడు. పెన్‌స్టేషన్‌లో జోళ్ళకు మెరుగుపెట్టించుకున్నాడు. స్పానిష్ హార్లెమ్‌కు టాక్సీలో వెళ్తూ, కిరాయి ఎంత అవుతుందో గుణించుకున్నాడు.

గోమేజ్ తల్లిదండ్రులున్న యిల్లు చిన్నదిగా, పరిశుభ్రంగా వుంది. మూడేమూడు గదులు. అందులో బల్లలు, కుర్చీలు సరి

కొత్తగా కనపడ్డాయి. గోమేజ్ పంపిన డబ్బుతో వాటిని కొని వుండాలి. వాళ్ళకు స్పానిష్ తప్ప వేరేభాష తెలియదు. గోమేజ్ వాళ్ళకు నన్ను పరిచయంచేసినప్పుడు సిగ్గుపడుతూ ఆహ్వానించారు. గోమేజ్ తల్లిదగ్గర చనువుగా కబుర్లుచెప్తుంటే నేను అనియంత్రిత హంసపాదులతో సంభాషణ నడిపాను. "అయ్యో, నాయనా ఎంత చిక్కిపోయావు? ముఖమంతా ఎలా లోతుకుపోయిందో సరిగా భోజనం చేయటంలేదా?" అని అందరి తల్లులలాగానే గోమేజ్ తల్లికూడా అతన్ని ప్రేమతో పరామర్శించింది. తండ్రి మాత్రం తన కొడుకేదో పెద్ద ఆఫీసులో ఏ తలుపులు తెరిచే ఉద్యోగమో చేస్తున్నాడనుకుంటున్నాడు. నేను గ్రహించినంతవరకూ అతని బాధల్లా ఏమంటే, ఆ ఆఫీసులో మగనాలు ఎవరన్నా వాణ్ణి కోరుకుని వలేసి పట్టేసిందేమో?

వాళ్ళమ్మ మమ్మల్ని అక్కడే భోజనానికి ఆగమనటం. గోమేజ్ బయట భోజనం చేస్తామనటంతో చిన్న వాదన జరిగింది. చివరికి ఫార్ట్ బెల్ స్కూలుకు వెళ్ళే రోజానుచూచి, అక్కడే భోజనం చేస్తామని గోమేజ్ ఒప్పుకోవలసి వచ్చింది. దానితో వాళ్ళమ్మ కూడా అంగీకరించింది. అందరూ ఒకసారి నవ్వుకున్నాము. రోజా చాలా చాలా మంచి పిల్ల అని వాళ్ళ నాన్న నాతో నొక్కి నొక్కి చెప్పాడు.

మూడు వరుసల మెట్లు దిగి మేము వీథిలోకి వెళ్ళాలి. దిగుతూ వుంటే మా వెనకాలే గంతులువేస్తున్న పిల్లల్ని చూచి "పల్లెటూరి బైతులు, అమెరికా మొహం ఎరగరు," అన్నాడు గోమేజ్. పోను పోను మెట్లు చాలా హెచ్చు తగ్గులుగా ఉండడాన గోమేజ్‌కు చెయ్యి ఊతం యిచ్చి దిగమన్నా. కర్మం చాలక కావలివారు కంటపడ్డారా అంటే అతని కులాసా అంతా మాయమౌతుందని అతను అటు చూడకుండా ముందే జాగ్రత్త పడ్డా.

యథాప్రకారం పోర్ట్ బెల్ హోటల్ జనంతో నిండివుంది. అందమైన రోజా ఆ గల్లాపెట్టె దగ్గరే కూర్చునివుంది. తీరా అంతదూరం వెళ్ళాక ఆ పిల్ల ఎదుటబడగానే గోమేజ్‌కు కాళ్ళు తడబడ్డాయి. “ఇక్కడ ఖాళీ లేనట్టుంది. ఇంకో హోటలుకు వెళ్దాము,” అని చెప్పుకోబోయాడు “మనకు స్థలం దొరక్కపోదు.” అని అతన్ని బలవంతంగా లోపలికి లాక్కు వెళ్ళాను.

“జూలియో-నీవా?” అని రోజా పలకరించింది. పద్దమ్మలాగా ఒక నిమిషం నిలుచుని “ఔను - రోజా - నాల్గురోజులు సెలవుపెట్టి వచ్చాను,” అన్నాడు.

“నీవు వచ్చావు - నాకు ఎంతో సంతోషంగా ఉంది!” అని మురుతూ చెప్పింది.

“నిన్ను చూడటం నాకూ చాలా సంతోషంగా ఉంది!” అని అతనిచేత అనిపించాను. “రోజా- ఇతను నా ప్రాణస్నేహితుడు. సంవత్సరం వాషింగ్టన్‌లో ఒకేచోట పనిచేస్తున్నాము,” అని నన్ను రోజాకు పరిచయం చేశాడు.

“చాలాసంతోషం నీవు కూడా ఈపూట మాతో భోజనం చెయ్యరాదూ! నీవు, గోమేజ్ కలిసి కావలసినన్ని కబుర్లు చెప్పుకుందురు గాని,” అని ఆహ్వానించాను.

“సరే చూస్తాను. అదుగో- అక్కడ బల్లదగ్గరకూర్చోండి. నేను చెప్పేసి యిప్పుడే వస్తాను.”

మేమిద్దరం ఒక బల్లచూసుకుని కూచున్నాము. రోజాకూడా యజమానురాలిని ఒప్పించి మాతో చేరింది. కోడిపలావు - ఇంకా రుచిగల భక్ష్యాలను ముగ్గురం కడుపునిండా తిన్నాము. సిగ్గువదిలి

పోయింది. మెల్లిగా వారిరువురు మాటల్లో పడ్డారు. నామాట పూర్తిగా మరిచిపోయారు. అయినా నేనుపట్టించుకోలేదు. చక్కగా ఈడూ జోడుగా వున్నారు. నవ్వుకుంటూ ఎంతసేపు మాట్లాడు కున్నారు. వెనుకటి విషయాలన్నీ నెమరు వేసుకున్నారు. మాటలూ, పాటలూ, షికార్లూ, సినిమాలూ—అన్నీ జ్ఞాపకం తెచ్చుకుని కులాసాగా మాట్లాడుకున్నారు. ముసిలితాతలాగా మురిసిపోతూ వారి సంభాషణను ఆలకిస్తూ కూర్చున్నా. గోమేజ్ ముఖంమీద ఆనాడు చూచిన విషాదచ్ఛాయలు ఆ సంతోషసమయంలో నాస్మృతి పథంనుండి ఒక క్షణంసేపు తొలిగిపోయాయి. భోజనం ఆఖరవుతూంటే నేను వాళ్ళ సంభాషణలో జొరబడ్డాను. అప్పటికి సంకోచం వదలి నా ఎదుట ఒకరి చేతులొకరు పట్టుకునే స్థితికొచ్చారు.

"మీరిద్దరూ అలా ఊరంతా తిరిగిరారాదూ. నేను మాడిసన్ పార్క్ హోటల్లో ఉంటాను," అని సలహాచెప్పాను. నా విలాసం ఒక కాగితం మీద వ్రాసియిస్తూ, "నీకు కూడా ఒక గది అద్దెకు పుచ్చుకుంటూ, నీ ఇష్టం వచ్చినంతసేపు తిరిగి రావచ్చు," అని, అతని జేబులో 20 డాలర్ల నోట్లు నాల్గు పెట్టాను. అతని చేతిలో డబ్బు వుందో లేదో నాకు తెలియదు. ఒకవేళ అవసరమైతే వుంటుందని అలా చేశాను. అతను సిగ్గుపడుతూ నాకు ధన్యవాదాలు చెప్పాడు. నేను ఘనకార్యం చేసినట్టు మురిసిపోయాను.

ఒక పిల్లవాడెవరో ఒంటరిగా పేపర్ చదువుతూ ఒక మూల కూచుని తినడం చూచాను. వాడు సరిగా అదే ఎత్తు, అదే లావు - దూరానికి గోమేజ్‌లాగా వున్నాడు. గోమేజ్ తొడిగిన చార్ల చొక్కా వంటిదే తొడిగాడు. భోజనం ముగించి, గల్లాపెట్టె దగ్గరకు వెళ్ళి డబ్బు చెల్లించి బయలుదేరాడు.

అదేసమయంలో నేనుకూడా సరదాగా తిరిగిరండని గోమేజ్‌ను, రోజానూ హెచ్చరించి, హోటలు బయటపడి, ఆ రెండవ కుఱ్ఱవాడికి దగ్గరగా నడువనారంభించాను. మమ్మల్ని వెంబడిస్తున్న వల్‌హౌస్, హిగ్గిన్సులను మాయచేయడానికే యీ ప్రయత్నం. కొంతదూరం ఆలా వెళ్ళాక, "ఎందుకయ్యా, కుక్కలాగా నా వెంటపడ్డావు?" అని ఆ కుఱ్ఱవాడు నన్ను కసిరాడు. మాట్లాడకుండా వెనక్కు తిరిగాను. ఇది చూచి రక్షకభటులు తెల్లబోయి మోసం జరిగిందని వెంటనే పోర్ట్‌ల్ హోటలుకు పరుగెత్తారు. నేనుకూడా వారి వెనకాలే వెళ్ళాను. అప్పటికప్పుడే గోమేజ్, రోజా వెళ్ళిపోయారు.

''నేను విల్‌పక్‌తో వుంటాను. నీవు చుట్టుపక్కలంతా వెతికి వారిని పట్టుకో. తెలిసిందా?'' అని వల్‌హౌస్ రెండవవానితో చెప్పాడు. కాని నాతో మాత్రం మాట్లాడనేలేదు. టాక్సీ చేసుకుని మాడిజన్‌పార్క్ హోటలుకు వెళ్ళాను. అది పురాతనపు హోటల్ అయినా చాలా సుఖంగా వుంటుంది పెద్దపెద్ద గదులు అందంగా అలంకరించి వుంటాయి. న్యూయార్కుకు ఏ పనిమీద వచ్చినా నేను అక్కడే ఉంటూంటా. ఆ హోటలు సమీపంలో అటూ యిటూ తిరిగి కొంచెం కాలక్షేపం చేశాను. మధ్యలో కొంచం బీరు పుచ్చుకున్నాను. ఒక పెద్దమనిషి రష్యావాళ్ళకు అణుబాంబులు లేనేలేవనీ, వారిదంతా వుత్త డాంబికమేననీ, మరునాడు తెల్లవారేటప్పటికి వారి పారిశ్రామిక నగరాలన్నీ ధ్వంసం చేసెయ్యాలనీ వాదిస్తూవుంటే కొంచం సేపు ఆలకించాను. నెమ్మదిగా హోటలుకు వెళ్ళాను.

ఎందుకో నాకు నిద్రపట్టలేదు. ఆ పెద్దమనిషి మాటలే తిరిగి తిరిగి జ్ఞాపకం వచ్చాయి. రష్యావారివల్ల అమెరికాకు ముప్పేమీ జరుగనేరదని అతను నొక్కివక్కాణించడం మర్చిపోలేక పోయాను. మనసు పరిపరివిధాల పోయింది. అనేక వెఱ్ఱి ఆలోచనలు కలిగాయి.

గోమేజ్ పరిశోధనా ఫలితాలు ఎల్లాంటి పరిణామాలకు దారి తీస్తాయని అడిగినప్పుడు డాక్టర్ మైన్స్, బాధగా కుంచించుకుపోయాడు. గోమేజ్ ముఖంమీద విషాదచ్ఛాయలు ఆవరించాయి. నిజం ప్రస్తుతం అణువునుంచి గ్రహించగలుగుతున్న శక్తికంటే ఎన్నోరెట్లు శక్తి అందులో దాగి ఉందని ఎక్కడో చదివాను. ఆ శక్తిని బయటికి లాగి దానికి ఏ ప్రతిభావంతుడైనా కాస్త దారి చూపించగానే, ప్రతి సామాన్యుడూ ఆ దారిని పట్టుకుని వెడితే – అప్పుడు ఏమి కానుంది? ఇలాంటి ఆలోచనలు నాకు నిద్రపట్టనివ్వలేదు.

ఆఖరుకు ఎలాగో నిద్ర పట్టింది – ఓ మూడుగం. ల సేపు.

తెల్లవారుఝామున – నాల్గుగంటల పదిహేను నిముషాలకు టెలి ఫోన్ గణగణ మ్రోగింది. నిద్దట్లో కంగారుపడుతూ లేచి తడుము కుంటూ ఫోన్ అందుకున్నా. "బిల్ – మమ్మల్ని ఆశీర్వదించు. మేము పెండ్లి చేసుకున్నాము!" అన్న గోమేజ్ కంఠం నవ్వుతూ వినవచ్చింది.

"పెండ్లి చేసుకున్నారా? ఎక్కడ, ఎప్పుడు?" అని ఆశ్చర్య పడ్డాను.

"అవును– పెండ్లిచేసుకున్నాము. నేనూ, రోజా– రైలులో ఈవూరు వచ్చాము. టాక్సీలో పురోహితుని వద్దకువెళ్ళాము– అతను మాయిద్దరికీ పెండ్లిచేశాడు. తరవాత ఈ హోటల్‌కి వచ్చాము."

"చాలాసంతోషం– మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాను. చాలా అభినందిస్తున్నాను. కాని– మరి నీకు వయస్సు చాలదుగా? ఇంత అవ్యవధిలో పెండ్లి ఎలా జరిగింది?........"

"ఈ దేశంలో అవేమీలేవు. ఇక్కడ పెండ్లిండ్లకు వ్యవధి అక్కరలేదు. నా వయస్సు 21-సంవత్సరాలని చెప్పాను. నమ్మారు. అంతే!" అని మురిసిపోతూ చెప్పాడు.

"షేష్ - బాగుంది జూలియో. మంచిపనిచేశావు. రోజాకు నామాటగా చెప్పు— మంచిమగడు దొరికాడని!"

"చాలా చాలా ధన్యవాదాలు, చీఫ్!—" సిగ్గుపడుతూ చెప్పాడు, రాత్రి మేము తిరిగిరాలేదని నీవు కంగారుపడుతున్నావేమోనని యిప్పుడే ఫోన్‌చేశాను. ఏమీ అనుకోకు- రేపువచ్చి అందరినీ చూస్తాము. మా అమ్మను, మా నాన్నను, రోజా అమ్మనూ చూచి హోటలుకు వస్తాము. నీవు హోటల్ ఎలాసం వ్రాసియిచ్చిన కాగితాన్ని జాగ్రత్తగా దాచిపెట్టానులే!"

"మంచిది— జూలియో- హాయిగా కాలంగడుపు. పనిమంగు మయినా నీకు ఆదుర్దా అక్కర్లేదు!" అని తిరిగివెళ్ళి హాయిగా నిద్రపోయాను.

మళ్ళీ నిద్రాభంగం — ఈసారి టెలిఫోన్ కాదు — మాక్డొనాల్డ్ సరాసరివచ్చి నన్ను కుదిపి తన సన్నటి బలమైన చేత్తో, తట్టి మరీ లేపాడు. అప్పుడే తెల్లవారింది, పడున్నర కొట్టింది. డల్ హౌసీ ఊరంతా గాలించి, గోమేజ్ కనబడకపోవడంతో కంగారుపడి పై అధికార్లకు వార్తపంపాడు.

"అత నేడి?" అని ఎడ్మిరల్ కోపంగా అరిచాడు.

"వస్తాడు కొంచెం సేపట్లో - బయలుదేరే ఉంటాడు."

భార్యాసమేతంగా వస్తున్నాడు. నిన్నరాత్రి దేశంపొలిమేరలు దాటి వెళ్ళి, పెళ్ళి లాంఛనం పూర్తిచేయించుకున్నాడు.

"అయ్యో దేవుడా! ఇప్పుడేంచేసేది? ఇంకతన్ని నిర్బంధ సైనిక నియమావళి ప్రకారం ప్రత్యేకశాఖలో కట్టిపడెయ్యవలసిందే ఇకముందు ఇలా జరిగితే—"

అతని మాటకు అడ్డంతగిలి, "ఇదిగో— ఇకమీరంతాచేరి అతన్ని ఒక చదరంగపు పావులాగా ఆడించడం మానివేయండి. మీకు దేశభక్తి, దేశగౌరవం, కర్తవ్య బాధ్యతవంటి' గొప్పగుణాలు భగవంతుని దయవల్ల ఉన్నమాట వాస్తవమే! అవి ఉండడం ఆఫీసర్లైన మీకు విధాయకం,—అయినంతమాత్రాన మీరు గోమేజ్ విషయం ఆలోచించ నక్కర్లేదా? గోమేజ్ యింకా పసివాడు. నూరేళ్ళు బ్రతుకవలసిన వాడు. అతన్ని యీ వయస్సులో యిలా యంత్రంలాగా అరగ రాయడం మీకు సబబుగావుందా? నేను శాస్త్రజ్ఞానంలేని మూర్ఖుణ్ణే కావచ్చు. మీరంతా తెలిసినవారుకదా! ఇలా మితిమీరితే అసలుకే మోసం రావచ్చునని మీలాంటి మేధావుల కెందుకు తోచలేదు?" అన్నాను. అతను నావంక తీక్షణంగా చూచాడు. మారుమాటాడలేదు.

నేను దుస్తులు వేసుకున్నాను. ఫలాహారం తెప్పించుకున్నాను. ఆ తరవాత మధ్యాహ్నందాకా కూర్చున్నాం, నేనూ, డల్‌హౌసీ ఎడ్మిరల్ అతిగంభీరంగా. అప్పటి కొచ్చింది గోమేజ్ దగ్గరనుంచి ఫోన్. కిందనించి చేశాడు.

"పైకిరా బాలియో!" అన్నాను నీరసంగా.

గోమేజ్ తన సూత్రప్రవక్షుపుతో సహా ప్రవేశించాడు. ఆఫీసు లోపల అడుగుపెట్టీ పెట్టకముందే ఎడ్మిరల్ లేచి గోమేజ్‌ను తిట్ట నారంభించాడు. అతని తిట్లలో కోపంకన్నా దుఃఖం ఎక్కువ కనబడ్డది. గోమేజ్‌కు దేశాభిమానం లేదనీ, అతనికి గొప్ప ప్రజ్ఞ ఉన్నప్పటికీ ఆ ప్రజ్ఞ అమెరికాకు చెందాలనీ, అతను బాధ్యతారహితంగా ప్రవర్తించాడనీ, జీవితంలో తనస్వసౌఖ్యానికి ప్రాధాన్యం యివ్వడం పొరపాటనీ, ఇంకోమారు ఇలా పారిపోవడం జరిగితే తప్పక నిర్బంధిస్తాననీ బెదిరించాడు.

"అందుకుగాను, ప్రప్రథమంలో- నీవు కూర్చుని, ఇంతవరకూ నేను చెప్పిన సూత్రాలన్నీ వెంటనే వ్రాసియివ్వాలి," అని కఠినంగా ఆదేశించాడు. "అంత ముఖ్యమైన విషయాలన్నీ వ్రాతలో కాకుండా మెదడులోనే జ్ఞాపకం ఉంచుకుంటాననడం పొరపాటు;— అలాంటి అజాగ్రత్త, అహంభావం - క్షమించరాని నేరాలు. ఇదిగో, ఇప్పుడే ఇక్కడే- వ్రాయి - "అంటూ కాగితం, కలం, దిక్కుతోచక విభ్రాంతుడై నిలుచున్న గోమేజ్ చేతిలో పెట్టాడు. అసలువిషయం ఏమిటో తెలియలేదు రోజాకు. ఎప్పుమినహాగా నిలబడిపోయింది ఆ పిల్ల.

గోమేజ్ కాగితం, కలం పుచ్చుకుని నిశ్శబ్దంగా వెళ్లి బల్ల దగ్గర వ్రాసేప్రయత్నంలో కూర్చున్నాడు. వణికిపోతూవున్న రోజా భుజంతట్టి, "భయపడవద్దు గోమేజ్‌ను వారేమీ చెయ్యరు." అని ఓదార్చాను. ఎడ్మిరల్ నావంక కొరకొరా చూసి, గోమేజ్‌వైపుకు దృష్టి మరలించాడు.

గోమేజ్ రెండు గుర్తులు పెట్టాడు. గుడ్లు పెద్దవి చేశాడు. చిటుకరించాడు. జుత్తు పీక్కున్నాడు - "అయ్యో భగవంతుడా? అంతా మర్చిపోయానే?" అన్నాడు.

ఎడ్మిరల్ వెలవెల పోయాడు. గోమేజ్‌ను బుజ్జగిస్తూ, "ఇదిగో అబ్బాయి-నీకొచ్చిన భయమేమీ లేదు; నెమ్మదిగా జ్ఞాపకం తెచ్చుకో! నీకేమిటి-మరిచిపోవడమేమిటి? అసంభవం! ఏదీ ఒక తేలికసూత్రంతో ప్రారంభించు. ఒక సమీకరణ వ్రాయి - చూద్దాం!" అని ప్రోత్సహించాడు.

గోమేజ్ ఎడ్మిరల్ వంక చూచాడు. కొంతసేపయ్యాక - "అబ్బే! అంతా మరిచిపోయా. ఏదీ జ్ఞాపకం రావడంలేదు. గణితం

లేదు; శాస్త్రం లేదు. ఆ నిమిషంనుండి—" అంటూ రోజా వంక చూచాడు. రోజా సిగ్గుతో తలవంచుకుంది.

"అదే-అదే-ఆ నిమిషంనుండి-నా తలలోనుండి అంతా మాయమైంది ఒక్కటీ జ్ఞాపకంలేదు" అని బొంగురు గొంతుకతో చెప్పాడు.

"ఆరి భగవంతుడా ? అలా ఎలా జరుగుతుందసలు ?" అని సుల్లిగా అంటూ ఫోను చేసి కనుక్కున్నాడు ఎడ్మిరల్. అలాంటివి జరుగుతూనే వుంటవని తెలుసుకున్నాడు.

జూలియో స్పానిష్ హార్లెమ్‌కు వెళ్ళిపోయాడు. తన సంపాదనలో దాచుకున్న డబ్బుతో పోర్టుగల్‌లో కొంత భాగం కొన్నాడు. నా సంపాదనతో నేను కారు కొన్నాను. నా పాతవిలేఖరి పనిలో చేరాను. మాక్డొనాల్డ్ ఈ కథను బయట పెట్టలేదు, ఎడ్మిరల్‌ను డబాయించిన తృప్తి తప్పితే, ట్రిబ్యూన్ సంపాదకుడికి ఈ విషయంపైన ప్రత్యేక హక్కులేవీ లభించలేదు.

కొన్నాళ్ళ తరువాత, జూలియో, రోజా, తమ కొడుకు పుట్టిన శుభవార్త తెలియచేశారు. పిల్లవాడు 6 పౌనులున్నాడట. ఫ్రాన్సిస్‌కో అని జూలియో తండ్రి పేరుపెట్టారట. ఆ కార్డు దాచిపెట్టాను. వేరే పనిమీద న్యూయార్కుకు వెళ్ళినప్పుడు వారిని చూడడానికి వెళ్ళాను.

జూలియోకు కొంచెం పెద్ద తరహా అబ్బింది. సుమారు డబ్బు సంపాదించుకుంటున్నాడు. రోజా పాపం కొంచెం లావెక్కింది. అయినా చక్కగానే వుంది. వాళ్ళలా సుఖంగా కాలక్షేపం చేయడం నాకు నచ్చింది. చాలా సంతోషం కలిగించింది.

తన పెళ్ళినాటి రాత్రి నేను పెట్టించిన కోడిపలావు లాంటిది వండించి నాకు పెట్టాలని జూలియో అన్నాడు. అయితే బజారుకు

అతనే వెళ్ళాలి. నేనూ అతనూ కలిసి దుకాణానికి వెళ్ళాము. బియ్యం. కోడి, మసాలా దినుసులు, మిగతా వంటసామగ్రి ధారాళంగా ఒక ఏభై రకాల ఏవేవో కొని పొట్లాలు కట్టమన్నాడు. అంగట్లో వున్న ముసలివాడు, కాగితపు సంచిమీద పద్దంతా వ్రాసి, మెల్లిగా కూడనారంభించాడు. పోర్ట్ బెల్ హోటల్ బాగా నడుస్తూ ఉన్నదని, ప్రక్కనున్న కొట్టునుకూడా అద్దెకు తీసుకోబోతున్నారనీ, గోమేజ్ తనపాటికి తను కబుర్లు చెపుతున్నాడు

"17 డాలర్ల 42 సెంట్లు"ని చివరికి అంగడివాడు లెక్క తేల్చాడు. లెక్కల పట్టీ వంక ఒక క్షణం ఓరగా చూచి, "కాదు – 39 సెంట్లు, జాగ్రత్తగా మళ్ళీ కూడు," అన్నాడు గోమేజ్. వాడు అలానే కూడి. "పొరపాటే–17 డాలర్ల 39 సెంట్లే!" అంటూ పొట్లాలు సంచిలో పెట్టాడు.

"అయితే నిజంగా...." అనబోయాను నేను.

అప్పుడూ ఎప్పుడూ కూడా ఆ విషయం మళ్ళీ మేం తర్కించ లేదు.

"బిల్–ఎవరికి చెప్పకేం?" అని మాత్రం అన్నాడు గోమేజ్. అంటూ కన్ను గీటాడు.

---

(మైకేల్ జోసఫ్ లిమిటెడ్, 26 బ్లూమ్స్ బరీ స్ట్రీట్. లండన్. W. C. I. సంస్థ ప్రకటించిన MIND WORM అను కథా సంకలనంనొండి అనుధితము.)

# ఫెస్సెండన్ సృష్టించిన విశ్వం

—ఎడ్మండ్ హామిల్టన్

స్టేషన్ నుండి, సుమారు ఒక అర మైలుదూరం నడిచి, ఆ విశాల ఆవరణం కొసనున్న రాతియింట్లో ప్రవేశించడం నాకు బాగా జ్ఞాపకం ఉంది. అది అక్టోబరు నెల. చలి ఎక్కువగావుంది. మంచు కమ్ముకొచ్చేటట్టుగా ఆకాశం భయంకరంగా మెరుస్తూంది.

అలవాటు ప్రకారం తలయెత్తి నక్షత్రాల్లోకి చూశాను. పదహారు సంవత్సరాలపాటు ఆనక్షత్రాలే నాకు సహచరులు. అవే నాకు మిత్రులూ, శత్రువులూ కూడా. ఆరాత్రి- అంటే అదే కడపటిరాత్రి నేను ఇంకా ఖగోళశాస్త్రజ్ఞుడినే- అప్పుడు ఆ ఆకాశం నాకు రెండు విధాలుగా గోచరించింది. ఒకటి- మిణుకుమనే దీపకణాలు పొదిగిన ఒక వినీల విశాలమైన గుడారమో అన్నట్టు- రెండు-సకలమానవకోటికీ భయ, సంభ్రమాశ్చర్యాలు కలిగించే, అతి ప్రమాదకరమైన అగాధమో అన్నట్టు.

ఖగోళశాస్త్రజ్ఞుడు రెండుస్థాయిల్లో బ్రతుకుతాడు. ఒక స్థాయిలో— నలుగురితోపాటు పెండ్లిచేసుకుని, సామాన్యుని వలె సంసార తాపత్రయాలతో కాలక్షేపంచేస్తాడు. రెండవస్థాయిలో అతను అనంతాకాశంలో విహరిస్తాడు. ఏ అనంతవిశ్వంలో మన యీ మనుష్య ప్రపంచం అణుసన్నిభంగా తిరుగుతూ వుంటుందో—ఆ మహా విశ్వం లోని బ్రహ్మాండ గోళాల ఛాయాచిత్రాల్ని అద్దాలమీద గ్రహించి ఎడ తెరిపిలేకుండా, పర్చి, కూర్చి, పోల్చుతూవుంటాడు.

ఆ ఛాయాచిత్రాలవంక చూస్తూంటే ఆశ్చర్యం కలుగుతుంది— ఈ సృష్టిక్రమం తటికి మొదలెక్కడ అని! ఈ నక్షత్రపు మబ్బులూ, ఈ బ్రహ్మాండ ద్వీపాలూ, ఇలా గుంపులుగుంపులుగా గుమిగూడిన నక్షత్రమండలాలూ ఆకాశంలో అవిరామంగా సంచరిస్తూఉన్న యీ తోకచుక్కలూ— ఇవన్నీ ఎలావచ్చాయి! విశ్వవీథుల్లో వీటి ఉనికికి కారణం ఏమిటి! అతిక్లిష్టమైన వాటిగతులకూ ఆధారం ఏమిటి? ఆ ఛాయాచిత్రాలలో ఒక అంగుళం అనంతాకాశంలో శతకోటి యోజనాలకు సమానం. స్వయం ప్రకాశకములైన ఆ సూర్యబింబాల ఒంటరితనం అత్యద్భుతం. తలుచుకుంటే భక్తి సంభ్రమాలతో ఒడలు ఝుల్లుమంటుంది. ఇవన్నీ ఎలా జరుగుతున్నాయి? ఎందుకు జరుగు తున్నాయి? అని ఆశ్చర్యపడుతూ ఆలోచిస్తాం....ఇప్పుడూ, ఎప్పుడూ.

అలా సృష్టి చిత్రాలనుగూర్చి తలపోసుకుంటూ ఆర్నాల్డ్ ఫెస్సెండన్ ఇంటివైపుకు నడిచాను. రాత్రివేళ నల్లగా అగుపించే కళాశాల భవనాలను దాటి వెళ్ళాను. ఆ కళాశాలలోనే ఫెస్సెండన్ ఖగోళశాస్త్రంలో ఆచార్యుడు. మెలికలు తిరిగిన మెట్లమీదుగా వెళ్ళి గుమ్మంముందు ఆగి, మీటనొక్కి గంటమోగించాను.

ఫెస్సెండన్ తానేవచ్చి తలుపు తెరిచాడు. అతన్ని నేను చూసి ఎన్నో ఏళ్లైంది. అయినా ఆ వెలుతురులో కీవిగా నిలబడ్డ అతని పెద్ద విగ్రహాన్ని వెంటనే పోల్చుకో కలిగాను.

అతను నావైపు ఎగా దిగా చూచి అన్నాడు- "నీవా బ్రాడ్లీ- ఇప్పటికి వచ్చావన్నమాట. నీవు నన్ను మరిచిపోయి ఉంటావనే అనుకుంటున్నా."

అతను నన్ను లోపలికి రమ్మన్నాడు.

"నేను మౌంట్ విల్సన్‌లో ఉన్నాను. నీ ఉత్తరం ఆలస్యంగా అందింది," అన్నాను నేను.

ఇంట్లో చలి విపరీతంగా వుంది. చలి కుంపటి వెలిగించాలని ఎవరికీ తోచినట్లులేదు. ఫెస్సెండన్ తలుపుమూసి గడియ భద్రంగా బిగించాడు. నా కోటు అందుకుని కొంకెకు తగిలించాడు.

"ఇక్కడంతా చిందరవందరగా వుంటుంది లే ! ప్రస్తుతం పనివాళ్ళెవరూ లేకుండానే కాలక్షేపంచేస్తున్నా ఆగదిలో కూర్చోవచ్చు. రా- కూర్చో- ఏమైనా పానీయం కొద్దిగా పుచ్చుకుందువుగాని," అని పిలిచాడు నన్ను.

గది ఎక్కడ చూసినా సామానుతో మట్టి కొట్టుకునివుంది. అయితే ఇక్కడ దీపంకొంచం ఎక్కువకాంతిగా వుంది. ఆ కాంతిలో ఫెస్సెండన్ ముఖంస్పష్టంగా కనపడ్డది.

"అయ్యోదేవుడా ! ఈ వాలకం ఏమిటి ? ఇలా మారిపోయావేమిటి ?" అని అడిగాను.

"ఏముంది ? - అంతా మామూలేగా !" అంటూ సగంకాళీ అయిన సీసా, గ్లాసులూ అందుకుని "తిండిమానేయడం—నిద్ర మరిచి

పోవడం, పాఠాలు చెప్పడంలో శ్రద్ధతప్పిపోవడం-అంతకూ లంటే ఎప్పుడైనా ఒక చుక్క తాగుతూ ఉండడం-" అన్నాడు

నాకు ఎదురుగా కుర్చీ అంచుని ముందుకువాలి కూర్చున అతని నల్లటికండ్లు తళతళా మెరిశాయి.

అతను చెప్పుకుపోతున్నాడు.

"మనం బాగా జతగా ఉంటూవుండేవాళ్ళంకదూ, చాలాకాలం క్రితమేననుకో- కానీ ఆరోజులు మరిచిపోలేను. ఎప్పుడూ కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్ళం ఆ బళ్ళో, మనం మాట్లాడుకునే వాళ్ళమో, ఏ విషయాలు మాట్లాడేవాళ్ళమో గుర్తున్నదా ?"

"లోకం ? జీవితం-మృత్యువు, నక్షత్రాలు," అని నేను చెప్పాను. "అప్పుడు మనం బొత్తిగా చిన్నవాళ్ళం. తెలుస సృష్టి రహస్యాలు మన్ని భయపెట్టేవి. అయినా తెలియని రహ లను ఛేదించాలన్న పట్టుదల ఉండేది మనకి, ఆ వయసులో. కాన ఫెస్సెండన్ తల పంకిస్తూ అన్నాడు, "మనం యిప్పుడూ భయప వున్నాం- ఆమాటకొస్తే యిప్పుడు యింకా హెచ్చుగా భయ తున్నాం- కానా ?" నేను బదులు చెప్పలేదు. ప్రతి ఖగోళ జ్ఞునికి ఇలాంటి ఆలోచనలు ఎప్పుడో ఒకప్పుడు కలుగు వుంటాయి. అయితే ఎవరూ పైకి అనరు, ప్రస్తావించరు.

"కాదంటావా, బ్రాడ్లీ ?" అని తిరిగి అడిగాడు.

"నిజమే-అయితే నీవు తప్ప ఎవరూ ఇలా ఒప్పుకో అన్నా నేను.

"అదేకాదు- సృష్టి రహస్యాన్ని ఛేదించి తీరాలన్న చిన్న నాటి సంకల్పాని యిన్నాళ్ళు పట్టుకుని పోట్లాడింది కూడా నేనొక్క డినే!" అన్నాడు.

అతనివంక చూచి అడిగాను. "ఏదో కొత్తవిశేషం ఉన్నట్టుంది! అది చెప్పడానికేనా నన్నిక్కడకు రప్పించింది?"

"చెప్పడానికి కాదోయ్— చూపడానికి అని మందలిస్తూ, గభాలున లేచాడు. గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తూ చెప్పసాగాడు.

"ఎవరికో ఒకరికి చూపాలి మరి. నీవు తప్ప దాన్ని అర్థంచేసుకో గలవాడు ఇంకొకడు కనపడలేదు. మనం ఎప్పుడూ ఒకే రకంగా ఆలోచించేవాళ్ళం- నీవూ నేనూ. అప్పుడు మనకిద్దరికీ ఒకటే తృష్ణ!" నిడుపైన అతని ఆకారం నాముందు పర్వతంలా నిలబడింది. పీల్చుకు పోయి, ముడుతలుపడ్డా, అతనిముఖంలో విజ్ఞానబలం, విజయో త్సాహం, తాండవిస్తూ వున్నాయి.

"ఇదిగో చూడు- ఈ ఖగోళశాస్త్రంలో ఉన్న విశేషం ఏమంటే—ఈ నాటివరకూ సభా చర్చలతో సంతృప్తి పడవలసిందే గాని, ప్రయోగాత్మకంగా యిదమిద్ధమని తేల్చుకో వీలులేని శాస్త్రం ఇది. ప్రయోగాలకు స్వాధీనంకాని పదార్థ విశేషాలతోకూడిన శాస్త్రం గనుక కళ్ళప్పగించిచూస్తూ వ్యాఖ్యానాలు వ్రాసుకోవలసిందే." అని యింకా చెప్పాడు.

ప్రయోగాల వల్ల సిద్ధాంతాలను, రుజువుచేసే ఖగోళ శాస్త్ర వేత్తలలో నేనే ప్రప్రథముణ్ణి కావాలన్న దృఢ సంకల్పంతో కృషి చేశాను. ఇప్పుడిక విశ్వాంతరాళంలోకి నిస్సహాయుణ్ణిగా చూస్తూ ఊరుకోను. ఒక విశ్వాన్నే హస్తగతం చేసుకుని, యిచ్చ వచ్చినట్లు ఆడించగలను.

నేను తెల్లబోయి చూస్తూ, అన్నాను. "ఏమిటేమిటీ? విశ్వాన్నే ఆడిస్తావు? భలే కథ చెప్పావులే!"

ఫెస్సెండన్ కథ కాదన్నట్లు తల ఊపుతూ అన్నాడు. "సరిగ్గా విను మరి. నేను" 'విశ్వం' అన్నానా? "ఒక విశ్వం" అన్నాగాని! నా ప్రయోగాలకని నేను స్వయంగా సృష్టించుకున్న 'ఒక విశ్వం'అది"

నేను చిరాకుగా అన్నాను, "నీ అతిశయోక్తులకూ అలంకారాలకూ అర్థమేమిటీ అని?"

"అతిశయోక్తికాదు, అలంకారమూ కాదు, నేను చెప్పింది అక్షరాలా నిజం. నా ప్రయోగశాలలో నా స్వహస్తాలతో నేనొక విశ్వాన్ని సృష్టించుకున్నా, ఆ విశ్వంలో లాగానే 'నా విశ్వం'లో కూడా వేలాది సూర్యులు, లక్షలాది గ్రహాలుఉన్నాయి. ఇందులో అతిశయోక్తి ఏమీలేదు," అని వివరించి చెప్పాడు.

నా తొట్రుబాటు, సంభ్రమం- అతను గ్రహించినట్లున్నాడు. నన్ను చూచి ఒక చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. "నిన్నలా గాబరా పెట్టినందుకు విచారిస్తున్నాను. అయితే విషయం అలాంటిది. నేనేం చేయగలను."

"నా ప్రయోగశాలకు రా. నీ కళ్ళతో నీవే చూతువుగాని" అని పిలిచాడు.

వసారాలో అతని వెనకాలే వెళ్ళాను. అతను ఏమి చూపించు తాడో ఊహించుకోలేక పోయాను. చూడాలన్న ఆత్రం మాత్రం ఎక్కువైంది,

ప్రయోగశాల ఒక పొడుగాటి గది. రాతి గోడలు, గోడల నిండా అలమారులు, అలమార్లలో ప్రయోగాలకు కావలసిన పరికరాలు

ఉన్నవి. నాల్గు మూలల్లో పెద్ద పెద్ద విద్యుద్యంత్రాలు వున్నవి అంతకు ముందెప్పుడు నేను అలాంటి పరికారాలు చూడలేదు. ముఖ్యంగా ఆ గది మధ్యనున్న వింత యంత్రం నా దృష్టి నాకర్షించింది.

ఆ యంత్రంలో పన్నెండేసి అడుగుల రేకు చక్రాలు రెండు ఉన్నాయి. వాటి ఉపరి భాగాలు జల్లెడలు లా ఉన్నాయి. ఒకటి నేలకి దగ్గరగా ఉంది, దానికి సూటిగా పైన ఇంటికప్పు దగ్గర రెండవది ఉంది. సరిగా అలాంటిదే మరొకటి దానికి తిన్నగా ఇంటికప్పుమీద ఉన్నది. మూల నున్న విద్యుద్యంత్రాల నుండి లావాటి తీగలు ఆ పెనాలకు తగిలించారు. వెల వెల పోయే ఊదా రంగుతో ఆ రేకులు అస్పష్టంగా మెరుస్తున్నాయి.

ఆ రెండు రేకుల మధ్య చిన్న చిన్న కాంతి కణాల సముదాయం మబ్బువలె గాలిలో తేలిపోతూవుంది. సూక్ష్మాతి సూక్ష్మ పరిమాణం కలిగి, కోటాను కోట్లుగా గుమిగూడి, తళ తళ మెరుస్తూ ఉన్న తేనె టీగల పుట్టను స్ఫురింప జేస్తూ ఆ మబ్బు దీర్ఘవలయాకారంగా అగుపించింది. దానిలోని మెరుపు కణాలను పరిశీలించడానికే కాబోలు, చుట్టూ అనేక సూక్ష్మదర్శినులు అమర్చి ఉన్నాయి.

ఫెస్సెండన్ ఆ యంత్రం దగ్గర నిలబడి, నేలమీద ఇంటి కప్పు మీద మెరుస్తూఉన్న ఆ రెండు పెద్ద రేకులనూ చూపిస్తూ "ఇలా చూడు బ్రాడ్లీ, ఈ రెండు రేకుల మధ్య నుండే స్థలంలో భూమి యొక్క ఆకర్షణశక్తి లేకుండా చేశాను." అని చెప్పాడు.

"ఏమంటున్నావు?" అన్నాను ఆశ్చర్యం పట్టలేక. ఒక అడుగు ముందుకు వేసి, అతను చెప్పిన దాంట్లో నిజమెంతో చూద్దామని, నా చేతిని ఆ రెండు రేకుల మధ్యకూ జాపపోయాను.

ఫెస్సెండన్ చటుక్కున నా చేతిని వెనక్కు లాగి, హెచ్చరించాడు. "జాగ్రత్త. అలాంటి సాహసం చెయ్యకు. మానవశరీరం భూమియొక్క ఆకర్షణ శక్తికి అలవాటు పడ్డది. ఆ ఆకర్షణ శక్తిని ఎదుర్కునే ఒత్తిడి శరీరంలో ఉంటుంది. నీవు గనుక యీ రేకుల మధ్య భాగంలో అడుగు పెట్టావంటే నీలోని ఒత్తిడివల్ల నీ శరీరం ఉబ్బిపోయి పేలిపోతుంది. భూమ్యాకర్షణ చటుక్కుని లోపిస్తే ఆ మార్పుకు నీ శరీరం తట్టుకోలేదు. సముద్రపు లోతులకు అలవాటుపడ్డ చేపల్ని అకస్మాత్తుగా పైకి తీస్తే అవి పేలిపోవూ! అలాగే ననుకో." అని, ఇంకా యిలా చెప్పాడు కాంతికణాలను చూపిస్తూ—

"ఇదే నేను సృష్టించుకున్న విశ్వం. ఇక్కడ భూమియొక్క ఆకర్షణ శక్తి ఉండకూడదు."

ఒకమారు అతని వంక, మరొకమారు ఆ కాంతి మబ్బు వంక వెఱ్ఱిగా చూచాను. చిన్నగా నవ్వుతూ ఉన్న అతని ముఖంకేసి చూస్తూ అన్నాను, "ఆ కాంతి కణాల గుంపులు—అవేనా నీ విశ్వం!!"

"అదే, అదే!" అన్నాడు, "దగ్గరగా వెళ్ళి చూడు, బ్రాడ్లీ."

నేను దగ్గరగా వెళ్ళి చూచాను. నా వళ్ళు ఝల్లుమంది. ఆ కాంతికణాలు కండ్లకు కనపడనంతటి సూక్ష్మాతి సూక్ష్మపరిమాణంలో ఉన్నవి. దట్టమైన ఆ పుట్టలో కోట్లకొలది కణాలు ఉన్నట్లు గ్రహించాను. వాటిని చూస్తూ ఉంటే, ఎక్కడో, వేటినో చూచిన గుర్తులు మనసులో మెదిలాయి.

కొన్ని కణాలు తెల్లగా మెరుస్తున్నాయి. మరికొన్ని ఎఱ్ఱగా పొగ పారినట్లున్నాయి. ఇంకా కొన్ని బంగారువన్నె కల్గి ఉన్నాయి. విశ్వాంతరాళంలోని సూర్యుల రంగులే అవి! అంతా అదే తీరు. కొన్ని జంటలుగా ఉన్నాయి. కొన్ని మూడు మూడుగా చేరాయి.

ఇంకా కొన్ని వందల సంఖ్యలో గుంపు గూడాయి. అక్కడక్కడ చిన్న చిన్న వెలుగు మచ్చలు పరుచ్చుకున్నాయి. అవి చిన్న పాల పుంతలు. మరికొన్ని కాంతి కణాలు మెరిసే తోకలతో పాకు తున్నాయి, అవి బుల్లి తోకచుక్కలు....ఆ వెలుగుతున్న కణాలు చిన్న చిన్న సూర్యగోళాలైనట్టే.

ఆ కాంతి కణాలు సూర్యమండలాలే! నాకు తెలుసు. అందులో సందేహం ఎంతమాత్రమూ లేదు. నా మెదడు ఇదంతా అసంభవమని గట్టిగా వాదిస్తూనే ఉంది. అయినా సరే. అది నిస్సందేహంగా సృష్టికి ప్రతి సృష్టి! విశ్వాంతరాళంలో ఉన్న ఆ బృహద్గోళాలన్నీ అతిస్వల్ప ప్రమాణంతో ఆ సూక్ష్మ ప్రపంచంలో అమరి ఉన్నాయి.

ఫెస్సెండన్ ఏన ప్రయోగశాలలో. సృష్టికి అక్షరాలా ప్రతి బింబమైన ఒక సూక్ష్మ ప్రపంచాన్ని సృష్టించాడు.

నేను నిర్ఘాంతపోయి చూస్తూ నిలుచున్నా. నా సంభ్రమం అంతా ఫెస్సెండన్ చూస్తూనే మెల్లిగా చెప్పాడు. "ఔను, బ్రాడ్లీ! నీవు చూచిందంతా యథార్థం. ఇది ఒక సూక్ష్మ ప్రపంచం - మన సృష్టిలో ఏమేమి ఉన్నాయో, అన్నీ బ్రహ్మాండ గోళాలనుండి పర మాణు రూపాల వరకూ ఊా నా సృష్టిలోనూ ఉన్నాయి. అయితే సూక్ష్మాతి సూక్ష్మ ప్రమాణంలో ఉన్నాయి. పరిమాణంలో తప్ప ఆ ప్రపంచానికి, యీ ప్రపంచానికీ తేడా ఏమీ లేదు."

"అయితే దీన్ని నీవు సృష్టించావన్నమాట!" కొంచం ఊపిరి పీల్చుకుని అడిగాను.

ఫెస్సెండన్ ఔనన్నట్లు తల ఊపుతూ, "ఔను, అప్పటినుండి ఇప్పటి వరకూ తంటాలు పడగా పడగా యీనాటికి సాధించాను.

కొన్ని వారాల క్రితమే నా ప్రయత్నాలు ఫలించాయి. అప్పటినించీ నా చిన్న విశ్వంలో ప్రయోగాలు సాగిస్తున్నాను." అతని నల్లటి కళ్లు ఒకమారు తళుక్కుమన్నాయి.

"ఏనాడూ ఏ శాస్త్రవేత్తా ఇటువంటి అద్భుత ప్రయోగం తలపెట్టి ఉండడని చెప్పలేదూ నీతో? నేను ఏమి చేయగలనో ఒక్కసారి ఊహించుకో. నా ఖగోళ ప్రయోగాలు విశ్వాన్నంతనీ ఆకళించుకోగలవు. విశ్వాంతరాళంలో జరిగే సంఘటనలు, మార్పులు, నా ఇచ్ఛానుసారం ఇక్కడ జరిపించగలను. సూర్యచంద్రాదులను మార్చగలను. నక్షత్ర మండలాలను రూపుమాపగలను. శతకోటి రెట్లు పరిమాణం పెంచి చూపగల నా సూక్ష్మదర్శినిలో చూస్తూ, యీ నా చిన్న ప్రపంచంలో జరిగే ప్రతి సంఘటనా చక్కగా పరిశీలించగలను. ఆ సృష్టికి ప్రతిబింబమైన యీ సృష్టితో ప్రయోగాలు చేసి, నా శాస్త్ర సిద్ధాంతాలకు ప్రత్యక్ష ఆధారాలు చూడగలను."

విస్మయంతో అన్నాను- "ఇదంతా ఎలా చేశావు?— ఎక్కడ మొదలు పెట్టావు?"

అతను ఒకసారి భుజాలు ఎగురవేసి చెప్పడం ప్రారంభించాడు. "అసలు మన ప్రపంచం ఎలా పుట్టిందంటావు బ్రాడ్లీ? సృష్ట్యాదిలో ఆకాశం అంతా ప్రజ్వలిస్తూన్న ఆవిరి మబ్బులతో నిండి ఉండేది. ఆ మబ్బులలో ఉన్న వాయుకణాలు ఒకదాన్ని నొకటి ఆకర్షించుకుని దగ్గర పడ్డాయి. అవి నక్షత్రమండలాలుగా, నెబ్యులాలుగా, సూర్య మండలాలుగా ఏర్పడ్డాయి. వీటి మంటల్లో నుండి విడిపడ్డ ద్రవ్యం చల్లపడి, పరిభ్రమించే గ్రహగోళాలై యాయి."

కొంచెం సేపు ఆగి మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు. "సరిగా అదేవిధంగానే యీ సృష్టి కూడా ప్రారంభించాను. ఈ రెండు రేకులూ

ఉన్నాయా? వీటి మధ్య ఖాళీలో భూమ్యాకర్షణ లేకుండా జేశానని చెప్పాగా! ఈ ఖాళీలోకి మందుతూవున్న వాయువును వదిలి తమాషా చూస్తూ కూర్చున్నాను. ఈ నా విశ్వంలోని పరమాణువులు, వాటి విద్యుత్కణాలలో వచ్చిన మార్పులవల్ల-మామూలు పరమాణువుల కన్న బాగా చిన్నవి. అలా తయారైన సూక్ష్మాతిసూక్ష్మ కణాలు, పరస్పరాకర్షణవల్ల మబ్బులుగా, మండలాలుగా, నక్షత్రాలుగా గుమిగుండాయి. వాటి మంటల్లోంచి విడిపడ్డ ద్రవ్యం మన భూమ్యాది గ్రహాలులాగానే ఆ సూర్యుల చుట్టూ తిరగడం ప్రారంభించాయి. అంతే—ఆ బృహత్సృష్టికి అక్షరాలా ప్రతిబింబం నా యీ సూక్ష్మసృష్టి.

"చూడు బ్రాడ్లీ—ఈ నా విశ్వంలో వున్న లక్షలాది గ్రహాల్ని. వీటిని నా యిష్టానుసారం ఆడించగలను. వీటి సృష్టి స్థితి లయాలు నా స్వాధీనం. వీటిపైన నా అంతట నేను జీవరాసులను పుట్టించి, పెంచి, నాశనం చేయగలను. ఇదే నా ప్రజ్ఞ. ఇదే నేను సాధించినవిజయం."

ఆశ్చర్యంతో నోట మాట రాక, అతి కష్టంమీద అన్నా - "ఏమిటేమిటీ—జీవరాసులా! ఈ సూక్ష్మ జగత్తులో గ్రహకూటాలా? వాటి మీద జీవోత్పత్తికూడా?"

"ఇందులో ఎంతమాత్రమూ అతిశయోక్తి లేదు బ్రాడ్లీ! అనుకూల వాతావరణంలో జీవోత్పత్తి సహజంగానే జరిగిపోతుంది," అంటూ ఒక పెద్ద సూక్ష్మదర్శిని యంత్రాన్ని చూస్తూ, "అలాంటి గ్రహాన్నొకదాన్ని నీకు యిప్పుడే చూపిస్తాను. దానిమీద జీవోత్పత్తి ఎలా జరుగుతుందో నీ కండ్లతో నీవే స్వయంగా చూతువుగాని," అతనొక సూక్ష్మదర్శినీ యంత్రంలోనుండి చూస్తూ దాన్ని ఒక వెలుగు మబ్బువేపు తిప్పాడు. స్పష్టంగా కనబడేలాగ యంత్రాన్ని అమర్చి ప్రక్కకు జరిగాడు.

"బ్రాడ్లీ—నీవు దీనిలో చూడు, నేను ఆ రెండవదానిలో చూస్తాను," అన్నాడు.

వినీలమైన ఆకాశంలో మెరిసిపోతూ ఉన్న మబ్బులో తేలుతూ ఉన్న కాంతికణ సముదాయాన్ని సూక్ష్మదర్శినిలో చూచా. ఆకాశంలో కండ్లు మిరుమిట్లు గొలిపే సూర్యబింబంవలె, తీవిగా పయనిస్తూ ఒక కాంతిగోళం నా దృష్టిలోకి వచ్చింది. ఆ మెరుపు మబ్బులోని సూక్ష్మాతిసూక్ష్మమైన కాంతికణం సూక్ష్మదర్శినిలో సూర్యగోళమంత బృహత్పరిమాణంతో అగుపించింది.

ఫెస్సెండన్ నా ప్రక్కనే మరొక యంత్రంలో చూస్తున్నాడు. సూక్ష్మదర్శిని మరలను తిప్పుతూ అతను నన్ను హెచ్చరించాడు. "అలానే చూస్తూ వుండు, బ్రాడ్లీ! మన యథార్థ ప్రపంచంలో యుగయుగాలలో జరిగిన మార్పులు యీ కల్పిత ప్రపంచంలో కొన్ని క్షణాల్లోనే చూడగలవు. ఎందుకంటే-యీ సూక్ష్మజగత్తులో కాలం అతి వేగంగా నడుస్తుంది."

అతను యంత్రాన్ని గురిచేస్తూ వున్నాడు. నేను సూర్యగోళాన్ని చూస్తూనే వున్నా. రెండు చిన్న గ్రహాలు, అపరిమితమైన వేగంతో సూర్యుని చుట్టూ గిర్రుగిర్రున తిరగడం ప్రారంభించాయి. వాటి కాలగతిలో ఒక సంవత్సరం మన కాలగతిలో ఒక క్షణంలాగే ఉంది.

అందులో ఒక గ్రహం యింకా పూర్తిగా చల్లారి గట్టిపడలేదు; మరొకటి చల్లపడ్తూ వుంది. దాని చుట్టూ ఉన్న వేడి ఆవిరి చల్లారి మబ్బువలె అగుపించింది. కొంచం పరికించి చూచా. ఆ చల్లబడుతూ వున్న గోళంమీద నేను నిలుచున్నట్లనిపించింది. అదంతా రాళ్ళు

గుట్టలు. మబ్బు కమ్మిన ఆకాశంనుండి వాన ఏకధారగా కురిసిం రెప్పపాటు కాలంలో వాననీరంతా జేరి మహాసముద్రా లేర్పడ్డాయి

మెల్లిగా సముద్రాల ఒడ్డున పచ్చపచ్చటి మొక్కలు బయ దేరాయి. క్రమంగా అవి భూభాగం మీదకు విస్తరించుకున్నా చూస్తూ ఉండగానే ఆ భూగోళం అంతా పచ్చటి వృక్షజాలంతో ని పోయింది, ప్రాకే ప్రాణులు పుట్టుకొచ్చాయి. కోటానుకోట్ల రాసులు అంతలోనే పుట్టి పెరిగాయి. పెద్దపెద్ద రాక్షస జంతువు పుట్టాయి - అంతరించాయి. మానవజాతి బయలుదేరింది. చిన్న చి గ్రామాలు, పెద్ద పెద్ద పట్టణాలు, నవీన నగరాలూ, ఒకదాని వెన ఒకటి వెలిశాయి. మానవుని తెలివితేటల అభివృద్ధితోపాటు, బళ్ల పడవలు, ఓడలు-క్రమంగా తయారయ్యాయి. ఇలా యుగయుగా అభివృద్ధి ఒక క్షణంలో నా కండ్లముందు జరిగిపోయింది.

ఉలిక్కిపడి వెనుకకు ఒరిగి తత్తరపాటుతో అన్నాను-"ఇదం అసంభవం—అబద్ధం."

ఫెస్సెండన్ చిఱునవ్వుతో అన్నాడు, "అంతా నిజమే. ఇందు అబద్ధం ఏమాత్రమూ లేదు. నీవు చూచిన భూమి, దానిమీద నివసిం మానవజాతి-అన్నీ యథార్థమైనవే!" ఇంకా తనలో తాను ము పోతూ, "వాళ్ళు చూచావూ - ఆ మనుష్యులు—తమ తెలివితే తోనూ, శాస్త్రజ్ఞానంతోనూ ఎదుర్కొలేని శక్తి ఏదీ లేదని మి పడుతున్నారు. నిజమైన ప్రమాదం సంభవించినప్పుడు వారి గతి ఏ తుందో చూద్దాం," అన్నాడు.

ఒక చిన్న సూది వంటి యంత్రాన్ని ఎదురుగాఉన్న ఆ సూ బింబం పైకి ఎక్కుపెట్టాడు. ఒక చిన్న తోకచుక్క ఆ మబ్బు మెల్లిగా జరగడం ప్రారంభించింది. ఫెస్సెండన్ ఒక మీట నొక్కా

ఆ సూది వంటి దానినుండి కంటికగుపడనంత సన్నటి తీగవంటి కాంతి ఆ తోకచుక్కను తాకింది. ఆ తాకిడికి తోకచుక్క కొంచెం గతి తప్పి నట్టనిపించింది.

ఉత్సాహంతో, ఫెస్సెండన్ మళ్ళీ అన్నాడు—"ఉండు చూద్దాం—వాళ్ళ శక్తిసామర్థ్యాలు ఏపాటివో!"

నాకంతా అగమ్యంగా ఉంది. అయినా తిరిగి ఆ సూక్ష్మదర్శిని గుండా చూడనారంభించాను. వెనుకటి చిన్న నగరాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇంటి కప్పులన్నీ భేదించరాని అద్దాల తొడుగులతో మెరిసిపోయాయి. ఆకాశంలో విమానాలు విరివిగా తిరిగాయి. ఆ చిన్న ప్రపంచంలో ఎటు చూచినా అభివృద్ధి గోచరించింది. జీవితం సాఫీగా నడిచిపోతోంది. ప్రశాంతంగా తరాలు గడిచిపోతున్నాయి. ఇంతలో ఆ మానవుల్లో ఒక వెఱ్ఱి సంచలనం బయలుదేరింది. వారి భూభాగంపైన ఒక లేత ఆకుపచ్చటి కాంతి కప్పుకుంది. అతివేగంగా వారి భూమి వంకకు దూసుకువస్తూ ఉన్న ఒక పెద్ద తోకచుక్కనుండి ప్రసరించే కాంతి అది. ఫెస్సెండన్ సన్నటి కాంతిరేఖతో తాకిన తోకచుక్కే యిది. భూతద్దంలో అది విశ్వరూపం దాల్చినట్లగుపించింది. కాంతిరేఖ తాకిడివల్ల అది దాని దోవ తప్పి ఆ భూగోళానికి దగ్గరగా పోయింది. దాని పచ్చటి కాంతి ఆకాశం అన్ని మూలలా అలముకుంది. అది పోయిపోయి భూగోళాన్ని దూసుకుని పోయింది. అయ్యో పాపం! ఇంకేముంది? అంతా సర్వనాశనం. తోకచుక్కనుండి రాలిన ఉల్కల తాకిడికి అద్దాల మేడలు అడుగంటాయి. ఇళ్ళు, వాకిళ్ళు భస్మమయ్యాయి. నగరాలు నశించాయి. విషవాయువులు మబ్బులవలె భూమిని ఆవరించాయి.

మా కళ్ళముందే ఆ తోకచుక్క కదలిపోయింది. అయితే అది విడిచిపెట్టిన విషవాయులవల్ల భూమి మీద జీవరాసులన్నీ ఒక్క

మూరుగా నశించాయి. నిశ్చేతనంగా, నిర్జీవంగా మారిన రంగుతో ఆగ్రహం తన సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేస్తోంది. శిథిలమైన పట్టణాలు క్రమంగా నామరూపాలు లేకుండా నశించిపోయాయి, మా కళ్ళ యెదటే.

ఫెస్సెండన్ ఉత్సాహంతో చెప్పాడు. "చూచావు కదూ–తోక చుక్క కొద్దిగా దోవ తప్పింది. అంతమాత్రాన తమకు కలిగిన ప్రమాదాన్ని ఎదుర్కొనే విజ్ఞానం ఆ మనుష్యులకు లేకపోయింది."

నిజం చెప్తాను. ఒక భూమిమీద జీవరాసులన్నీ అమాంతంగా, ఒకేమారు అలా నశించడం చూచినప్పుడు, నేను భయంతో చలించి ఉండాలి. కాని అలా జరుగలేదు. ఏమి జరుగుతుందో చూడాలన్న గొప్ప ఉత్సాహంవల్ల యితరమైన ఆలోచన ఏదీ నాకు తోచలేదు. సూక్ష్మాతి సూక్ష్మ ప్రమాణంలో జరిగిన విలయం గనక నాకు బాధ కలుగనేలేదో! లేక ఆ అద్భుత ప్రయోగంలో నిమగ్నమైన నా మనస్సులోకి జాలివంటి ఉద్వేగాలు ప్రవేశించలేకపోయాయో! మొత్తానికి – చీమల పుట్టను కాలితో తన్ని తమాషా చూచేవాడిలా ఆ పరిణామాన్ని చూస్తూ నిలబడగలిగాను.

"మరొక ప్రపంచాన్ని చూద్దాం ఉండు. ఇదిగో, ఇటుప్రక్క నాకు రెండు గోళాలు కనబడ్తున్నాయి, ఇవి మనం చూడవలసినవే!" అన్నాడు ఫెస్సెండన్.

ఫెస్సెండన్ సూక్ష్మదర్శిని మరోవేపుకి మళ్ళించాడు. మరొక సూర్య గోళంపైన నా దృష్టిపడ్డది. ఆ గోళం పసుపువన్నెగా వుంది. దాని చుట్టూ నాల్గు గ్రహాలు తిరుగుతున్నాయి. అందులో రెంటి మీద గాలి అన్న మాటలేదు. మూడవ దానిమీద మన మనుష్యులను పోలిన జీవులున్నారు. నాల్గవ దానిమీద పాముపలె పాకే ప్రాణులున్నాయి.

ఈ రెండు గ్రహాలకు మధ్య దూరం చాలావుంది. ఒకదాని నుండి మరొక దానికి రాకపోకలులేవు. ఏ గ్రహంలోని జీవరాశి, ఆ గ్రహంలో సర్వ స్వామ్యాన్ని అనుభవిస్తూ, నిశ్చింతగా కాలంగడుపుతూ వుంది. మొత్తానికి రెండుచోట్లా కూడా కొద్దిగానో గొప్పగానో నాగరకత కనబడుతూనే వుంది. చిత్రమైన పట్టణాలున్నాయి రెంటిమీదా.

ఇప్పటివరకూ యీ రెండు గ్రహాలమీద నివసించే జీవరాసులకు ఒకరితో ఒకరికి సంబంధంలేదు. కాని, అవిరెండూ ఒకచోట తారసిల్లా యనుకుందాం ఏం జరుగుతుంది. ఎవరు గెలుస్తారంటావు? అని అడిగాడు ఫెస్సెండన్.

"సందేహం ఎందుకు? మనుష్యులను పోలిన జీవులే గెలుస్తాయి. మనుష్యులు, మనుష్యులను ఎక్కువగా పోలిన యితర జంతువులు క్రొత్త పరిసరాల్లో సులభంగా అతికి అమిరిపోగలరని శాస్త్రమే చెప్పుతూ ఉన్నది గదా!" అని నా అభిప్రాయం చెప్పాను.

"అయినా ఎందుకో, ఆ ప్రాకే జంతువులే మొరటుగా బలంగా కనబడుతున్నాయి. వాటి బలా బలాల్ని ఇప్పుడే తేల్చుకుందాం" అంటూ ఫెస్సెండన్ మళ్ళీ సూది మీట నొక్కాడు. ఆ సూది నుండి కాంతిరేఖ సూక్ష్మ జగత్తులోకి చొచ్చుకుపోయింది. దాని తాకిడివల్ల ఆ రెండు గ్రహాల్లో ఒకటి దారితప్పి రెండవదాని వంకకుపోయి. భూమి చుట్టూ ప్రదక్షిణం చేసే చంద్రునివలె దానిచుట్టూ గిర్రు గిర్రున తిరుగ నారంభించింది.

అలా సమీపంగా వచ్చిన ఆ రెంటి మధ్య, అనతికాలంలోనే, ఆకాశనావలు అటూ యిటూ తిరిగాయి. జీవజంతువులు ఒకదాని నుండి మరొకదానికి రాకపోకలు సాగించాయి. పరస్పర సంఘర్షణలతో రెంటి నడుమ యుద్ధం జరిగింది. భయంకరమైన పోరాటంలో

నగరాలు దగ్ధమయ్యాయి. జీవరాశులు శిరుపడుల్లోనూ అసంఖ్యాకంగా నశించాయి చివరకు పాములవంటి ప్రాణులే జయించాయి. అవి గుంపులు గుంపులుగా గూడి మనిషివంటి జీవుల్ని నామరూపాలు లేకుండా నశింపజేశాయి.

"చూస్తున్నావా, బ్రాడ్లీ? పామును పోలిన జాతికున్నంతగా పరిసరాలకు అలవడే శక్తి, మనిషివంటి జీవికి లేకపోయింది." అన్నాడు ఫెస్సెండన్.

"ఎవరు చూశారు? నాగరికత పెరిగేటప్పటికి యీ ప్రాణికే జంతువులు గభాలున నశించిపోవచ్చుగా!" అని సమర్థించబోయాను.

అది నిజం కాదన్నట్లు తల ఊపుతూ, ఫెస్సెండన్ చెప్పాడు, "అదికాదు బ్రాడ్లీ! రెండు కాళ్ళ జంతువులు, శాస్త్రంలో చెప్పినంత తేలికగా, వాతావరణపు మార్పులకు తట్టుకోలేవు. ఈ సూక్ష్మ జగత్తులో నీకా విషయం స్పష్టంగా ఋజువుచేసి చూపించాను. ఇంకా కూడా ఋజువు చేస్తాను, చూస్తూ వుండు."

మతిపోయినవానిలాగ, ఒళ్ళు మరచిన విస్మయంతో చూస్తూ కూర్చున్నా. ఫెస్సెండన్ ఒకదాని తరువాత మరొకటి, అనేక ప్రపంచాలు చూపించాడు. ఒక ప్రపంచం, మరొక ప్రపంచం, ఇంకొక ప్రపంచం—ఇలా అనేక గోళాలు నా దృష్టిపథంలోకి అవతరించాయి-అంతరించాయి. గ్రహాలు, జీవరాసులు, రాజ్యాలు, నగరాలు — పుట్టాయి, పెరిగాయి, నశించాయి. ఆ పరిణామాలన్నీ ఫెస్సెండన్ సిద్ధాంతాల్ని అక్షరం తప్పకుండా ఋజువు చేశాయి.

అందులో ఒక గ్రహం - దానిమీద దట్టంగా అలముకొన్న అరణ్యాలు. ఆ అరణ్యాల మధ్య వేటాడి బ్రతికే మనుష్యులు, గుంపులు

గుంపులుగా అక్కడక్కడ నివశిస్తున్నారు. ఎన్ని తరాలు మారినా గాని వారి జీవిత విధానంలో మార్పన్న మాట లేదు. వేటాడి భుజించడం, పెండ్లాడి సంతానం కనడం, చనిపోవడం—ఇంతకు మించి వారు కాంక్షించిందీ, సాధించిందీ మరొకటి లేదు. వారి నాగరకత అలా తరుగు, పెరుగుల్లేని ఒకే స్థాయిలో ఉంది. అంతట్లో ఫెస్సెండన్ ఆగ్రహం మీదికి ఒక కాంతి కిరణాన్ని ప్రయోగించాడు. తత్ఫలితంగా ఆ భూభాగం మీద కొన్ని రాసాయనిక పరిణామాలుకలిగాయి. ఆ మార్పులు అక్కడి వృక్షజాలంలో అత్యధికంగా వ్యక్తమయ్యాయి. వ్రేళ్ళు పెరగకుండా వృక్షాలు పెరిగాయి. అలా భూమి ఆధారం లేని చెట్లు పెళ పెళ విరిగి పడడం వల్ల, జంతుజాలాలు నశించాయి. ఈ మార్పును అరికట్టడాన్కి అక్కడ వేటగాళ్ళు సర్వశక్తులా ప్రయత్నించి విఫలులయ్యారు. చిట్టచివరకు వారు అంకురం లేకుండా నశించి పోయారు, అంతులేకుండా పెరిగిపోయిన వృక్ష జాతి మాత్రమే దాని మీద మిగిలింది.

మరొక గ్రహం - అది ప్రదక్షిణం చేసే సూర్యుడు సూక్ష్మ జగత్తుకు ఒక చివరగా ఉన్నాడు. ఆ గ్రహం అంతా జలమయం. దాని ఉపరితలం సముద్రాలతో నిండివుంది. ఆ సముద్రాలలో చేపలు కొల్లలు కొల్లలుగా పుట్టుకొచ్చాయి. క్రమంగా చేప ఆకారంలో ఉండే మనుష్య జాతి ఉద్భవించింది. ఆ చేప మనుష్యులు సముద్ర గర్భంలో పెద్ద పెద్ద జలనౌకల వంటి భవనాలూ, నగరాలూ నిర్మించారు. ఆ నగరాలలోని ఎత్తైన గోపురాలు అక్కడక్కడ నీటి పైభాగాన కూడ కాన వచ్చాయి. మళ్ళీ దానిపైకి ఫెస్సెండన్ ఒక కాంతి కిరణాన్ని ప్రయోగించాడు. దాని తాకిడికి సముద్ర జలం ఆవిరియై అంతరిక్షానికి ఎగసి పోయింది.

క్రమక్రమంగా సముద్రాల్లో జలం తరిగిపోయింది. ఎండి పోయిన జలస్థావరాలలోని తమ రమ్య హర్మ్యాలను విడిచి, చేప మనుష్యులు నీటిని వెతుకుతూ పోయారు. చిట్టచివరకు అన్ని సముద్రాలూ ఇంకిపోయి, ఒకే ఒకటి నిలిచింది. చేపమనుష్యులంతా అక్కడ గుంపుగా చేరుకున్నారు. వారికి తెలిసిన శాస్త్రజ్ఞానాన్నంతా వినియోగించి, తను కట్టకడపటి నివాసమైనా యింకిపోకుండా ఆపుచేద్దామని విశ్వప్రయత్నం చేశారు. కాని ఫెస్సెండన్ ప్రారంభించిన విలయ కార్యం అంతటితో ఆగలేదు. ఆ కడపటి సముద్రం కూడా కాగి పోయింది. చేపమనుష్యులు చచ్చిపోయారు. ఎండిపోయిన ఎడారి ప్రదేశం - దానిలో అక్కడక్కడ కొన్ని నగరాలు చేపమనుష్యుల యొక్క స్మృతిచిహ్నాలుగా మిగిలిపోయాయి.

ఇలా ఒక ప్రపంచం, మరొక ప్రపంచం, ఒకదాని వెనుక మరొకటి, ఒళ్ళు మరచిన ఉత్సాహంతో చూస్తూ వచ్చా. అది మరొక గ్రహం. మంచువలె చల్లగా వుంది. ఆ గ్రహం సూర్యునికి చాలా దూరంలో వుంది. అక్కడ చల్లదనానికి తగినట్టుగా, పాలిపోయిన మనుష్యులున్నారు. వారిది ఒక అపురూపమైన నాగరకత. విశాలమైన, భయంకరమైన మంచుప్రదేశాలమధ్య, అతి చమత్కారంగా వారు నిర్మించుకున్న పెద్ద పెద్ద భవనాలు, చక్కటి నగరాలూ, వారి నాగరకతను చాటిచూపుతున్నాయి. వారి శాస్త్రవిజ్ఞానం అద్భుతంగా తోచింది.

ఫెస్సెండన్ ఒక కాంతిరేఖతో ఆ సూర్యుణ్ణి తాకించాడు. ఆ సూర్యగోళం ఒకమారు భగ్గుమని ప్రజ్వరిల్లింది. దాని ఉష్ణోగ్రత తక్షణం పెరిగిపోయింది. దాని ప్రకాశం నాల్గురెట్లు ఇనుమడించింది. ఆ అధికోష్ణ ప్రసారంవల్ల ఆవల దూరంగా తిరుగుతూవున్న మంచుగ్రహం మీద

మంచు మెల్లగా కరగనారంభించింది. ఉష్ణతాపాన్ని భరించలేని జనం చావనారంభించారు. వారంతా సంవత్సరాలతరబడి ఏదో పనిలో మునిగిపోయారు. అదేమిటో మాకు తరవాత బోధపడింది. వారి గ్రహం మీదనుండి ఒక తురాయివంటి ఘంటపైకి లేచింది. ఆ లేపడంతో విడుదలైన శక్తిప్రభావంవల్ల వారి మంచుగ్రహం ఒక్క ఊపుతో సూర్యమండలాన్ని దూరంగా జరిగిపోయింది. సూర్యరశ్మి సోకనంత దూరంలో దాన్ని ఆపుకున్నారు. పూర్వపు చల్లదనం చెడకుండా పేరొక క్రొత్తపరిధిలో ఆ గ్రహం సూర్యప్రదక్షిణం సాగించింది, ఫెస్సెండన్ నవ్వుతూ, ఆ మనుష్యుల తెలివితేటలను ఉగ్గడించాడు.

అది మరొక ప్రపంచం, అక్కడ జనసంఖ్య హెచ్చుగా వుంది. మేధావులైన కొంతమందిజేరి, అధికసంఖ్యాకులైన మిగతావారిని యిచ్చవచ్చినట్లు పాలించేవారు. బానిసలుగా బ్రతికే ఆ జనులు అప్పుడప్పుడు తిరుగుబాటు చేసేవారు, ప్రభువులైన వారు తమ ఆయుధప్రయోగంతో ఆ తిరుగుబాటును అణిచివేసేవారు. ఫెస్సెండన్ తన కాంతిరేఖను దానిమీదకు ప్రయోగించాడు. ఆ శక్తి తాకిడికి ఆ గ్రహగర్భంలో కల్లోలం కలిగింది, అతి భయంకరమైన భూకంపాలు జరిగాయి. భూగర్భంలోంచి రేడియోధార్మికత గల పదార్థాలు ముద్దలు ముద్దలుగా బయటపడ్డాయి. మనుష్యులంతా క్రొత్త వ్యాధులతో చావనారంభించారు. క్రమంగా మెదడు జబ్బులు కూడా ప్రారంభించాయి. జాతి నశించే సూచనలు కనపడ్డాయి. చాలామంది మృత్యువువాత పడ్డారు. కొందరు మేధావులు మాత్రం వ్యాధి నిరోధక ఔషధాన్ని తయారుచేసి సేవించారు, అలా ఆ మేధావుల సంతతి కొన్ని తరాలు జీవించారు. పరివారం లేని లోటును

వారు యంత్రాల మూలంగా తీర్చుకున్నారు. అయితే కొన్నాళ్ళకు ఆ యంత్రాల శక్తి విజృంభించడంవల్ల తాము నిర్మించిన యంత్రాలకు తామే బలి అయి నశించారు. ఆ తరువాత నడపడానికి మేధాశక్తి లేకపోవడంవల్ల ఆ యంత్రాలుకూడా నశించిపోయాయి.

భ్రమగొన్న వానివలె అలాగే చూడసాగాను. ఒక్కొక్క ప్రపంచాన్నే చూపిస్తూ, దాన్ని తన కాంతిరేఖా ప్రయోగంతో నిర్మూలిస్తూ వచ్చాడు ఫెస్పండన్. మరొక ప్రపంచాన్ని చూశాను. దాని సౌందర్యానికి ముగ్ధుడి నయ్యాను. అది ఫల పుష్పాదులతో కలకల్లాడుతూంది. అక్కడి జనులు అతిలోక సుందరులు. మనకన్నా ఎంతో ఎక్కువ నాగరికులు. వారేమీ పెద్ద పెద్ద నగరాలు నిర్మించలేదు. పెద్దపెద్ద ఉక్కు యంత్రాలతో వారికి పనేలేదు. రాకపోకలకు వారికి కార్లు, ఓడలూ, విమానాలూ అసలే అక్కరలేదు. భౌతికమయిన అభివృద్ధికి అతీతమైన స్థితినందుకుంది వారి నాగరికత. వారి గ్రహమే ఒక సుందరమైన ఉద్యానవనంలా వుంది. అక్కడక్కడ ఫలవృక్షాల మధ్య అతి రమ్యమైన భవనాలు ఉన్నాయి. ఆ పూలతోటల్లోనూ, అందమైన అడవుల్లోనూ, హృదయ వికాసంతో పరిపూర్ణులైన స్త్రీ పురుషులు సంచరిస్తున్నారు. వారు జ్ఞానసంపదతో మృత్యువును జయించి, అమరులైనారు. భవిష్యత్తులో ఏనాటికైనా మానవజాతి ఆశించి, అందుకోగల శాంతి సౌఖ్యాలకు ఆలవాలమా ప్రదేశమన్నట్టు ఒక క్షణం ఊహించాను. నా హృదయం ఆనందపరవశమైంది.

అంతలోనే ఫెస్పొండన్ చేయి కదలడం చూచాను. మళ్ళీ ఆ సూది మరను తిప్పాలని, ఆ చిన్న ప్రపంచాలపై ఆ కాంతిరేఖను ప్రయోగించాలని చేయి జాపాడు.

"ఫెస్సెండన్ - ఈ గోళం మీద మాత్రం నీ ప్రయోగాన్ని సాగించకూడదు!" అని సంభ్రమంతో అన్నాను.

అతను నా వంక ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు, "ఎందుకు సాగించకూడదూ! అసలు యీ తమాషా చూసి తీరవలసిందే! ఇంత కాలం, అక్కడి మనుష్యులు, కష్టమన్నమాట తెలియకుండా హాయిగా, నిశ్చింతగా, తృప్తిగా కాలం గడుపుతున్నారు. ఆపదల నెదుర్కోవలసి నప్పుడు వారు తమ శక్తిసామర్థ్యాల్ని ఉపయోగించగలుగుతారో లేదో - చోద్యం చూద్దాం."

అతను తలపెట్టిన ప్రయోగంలోని రాక్షసత్వం నాకు దిగ్భ్రమ కలిగించింది. వెంటనే, ఇంతవరకూ అతను సాగించిన మారణహోమం లోని రాక్షసత్వం స్పష్టంగా అర్థమయింది నాకు.

ప్రయోగం మీది వ్యామోహం నా యుక్తాయుక్త జ్ఞానా న్నింతవరకూ అణచిపెట్టింది. మేము చేసిన ఘోరపాపం యొక్క సంపూర్ణ స్వరూపం, ఆ సూక్ష్మ ప్రపంచాలను దుర్భరావేదనకు గురిచేసి జ్ఞానం సముపార్జన చెయ్యడంలో ఉన్న అమానుషత్వం నాకళ్ళకు కట్టి నట్టగుపడ్డాడు.

ఫెస్సెండన్ చేయి జాపుతూ అన్నాడు - "ఒక చిన్న శక్తి కిరణం - అంతే. దాని మహిమ చూడు. దాని తాకిడికి ఆ సూర్యగోళం గిర్రు గిర్రున తిరిగి తునకలై పోతుంది. ఇక అప్పుడా మనుష్యులేమి చేయగలరో చూద్దాం-మెల్లిగా వారిగ్రహాన్ని యింకో సూర్యమండలం లోకి తీసుకు పోతారో, మరేమి చేస్తారో!"

నేనింక సహించలేకపోయాను. విసురుగా అతన్ని ఆ యంత్రా న్నించి దూరంగా ఒక తోపు తోశాను. అతి కష్టంమీద పడిపోకుండా ఆ తోపును తట్టుకుని నిల్చున్నాడు.

"ఇంక చాలించు నీ ప్రయోజకత్వం, ఫెస్సెండన్. ఈ అర్ధరాత్రి మనం చేసిన కర్మకాండను తలుచుకుంటే నాకే అసహ్యం వేస్తూవుంది. ఆ సూర్యమండలాలూ, గ్రహగోళాలూ, జీవరాసులూ, అన్నీ నిజమైనవే!" అని ఆవేశంతో, ఆవేదనతో అరిచాను.

ఫెస్సెండన్ ముఖం చిట్లించి కోపంతో అన్నాడు—"విజ్ఞాన తృష్ణగల శాస్త్రజ్ఞుడివనుకున్నాను బ్రాడ్లీ! నీవు వట్టి పిరికిగుండె గల పామరుడవని ఇప్పుడర్థమైంది."

కోపంతో కంఠస్వరాన్ని హెచ్చిస్తూ అన్నాడు, "ఆ సూక్ష్మ జగత్తును నేను సృష్టించాను. అది నా స్వంతం. దాన్ని నా యిష్టం వచ్చినట్టు ఆడిస్తాను. నా ప్రయోగాలతో కావాలంటే ఈ క్షణంలో నిర్మూలిస్తాను. ఆ యంత్రం దగ్గరనుండి తప్పుకో."

ఇంత పాపానికి ఒడిగట్టిన అతణ్ణి చూస్తే రోత పుట్టింది. అంత సేపు అతని ప్రయోగాలలో పాల్గొన్నందుకు నన్ను తలచుకుని నేనే రోత పడ్డాను. నేను తిరుగబడి అన్నాను - "ఫెస్సెండన్! ఇంక నీ దురాగతాలు చాలించు. ఇప్పటికే మనం ఆ గ్రహాలకు, అందలి జీవ కోటికి తీరని అపకారం చేశాం. కేవలం చోద్యం చూద్దామని వాటిని ముప్పుతిప్పలు పెట్టాం. ఇంక చాలు - ఇంక ఏ మాత్రమూ యీ పనికి నేను ఒప్పుకోను - నిన్ను చేయనివ్వను."

"ఏమిటీ—చేయనివ్వవ?" అని ఉగ్రుడై నా పైకి ఉరికాడు. పిడికిలి బిగియబట్టి బలంగా ఒక సారి మోదాడు. దాని తాకిడికి పట్టుకున్న యంత్రాన్ని విడిచి దూరంగా పడ్డాను. నేను తేరుకునేటంతలో ఒక అరుపు వినబడ్డది. అక్కడ ఉన్న విద్యుద్వాహకాల్లో ఒకటి ఫెస్సెండన్ కాలికి అడ్డుతగిలడం చేత అతను, ఆ రెండు రేకులమధ్య నున్న ఖాళీస్థలంలోకి ఉవ్వెత్తుగా పడిపోయాడు. ఆ పడటంలో అతను

సృష్టించిన సూక్ష్మ జగత్తులోని కాంతికణ సముదాయం చెల్లాచెదురుగా అతన్ని చుట్టుముట్టింది. మరుక్షణంలో ఫెస్సెండన్ భౌతిక శరీరం ఉబ్బి పోయి బద్దలైంది. ఆదిలో నేను ఆ రేకులమధ్య భాగంలో చెయ్యి దూర్చబోయినప్పుడు ఏం జరుగుతుందని భయపెట్టి నన్ను వారించాడో, అదేవిధంగా అతని శరీరం ఖండఖండాలుగా పేలిపోయింది.

అతని కాలికి తగిలిన విద్యుద్వాహకం స్థానం తప్పడం చేత నేలమీద నున్న రేకుమీద మంట పుట్టింది. దానినుండి లేచిన విద్యు జ్జ్వాలలు ఆ రేకుల మధ్యనున్న ఖాళీస్థలాన్ని, అక్కడే వున్న ఫెస్సెండన్ దేహాన్నీ అలముకున్నాయి. మంటలు పెరిగి, ఆ చుట్టు పక్కల నున్న పరికరాల నన్నింటినీ పేల్చివేశాయి.

నేను మాత్రం ఎలాగో తప్పించుకుని బయట పడ్డాను. వెను దిరిగి చూడనైనా చూడకుండా నడిచిపోతున్నాను. పెద్ద ధ్వని వినిపిం చింది. ఆకాశాన్నంటుతున్న మంటల్లో ఇల్లు భస్మమౌతూఉందని గ్రహించాను. అయినా వెనక్కు చూడలేదు.

అదన్నమాట ఫెస్సెండన్ కథ. అతని అద్భుత పరిశోధనలు ఆ విధంగా అతనితోనే సమాప్త మయ్యాయి. ఏదో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని అతను మరణించాడని అందరూ అనుకున్నారు. నేను ఏమీ ఎరుగని వానిలాగా ఊరుకున్నాను. వారి అభిప్రాయాన్ని మార్చడానికి నేనేమీ ప్రయత్నించలేదు. ఆ రాత్రి జరిగిన ఉదంతాన్ని అసలు ఎవరికీ చెప్పకూడదనే నిశ్చయించుకున్నాను. ఎందుకంటే – ఆ పాపంలో నేనుకూడా భాగస్వామిని.

ఫెస్సెండన్‌ను, అతడు సృష్టించిన విశ్వాన్నీ ఎంత మరచి పోదామన్నా మరువలేకుండా ఉన్నాను. అందుకే ఆ నాటినుండి నేను ఖగోళశాస్త్రాన్నే పూర్తిగా విడిచిపెట్టాను. ఇప్పుడు గనక తలయెత్తి

నక్షత్రాల్లోకి చూస్తే, ఎనుకటి భయవిస్మయాలే కాకుండా మరొక తీరని సందేహంకూడా నన్ను పెనుభూతం లాగా ఆవేశిస్తుంది.

ఇదే ఆ సందేహం: అది మన సృష్టిని గురించి. సూర్య చంద్రాదులతో, నక్షత్ర మండలాలతో నిండివున్న యీ మన జగత్తుకూడా, మరొక-మనకు తెలియని మహా జగత్తులో సూక్ష్మాతి సూక్ష్మమైన ఒక భాగమేమో! ఆ మహాజగత్తులో ఫెస్సెండన్‌ను పోలిన ఒక మహాసృష్టికర్త యీ మన జగత్తును సృష్టించి, తన వినోద కాలక్షేపానికని యిచ్చ వచ్చినట్లు ఆడించి, పెంచి నాశనము చేస్తున్నాడేమో!

---

పెల్లెగ్రినీ & కుడాహీ (న్యూయార్క్) ప్రకటించిన "ఫెస్సెండన్స్ వరల్డ్స్" నుండి అనూదితము.

# గాంధీలోకం

— ఎరిక్ ఫ్రాంక్ రసెల్

అది ఒక విచిత్రమైన లోకం. అక్కడ కాపురం చేయడం సులభ సాధ్యం కాదు. అక్కడి ప్రజలదంతా అదోక తరహా. వారిలో స్నేహభావంలేదా అంటే, అది కాదు. వారు మూర్ఖపుపట్టు మనుష్యులా అంటే, అదీకాదు. ఎందులోనూ కలుగజేసుకోని, దేనికీ కలిసిరాని ఒక వింత వాలకం వారిది.

*　　　*　　　*

ఆ అంతరిక్ష యుద్ధనౌక చాలా పెద్దది. దాని వెడల్పు ఎనిమిది వందల అడుగులు— పొడవు మైలుకన్నా కొంచెం ఎక్కువ. అంత పెద్దది కావడం చేత ఆగిన చోటల్లా ఎంతో స్థలం ఆక్రమించుకుంటుంది. పెద్ద సొట్ట చేస్తుంది. ఈ నౌక ఒక పొలంలో పూర్తిగానూ, రెండవ పొలంలో అర్థభాగమూ అమాంతంగా ఆక్రమించుకుంది. దాని బరువువల్ల ఆగినస్థలంలో ఇరవై అడుగుల లోతైన శాశ్వతమైన గాడిపడింది.

ఆ నావలో రెండువేలమంది ఉన్నారు. వారిని మూడు తెగలుగా విభజించవచ్చు. పొడుగ్గా, సన్నగా, ముడుచుకుపోయిన కండ్లతో వున్నవారు నావనడిపే సిబ్బంది. క్రాపు జుట్టు, జములు దవడల వారు సైన్యం. బట్టతలలు, హ్రస్వదృష్టి, కళావిహీనమైన ముఖాల వారు పాలకబృందం.

అందులో మొదటి తెగకు చెందిన నావికులకు ఈ లోకంమీద పెద్ద మోజు ఏమీలేదు. ఒక లోకంమీద దిగడం, లాంఛనానికి ఒకసారి దాన్ని చూడ్డం, మరో క్రొత్తలోకాన్ని వెతుక్కుంటూ పోవడం వారికి పరిపాటి. రెండవ తెగకు చెందిన సైనికులకు ఈ లోకాలంటే చిరాకు, విసుగు. ఇక మూడవ తెగకు చెందిన పాలక బృందానికి, ఈ లోకం వారి స్వంతమైపోయినట్లు అధికార గర్వం ఇలా ఎవరి దృక్పథాన్నించి వారు ఈ లోకాన్ని చూశారు. ఇంతకుముందు వారందరూ డజన్ల కొద్దీ క్రొత్తలోకాలను ఆక్రమించుకున్నారు. స్వాధీనం చేసుకున్నారు. అది వాళ్లకు పరిపాటైపోయింది. అదే విధంగా ఈ లోకాన్ని కూడా స్వాధీనం చేసుకోవచ్చుననుకున్నారు. అయితే ఇక్కడ ఒక గడ్డు సమస్యను ఎదుర్కోవలసి వస్తుందని వారెరుగరు.

ఓడలోంచి దిగడానికి ఒక క్రమం నిర్ణయించబడింది. ఆ వరస తప్పడానికి వీల్లేదు. మొదట సామ్రాజ్య రాయబారి అతని వెనుక నౌకాధిపతి, అతని వెనుక సేనాధిపతి, తరువాత ప్రధానోద్యోగి. ఆ తరువాత రెండవ తరహా ఉద్యోగులు మొదటి క్రమంలోనే దిగాలి. అంటే సామ్రాజ్య ఆంతరంగిక కార్యదర్శి, సహాయ నౌకాధిపతి, సహాయ సేనాధిపతి, ప్రధానోద్యోగిగారి కార్యదర్శి. అలా అంతస్థుల వారీగా నౌకలోనుంచి దిగిపోగా, ఇక మిగిలేది, రాయబారిగారి మంగలి, జోళ్ల నౌకరు, దుస్తుల సేవకుడు, కొందరు కింది తరహా

సాధారణ అంతరిక్ష యాత్రికులు, అప్రధాన్యమైన సైనికోద్యోగులు ఎప్పటికన్నా భాయమౌతుందన్న ఆసతో పనిచేసే తాత్కాలిక గుమాస్తాలు. ఈ ఆఖరు తరహాకు చెందిన దురదృష్టపరివారం ఎప్పుడూ చుట్టయినా తాగకుండా నౌకలోనే కాపలాకాస్తూ, తుడుస్తూ, సర్దుతూ ఉండాలి. అదీ రాజాజ్ఞ. దిగిన లోకం గనక అసాధారణమైనదీ, ఆ లోకవాసులు ఎంయుధులూ, యుద్ధ సన్నద్ధులూ అయితే మాత్రం నౌకనుండి దిగే క్రమం తలక్రిందులౌతుంది, బైబిల్‌లో చెప్పినట్టు ఆఖరివారు మొదటికొస్తారు, మొదటివారు ఆఖరుకి పోతారు.

అయితే ప్రస్తుతం నౌక ఆగిన గ్రహం వుందే - అది మిగిలిన గ్రహాలవంటిదే. అసాధారణమైనదికాదు. రెండువందల కాంతి సంవత్సరాల దూరంలో యిలాంటి గ్రహమొకటి వున్నదని ఎప్పుడో తెలుసుకున్నారు - అంతరిక్షపటంలో గుర్తుపెట్టి ఉంచారు. ఇది ఆక్రమించి స్వాధీనం చేసుకోవలసిన సారవంతమైన ప్రదేశమని తెలుసువాళ్ళకు. అయితే ఇంతకంటే సారవంతమైనవి కొల్లలుగా ఉండడంవల్ల ఈ గ్రహానికి రావడం ఆలస్యం అయింది — అంతే - దీని విషయం తెలియక కాదు.

ఆదికాలంలో జరిగిన ఆ మహాప్రళయాన్ని గురించి కుర్రవాళ్ళకి కూడా తెలుసు. పేరుని చూసి భయపడవలసిందే గాని, నిజానికి అది ప్రళయమే కాదు. అణుశక్తితో జన్మించిన రాకెట్ల స్థానే బ్లీడర్ రాకెట్ వచ్చింది. వేలకొద్దీ మానవుల్ని గుంపులు గుంపులుగా అంతరిక్షంలో అన్నిచోట్లకూ చేర్చింది. ఈ విశ్వాన్నంతా వారి అరచేతిలో పెట్టింది. దీనికే మహాప్రళయమని పెద్ద పేరుపెట్టారు.

బ్లీడర్ రాకెట్ ధర్మమా అంటూ అంతరిక్ష ఫలాలన్నీ మానవులకు హస్తగతమయ్యాయి. ఆ విధంగా మానవులు ఆక్రమించుకున్న

గ్రహకూటంలో చిట్టచివరి వరుసలో ఉంది. ప్రస్తుతం యుద్ధనౌక నిలిచిన కొత్త గ్రహం.

ఆ కాలంలో - అంటే సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం భూలోకంలో ఏదో బావుకోవచ్చునన్న ఆశతో, కుటుంబాలు, కులాలు, మతాలు, జాతులు అంతరిక్షంలో అన్వేషణ ప్రారంభించారు. అసంతుష్టులు, ఆవేశపరులు, సంఘద్రోహులు, ఆశాపరులు, కౌతూహలులు, పదులూ, వందలూ, వేల సంఖ్యల్లో ఇతర గ్రహాలకు వలస పోయారు.

అప్పట్లో సుమారు రెండు లక్షలమంది ఈ గ్రహానికి వచ్చారు. ఆఖరు జట్టు వచ్చి మూడువందల సంవత్సరాలైంది. ఆ వచ్చినవారిలో నూటికి తొంభై మంది మొదట వలస వచ్చినవారి బంధువులు, స్నేహితులు, పరిచితులే. 'ఎడ్డీ' మాసు సింహాసనాన్ని. 'ఐరీ' తాంత్రిక తెగింపును గుర్తుకు తెచ్చుకుని, వారిని అనుసరించాలన్న ఆత్రంకొద్దీ వచ్చినవారే.

ఆ జనాభా మామూలు పద్ధతిగా పెరిగి ఉంటే, ఇప్పటికి అది కోట్ల సంఖ్యలో ఉండాలి. జనాభా పెరిగిందని మాత్రం ఈ గ్రహాన్ని సమీపిస్తూనే తెలుసుకోవచ్చు. పెద్ద పెద్ద నగరాలంతగా కనబడక పోయినా, చిన్న చిన్న పట్టణాలు చాలా కనపడ్డాయి. గ్రామాలు, పల్లెలు అత్యధిక సంఖ్యలో కానవచ్చాయి.

ఘనత వహించిన రాయబారి తన కాలికింద మెత్తగా తగిలిన గడ్డివేపు ఆప్యాయంగా చూశాడు. అతి ప్రయత్నం మీద తన లావాటి కాయాన్ని వంచి, ఒక గడ్డిపోచ తుంచాడు. ఆయన ప్రాణానికి ఇలా వంగడం ఒక కసరత్తు చేసినంత పనైంది. కడుపులో పేగులు కలుక్కుమన్నాయి.

"భూమిమీది గడ్డిలాంటిదే. చూచావా కాప్టెన్? ఇది యిక్కడ దానంతట అదే మొలిచిందంటావా? లేక ముందు వచ్చినవారు భూమి పైనుండి విత్తనాలు తెచ్చి యిక్కడ మొలిపించి ఉంటారంటావా?" అని ప్రశ్నించాడు రాయబారి.

"బహుశా దానంతట అదే మొలిచి వుంటుంది. ఇంతకుముందు నాల్గు లోకాల్లో యిలాంటి గడ్డిని నేను చూశాను. ఇది కూడా అలాంటి లోకమే అయివుండాలి" అని జవాబు చెప్పాడు కాప్టెన్ గ్రేడర్.

"ఔను ఎందుకు కాకూడదు?" అంటూ రాయబారి దూరాన కనబడుతూ వున్న పొలాల్లోకి దృష్టిని సారించాడు, అవన్నీ తన స్వంతమే నన్న అహంభావంతో. "అక్కడెవడో పొలం దున్నుతున్న ట్లున్నాడు. రెండు బలమైన చక్రాలతో ఒక చిన్న ఇంజన్ నడుపు తున్నాడు. ఈ మనుషులింకా ఇంత వెనకబడి ఉన్నారా? అని తన జములు గడ్డాలని నిమురుకుంటూ, అతన్ని ఇక్కడకు రప్పించు. అతనితో మాట్లాడి మన పని ఎక్కడ ఎలా ప్రారంభించాలో నిర్ణ యిద్దాం అని రాయబారి ఆజ్ఞాపించాడు.

"చిత్తం" అని కెప్టెన్ గ్రేడర్. కర్నల్ పెల్టన్ వేపు తిరిగాడు. "మన రాయబారిగారు ఆ పొలం దున్నేమనిషితో మాట్లాడాలంటు న్నారు," అంటూ దూరాన ఉన్న రైతును చూపించాను.

పెల్టన్ మేజర్ హామ్ వేపుతిరిగి "అక్కడ లేడూ ఆ రైతు? - మన రాయబారిగారు అతన్ని వెంటనే తీసుకు రమ్మన్నారు," అని ఆజ్ఞను అందించాడు.

"ఆ రైతును పట్టుకొని తక్షణం ఇక్కడకు రప్పించాలి," అని మేజర్ హామ్ లెఫ్టినెంట్ డీకన్‌కు హుకుం జారీచేశాడు.

"ఆ రైతును రప్పించాలి. రాయబారిగారు కనిపెట్టుకొని ఉన్నారు—త్వరగా రప్పించాలి," అని డీకన్ సార్జెంట్ మేజర్ బిడ్వర్దీని ఆదేశించాడు.

సార్జెంట్ మేజర్‌ది భారీ శరీరం, కందగడ్డలాంటి ముఖం. అతడు అటూ యిటూ చూశాడు. ఆజ్ఞ అందించడానికి తనక్రింద ఉద్యోగి ఎవరైనా ఉన్నారేమోనని మిగతా వాళ్ళంతా చుట్టయినా కాల్చకుండా ఓడతుడుస్తున్నారని గుర్తుకొచ్చింది. ఇక తనకు తప్పదనుకున్నాడు. అడ్డపడి నాలుగు చేలు దాటాడు. ఆసామీకి కూతవేసి దూరంలో సైనికశిక్షణ ప్రకారం టక్కుమని ఆగాడు. 'ఏయ్' అని ఒక పొలికేక పెట్టాడు. త్వరగా రమ్మనట్టు సైగచేశాడు.

రైతు ఆగాడు నొసలు తుడుచుకున్నాడు. చుట్టూ చూశాడు. పర్వత ప్రమాణంలో ఉన్న అంతరిక్ష యుద్ధనౌక వేపు అటాకు నాలుగమ్మో ఆటవస్తువన్నంత నిర్లిప్తంగా చూశాడు.

బిడ్వర్దీ తిరిగి చెయ్యి ఊపాడు. ఆ రైతును రమ్మని ఆజ్ఞాపిస్తూ. తాపీగా చేతిఊపుతో సమాధానం చెప్పి, రైతు తనదారిని తను తిరిగి దున్నడం ప్రారంభించాడు.

సార్జంట్ మేజర్ ఉరిమాడు. ఆ ఉరుమును చల్లబరిస్తే దాని అర్థం "ఎంతపొగరు?" – అని ఇంకో ఏభై అంగలు ముందుకి వేశాడు. ఆ రైతు ముఖం అప్పుడు కొంచెం స్పష్టంగా కనబడ్డది. ముఖం మీద చర్మం మొద్దుపారింది. కనుబొమలు దుబ్బుల్లా ఉన్నాయి.

"ఏయ్" – తిరిగి సార్జెంట్ మేజర్ హెచ్చరించాడు.

రైతు దున్నడం ఆపి, నాగటికొయ్య మీద ఆనుకొని పళ్లు కుట్టుకుంటున్నాడు.

ఈ మూడు వందల సంవత్సరాల్లోనూ వీళ్లు మానవ భాష మరిచి పోయి కొత్త భాష నేర్చుకున్నారేమో నన్న సందేహంతో బిడ్‌వర్డ్ ప్రశ్నించాడు. "నన్ను నీవు అర్థం చేసుకుంటున్నావా ?"

"ఒకడు మరొకణ్ణి అర్థం చేసుకోవడం సాధ్యమా!" అని స్పష్టమైన ఉచ్చారణతో మారు ప్రశ్న వేశాడు రైతు. తిరిగి దున్నడం ఆరంభించాడు. బిడ్‌వర్డ్‌కి ఏమి చెయ్యాలో తోచక ఒక క్షణంసేపు తికమక పడ్డాడు. కొంచం స్థిమితపడి, హడావిడిగా అన్నాడు. "ఘనత వహించిన భూలోక రాయబారిగారు నీతో తక్షణం మాట్లాడవలె నంటున్నారు." ఆమాటలు నెమరువేస్తున్నట్టు ఆలోచిస్తూ అడిగాడు రైతు "అలానా ! ఆయనకు ఆ ఘనత ఎలా వచ్చిందో." అన్నాడు రైతు.

"ఆయన చాలా ప్రధానమైన వ్యక్తి!" అని చెప్పాడు బిడ్‌వర్డ్! రైతు వాలకం అతనికి ఏమాత్రమూ అర్థం కావడంలేదు. వాడేమైనా వింత వరహా మనిషా? లేక కావాలని తనను వేళాకోళం చేస్తున్నాడో! - తేల్చుకోలేక పోయాడు. ఇలా దూరదూరంగా ఉన్న గ్రహాలకు వలస వచ్చిన వారిలో కొందరు (తమకు మించినవారు లేనట్టు) ప్రత్యేకత నభినయించడం కద్దు.

"చాలా ప్రధానమైన వ్యక్తి !"తనలో తను అనుకున్నాడు రైతు, కండ్లు చిట్లించి దూరానికి చూస్తూ. ఈ భావం అతనికి కొత్తది. దాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నట్లు కనపడ్డాడు. కొంచం ఆగి— "ఆయన చచ్చిపోతే మీ భూమి గతి ఏమౌతుంది ?" అన్నాడు.

"ఏమీ కాదు—" బిడ్‌వర్డ్ ఒప్పుకున్నాడు.

"ఎప్పటిలాగానే తిరుగుతూ వుంటుందా ?"

"ఎందుకు తిరగదు ?"

"అయితే అతను ప్రధాన వ్యక్తి కాడు," అని సాఫీగా సమాధానం చెప్పాడు. 'ఛుఫ్ ఛుఫ్' మంటూ ఇంజను కదిలింది; నాగలి దున్నింది.

బిడ్ వర్ది కి ఒక అరనిమిషం ఊపిరాడలేదు; దిక్కు తోచలేదు. చేతులు నులుపుకుంటూ గద్గదస్వరంతో "నీ వద్దనుంచి సమాధానం లేకండా మా ప్రభువువారి దగ్గరకు ఎల్లా వెళ్ళగలను?" అన్నాడు.

"ఏం? ఎందుకు వెళ్ళలేవు?" అని రైతు ఆశ్చర్యంగా చూశాడు. బిడ్ వర్ది ముఖంలో కంగారును చూచి జాలిపడి అన్నాడు. "అయితే సరే–ఆయనతో ఇలా చెప్పు–" కొంచం ఆలోచించి "దేముడు మీకు మేలు చేస్తాడు–నమస్కారం!' అన్నానని చెప్పుతే" అన్నాడు.

సార్జంట్ మేజర్ బిడ్ వర్ది చాలా బలిష్ఠుడు. రెండువందల ఇరవై పౌన్ల బరువు–ఇరవై సంవత్సరాలుగా ఖగోళయాత్ర సాగిస్తూ అంతరిక్షంలో అంచలమీద సంచరిస్తూన్న అనుభవశాలి. భయమంటే ఎలా వుంటుందో ఎరుగనివాడు. ఏ పరిస్థితిలోగాని అతను వెంట్రుకవాసికూడా చలించడు. అటువంటిది, ఈసారి, ఓడ దగ్గరకు తిరిగి వెళ్ళేటప్పటికి నఖశిఖపర్యంతం వణకి పోతున్నాడు.

రాయబారి అతనివంక తీక్షంగా చూస్తూ "ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు.

"అతను రాడట–" అవమానం, కోపంతో బిడ్ వర్ది ముఖంమీది నరాలు పొంగాయి–

"ప్రభూ–వాడు గనుక నా పటాలంలో, కొద్దిరోజులున్నాడంటేనా, వాడి పొగరణిచి, ఎముకలు విరిచి, నా మాట వినేసరికి లుంగలు చుట్టుకుపోయేటట్టు చేయగలను."

"నీ సమర్థత నే నెరుగనా, సార్జెంట్ మేజర్?" అని బుజ్జగించాడు రాయబారి. కర్నల్ పెల్టన్‌నుద్దేశించి రహస్యంగా, "ఇతను మంచివాడే-కాని లౌక్యం తెలియదు. కటువుగా, కట్టె విరచి పొయ్యిలో పెట్టినట్టు మాట్లాడి, వ్యవహారం చెడగొడ్తాడు. నీవే వెళ్ళి తీసుకొని రా. ఎక్కడ మొదలుపెట్టాలో తెలియకుండా ఎంత కాలం కూర్చుంటాం ఇలాగ?" అని అన్నాడు.

"అలాగే ప్రభూ!" అంటూ పెల్టన్ పొలాల కడ్డంగా కష్ట పడ్తూ నడిచాడు.

నాగలి దున్నే రైతును సమీపించి, మృదువుగా మందహాసం చేస్తూ "తమ్ముడూ, బాగున్నావా?" అన్నాడు.

నాగలిని ఆపి రైతు నిట్టూర్చాడు, ఇలాంటి దుర్దినాలు ఎలాంటి వాళ్ళకైనా తప్పదన్నట్టు.

ఎదుటి మనిషిని చూచినప్పుడు అతని కళ్ళు మబ్బులు మూసినట్టయి పోయాయి, చీకటిగా.

"నేను నీ తమ్ముడినని ఎందుకనుకుంటున్నావు?" అని పెల్టన్‌నుద్దేశించి అడిగాడు రైతు.

"మాటవరసకన్నాను," అన్నాడు పెల్టన్. జరిగినపొరబాటు తనకిప్పుడర్థమైందనుకున్నాడు. వీడొక తిక్కమనిషి. బిడ్‌వర్డ్ దురుసుగా మాట్లాడి ఉంటాడు. ఒకరిని చూసి ఒకరు గుర్రుమనుకుని ఉంటారు కుక్కల్లాగ. పెల్టన్ అన్నాడు.

"నిన్ను మంచి చేసుకోవాలనే నా ప్రయత్నం."

"అయితే నీ ప్రయత్నం మంచిదిలాగే తోస్తుంది," సాలోచనగా అన్నాడు రైతు.

పెల్టన్ ముఖం కొంచం ఎర్రబారింది-అయినా అతి ప్రయత్నం మీద కోపం ఆపుకుని అన్నాడు.

"మా ప్రభువు మిమ్మల్ని మా ఓడ దగ్గరకు ఆహ్వానించడానికి నన్ను పంపారు. వారు మీ పరిచయ భాగ్యం కోసం ఆశపడుతున్నారు."

"నా పరిచయం వారికి భాగ్యమౌతుందంటావా ?" అని అతి అమాయకంగా అడిగాడు రైతు.

"అవుతుందని నాకు తెలుసు!" అన్నాడు పెల్టన్.

"నీవు అబద్ధాలకోరువి!" అన్నాడు రైతు.

పెల్టన్ ముఖం మరీ ఎర్రబడింది. కోపంగా అన్నాడు.

"నన్ను అబద్ధాలకోరంటే నే నూరుకోను."

"ఊరుకోక ఉరేసుకున్నావా, ఇప్పుడు ?" అన్నాడు రైతు.

ఆ సంభాషణ తప్పించి, "ఓడ మీదకు వస్తున్నావా, లేదా ?" అని మళ్ళీ అడిగాడు పెల్టన్.

"నేను రాను."

"ఎందుకు రావు ?"

"అవామొమో."

"అంటే ?"

"అవామొమో." పునరుచ్చరించాడు రైతు. అదేదో తిట్టని పించింది పెల్టన్‌కు.

కర్నల్ పెల్టన్ వెనక్కి వెళ్ళిపోయాడు. రాయబారితో చెప్పాడు "వాడు బలేగడుసుపిండం. అంతసేపు మాటాడాక వాడు చెప్పినమాట అవామొమో, దాని అర్ధం ఏమిటో మరి."

"అది యిక్కడి వాడుకమాట అయివుంటుంది. మూడువందల సంవత్సరాలలో ఇలాంటి మాండలిక పదాలు కుప్ప తిప్పలుగా పుట్టు కొస్తాయి. ఒకటి రెండు గ్రహాల్లో ఈలాటి మాండలిక పదాలు పెరిగి పోయి పూర్తిగా ఒక క్రొత్త భాషే రూపొందడం నేను చూశాను. అని కాప్టెన్ గ్రేడర్ తన అనుభవాన్ని వెళ్లబోసుకున్నాడు.

"నీ భాష అతనికి బోధపడ్డదా?" పెల్టన్‌నుద్దేశించి రాయబారి ప్రశ్నించాడు.

"బోధపడ్డది ప్రభూ. అతనుకూడా చక్కటి భాషే మాట్లాడాడు. కాని నాగలిని వదిలి ఒక్క అడుగైనా ఇవతలికి రాలేదు." అని కొంచం ఆలోచించి. "నాకు అనుమతియిస్తే వాణ్ణి బలవంతంగా పట్టి, సాయుధ బలగంతో ఖైదీగా తీసుకొనివస్తా. అని విన్నవించాడు.

"అప్పుడు మనకు కావలసిన సమాచారమంతా ఉత్సాహంగా బయట పెడతాడుకాదూ?" అన్నాడు వెటకారంగా రాయబారి పొట్టనిమురుకున్నాడు. కోటు సర్దుకున్నాడు.తళ తళ మెరిసే జోళ్ల వంక చూచుకున్నాడు. "ఇంక లాభం లేదు - నేనే స్వయంగా వెళ్ళి మాట్లాడుతాను," అని బయలుదేర బోయాడు.

కర్నల్ పెల్టన్ విస్మయంతో వారించాడు, "ప్రభూ! ఆపని మీకు తగదు."

"ఎందుకు తగదు?"

"అది మీగౌరవానికి భంగం."

"అది నాకు తెలుసు;" రాయబారి చిరాకుగా అన్నాడు "అయితే వేరే ఉపాయం?"

"ఒక పటాలాన్ని పంపి మనకు సహకరించేవాడు నురొకడెవ డైనా దొరుకుతాడేమో వెతికి తీసుకొని రమ్మందాం.

"ఆ తీసుకొచ్చేది శాస్త్ర విషయం తెలిసినవాణ్ణి తెస్తే మంచిది" అని కెప్టెన్ గ్రేడర్ సలహా ఇచ్చాడు. "పట్టిగొడ్డుని ఎంత పితికితే పం లాభం? మనకి కావలసిన సమాచారంలో నాలుగో వంతైనా ఆ మట్టి బుర్రకి తెలుసునా అని నా అనుమానం."

"అయితే సరే—" తను స్వయంగా వెళ్ళాలన్న ప్రయత్నం విరమించుకున్నాడు రాయబారి. "పటాలాన్ని పంపించండి. పని మాత్రం సాధించుకురావాలి." అని ఆదేశించాడు.

"పటాలం-ఒక పటాలాన్ని వెంటనే సిద్ధం చెయ్యి," కర్నల్ షెల్టన్ మేజర్ హామ్‌కు చెప్పాడు.

"వెంటనే ఒక పటాలాన్ని రప్పించు-" మేజర్ హామ్ లెఫ్టినెంట్ డీకన్‌ను కేక పెట్టాడు.

"ఒక పటాలాన్ని తీసుకొని వెంటనే బయలుదేరవయ్యా, సార్జంట్ మేజర్!" అని డీకన్ బిడ్వర్దీని ఆజ్ఞాపించాడు.

బిడ్వర్ది ఓడదగ్గరకు వెళ్ళి, నిచ్చెనెక్కి ఓడ లోపలికి తొంగి చూసి గట్టిగా అరిచాడు— "సార్జంట్ గ్లిడ్- నీ పటాలంతో బయట కురా—తక్షణం." అతని ముక్కుకు ఏదో వాసన తగిలింది. ఇంక కొంచం లోనికి వంగిచూసి "ఎవర్రా అక్కడ చుట్టకాలుస్తున్నారు? ఇదే చెపుతున్నా. పట్టుకున్నానంటేనా-" అని బెదిరించాడు.

బెలూన్ షెడ్లమీద ఒక ఇంజన్ చుఫ్ చుఫ్ మంటూ పొలాల కడ్డపడి పాకుతూ వెళ్ళింది.

కుడిపక్కగా ఎనిమిదేసి మంది సిపాయిలు రెండుబార్లు తీరి నిలబడ్డారు. గ్లీడ్ అరుపుతో వారు దఫాలునతిరిగి తిన్నగా నడవ సాగారు. వాళ్ళజోళ్ళు లయప్రకారం టక టక మన్నాయి. వారి ఆయుధాలు ధగ ధగ మెరిశాయి.

సార్జంట్ గ్లీడ్ తనపటాలాన్ని ఎంతోదూరం తీసుకొని వెళ్ళ నక్కరలేకపోయింది. యుద్ధ నౌకనుండి వందగజాలు నడిచారో లేదో కుడిపక్కగా కదంతొక్కుతూ వస్తున్న ఒక వ్యక్తి అగుపించాడు. దూరంగావున్న ఎడమవైపు పొలాల్లో దున్నుతూవున్న ఆ రైతుదగ్గ రకు ఆ రెండోవ్యక్తి వెళ్తున్నాడు. ఎదురుగా కనబడుతూవున్న ఓడను శ్రొత్తిగా లక్ష్యపెట్టనేలేదు.

"సిపాయిలూ-కుడిపక్కకి-బొబ్బరింత పెట్టాడు గ్లీడ్. పటాలం అంతా తిన్నగా ఆసామీని దాటిపోయాక వెనక్కి తిరగమని ఆజ్ఞా పించాడు గ్లీడ్. ఆ తరవాత సంజ్ఞచేశాడు. పటాలం వేగంగా అడు గులు వేసింది. రెండుబారులూ దూరంగా విడిపోయి, ఆసామికి రెండు వేపులా అనుసరిస్తున్నాయి. ఆకస్మికంగా ఏర్పడ్డ ఈ అంగ రక్షను అసలు గుర్తించకండానే ఆసామీ తన దారిని తను పోతూనే ఉన్నాడు, సర్వంమిథ్య అన్న సత్యాన్ని గ్రహించిన వేదాంతిలాగ.

"ఎడమప్రక్కకు తిరగండి," అని గ్లీడ్ గర్జించాడు. సిపాయిలు అతి విధేయతతో తక్షణం రాయబారి ఉన్నవేపు తిరిగారు. ఒకటి, రెండు, మూడు హాప్ - అన్న లయ తప్పకుండా ఆవైపుకు నడిచారు. మంచికట్టుగా నడుస్తున్న ఆ పటాలం చూడముచ్చటగావుంది. అయితే దానిలో ఒకచేలోటు, వారు బందీగా తీసుకుపోవలసిన వ్యక్తిమాత్రం తన మామూలుపద్ధతిలో అంగలువేస్తూ, తన వైపుకు తను పోతున్నాడు. కుడివరసలో నాలుగూ ఐదూ సిపాయిల మధ్య కాళీలోంచి సునా

యాసంగా దాటేశాడు. అతి విధేయులైన భటులు దళాధిపతి ఆజ్ఞ ప్రకారం గుడ్డిగా ఓడవంకకు నడుస్తూనేవున్నారు. పటాలం పృథాగా బూట్లు చప్పుడుచేసుకుంటూ ఒక పక్కనే, వారిబందీ స్వేచ్ఛగా రెండో పక్కకి పోతుంటే, యుద్ధకళావిరుద్ధమైన ఈ దృశ్యాన్ని రాయబారి వినోదంగా చూస్తున్నాడు. కర్నల్ పెల్టన్ ఈ విషయమై తనని తప్పక దుయ్యబడతాడు. అతడు అనగా మిగిలినవి బిడ్వర్డ్ పూర్తి చేస్తాడు. గ్లిడ్‌కి మతిపోయింది.

"పటాలం!" అని అరిచాడు ఆత్రంగా పోతున్న బందీవేపు వేలు పెట్టిచూపిస్తూ, ఇంక సైనికశాస్త్ర నియమావళిని పక్కకునెట్టి. "ఆ పీనుగుని పట్టుకురండి," అని కేక వేశాడు.

వెంటనే సిపాయిలు సమవరుసలు వీడి పరుగెత్తి ఆ వ్యక్తిని చుట్టుముట్టారు. తప్పించుకోడానికి వీలులేనందున ఆ వ్యక్తి నిలిచాడు.

గ్లిడ పరుగెత్తుకొనివచ్చి, ఆయాసపడ్తూ చెప్పాడు—" చూడు భూలోకరాయబారి నీతో మాట్లాడాలంటున్నారు. అంతే - వేరే ఏమీ లేదు-"

ఆ వ్యక్తి బదులుచెప్పలేదు. తన నలుపాటి కండ్లుపైకెత్తి గ్లిడ్‌ను చూచాడు. చూడడానికి వాడు చాలా తమాషాగా ఉన్నాడు. దిబ్బ ముఖం, దాక నోరు, మాసినగడ్డం, మూతిచుట్టూ పీచువంటి మీసాలు చూడడానికి సూర్యకాంతం పువ్వువలె ఉన్నాడు.

"మా రాయబారితో మాట్లాడతావా ?"

"ఊహు— జెక్‌తో మాట్లాడబోతున్నా" తల ఊపుతూ రైతును చూపించాడు ఆసామీ.

"రాయబారితో ముందుమాట్లాడాలి!" గ్లిడ్ నిష్కర్షగా చెప్పాడు. "ఆయన ఘరానా మనిషి."

"కనబడ్తూనే వుంది."

"తిమ్మిరిగా వుందేం? వదిలిస్తావుండు." ముఖం వికృతంగా చిట్లించాడు గ్లిడ్. భటులనుద్దేశించి, "ఈడ్చుకొని రండిరా వీణ్ణి- మన సత్తాచూపిద్దాం!" అని ఆజ్ఞాపించాడు. ఆపీచు మీసాలవాడు చటుకుని చతికిలబడి కూర్చున్నాడు. ఎన్నాళ్లుగానో అక్కడ పాతుకుపోయిన శిలావిగ్రహం లాగ. వాడి పీచుమీసాలు కూడా ఆ విగ్రహంలో భాగంలాగ బిగుసుకుపోయాయి. సార్జంట్ గ్లిడ్ ఇలాంటి వారినెందరినో చూచాడు. అయితే వారికి వీడికీ ఒక తేడా- వారిది తప్పతాగిన హఠం. వీడిది స్థిమితంగా తెలిసిచేసే హఠం.

"వాణ్ణి ఎత్తుకొని రండి," అని ఆజ్ఞాపించాడు గ్లిడ్.

కాళ్లు ముందు, తరువాత తల పట్టుకొని భటులు వాణ్ణి మోసుకుపోయారు. వాడు వద్దనలేదు- పెనగులాడలేదు- శవంలాగ వాళ్ళ చేతులమీద పడుకున్నాడు. ఇంత అశుభంగా రాయబారి సమక్షానికి వాణ్ణి మోసుకొనిపోయి నిలబెట్టారు భటులు. మరుక్షణంలోనే వాడు తిరిగి జెక్ దగ్గరకు పోవడానికి బయలుదేరాడు.

"వాణ్ణి పట్టుకోండి. వదిలారంటే తొక్కచీల్చేస్తా!" అరిచాడు గ్లిడ్. పటాలం వాణ్ణి అమాంతంగా పెనవేసిపట్టుకున్నారు.

రాయబారికి వాడిమీసాలు చూడగానే అసహ్యంకలిగింది. అయినా అతినేర్పుతో తన ఏవగింపును పైకి పొక్కనీయక, సన్నగా దగ్గి అన్నాడు," నిజంచెప్తున్నా- మిమ్మల్ని ఈవిధంగా యిక్కడకు రప్పించడం నాకు చాలా బాధగా ఉంది.

"అలా జరక్కుండా మీరు జాగ్రత్తపడితే ఈ బాధ మీకు తప్పేది." అని సలహాఇచ్చాడు. ఖైదీ.

"గత్యంతరం లేక చేయవలిసివచ్చింది. ఎల్లాగో ఒకలాగ అసలు వాళ్లని కలుసుకుని తీరాలి.

"ఎందుకు కలుసుకోవాలి ? అయినా ముహూర్తాన్ని గురించి మీకంత పట్టింపెందుకు ?

"ముహూర్తమా ?'' అర్థంకాక ముఖం చిట్లించాడు రాయబారి. "దానికి దీనికీ ఏం సంబంధం ?"

''అదే నాకూ తెలియక అడిగాను."

"నువ్వనేదేమిటో నాకు అర్థంకావడంలేదు." రాయబారి" కర్నల్ పెల్టన్‌ను ఉద్దేశించి, "ఇతని అభిప్రాయం నీవేమన్నా గ్రహించావా ?" అని అడిగాడు.

"బహుశా అతని ఉద్దేశం - ఇదై వుండవచ్చు. మూడువందల సంవత్సరాలుగా వాళ్ళ అతీగతీ కనుక్కోకుండా ఉన్నాముగదా - అటువంటప్పుడు ఈరోజే సమాచారం తెలుసుకోవాలన్న ప్రత్యేకమైన తొందర ఎందుకు కలిగింది అని అడుగుతున్నాడనుకుంటా," అని పెల్టన్ బదులు చెప్పి, నిజమేనా అన్నట్టు దిబ్బ ముఖం మనిషి వంక చూచాడు.

"ఫరవాలేదే. మట్టిబుర్రవైనా బాగానే లాక్కొచ్చావు!" అని అతన్ని సమర్థించాడు దిబ్బ ముఖం.

ఇది విని పెల్టన్ ఏమనుకున్నాడో ఏమోగాని, బిడ్‌వర్డీ మాత్రం భరించలేకపోయాడు. కండ్లు ఎఱ్ఱనై నిప్పులు కక్కాయి. పెల్లుబికే కోపంతో నిలువునా కంపిస్తూ, "ఉన్నతాధికార్లతో మర్యాదగా మాట్లాడు!" అని గద్దించాడు.

ఆ ఖైదీ, శాంతం ఉట్టిపడుతూ వున్న తన నల్లటి కండ్లెత్తి బిడ్వర్ధీ వంక అమాయికంగానూ, ఆశ్చర్యంతోనూ చూశాడు. అతన్ని ఆపాదమస్తకం ఎగా దిగా చూచి రాయబారి వంక తిరిగి, "ఈ డంబాచారి ఎవరండీ?" అన్నాడు.

రాయబారి ఆ ప్రశ్న అనవసరమన్నట్టు విసుగ్గా చేతి ఊపుతో సూచించి అన్నాడు, "ఇదిగో చూడు - ఏదో మా సరదాకొద్దీ నిన్ను బాధ పెట్టడానికి రప్పించామని నీవనుకుంటున్నట్టున్నావు. అది కానే కాదు - అవసరం తీరాక నిన్ను ఒక్క క్షణమైనా ఆపుచేయం—" అన్నాడు. పీచుమీసాలను మరికొంచెం అసహ్యంగా పీక్కుంటూ, "ఆ అవసరం ఎప్పుడుతీరుతుందో నిర్ణయించేది మీరేకదూ!" తిప్పి అడిగాడు ఆ మనిషి.

"కాదు కాదు. అదంతా నీచేతిలోనేవుంది. నీవు ఎప్పుడు వెళ్ళ దలచుకుంటే అప్పుడే వెళ్ళవచ్చు. నీవు చేయవలసిందల్లా....... ...." ప్రశంసనీయమైన నిగ్రహం చూపిస్తూ అంటున్నాడు రాయబారి .

"అయితే ఇప్పుడే వెళ్ళదలచుకున్నా." అంటూ సిపాయిల చేతినుండి విడిపించుకోచూశాడు. "నన్ను వెళ్ళి జెక్‌తో మాట్లాడ నీయండి."

నీవు జేయవలసిందల్లా— మీ కేంద్రప్రభుత్వోద్యోగుల్లో ఎవరినైనా ఒకరిని ఎక్కడ కలుసుకోవచ్చో చెప్పడం--" అంటూ రాయబారి ఖైదీవంక కఠినంగా చూశాడు. "ఉదాహరణకు-ఈ ప్రాంతంలో రక్షకభట కార్యాలయం ఎక్కడుందో చెప్పు."

"అవామొమో" అన్నాడు మీసాలమనిషి. "నీకూ అంతే" అని విసురుగా అన్నాడు రాయబారి. అతవి ఓర్పు సన్నగిల్లింది. "అందుకో

సమే నా తాపత్రయంఅంతా," అని వ్యంగ్యంగా బదులుచెప్పాడు ఖైదీ. "నన్ను మీరు అలా చెయ్యనివ్వడంలేదు మరి."

"ప్రభూ - దయచేసి, నన్నొక సలహా చెప్పనిస్తారా?" అని ప్రాధేయపూర్వకంగా అడిగాడు కర్నల్ షెల్టన్.

"నాకు సలహాలతో పనిలేదు. నీవేమీ నాకు సలహా చెప్పనక్కర్లేదు!" అని కసురుకున్నాడు రాయబారి. "ఈ వెర్రివెంగళాయి వ్యవహారం ఇంక చాలు. అనుకోకుండా మనం ఒక పిచ్చివాళ్ళకోసం కేటాయించిన ప్రదేశంలో దిగాము. ఇప్పటికైనా ఈ సంగతి గ్రహించి ఇంక ఏమాత్రం ఆలస్యంచేయకుండా, ఇక్కడనుండి తరలిపోవడం మంచిది."

"బాగా చెప్పారు ఎంతదూరంగా తరలివెడితే అంత మంచిది, అని రాయబారితో పీమమీసాల మనిషి ఏకీభవించాడు.

"ఈ గ్రహాన్ని పూర్తిగా వదిలి వెళ్తున్నామని అనుకుంటే అది. కేవలం నీ మట్టిబుర్రలో మెదిలిన భ్రమే అవుతుంది," అని వెటకారంగా రాయబారి అన్నాడు. "ఇది మా భూ సామ్రాజ్యంలో ఒకభాగం. ఆ విషయం స్థిరపరచి, ప్రకటించి, పరిపాలన ఏర్పాటుచేసిగాని యిక్కడనుండి కదలం," అంటూ అధికారదర్పంతో అక్కడి నేలను కాలితో ఒకసారి తొక్కాడు.

"వినుడు వినుడు," అని చప్పట్లు చరిచాడు. ప్రధానోద్యోగి. గొప్ప వక్తగా ఖ్యాతికెక్కాలని అతని ఆర్భాటం. ముఖం చిట్లించి ఒకసారి వెనక్కు చూచాడు రాయబారి. "మరికొంచం చురుకైన బుర్రలున్నచోటికి మన ఓడను మరలిద్దాం," సిపాయిల నుద్దేశించి సైగ చేశాడు. "వీణ్ణిక వదలిపెట్టండి. గడ్డం గీక్కోడానికి కత్తి ఎక్కడైనా ఎరువుతెచ్చుకోవాలో ఏమో. తొందరపడుతున్నాడు మనిషి."

సిపాయిలు వాణ్ణి వదిలిపెట్టారు. అప్పటినుంచి అలానే పొలం మన్నుతూవున్న జెక్ వంకకు ఆ మీసాలమనిషి టకీమని తిరిగి, అయ స్కాంతం ఆకర్షించిన సూదిలాగ తనమామూలు పద్ధతిలో అంగలు వేసుకుంటూ పోయాడు. నోరువిప్పి ఒకమాటైనా మాట్లాడలేదు. అసహ్యంతో ఆశాభంగంతో గ్లిడ్, నిడవర్థిల ముఖాలు ముడుచుకు పోయాయి.

"తక్షణం యీ ఓడను యిక్కడనుండి కదలించండి. క్రొత్త వాళ్ళని వింతజంతువులా చూసే ఇలాటి అడివిమృగాలున్నచోట కాకండా, కాస్తమంచి ఊరుచూసి దింపండి." అని కాప్టెన్ గ్రేడర్‌ను ఆజ్ఞాపించాడు రాయబారి. దర్పంగా ఓడ మెట్లెక్కాడు. కాప్టెన్ గ్రేడర్ అతన్ని అనుసరించాడు. అతని వెనుక కర్‌నల్ షల్టన్, అతని వెనుక వక్తయైన ప్రధానోద్యోగి, ఆ వెనుక వరుసగా ఒక్కొ క్కరు ఓడ ఎక్కారు. కట్టకడపట గ్లిడ్, అతని పటాలం కూడా ఓడ ఎక్కారు.

ఓడదిగే నిచ్చెన లోపలికి ముడుచుకుంది. బహిర్ద్వారం తలుపు దఢాలున మూసుకుంది. అంతపెద్ద ఓడ ఒక్క కుదుపుతో అతిసుల భంగా పైకిలేచింది. చెవులు గింగురుమనే శబ్దంగాని, కండ్లు మిరు మిట్లుగొలిపే మంటలుగాని, లేకుండానే ఆ ఓడ అతి అవలీలగా పైకి పోయింది.

నిజానికి అంతటా నిశ్శబ్దం. మారాన్న పొలందున్నే ఇంజన్ మాత్రం ఛుఫ్ ఛుఫ్ మంటూ కదులుతూంది. దానిప్రక్కన ఇద్దరు వ్యక్తులు సన్నగా సంభాషించుకుంటూ నడుస్తూ పోతున్నారు. అక్కడ ఓడదగ్గర ఏమి జరుగుతూన్నదీ తమకు అవసరం లేనట్లు వారిలో ఒక్కరైనా తల అటుత్రిప్పలేదు.

"ఒక్క బంగీబ్రాందీకి శ్రేష్ఠమైన పొగాకు పదుసార్లు అంటే చాలా హెచ్చు." అంటూ తన అభ్యంతరాన్ని తెలిపాడు మీసాల మనిషి. "నా బ్రాందీకి ఎక్కువకాదు." వెయ్యి ఏనుగుల జోరుంది దానికి. భూమియుల పతనానికన్నా మెత్తగా తెలియకుండా పప గొట్టేస్తుంది," అని సమర్థించాడు జెక్.

ఆ పెద్ద యుద్ధనౌక ఈసారి ఒక పట్టణానికి ఉత్తరంగా, సుమారు ఒక మైలుదూరంలో ఉన్న ఒక విశాలమైన బయల్లో దిగింది. ఆ పట్టణంలో రమారమి పన్నెండు - పదిహేనువేల జనం ఉండవచ్చు. ఊరుమీద క్రిందగా ఎగురుతూ సంగతి సందర్భాలు పరిశీలించాలన్న ఆశ కాప్టెన్ గ్రేడర్‌కు లేకపోలేదు. అయితే అంతదగ్గర పనిఉ చిన్న విమానాలతో సాధ్యమౌతుందిగాని, ఇంతపెద్ద నౌకతో సాధ్యంకాదు. ఈ నౌకలోవున్న విశేషం ఏమంటే - ఇది పైకి ఎగిరేటప్పుడు గబా లున చాలా పైకిలేస్తుంది. క్రిందకు దిగేటప్పుడు చటుక్కున దిగుతుంది. అంతకుతప్పితే, మధ్యస్థంగా భూమికి కొంచం ఎత్తులో ఎప్పుడూ ఎగు రదు. ఆ కారణంవల్ల సమీపంనుండి దిగే ప్రదేశంలో ఏమున్నదీ పరీక్ష చేయడాన్కి బొత్తిగా వీలుపడదు.

ఓడను ఎక్కడ ఆపాలి అన్నది ఒక్క రెప్పపాటుకాలంలో నిర్ణ యించాలి. అంతతక్కువ వ్యవధిలో తను చూడగలిగినంత చూచి, తనకు మంచిదని తోచిన స్థలంలో దాన్ని దింపాడు కాప్టెన్ గ్రేడర్. అక్కడ రాతిప్రదేశం కావడాన, నేల గట్టిగావుంది. ఒడ వాలినప్పుడు ఈసారిపడ్డది పన్నెండు అడుగుల గాడిలోతు మాత్రమే. నిచ్చెన క్రిందకు వేశారు. పెద్దలందరూ వరుసక్రమంలో ఓడదిగారు.

ఘనత వహించిన రాయబారి ఎంతో ఆశతో నలుప్రక్కలా కలియజూచాడు. కాని అతని ఆశ నిరాశ అయింది. ఆశాభంగాన్ని వెళ్ళబుచ్చుతూ, అన్నాడు.

"ఇది చాలా చిత్రంగా ఉందే అదే ఊరు. ఇక్కడమనం వెండి కొండలాంటి మన ఓడ. కొందరు నిద్రపోతున్నా మరికొందరు తలుపులు మూసుకుని సమాధుల్లో మునిగిపోయినా, అధమం ఒక వెయ్యి మందైనా మనల్నిచూచి ఉండాలిగదా. ఒక్కడుం రాడేం? వాళ్ళల్లో ఉబలాటమన్నా కనబడదేం?"

"ఉన్నట్టు కనబడదు స్వామీ అని బలపరుస్తూ కంటి రెప్పలాగి వదిలాడు, కర్నల్ పెల్టన్.

"నేను నిన్ను అడగలేదు. నీకు చెప్పాను. ఇక్కడివారికి ఉత్సాహంలేదు. ఉబలాటంలేదు. ఆశ్చర్యంలేదు. ఆమాటకొస్తే తెలుసుకుందామన్న సరదా కూడా కనబడదు."

ఇల్లాంటి ఓడ ఇదివరకొచ్చినట్టూ, అందులో మహామ్మారినీ. దొంగబంగారాన్ని దిగుమతిచేసినట్టూ చూస్తారేం? అసలు వాళ్ళల్లో ఉన్న లోపం ఏమిటీ అని ?"

"వాళ్ళకి కుతూహలం లేదేమో!" అని అందించాడు పెల్టన్.

"అదైనా అయివుండాలి. లేకపోతే వాళ్ళందరికీ భయమైనా అయివుండాలి. లేదా వీళ్ళంతా పిచ్చిమాలోకాలైనా అయిఉండాలి. మతిస్థిరంలేని ఇలాంటివారు చాలామంది, తమ పిచ్చివాలకాలకు స్వేచ్ఛ కోసమని కొన్నికొన్ని గ్రహాలకు తరిలివచ్చారు.

ఈ మూడువందల సంవత్సరాలూ అవిచ్ఛిన్నంగా నిలబడ్డ పిచ్చి భావాలు సంప్రదాయాలైపోతాయి. అలాంటివాళ్లకి ముత్తాత గారి అటకలో గబ్బిలాలను సాకడం సహజంగా కనిపిస్తుంది. తరాలు గడిచిన కొద్దీ ఈ పిచ్చి కుదిరి వీళ్ళరోగం మనం కుదురుద్దాం.?

"అవునుప్రభూ - తప్పక కుదురుద్దాం."

"నీకూ్కడా అంత మతి స్థిరంవున్నట్టు తోచదు. ఆ కనురెప్ప లెందుకలా లాగుతావు?" అని మందలించాడు రాయబారి. వణుకుతూ వున్న చేతిని షెల్టన్ జేబులో దోపుకున్నాడు. ఆగ్నేయదిక్కుగా చూపుతూ రాయబారి అన్నాడు. అక్కడ రహదారి కనబడ్తూవుంది. చూచావా? బాగా వెడల్పాటి సిమెంటుదారి. నీ పటాలాన్ని ఆ వంకకు పంపు. కొంచెం సేపటికల్లా మనకు సరిగా జవాబు చెప్పేవాణ్ణి ఒకణ్ణి వారు తెస్తేసరి - లేదా - పట్టణంమీదికే దండుపంపుదాం"

"పటాలం!" షెల్టన్ హోమ్‌కు చెప్పాడు.

"పటాలాన్నిపిలు" మేజర్ హోమ్ డీకన్‌ను ఆజ్ఞాపించాడు.

"వెనుకటి పటాలాన్ని తిరిగి రప్పించు, సార్జెంట్ మేజర్!" అని ఆజ్ఞను అందించాడు లెఫ్టెనెంట్ డీకన్.

బిడ్‌వర్ది గ్లిడ్‌కు, అతని సిపాయిలకు కబురంపాడు. రహదారిని చూపిస్తూ, వారిని అటువంక పొమ్మని ఒక అరుపులరిచాడు. గ్లిడ్ ముందు, సిపాయిలు వెనుక-నడువ నారంభించినారు. ఒక అరమైలు దూరంలో ఉంది పట్టణం. ఎడమబారులో నడిచే సిపాయిలకు ఊరి చివరి ఇళ్లు స్పష్టంగా కనబడ్డాయి. ఇళ్ళుచూస్తే వాళ్ళకి నోరూరింది. ఈ గ్లిడ్డూ, ఆ బిడ్‌వర్ది సహారా ఎడారిలో చస్తే బాగుండునకున్నారు.

ఆ బాటను చేరిచేరకముందే వారి కొకవ్యక్తి ఎదురయ్యాడు. మోటర్‌సైకిల్‌వంటిదానిమీద రయ్యిమని అతివేగంగా అతను ఊరు వదలి బయటకువచ్చాడు. రెండు పెద్ద రబ్బరుబంతులమీద ఆవాహనం నడుస్తూంది పంజరంలోవున్న ఫంకా తిరుగుతూ దాన్ని నడుపుతూ వుంది. గ్లిడ్ సిపాయిలను దారికడ్డంగా నిలబెట్టాడు. చెవులు గింగురు

మనేటట్టు ఆ వాహనం కూతపెట్టింది. కోపంవచ్చినప్పుడు బిడ్‌వర్డ్
బొబ్బరింత కొంచం ఇంచుమించు అలాగేవుంటుంది.

"అడ్డంగా నిలవండి. వాణ్ణి పోనిచ్చారంటే చర్మం ఒలిచేస్తా,
జాగర్త!" అని హెచ్చరించాడు గ్లిడ్.

మళ్ళీ అదేచెవులు గింగురుమనేకూత. కాని సిపాయిలు కదల
లేదు. బండి వేగం తగ్గింది. మెల్లగా జరుగుతూ సిపాయిలముందు
ఆగింది. పంజరంలో ఫంకా 'ఉజ్' అంటూ మెల్లగా తిరిగింది. దాని
ఆకులు విడివిడిగా కనబడుతున్నాయి.

"ఏమిటిదంతా?" అన్నాడు ఆ బండిమీద వచ్చిన వ్యక్తి.
బక్కపలచగావున్నాడు. వయస్సు సుమారు ముఫ్ఫై అయిదు
వుండవచ్చు. నాలుగడుగుల పొడవైన జడవేసుకున్నాడు. ముక్కుకు
బంగారు నత్తుతగిలించుకున్నాడు. ఈ వేషాన్ని చూచిగ్లిడ్ తనకండ్లను
తను నమ్మలేకపోయినాడు. అతని వంక తేరిపారచూస్తూనే, అతి ప్రయ
త్నంమీద బొటనవేలితో ఓడను చూపుతూ, "భూమీశ్వరుల నౌక"
అన్నాడు.

"అయితే నన్నేమిచేయ మంటావు ?"

"సహకరించాలి!" అన్నాడు గ్లిడ్. అతని జడవేపు వింతగా
చూస్తూ ఇదివరకెప్పుడూ అలాంటి జడ అతను చూడలేదు. అందులో
ఆడంగితనం లేదనుకున్నాడు గ్లిడ్. పైగా ముఖంలో ఒక విధమైన
క్రౌర్యం వుంది—అనాదికాలంలో ఉత్తర అమెరికాలోని వసించిన
ఆదిమనివాసుల బొమ్మలు అచ్చంగా ఇలానే ఉంటాయి.

"సహకారం!" ఆలోచనతో పునరుచ్చరించాడు ఆవ్యక్తి.
"ఇది చాలా చక్కటిమాట. దీని అర్థం ఏమిటో నీకు తెలుసు
కాబోలు ?"

"నే నేమీ అంత మందబుద్ధిని కానులే."

"నీ బుద్ధి ఎంత మందమైనది అన్న మీమాంస ఇప్పుడు మన కనవసరం." అన్నప్పుడు అతని ముక్కు నత్తు అల్లల్లాడింది. "మనం ఇప్పుడు మాట్లాడేది సహకారాన్ని గురించి. మీరు దాన్ని సామాన్యంగా ఆచరిస్తారనుకుంటా."

"ఆ విషయమై నీకు సందేహం అక్కర్లేదు. నేనే కాదు, స్వతేమాన్ని కోరుకున్న ప్రతివారూ దాన్ని ఆచరిస్తారు," అని నొక్కి చెప్పాడు గ్లిడ్.

"అసలు విషయాన్ని వదిలి అల్లి బిల్లి కబుర్లలోకి దిగవద్దు," అంటూ వాడు పంకా వేగాన్ని కొద్దిగా పెంచించి తిరిగి తగ్గించాడు. "ఒకరు ఆజ్ఞాపిస్తే, ఆ ఆజ్ఞను నీవు ఆచరిస్తావు, అంతేనా?"

"తప్పకుండాను. లేకపోతే నా బ్రతుకు బయటపడ్డట్టే."

"దాన్నేనా సహకారం అంటున్నావు?" అంటూ ఆ వ్యక్తి ఒకసారి భుజాలు కుదిలించుకున్నాడు. నిట్టూర్చాడు. మళ్ళీ అన్నాడు. "నిజమేలే. చరిత్రను అప్పుడప్పుడు సరిచూసుకోవడం మంచిది. పుస్తకాల్లో కూడా తప్పులుండొచ్చు." పంకా గిర్రున మెరుపులాగా తిరిగింది. బండి రయ్యిమని ముందుకు దూసుకొని పోయింది. "క్షమించండి" అన్నాడు. ముందు చక్రం ఇద్దరు సిపాయిలను నెట్టుకుంటూ పోయింది. వారిద్దరు కిందపడ్డారు కాని దెబ్బలు తగులలేదు. రెప్పపాటులో బండి అతివేగంగా ఆమడలెక్క పోయింది. ఆ వేగంలో, పంకా గాలి విసురుకు, వాడి జడ నిటార్గా నిలబడింది.

"వెట్టి ముఖాలు!" అని తిట్టాడు గ్లిడ్. క్రిందపడ్డ సిపాయిలు లేచి మట్టి దులుపుకున్నారు. "చేతులు పట్టుకుని నిలవండిరా, దోవ

విడువకండిరా అని చెప్పానా? వాడు అలా తప్పించుకు పోతూంటే కండ్లప్పగించి నిలుచుంటే ఏమైనట్టు?" కోపంతో మండిపడ్డాడు గ్లిడ్.

"ముమ్మాత్రేన్నేం చేయమంటారు, సార్?" అన్నాడు ఒక సిపాయి ముఖం ముడుచుకుని.

"నోరు ముయ్యి, మీరు ఆయుధాలు సిద్ధంగా ఉంచుకున్నట్టయితే, ఆ బెలూన్ చక్రాల్ని పగులకొట్టి ఉండవచ్చుగా. అప్పుడు వాడు ఆగక ఏమి చేస్తాడేం?"

"తుపాకులు సిద్ధంగా ఉంచుకోవాలని మీరు మాకు చెప్పలేదు."

"మరి మీ తుపాకీ ఏమైంది?" సన్నగా వినపడ్డది ఒక గొంతు.

గ్లిడ్ గిర్రున తిరిగి "ఎవడ్రా వాడు?" అని అరిచాడు. వరుసగా ఒక్కొక్క సిపాయి ముఖంవంక కొరకొరా చూచాడు. ఎవరి మట్టుకు వారు తను కాదన్నట్లు గుప్ చిప్ గా నిలబడ్డారు. నేరస్థుడు ఎవడైందీ పట్టుపడలేదు.

"మీ రోగం ఇలా కుదురదు. ఇంకోసారి పని పడ్డప్పుడు మీ ఒళ్లు ఎలా నలగ్గొట్టానో మీరే చూద్దురుగాని," అని దబాయించాడు.

"అదుగో, సార్జంట్ మేజర్ వస్తున్నాడు," అని హెచ్చరించాడు ఒక సిపాయి.

బిడ్వర్ది నాల్గువందల గజాల దూరంలో వున్నాడు. మిలిటరీ పద్ధతిలో నడుస్తూ వారి వంకకు వస్తున్నాడు. వారిని సమీపించి తిరస్కారం, ఆక్షేపణా సూచిస్తూ "ఏం జరిగింది?" అని అడిగాడు.

జరిగిందంతా క్లుప్తంగా నివేదించాడు గ్లిడ్.

"వాడు చూస్తే పెద్ద మోతుబరి చికాసో ననుకుంటున్నాడు!" అని నిందాపూర్వకంగా ముగించాడు.

"చికాసో ఎవరు?" బిడ్వర్డీ అడిగాడు.

"నేను చిన్నప్పుడు ఏ పుస్తకంలోనో వాళ్ళను గురించి చదివాను," తన చదువును కాస్త పై అధికారికి పంచిపెట్టాలన్న ఆత్రంతో. "వాళ్ళకు పొడుగాటి జడలుండేవి. కంబళ్ళు ధరించేవారు. బంగారం పొదిగిన కార్లలో తిరిగేవారు" అని వివరించాడు.

"అదంతా బూటకం. అలాంటి పుక్కిటి పురాణపు మాయా బజారు కథలు చదవడం నేను ఏడేళ్లప్పుడే మానేశాను. పన్నెండేళ్లు నిండకముందే శాస్త్రపుస్తకాలు చదివాను. పధ్నాలుగు సంవత్సరాలు నిండకముందే మిలిటరీలో చేరాను." అంటూ ఒకసారి ముక్కుతో గట్టిగా గాలి పీల్చి, గ్లిడ్ వంక ఓరకంటితో చూస్తూ సాక్షేపణగా అన్నాడు, "కొంతమందికి వయస్సు పెరిగినా, మెదడు పెరగదు!"

"అలాంటివారు నిజంగానే వుండేవారు. అబద్ధం కాదు." అని సమర్థించాడు గ్లిడ్.

"యక్షులు, కిన్నరులూ కూడా నిజంగానే వుండేవారు" అని వెక్కిరించాడు బిడ్వర్డీ. "ఉండేవారని మా అమ్మ చెప్పింది. మా అమ్మ చాలా మంచిది. ఇలాంటి పిచ్చి కబుర్లు ఎప్పుడోగాని చెప్పేది కాదు." రోడ్డుమీద ఉమ్మివేసి, "వయస్సుకు తగినట్టు మాట్లాడాలోయ్!" అన్నాడు సిపాయిలవంక కోపంగా చూచి. "ఇంక మీ తుపాకులు తియ్యండి. అసలవి మీతో తెచ్చారుగదా! ఎక్కడున్నాయో తెలుసా? ఏ చేతిలో ఎలా పట్టుకోవాలో తెలుసనుకుంటా. ఇంక నేను

చూచుకుంటా మిమ్మల్ని. నేను చెప్పినట్టు చెయ్యండి." అని అన్నాడు.

రోడ్డు ప్రక్కన పెద్ద రాతిబండమీద కూర్చుని ఊళ్ళోకి అదే పనిగా చూడసాగాడు బిడ్ వర్డీ. గ్లిడ్ అతని ప్రక్కనే ముఖం చిన్న బుచ్చుకొని నిలబడ్డాడు. సిపాయిలు రోడ్డు కడ్డంగా బార్లు తీరి, తుపాకులు సిద్ధంగా పట్టుకున్నారు. ఒక అరగంట గడిచింది.

సిపాయిల్లో ఒక డడిగాడు, "సార్జెంటు మేజర్, చుట్ట తాగ వచ్చా ?"

"కూడదు."

వాళ్ళు దీర్ఘ ముఖాలతో పెదవులు చప్పరించుకుంటూ ఊళ్ళోకి చూస్తూ నిలబడ్డారు. వాళ్ళు ఆలోచనలో పడ్డారు. ఆలోచించడాన్కి వాళ్ళకు ఎన్నో విషయాలున్నాయి. ఒక ఊరు, అది ఏ ఊరైనా సరే, జనం నివసిస్తున్న ఊరై తే చూడడానికి ముచ్చటగా వుంటుంది. అక్కడ వుండే ఆనందం అంతరిక్షంలో మరెక్కడున్నా కలుగదు. దీపాలు, స్నేహితులు, స్వేచ్ఛ, నవ్వులాటలు-ఇంకా జీవితాన్ని ఆనందమయంగా జేసే అనేకం ఇలాంటి ఊళ్ళలో దొరుకుతాయి. వీటికోసం వాళ్ళు ఎంతో కాలంగా తపిస్తున్నారు.

ఆఖరికి పొలిమేరనుండి ఒక పెట్టెబండి బయటకు వచ్చింది. రోడ్డు దాటి కూతకూస్తూ వారికి ఎదురుగా వచ్చింది. ఆ పెట్టె పొడుగ్గా తళతళ్లాడుతూ వుంది. రెండు పక్కలా రెండు పదులు, ఇరవై బంతుల్లాటి చక్రాలమీద అది నడిచింది. వెనుకటి మోటారు సైకిల్ వంటి బండి కూసినట్టే కూసింది. అయితే అంతకన్నా చెవులు గింగురు మనేటట్టుంది దీని కూత. పైకి పంకాలేవీ ఉన్నట్టు అగపడడం లేదు. అందులో మనుష్యులు నిండుగా వున్నారు.

సిపాయిలకు రెండువందల అడుగుల దూరంలో ఉండగానే బానెట్ క్రింద గొట్టంనుండి గట్టిగా "తప్పుకోండి-తప్పుకోండి." అన్న అరుపు వినవచ్చింది.

"అమ్మయ్య-ఒక్కసారిగా యింతమంది చిక్కారు." అని తృప్తిపడ్డాడు బిడ్‌వర్ధి. "ఇందులో ఒక్కడైనా అడిగిందానికి సరిగా జవాబు చెప్పితీరాలి. లేకపోతే నా ఉద్యోగానికే రాజీనామా యిచ్చేస్తా." అంటూ సాధించగలనన్న నమ్మకంతో బండమీదనుండి లేచి సిద్ధంగా నిలుచున్నాడు.

"తప్పుకోండి-తప్పుకోండి!" తిరిగి అరుపు.

"తప్పించుకొని పోయాడంటే చక్రాలు పగులకొట్టండి!" అని బిడ్‌వర్ధి సిపాయిలకు ఆజ్ఞాపించాడు.

అంతపని అవసరం లేకపోయింది. బండి వేగం తగ్గింది. సిపాయిలకు ఒక గజం దూరంలో నిలబడ్డది. బండి నడిపే డ్రైవర్ బయటకు తొంగి చూచాడు. వెనుక వాళ్ళంతా కూడా వరుసగా తొంగి చూశారు.

బిడ్‌వర్ధి మంచి మాటలతోనే పని కానిద్దామని నిశ్చయించుకున్నాడు. డ్రైవర్ దగ్గరగా వెళ్ళి, "సుప్రభాతం!" అన్నాడు.

"నీ కాలజ్ఞానం గంగపాలైనట్లుందిలే!" అన్నాడు డ్రైవర్. అతనికి నల్లటి దవడలు, చిట్లిన ముక్కు, పెద్ద చెవులు, చూడడానికి యుద్ధంలో కారు నడిపేవాడిలా వున్నాడు. "నీ కొంప గడియారానికి కూడా గతి లేదా?" అని అడిగాడు.

"ఏం?"

"ఇది ప్రభాతం కాదు-మధ్యాహ్నం కూడా దాటింది."

"ఔను. నిజమే—అయితే మీకు సుదినం!" తెచ్చిపెట్టుకున్న చిఱునవ్వుతో ఒప్పుకున్నాడు ఐక్ వర్ద్.

"ఏమో—నా కనుమానమే!" బండి చక్రం మీదకు ఒరిగి, సాలో చనగా పళ్ళు కుట్టుకుంటూ అన్నాడు డ్రైవరు—"అన్ని రోజుల్లాంటిదే ఇదీని. మరొక రోజు చావుకు దగ్గర పడ్డాం—అంతే."

"అయితే కావచ్చు." అని ఒప్పుకున్నాడు ఐక్ వర్ద్. ఇలాంటి చింతలతో అతనికి పనిలేదు.

"నాకు వేరే చింతలు ఎన్నో వున్నాయి - మరి—"

"చింతించి లాభం లేదు-జరిగిందీ, జరుగుతున్నదీ దేన్ని గురించీ కూడా!" అని సలహా చెప్పాడు డ్రైవర్ - "ఎందుకంటే యిక ముందున్నది ముసళ్ళపండుగ! పెద్ద పెద్ద చింతలు కాచుకొని కూర్చున్నాయి."

"అలానా?" అన్నాడు ఐక్ వర్ద్—జీవితంలో రాబోయే చిక్కుల్ని గూర్చి చింతించడానికి అది స్థలమూ కాదు, సమయమూ కాదని అతని అభిప్రాయం. "కానీ, నా స్వంత సమస్యలు, నాకు యిష్టమైనప్పుడూ, నా యిష్టం వచ్చిన రీతిలో, నేనే పరిష్కరించుకుంటాను," అని అన్నాడు.

"ఏ ఒక్కరి సమస్యలూ వారి స్వంతం కావు. అలానే వారి సమయం. అలానే వారి పద్ధతులూను," అంటూ వాదించాడు డ్రైవర్ - "ఏమంటావు?"

"అది ఎలాగైనా కానియ్యి-అది నాకు తెలియనూ తెలియదు; తెలుసుకోవాలన్న కోర్కె నాకు లేనూ లేదు." ఐక్ వర్ద్ కి ఓర్పు మెల్లిగా నశిస్తూ వుంది. పక్కనే గ్లిడ్, అతని పటాలం - యిదంతా

వింటూ చూస్తూ లోలోపల నవ్వుకుంటూ వుంటారని అతనికి తెలుసు. పైగా బండిలో ప్రయాణీకులంతా తన వంకే చూస్తున్నారు-కొంచం చురచురలాడుతూ అన్నాడు. "ఇలా నాన్చి నాన్చి నన్ను ఏమారుద్దామని అనుకుంటున్నావు కాబోలు - అదేమీ లాభం లేదని తెలుసుకో. ఫూలో రాయబారి కనిపెట్టుకొని వున్నాడు."

"ఇక్కడ మేమూ కనిపెట్టుకొని కూర్చున్నాము." పొడిచినట్టు అన్నాడు డ్రైవర్.

"ఆయన నీతో మాట్లాడాలని కోరుతున్నాడు. తప్పకుండా మాట్లాడి తీరుతాడు."

"నే నేమీ వద్దనలేదే ? ఇక్కడ అందరు స్వేచ్ఛగా మాట్లాడవచ్చు-అదేదో తొందరగా వచ్చి, మాట్లాడవలుచుకున్నది మాట్లాడితే-మాదారిని మేము పోనైనాపోతాం."

"నీవే ఆయన దగ్గరకు రావాలి." బిడవర్ద చెప్పాడు. బండిలో కూర్చున్న ప్రయాణీకులనందరినీ చూసి "ఈ గుంపుతో సహా" అని హెచ్చరించాడు.

"నేను రాను." అంటూ ఒకలావాటి మనిషి బండిలోంచి తొంగిచూచాడు. అతని కళ్ళద్దాలు చాలా మందంగా ఉన్నాయి. వాటిలోంచి అతని కళ్ళు కోడిగుడ్లవలె కనబడ్డాయి. ఎత్తైన, తెలుపు రోజా చార్ల టోపీనొకదాన్ని తలకు తగిలించుకున్నాడు. "నేను రాను బాబూ!" అని, ఆ ఆకారం మరొకసారి నొక్కి చెప్పింది.

"నేనూ రాను." డ్రైవర్ అన్నాడు.

"రారేం? అయితే చూడండి-ఈ బండిని ఒక్క అంగుళం

అటూ ఇటూ కదిల్చారా, మీ బెలూన్ చక్రాలన్నీ బ్రద్దలు చేసేస్తాం. బండి దిగుతారా దిగరా-ఊ!" అని బిడ్‌వర్డీ బెదిరించాడు.

"నేను దిగను-ఇక్కడ నాకు హాయిగా వుంది. చేతనైతే దింపుకోండి," అన్నాడు డ్రైవర్.

"వాడి మాట విన్నారుగా! ఇంకా ఊరుకుంటారేం? అని దగ్గర్లో నిలబడ్డ ఆరుగురు సిపాయిలకు సైగచేశాడు బిడ్‌వర్డీ. వెంటనే సిపాయిలు బండి తలుపు తోసుకొని డ్రైవర్ మీద పడ్డారు. వాడు గనుక తిరగబడ్తాడనిగాని, పెనుగులాడ్తాడనిగాని వారు అనుకుని ఉంటే తప్పక ఆశాభంగం కలిగి ఉండేది. వాడు వద్దనలేదు, కద్దనలేదు. వారంతా కలిసి వాణ్ణి సగంమేర బయటకులాగారు. అంతే-అంతకు మించి లాగలేకపోయారు.

"లాగండి రా బయటికి," వేగిరపెట్టాడు బిడ్‌వర్డీ. "మనం ఎవరమో వాడికి తెలియనియ్యండి - ఎందుకు ఆలస్యం-ఏం-వాడు అందులో పాతుకొనిపోయాడా?"

ఒక సిపాయి డ్రైవర్ మీదుగా ఎక్కి లోపలికి తొంగిచూచాడు "వాడా నిజంగానే పాతుకొని పోయాడు—" అన్నాడు.

"ఏమిట్రా నీవు చెప్పేది?"

"వాడి కాలికీ చక్రానికీ కలిపి సంకెళ్ళు వేశారు."

"ఏదీ-నన్ను చూడనియ్యి-" బిడ్‌వర్డీ చూశాడు. సిపాయి చెప్పింది నిజమే. గొలుసు చిన్నదైనా బరువైన గొళ్ళెం, తాళం కప్పతో వాడి కాలు చక్రానికి బిగించి వుంది. "తాళంచెవి ఎక్కడ?" బిడ్‌వర్డీ గద్దించాడు.

"వెతుక్కోండి," పళ్లికిలిస్తూ అన్నాడు డ్రైవర్.

వాళ్ళు వెతికారు-కాని లాభంలేక పోయింది. తాళం చెవి ఎవరిదగ్గర వుంది?'' అడిగాడు బిక్‌వర్ది."

''అవామొమో—'' డ్రైవర్ బదులు చెప్పాడు.

"వాడిని వాడి స్థలంలోకి తోసి వెయ్యండి," అని ఆజ్ఞాపించాడు బిడ్‌వర్ది. "ప్రయాణీకుల్ని పిలుచుకొని వెళ్దాం. ఎవడో ఒకడు ఎవడైతేనేం నా పనికి?" అంటూ ఒక్కొక్క కిటికీ దగ్గరకూ వెళ్ళి తలుపులు కొట్టి, ''దిగండిరా యింక. ఆలస్యం చేయకండి.'' అని హెచ్చరించాడు.

ఒక్కడూ కదల్లేదు. వారంతా బిడ్‌వర్ది వంక అదేపనిగా చూశారు. ఈ చూడటంలో వారి ముఖాలమీద వేరువేరు భావాలు కనబడ్డాయి. అయితే అందులో ఒకటికూడా బిడ్‌వర్దికి నచ్చలేదు. ఆ చార్లటోపీ లాంటి ముసలివాడు బిడ్‌వర్దిని పరిహసిస్తూ వున్నట్లు నవ్వాడు. వాణ్ణి చూస్తేనే బిడ్‌వర్దికి అసహ్యం. అసలు వాడు అంత లావుగా వుండడం బిడ్‌వర్దికి నచ్చలేదు. సిపాయి కసరత్ చెయ్యిస్తే తప్ప వాడు సన్నపడడని అనుకున్నాడు.

"మీరంతా మర్యాదగా దిగండి.'' అని సలహా చెప్పాడు బిడ్‌వర్ది, ప్రయాణీకులకేసి, ముఖ్యంగా చార్లటోపీవాడికేసి చూస్తూ. "లేకపోతే మెడలుపట్టి దింపమంటారా? కదుల్తారా, కదల్రా-వేగిరం చెప్పండి."

''నీకు బుఱ్ఱ పనిచేయక పోతేపోయింది-కళ్ళుకూడా కనబడడం లేదా?'' అని విమర్శించాడు లావుమనిషి. కూర్చున్నవాడు కొద్దిగా కదిలాడు. సంకెళ్లు మ్రోగాయి.

ఏమిటో చూద్దామని బిడ్‌వర్ది లోపలికి వంగి చూశాడు. తరవాత లోపలికి ఎక్కాడు-ఒక్కొక్క ప్రయాణీకుడివద్దకూ వెళ్ళి

వంగి చూశాడు. దిగాలుపడ్డ ముఖంతో వెనక్కి తిరిగి బండి దగ్గ సార్జంట్ గ్లీడ్ తో అన్నాడు-"అందరికీ సంకెళ్ళే! అందరికీని!-" డ్రైవర్ వంగి ముందుకు పడుతూ చూశాడు. "ఎందుకిదంతా? అందరినీ ఎందుకిలా కట్టివేశారు?" అని అడిగాడు.

"అవా మొమో-" అన్నాడు డ్రైవర్ నిర్లక్ష్యంగా.

"తాళాలెవరి దగ్గర ఉన్నాయి?"

"అవా మొమో-"

బిడ్‌వర్ధి ఒకసారి నిట్టూర్చాడు-తనలో తను అనుకున్నాడు. "కొందరు పిచ్చివాళ్ళలా డజన్లకొద్దీ మనుషుల్ని అంతమొందిస్తుంటారని వినడమేగాని చూడలేదు. అది నిజమా? ఇప్పుడర్థమైంది." మెటికలు విరిచి, గ్లీడ్‌నుద్దేశించి," ఈ జడ్డిముఖం అక్కడ కూర్చున్నంతసేపూ మనం యీ బండిని నడుపుకొనిపోలేం. తాళం చెవినైనా సంపాదించాలి, లేక సాధనాలతో యీ గొళ్ళాలైనా ఊడకొట్టాలి.

"లేకపోతె—మా దారిని మమ్మల్ని పోనిచ్చి, మీ దారిని మీరు హాయిగా పోనైనా పోవాలి," అన్నాడు డ్రైవర్.

"నోరుముయ్- ఎంతకాలం ఇక్కడ ఆగవలసి వచ్చినా ఆగి మీ అంతు...." అని సగం చెప్తూ వుండగానే,

"కర్నల్ వస్తున్నాడు." అని గ్లీడ్ బిడ్‌వర్ధిని మెల్లిగా తట్టి చెప్పాడు.

కర్నల్, షెల్టన్ వచ్చాడు. అడుగులో అడుగు వేస్తూ పెద్ద పెత్తందారులా ఆ బండి చుట్టూ ఒక ప్రదక్షిణం చేశాడు-ఆ బండిమైనాన్ని, అందులో కూర్చున్న ప్రయాణీకులమైనాన్ని, పరీక్షగా

చూశాడు. చార్లటోపీవాణ్ణి చూసి కొంచెం వెనక్కు జంకాడు. టోపీవాడు కళ్ళద్దాలలోంచి పెల్టన్‌ను ఓరకంట చూశాడు.

చేతకానితనంతో సగం చచ్చివున్న తన సిపాయిలను సమీపించి "ఇప్పుడొచ్చిపడ్డ చిక్కేమిటి, సార్జంట్ మేజర్?" అని అడిగాడు.

"అంతా అదే తంతు స్వామీ - కప్పల్లాగా నోరు తెరిచి, అవా మొమో అంటారు. మన రాయబారిగారంటే వీళ్ళకసలు లెక్కేలేదు. ఇంకెవ్వరికీ స్పందన. వాళ్ళు బండిలోంచి బయటకు రాసంటారు-బలవంతాన్న మనం వాళ్ళను బయటకు లాగుదామన్నా లాగలేము - గొలుసులు వేసి కట్టేశారు."

"గొలుసులా? ఎందుకని?"

"అది ఎందుకో అర్థం కావడం లేదు స్వామీ! జైలుకుపోయే జన్మఖైదీలలాగ వాళ్ళను గొలుసులతో కట్టారు."

ఆ మాటలు పూర్తిగా వినకుండానే పెల్టన్ బండి దగ్గరకు వెళ్ళాడు. స్వయంగా అంతా చూసి తిరిగి వచ్చాడు.

"అలాగే అనిపిస్తోందిగాని సార్జంట్ మేజర్ - అయితే వీరు జన్మఖైదీలని నాకు తోచదు," అన్నాడు పెల్టన్.

"కాదంటారా?"

"కాదు." కర్నల్ పెల్టన్ ఒకసారి ప్రయాణికుల వంక చూశాడు. వారి తలపాగాలూ, వేషాలూ అన్నీ పరకాయించి చూశాడు. అందులో ఒక పీచుజుట్టువాడి మెడకు అడుగు వెడల్పుగల చుక్కల చుక్కల బౌలై ఉంది.

"వీళ్ళ వైఖరిచూస్తే, ఎక్కడో ఆటకుపోతూవున్న పగటి వేషగాళ్ళలా ఉన్నారు. అయినా డ్రైవర్‌ను అడిగి చూస్తా." అన్నాడు.

బండి దగ్గర నిలచి, డ్రైవర్‌నుద్దేశించి, "మీరు ఎక్కడికి వెళ్లేదీ దయచేసి చెప్తావా ?" అని వినయంగా అడిగాడు.

"అలానే."

"అయితే చెప్పు – ఎక్కడికి ?"

"ఇదుగో చూడు-నీవూ నేనూ ఒకే భాషేనా మాట్లాడేది ?"

"ఏం ?"

"అభ్యంతరం లేకపోతే చెప్తావా అని అడిగావు – అలానే అన్నాను. అభ్యంతరం లేకపోతే చెప్తాను అని అర్థం – ఇప్పటికయినా తెలిసిందా ?"

"అయితే నీకు అభ్యంతరం ఉన్నదన్నమాట !"

"ఇప్పటికి బుఱ్ఱకెక్కిందిరా అబ్బాయీ !"

"అబ్బాయీ !" బిడ్‌వర్థ్ కోపంతో కంపించిపోయాడు. "నీవు ఎవరితో మాట్లాడుతున్నావో గ్రహించావా ?"

"నీవు ఊరుకో !" కర్నల్ షెల్టన్ వారించాడు. డ్రైవర్ వంక దిగాలుపడి చూస్తూ, "ఇక మీరు వెళ్ళవచ్చు – మిమ్మల్ని ఆపు చేసినందుకు విచారిస్తున్నా." అన్నాడు.

"మరేం ఫరవాలేదు – సమయం వచ్చినప్పుడు దీనికి బదులు తీర్చుకోక పోనులే," అని అతిమర్యాదగా ద్వంద్వార్థం స్ఫురించేటట్టు చెప్పి బండి మీటు నొక్కాడు డ్రైవర్.

సిపాయిలు దారి యిచ్చారు. బండి గ్రుతి పైస్థాయికి పెరిగింది. అతివేగంగా రోడ్డుననుసరించి వెళ్ళిపోయింది, దూరానికి పోయినకొద్దీ చిన్నదై పోతూ.

బిడ్‌వర్డ్ ముఖం ఎఱ్ఱగా కందగడ్డలా అయింది. "వాళ్ళని పాతెయ్యా!" అనుకుంటూ, పోతూవున్న బండి వంక చూస్తూ నిలబడ్డాడు. "మిగతా చోట్లకన్నా ఇక్కడి జనానికి పొగరు బాగా బలిసింది. వీళ్ళని...."

"శాంతించవయ్యా సార్జంట్ మేజర్!" అంటూ సముదాయించాడు పెల్టన్. "నాకు మాత్రం కోపం లేదంటావా? ఉంది. అయినా అణచివేస్తున్నా - లేకపోతే రక్తనాళాలు పేలిపోతాయి. వాట్ని పేల్చివేసుకోడంవల్ల మన సమస్యలు పరిష్కారం కావు."

"అయితే కావచ్చు, కానీ...."

"ఇక్కడంతా ఏదో వింతగా వుంది - దీని కీలకం ఎక్కడో తెలుసుకుంటేనేగాని మన కార్యం ఫలించదు. మన మామూలు పద్ధతులు ఇక్కడ పనికి వచ్చేటట్లు తోచదు. ఇంతవరకూ మన సిపాయిలు చిల్లిగవ్వంతపని చేయలేకపోయారు. కాలం వృథా అయింది. ఇక్కడ అధికారుల్ని కలుసుకోడానికి తిరుగులేని ఉపాయం ఏదన్నా ఆలోచించాలి. సిపాయిలనందర్నీ వెనక్కు మరలించు-సార్జంట్ మేజర్!" అని పెల్టన్ చెప్పాడు.

"చిత్తం!" నమస్కరించి బిడ్‌వర్డ్ వెనక్కు తిరిగి, రకీమని పిలచి, బిలంలాంటి నోరు తెరిచి, "పె—ట్రో—ల్—కుడిపక్కకు మరలండి!" అని అరిచాడు.

ఓడలో అందరూ సమావేశం అయ్యారు. రాత్రంతా చర్చలు జరిగాయి. మరునాడు జాము ప్రొద్దెక్కేటంతవరకూ చర్చలు జరుతూనే ఉన్నాయి. ఈ వాదోపవాదాలు జరుగుతూ వున్నంత అనేక రకాల బండ్లు ఆ రోడ్డుమీద అటూ ఇటూ పోతూనే

అయితే అంత కొండలాగా ఆ ఓడ అక్కడ నిలిచి ఉంటే, పేరుకైనా ఒక్క బండి ఒక్క క్షణంసేపు దాన్ని చూడడానికైనా ఆగలేదు.మాట వరుసకన్నా ఒక్క మనిషి పురుగు, పోనీ నావికులను పలకరిద్దామన్న స్నేహబుద్ధితో ఆ చాయలకు రాలేదు. అసలు వాళ్ళకి ఏదో మానసిక మైన గుడ్డితనం ఉంది. మొగంమీద పెడితేగాని వాళ్ళు ఏ వస్తువునీ చూడలేరు. అప్పుడు కూడా ఏదో కాకి చూపులతో పరీక్ష చేస్తారు దాన్ని.

జాగా ప్రొద్దెక్కింది. రెండు పజన్ల రబ్బరుబంతి చక్రాలమీద ఒక ట్రక్కు వడివడిగా అవైపున పోయింది. దానినిండా ఆడపిల్లలు. రంగుల రంగుల రుమాళ్లు తలలకు చుట్టుకున్నారు.

"ఒక చిన్న ముద్దిచ్చిపోరా ప్రియా," అన్న పాటేదో పాడు తున్నారు. ఓడ మెట్లదగ్గర కునికిపాట్లు పడుతున్న కొంతమంది సిపాయి లకు ఆ అమ్మాయిల్ని, చూడగానే ప్రాణం లేచివచ్చింది. చేతులు ఊపారు. ఈలలు వేశారు. కులాసా అరుపులు అరిచారు. అయితే పం- వారి శ్రమ వృథా అయింది. అమ్మాయిలు ఒక నిమిషమన్నా పాట ఆపకండా సిపాయిల్ని కన్నెత్తైనా చూడకండా, చెయ్యైనా ఊపకండా వెళ్ళిపోయారు.

వారి విరహబాధకు తోడు యిదంతా చూస్తున్న బిడ్ వర్ది వాళ్ళని తిట్టసాగాడు-"కోతి వెధవలందరికీ పనిలేక ఒళ్ళు కొవ్వెక్కి నట్టుంది. ఉండండి-కొవ్వు కరిగేపనులు చెప్తానుండండి!" అని ఒక్కొ క్కరిని కొరకొరా చూసి లోపలికి వెళ్ళిపోయాడు.

అంతరిక్ష పటాలన్నీ తగిలించి ఉన్న గదిలో గుట్టపు డెక్కలా ల్లచుట్టూ, ముఖ్య ఉద్యోగులంతా సభతీర్చారు. పరిస్థితిని 'ఖవితర్కాలు జరిగాయి. అందులో చాలామంది, క్రితం

రాత్రి చెప్పిన మాటలే తిప్పి తిప్పి చెప్పారు—క్రొత్త అభిప్రాయాలేవీ వారి బుద్ధికి తట్టలేదు.

"కాప్టెన్ గ్రేడర్-మూడు వందల సంవత్సరాల క్రితం భూమి మీద నుండి కొంతమంది యీ గ్రహానికి వలస వచ్చిన తరువాత మళ్ళీ క్రొత్తవారెవరూ యిక్కడకు వలసరాలేదని నీవు గట్టిగా చెప్ప గలవా?" అని అడిగాడు రాయబారి.

"గట్టిగా చెప్పగలను, ప్రభూ! అలా క్రొత్తగా ఎవరైనా వస్తే ఆ విషయం దీనిలో తప్పక గుర్తింపబడి వుంటుంది."

"భూలోక నౌకలో వచ్చినట్లైతే, యీ పటములో గుర్తించి ఉందురు. మరో లోకంనుంచి వచ్చిందనుకో నౌక. నాకెందుకో అనుమానముంది. ఎప్పుడో ఎక్కడినించో ఇలాంటి నౌకలు ఈ గ్రహానికి వచ్చి వుంటాయి. అందులో వచ్చినవారికీ వీరికీ పెద్ద జగడం జరిగుండాలి. లేకపోతే - వచ్చినవారంతా బందిపోటులైనా అయి వుండాలి. లేక దొంగవ్యాపారస్థులు వచ్చి వీరిని అమితంగా మోసం చేసి, వీరిసొత్తు అన్యాయంగా అపహరించైనా ఉండాలి—అలా ఏదో జరిగివుంటుందని నాగాఢ విశ్వాసం."

"అలా జరగడానికి ఏమాత్రమూ వీలులేదు మహాప్రభూ! అసలు భూమిమీదనుండి వలస వచ్చినవారి సంఖ్యే స్వల్పం. ఆ స్వల్ప సంఖ్య అంతరిక్షంలోవున్న యిన్నిగ్రహాల్లో కొద్దికొద్దిగా సర్దుకున్నారు. ఈ నాటికికూడా ఒక్క గ్రహంలోనూ చాలినంత జనం కనబడరు. ఇక అభివృద్ధి మాటకొస్తే-జరుగవలసిన దానిలో నూరోవంతు అభివృద్ధి కూడా ఎక్కడా కనబడదు. అలాంటిది—వీరు అంతరిక్ష నౌకలు రూపమాత్రానికైనా నిర్మించలేరు. మూలసూత్రాలు కొందరికి

తెలిసినా వాటి నిర్మాణానికి అవసరమైన సాధన సంపత్తి వాళ్ళకీ అసలులేదు."

"ఔను-నేనూ అదే అనుకుంటున్నా!"

"బ్లేడర్ ఇంజన్ ఓడలన్నీ సౌరమండలములోనే నిర్మాణ మయినయి. భూలోక నౌకలుగా వాటిమీద ముద్రపడుతుంది. అవి ఎక్కడ ఉన్నా తెలుసుకోవచ్చు - ఇవి తప్పితే, ఎనభై య్యో, తొంభై య్యో పురాతనపు రాకెట్ నౌకలున్నాయి. వాటినన్నింటినీ ఎప్సిలాన్ మండలంవారు చాలా చౌకగా కొనివేశారు. వారి మండ లంలో దగ్గర దగ్గరగా వున్న పద్నాల్గు గ్రహాలమధ్యా సామాన్ల రవాణాకని ఆ నౌకల్ని వారు ఉపయోగించుకుంటున్నారు. అలాంటి రాకెట్ నౌక నూరు సంవత్సరాలు ప్రయత్నం చేసినా, ఈ గ్రహాన్ని చేరుకోలేదు—"

"ఔను - చేరుకోలేదు."

"ఇంతదూరం రాగల అనధికార నౌకలు అసలు లేవు." అందు వల్లనే తమంతట తాము యింతింత దూరం ఎవరూ సాహసించి ప్రయాణం చేయరు. ఒక్కొక్క బ్లీడర్ నౌక నిర్మించాలంటే కోట్ల కొద్దీ ధనం కావాలి. అంచేత ఏ బందిపోటైనా ఈ నౌకతో తన దారి సాగించాలంటే ముందతను కుబేరుడు కావాలి!" అని గ్రేడర్ కచ్చి తంగా చెప్పాడు.

"అయితే నేను ముందు చెప్పిందే సిసలైన కారణం—వీరంతా ఒక వింత రకమైన మందబుద్ధులు - దానికి తోడు బయట సంపర్కం లేకపోవడంతో మరింత మొండివాలకంగా తయారయ్యారు—" ఎంతో భారంగా చెప్పాడు రాయబారి.

"నాకూ అలాగనే తోస్తూంది." కర్నల్ పెల్టన్ అందుకున్నాడు. "బండినిండా ఉన్న ప్రయాణీకుల్ని మీరు చూచేవుంటారు. ఒక వెంగళప్ప పాత జోళ్ళు తొడుక్కున్నాడు; ఒక కాలికి తోపుది, ఒక కాలికి పసుపుది. మరొక వెంగళప్ప - గుండు ముఖంవాడు - అడవిపిల్లి చర్మంతో చేసిన చార్లటోపీ తగిలించుకున్నాడు - వాడి చేతిలో తక్కువైంది కొబ్బరాకు బూరా. బహుశా అక్కడికి వెళ్లాక వాడికిస్తారేమో."

"వాడు ఎక్కడికి వెళ్తున్నాడు ?"

"నాకు తెలియదు - మహాప్రభూ! వాళ్ళు చెప్పం పొమ్మన్నారు."

రాయబారి అతన్ని హేళనగా విమర్శించాడు. "ఆహ! ఎంత కొత్త విషయాలు చెప్పి మా జ్ఞానాన్ని పెంపొందించావు! ఎంచేతంటే మనం ఎరగని ఒక వ్యక్తి, మనకి తెలియని ఒక చోటికి పోగానే, మనం ఊహించలేని ఒక ప్రయోజనం కోసం, నిష్ప్రయోజనమైన ఒక వస్తువుని, అతని చేతిలో ఎవరో పెడతారని వినగానే మా మనస్సులు వికసించాయి."

పెల్టన్ యిక మాట్లాడలేదు. ఆ లావాటి మనిషినిగాని, వాడి వెర్రివేషాన్ని అసలు ఎందుకు చూశానా అని మనస్సులో అనుకున్నాడు.

"వీళ్ళకు రాజధాని అంటూ ఒకటి ఉండాలి గదా! ప్రభుత్వోద్యోగులైన వీకొక కార్యాలయం అంటూ ఉండాలా అక్కర్లేదా?" రాయబారి గట్టిగా ఆలోచించాడు. "అదెక్కడుందో తెలుసుకోవాలి. తెలుసుకొని ఆక్రమించాలి. ఆక్రమించి మన ఆధునిక పద్ధతుల్లో మన ప్రభుత్వ విధానాన్ని నెలకొల్పాలి. అంతకుముందు వారి విధానం

ఎలాంటిదైనా దాంతో మనకు పనిలేదు. ఎక్కడైనా సరే-రాజధాని అంటే-రాజ్యానికి తగినట్లుగా వైశాల్యం, మిగతా హంగులూ ఉంటాయి. పైవారు తెలుసుకోలేనంత పేరూ ఊరూ లేనిదిగా ఉండదు గదా మరి. నైసర్గికంగాకూడా మిగతా స్థలాలలోకన్నా రాజధానిలో కొన్ని ప్రత్యేకమైన లక్షణాలు కనబడ్తాయి-విమానంలోంచి చూచినా గాని రాజధాని నగరాన్ని స్పష్టంగా గుర్తించవచ్చు - ఆ రాజధాని ఎక్కడుందో ఇప్పుడు మనం వెతకాలి. నిజానికి ముందుగా మనం తెలుసుకుని తరువాతనే ఓడ నిలుపవలసింది. ఇతర గ్రహాల్లో రాజధాని నగరాల్ని త్వరగానే కనిపెట్టేవాళ్ళం. మరి - ఇక్కడ ఎందుకిలాంటి గందరగోళంలో పడ్డామో నాకు బోధపడడం లేదు."

"మీరే చూడండి. మహాప్రభూ!" అంటూ కాప్టెన్ గ్రేడర్ రెండు ఛాయాచిత్రాల్ని రాయబారి ముందు పెట్టాడు. ఇవిగో-ఈ రెండు అర్ధగోళాలూ మనం దిగడానికి ముందే ఛాయాచిత్రాలు తీశాము. వీటిలో ఎక్కడా పెద్ద నగరమన్నది కనబడలేదు. మిగతా పట్టణాలకన్నా పెద్దదిగాని, మిగతా పట్టణాలకన్నా ప్రత్యేకంగా కనపడేదిగాని మనకేదీ దొరకలేదు.

"ఇలాంటి ఛాయాచిత్రాలంటే - ముఖ్యంగా దూరాన్నుండి తీసిన ఛాయాచిత్రాలంటే - నాకు బొత్తిగా నమ్మకంలేదు. వీటిలో కన్నా, కంటికే బాగా కనబడతాయి. మన దగ్గర నాల్గు ప్రాణరక్షణ నౌకలున్నాయి. వాటిలో వెళ్ళి ఈ గ్రహాన్ని ఆ మూలనుండి ఈ మూలకు చుట్టి రావచ్చు - వాటిలో ఎందుకు వెళ్ళకూడదు?

"ఇలాంటి పనికి కాదు కదండీ వాటిని నిర్మించింది!"

"ఎందుకని చేస్తేనేం?- ఇప్పుడు మనకి ఉపయోగిస్తే సరి." గ్రేడర్ మిక్కిలి ఓర్పుతో బదులు చెప్పాడు.

"అవి అంతరిక్షంలో నలభై వేలమైళ్ళ వేగంతో పోవడానికని నిర్మాణమైనవి. అవన్నీ పాతకాలపు రాకెట్ నౌకలు. అత్యవసర సమయాల్లోనే వాటిని ఉపయోగించాలి. నాల్గువందల మైళ్ళకు మించిన వేగంతో పోతే మనకి గ్రహంమీద ఏమున్నదీ అసలుకనపడదు. వేగం అంతకు తగ్గితే ఆ నౌకలు నేలమీదికి దిగిపోతాయి. ఒకవేళ ఆ వేగంలోనే ఆకాశంలో నడపడానికి ప్రయత్నిస్తే, వాటి గొట్టాలు పూడిపోతాయి, ఇంజన్ల శక్తి తగ్గిపోతుంది, ముప్పాతిక మువ్వీసం నౌక కూలిపోతుంది."

అయితే బ్లీడర్ నౌకలమీద, బ్లీడర్ రక్షణ నౌకలుండాలి."

"నేను ఒప్పుకుంటాను. ప్రభూ–అయితే, బ్లీడర్ నౌకల్లో ఎంత చిన్నదైనా మూడువందల టన్నులకు తక్కువ బరువుండదు. రక్షణ నౌకలు యింత బరువుండకూడదు." అని గ్రేడర్ ఛాయా చిత్రాలను సొరుగులో పెట్టాడు. "ఇప్పట్లో మనకు పనికివచ్చేది పూర్వకాలపు ప్రొపెల్లర్ విమానం–మన నౌకలతో నెమ్మదిగా పోవాలన్నా పోలేం. అలాంటి విమానాలలోనైతే ఎంత నెమ్మదిగా కావాలంటే అంత నెమ్మదిగా పోగలం."

"సైకిల్ వుంటే ఇంకా నెమ్మదిగా పోవచ్చుగా!" ఈ అడ్డు జవాబులతో ఆలోచనపాలుపోక కసురుకొన్నాడు రాయబారి.

"అన్నట్టు మనకొక సైకిల్ వుంది. 10–వ ఇంజనీరు పారిజన్ దగ్గర వుంది," అని గ్రేడర్ చెప్పాడు.

"అతను దాన్ని తనతో తెచ్చాడా?"

"అది ఎప్పుడూ అతనితోనే వుంటుంది. అది దగ్గర లేకపోతే అతనికి నిద్రకూడా పట్టదుట."

"అంతరిక్ష నావికుడు-సైకిల్ మోసుకొని రావడం!" అంటూ జట్టున చీదాడు రాయబారి. "ఆ సైకిల్ మీదెక్కి దాని అపార వేగానికి ముగ్ధుడై పోతాడనుకుంటా! అంతరిక్షంలో రాకెట్ వేగంత దూసుకుపోతున్నట్టు ఉంటుందికాబోలు అతనికి!"

"ఆ సంగతి నాకు తెలియదు ప్రభూ."

"హుం-హారిజన్‌ను రమ్మను. ఒక వెంగళప్పను పట్టడానికి మరొక వెంగళప్పే తగును"

గ్రేడర్ కళ్ళు చికిలించాడు ఫోన్ దగ్గరకు వెళ్ళాడు. "10-ఇంజనీర్ హారిజన్ వెంటనే పైకి, దేశపటాలున్న గదికి రావాలి. అని వర్తమానం పంపాడు.

పదినిమిషాల్లో హారిజన్ వచ్చాడు. ఇంజన్ గదినుండి సుమారు 6 ఫర్లాంగులైనా నడిచి రావాలి. అతను సన్నగా, తీగలాగ వుంటాడు కళ్ళు నల్లటి, కోతికళ్ళు. చేటలంత చెవులూను. గాలివనకాలనుం వీస్తుంటే అతను సైకిలు తొక్కక్కర్లేదు. చెవులే తెరచాపల్లా అతని ముందుకి నెట్టేస్తాయి.

ఒక ఎర్రటి జిరాఫీని జంతుశాస్త్రజ్ఞుడు పరిశీలించినట్లు, రాయ బారి వింతగా హారిజన్‌ను నఖశిఖ పర్యంతం చూచిఅడిగాడు "ఏమోయ్ నీవొక సైకిల్ తెచ్చావుట ?"

హారిజన్ సంకోచిస్తూ బదులు చెప్పాడు. "సైకిల్ తేకూడదని నిబంధన ఏమీ లేదు ప్రభూ - అందువల్ల...."

"నిబంధనలు పీడాపోయిరి." అంటూ రాయబారి చిరాకుగ అన్నాడు. ఇక్కడ మనం ఒకపిచ్చివాళ్ళ వ్యూహంలో చిక్కుకున్నాం దాన్ని ఛేదించడానికి పిచ్చి పిచ్చి ఉపాయాలు ఆలోచించాలి.

"అర్థం అయింది, ప్రభూ!"

"అందువల్ల, నీవిప్పుడొకటి చెయ్యాలి. నీ సైకిల్ తీసుకొని, సరాసరి పట్టణంలోకి వెళ్ళు – అక్కడ ఊరి పెద్దఎవరో—మేయర్, షెరిఫ్, పంచాయితీ అధ్యక్షుడు, లేక మరొకరు–ఎవరైనా సరే వాణ్ణి కలుసుకో. కలుసుకొని, మా తరుఫున వాణ్ణి యీ రాత్రి విందుకు రమ్మని ఆహ్వానించు. వాడితో పాటు, ఊరిపెద్దలన్న వారి నందరినీ తీసుకొని రమ్మని ఆహ్వానించు. వారి వారి భార్యలుకూడా రావచ్చునని చెప్పి వెళ్ళు.

"చిత్తం, ప్రభూ."

"వారికి నచ్చిన దుస్తులే వేసుకోవచ్చు."

పొరపాటుగా విన్నానేమో అన్నట్టు హారిజన్ ఒక చెవినిక్కపొడిచి." దయచేసి మరొక మారు చెప్పండి ప్రభూ!" అని అడిగాడు.

"వారికి నచ్చిన దుస్తులే వేసుకోవచ్చు."

"అర్థం అయింది. ఇప్పుడే వెళ్ళమంటారా ప్రభూ?"

"తక్షణం – త్వరగా తిరిగిరా. వచ్చి ఏ కబురూ చెప్పు."

నమస్కారం చేసి హారిజన్ వెళ్ళిపోయాడు. రాయబారి వాలు కుర్చీమీద వాలాడు. కాళ్ళు జాపుకు కూర్చున్నాడు. ప్రక్కనున్న వారు తెల్లబోయి చూస్తున్నా లక్ష్యపెట్టలేదు.

"ఇంతకన్నా సులభమార్గం వేరేలేదు;" అంటూ ఒక పొడుగాటి చుట్ట తీశాడు. జాగ్రత్తగా దాని కొస కొరికాడు. వాళ్ళ మనస్సులు వశపరుచుకోలేకపోతే, కడుపులు నింపి లొంగదీస్తాం."

కాప్టెన్ గ్రేడర్ నుద్దేశించి, "చూడవయ్యా – మంచి బ్రాందీ సిద్ధం చెయ్యి. మేలిరకం – వెనీషియన్ బ్రాందీలాంటిది – అంత మత్తు

కలిగించేది. కైపు ఎక్కేలాగా తాగించు - ఇక వారు గుట్టు బయట పెట్టక ఏం చేస్తారు? తాగుడు ప్రారంభించారంటే రాత్రంతా వారి నోరు మూయించలేము."

చుట్ట ముట్టించాడు. బాగా దమ్ము పీల్చి పొగ వదిలాడు. "ఎప్పుడూ కూటరాజతంత్రాలు ఫలించడానికి యిదే మార్గం— తృప్తిగా భోజనం పెట్టడం, మత్తుగా తాగించడం తప్ప తాగిన తరువాత ఇక వాళ్ళను ఎలా పడ్తే అలా ఆడించవచ్చు. తమాషా చూద్దురు గాని!"

హారిజన్ సైకిల్ తొక్కుతూ అతివేగంగా ఊళ్ళోకిపోయాడు. ఒక వీధి మధ్యలో ఆగాడు. ఆ వీధి కిరుప్రక్కలా చిన్న చిన్న ఇళ్ళు న్నాయి. ఇంటికి వెనుకముందు చక్కటి పూలతోటలున్నాయి — ఒక లావాటి ఆవిడ ఒక యింట్లో మొక్కలు వరుసగా కత్తిరిస్తూ వుంది. హారిజన్ ఆవిడ దగ్గరకు వెళ్ళి, మర్యాదగా వంగి సలాం చేశాడు. "అమ్మా! దయచేసి ఈ ఊళ్లో అందరిలోకి పెద్దమనిషి ఎవరో చెప్తావూ?" అని ఆమెను అడిగాడు.

ఆవిడ అతని వంక యథాలాపంగా చూచి, పూర్తిగా అటు తిరగకుండానే, కత్తెరతో ఆగ్నేయదిక్కుగా చూపిస్తూ, "జెఫ్ బెయిన్సే అనుమానం లేదు. మొదటి కుడిసందులోకి వెళ్ళి, అక్కడ ఎడమసందు లోకి తిరుగు. అక్కడ ఒక భోజనశాల వుంటుంది."

"ధన్యవాదాలు" అని నమస్కరించి అతను వెళ్ళాడు. ఆవిడ తిరిగి మొక్కలు కత్తిరించే చప్పుడు వెనకపక్క వినపడ్తూనే వుంది. ఆ సందులోకి తిరిగాడు. ఎడమప్రక్కకు తిరిగేలోగా, ఎవరో ముగ్గురు పిల్లలు అతని సైకిల్‌ను చూపిస్తూ వెనకచక్రం తిరిగపోతూ వున్నదని

కేకలు పెట్టి హెచ్చరించారు. అతనికి భోజనశాల కనపడ్డది. సైకిల్‌ను ఒకసారి ఆప్యాయంగా తట్టి, లోపలికి వెళ్ళి జెఫ్‌ను చూచాడు.

చూడవలిసింది చాలా ఉంది. నాల్గు మడతలు పడే గడ్డం, 22 అంగుళాల మెడ, అర్ధగజం ముందుకు వచ్చిన బాన కడుపు. తగు మాత్రపు మనిషి ఎవరైనా అతని పంట్లాము కాలులో డైవింగ్ దుస్తు లతో సహా అవలీలగా దూరిపోవచ్చు. అతని బరువు కనీసం మూడు వందల పౌన్లు వుంటుంది. ఆ ఊళ్ళోకల్లా అతను పెద్దమనిషి అనడానికి సందేహం ఎంతమాత్రమూ లేదు.

హోరిజన్‌నుద్దేశించి "ఏం కావాలి?" అని అడిగాడు జెఫ్ బెయిన్సు. అతని మాట ఎక్కడో బావి అడుగునుండి వచ్చినట్టుంది.

"ఏమీలేదు," అన్నాడు పడవ ఇంజనీర్ హోరిజన్. అక్కడ ఉన్న తినుబండారాలపైన అతని దృష్టిపడింది. అమ్మగా మిగిలినవి. రాత్రి పిల్లికైనా పెట్టకుండా జెఫ్ తినేస్తాడనుకున్నాడు.

"నేను కొందరు ముఖ్యుల కోసం వెతుకుతున్నాను," అన్నాడు హోరిజన్.

"నిజంగా! వాళ్లు నాకు నచ్చరు. అయితే ఎవరి అభిరుచి వాళ్ళది." అంటూ జెఫ్ బెయిన్సు కొంచెం ఆలోచించి, తన లావాటి పెదవిని ఒకసారి విరచి, "డేన్ ఎవెన్యూలో సిడ విల్‌కాక్ అని ఉన్నాడు. ముఖ్యుడంటే అతనేమరి. నాకు తెలిసినంత వరకు అంత పొడిగాటి ముఖం మరెవరికీ లేదు." అన్నాడు.

"అదికాదు నా అభిప్రాయం. నేను వెతుకుతున్నది ఎవరైనా ఉద్యోగిని."

"ఆ మాట ముందుగానే ఎందుకు చెప్పలేదు?" అని జెఫ్ బెయిన్సు తిరిగి ఆలోచించాడు. "అయితే టాడ్ గ్రీవ్ పనికిరావచ్చు. ఈ వీథి కొసన చెప్పులంగడిలో వుంటాడు. అతను అన్నిరకాల యోగాలు సాధనచేశాడు. మంచియోగి;" అని సలహా ఇచ్చాడు.

"మీరు పొరబాటుగా అర్థం చేసుకుంటున్నారు. ఈ ఊరిలో పెద్దతలకాయ ఎవరో తెలుసుకొని, అతన్ని విందుకు పిలుద్దామని చూస్తున్నా" అని హారిజన్ ఎరుకపరచాడు.

జెఫ్ బెయిన్స్ అక్కడ ఉన్న ఒక ఎత్తుపీటమీద కూర్చున్నాడు. లావాటి అతని మొత్త పీటకు నలుమూలలా ఒకడుగు బయటకు పరుచుకుంది. అతను హారిజన్ వేపు వింతగా చూస్తూ "ఇదేదో ఎల క్రిందుగా ఉందే! ఊళ్ళో ఉన్నవారందరి లోనూ ఎవరి తలకాయ పెద్దదో పరిశీలించడంలో నీ జీవితం సగం గడిచి పోతుంది. ఒకవేళ తెలుసుకొని అతన్ని పట్టావే అనుకో, అతని తలకాయ పెద్దదైనంత మాత్రాన అతని మీద ఒక 'మొమో' పారెయ్యడం ఎందుకూ అంటా?" అన్నాడు.

"ఏమన్నావు?"

"పాత మొమో. మనమీదుంటే అది తీర్చడానికి ఒక మొమో పారెయ్యడంలో అర్థముంది, ఔనా, కాదా?"

"అల్లాగా?" అని నోరు వెళ్ళబెట్టాడు. 'మొమో' అంటే ఏమిటో, మొమో వేయడం అంటే ఏమిటో అర్థం కాక తికమక పడ్డాడు హారిజన్.

"అయితే నీకు తెలియదన్న మాట." అని గడ్డం సవరించుకుంటూ అన్నాడు జెయిన్స్. హారిజన్ ధరించిన దుస్తులను చూపుతూ." ఇది మీ పటాలపు యూనిఫారమా? అని అడిగాడు.

"ఔను."

"మంచి, మేలిరకపు సిసలైన యూనిఫారం?"

"ఖచ్చితంగా."

"అదా సంగతి! నీవు ఒంటరిగా రావడంవల్ల నేను మోసపోయ్యాను. మీరంతా కలిసి వస్తే నేను వెంటనే గ్రహించేవాణ్ణి – అంతా ఒకేరకపు దుస్తులు ధరిస్తే – దాన్ని యూనిఫారమ్ అంటారు ఏదో- యూనిఫారమ్ అంటే ఒకే రకం అని అర్థం – ఔనా?"

"కాబోలు" అన్నాడు హారిజన్. నిజానికి యీ విషయాన్ని గురించి అతను ఎప్పుడూ ఆలోచించలేదు.

"అయితే నీవు ఆ ఓడనుండి దిగావన్నమాట–నిన్ను చూడగానే గ్రహించి ఉండేవాణ్ణి కాని, ఇవాళ బుర్ర ఎందుకో మందకొడిగా వుంది. అయితే, ఒక్కడవే వచ్చి అలాంటి బండి తొక్కుతూ ఊళ్ళో తిరుగుతావని నే నెలా అనుకుంటాను? చూశావా, పొరబాటు ఎంత వాళ్ళకైనా తప్పదు."

"ఔను" అంటూ హారిజన్ తన సైకిల్ నిలబెట్టిన వేపు చూశాడు. ఎవరైనా తను మాటల సందడిలో ఉండడం చూచి తీసుకుపోలేదు గదా అని. అది తను ఎక్కడ పెట్టాడో అక్కడే వుంది..

"ఇక చెప్పు మరి – నీవు యిక్కడకు వచ్చిన పనేమిటో!" అని ప్రశ్నించాడు జెయిన్స్.

"అదే నేను ఇంతసేపూ చెప్పడాన్కి ప్రయత్నిస్తూ వున్నది. నన్నిక్కడకు పంపింది ఎందుకంటే—"

"పంపించారా?" అంటూ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేశాడు బెయిన్సు.

"నిజంగా ఒకరు నిన్ను పంపించడానికి నీవు ఒప్పుకుంటావా?"

"ఏం? ఎందుకొప్పుకోను?"

"ఆహా ఇప్పుడర్థమైంది. నీమాటల తీరు నాకు కొత్తగా వుందిలే. మరొకరిమీద నీవు ఒక 'మొమో' వేశావన్నమాట-అంతేనా నీవు చెప్పేది?"

హరిజన్‌కు యీ సంభాషణ బొత్తిగా బోధపడలేదు. దిక్కు తోచక "మొమో, అంటే ఏమిటి?" అని అడిగాడు.

"ఇతనికి తెలియదన్నమాట—" బెయిన్సు సాలోచనగా ఇంటి కప్పును చూశాడు. "ఇతనికి యిది కూడా తెలియదన్నమాట," అని ఒకసారి నిట్టూర్చి, "నీ కేమైనా ఆకలి వేస్తున్నదా?" అని అడిగాడు.

"కొద్దిగా వేస్తూ వుంది."

"అయితే సరి. 'మొమో' అంటే ఏమిటో ఇప్పుడు చెప్తా - కాదు, చేసి చూపుతా" అంటూ పీటదిగి, వెనుకవక్క తలుపు దగ్గరకు తనబరువైన కాయాన్ని యీడ్చుకుంటూ నడుస్తూ, "ఎందుకింత ఓపికతో ఒక సిపాయికి ఈ విషయాలన్నీ బోధపరుస్తున్నానో తెలుసా? కూర్చొని కూర్చొని విసుగ్గా వుంద. రా, నాతో రా," అని హరిజన్‌ను పిలిచాడు.

విధేయతతో హారిజన్ బెయిన్సు వెనుక నడిచాడు. మధ్యలో ఒకసారి ఆగి తన సైకిల్ వంక చూసుకున్నాడు. నడవ దాటి దొడ్లో ప్రవేశించాడు. బెయిన్సు అతనికి అక్కడ పేర్చివున్న పెట్టెలను చూపి, "ఆ పెట్టెలు విప్పి, వాటిలోవున్న డబ్బాలను ఆ పక్కనవున్న సరుకుల కొట్లో పేర్చు. ఖాళీ పెట్టెల్ని దొడ్లోనే పేర్చు. అలా చేయడం నీకు యిష్టమైతేనే చెయ్యి. స్వేచ్ఛ అంటే అదే–ఏమంటావ్ ?" అని చెప్పి అతను ఆయాసపడ్తూ తిరిగి షాపులోకి వెళ్లాడు.

బెయిన్సు వెళ్లాక హారిజన్ కొంచంసేపు తల గోక్కుంటూ ఆలోచనలో పడ్డాడు. ఇందులో ఏదో కిటుకు ఉన్నదని ఊహించాడు. హారిజన్ అన్న ఒకానొక వ్యక్తికి, ఎవరో కచ్చితంగా తాటాకులు కట్టడానికి ప్రయత్నిస్తున్నట్టుంది – ఆ సందర్భం చూస్తే – పోనీ ఆ కిటుకు ప్రయోగించినవాడికి లాభసాటిగా ఉంటే, అది నేర్చుకుని మనం మరో చోట ప్రయోగించవచ్చు. చొరవ లేకుంటే ఫలం సిద్ధించదని నిశ్చయించుకున్నాడు హారిజన్. వెంటనే పెట్టెల్ని దింపి, డబ్బాలు తీసి, బెయిన్సు చెప్పినట్టు అన్నీ పేర్చాడు. త్వరత్వరగా చేస్తే, ఆ పని ఒక ఇరవై నిమిషాల్లో పూర్తి అయింది. అప్పుడు తను తిరిగి బెయిన్సు దగ్గరకు వెళ్లాడు.

"చూడు. ఇప్పుడు నీవు నా కొరకు కష్టపడ్డావు. ఒక పని చేశావు. అంటే, నీవు ఒక 'మొమో' నాపైన వేశావన్నమాట – అందుకుగాను నేను నీకు ధన్యవాదాలు చెప్పను. అలా చెప్పడం అనవసరం. నేను చేయవలసిందంతా – ఎలాగైనా 'మొమో'ను తీర్చివేయాలి," అని వివరించాడు బెయిన్సు.

"మొమో అంటే—"

"మొగమోటం! మాటిమాటికి అంత పొడుగాటి మాటను ఉచ్ఛరించకుండా దాన్ని పొట్టిజేసి మొ మా అంటుంటాము. ఇప్పుడు నా పైన ఉన్న మొమోను యిలా తిప్పివేస్తాను. ఆ అవతలపక్క యింట్లో ఉన్న సేట్‌ వార్బర్టన్ ఉన్నాడే. వాడిపైన నావి ఒక ఆరు మొమోలున్నాయి. ఇప్పుడు నిన్ను వాడి దగ్గరకు భోజనానిక్కి పంపిస్తా. ఈ విధంగా నీవు నామీద వేసిన మొహమాటాన్ని, అంటే మొమోను తీర్చుకుంటా. వాడు నీకు భోజనంపెట్టి, నా ఆరు మొమోలలోనూ ఒకటి వదిలించుకుంటాడు," అంటూ బెయిన్సు ఒక చిన్న కాగితం మీద ఒక ముక్క వ్రాసి, "ఇది వాడికియ్యి." అని హారిజన్ చేతిలో పెట్టాడు.

హారిజన్ ఆ చీటీని చదివాడు. మామూలు ధోరణిలో ఆ వ్రాత యిలా వుంది- "ఈ మట్టిబుర్రకి తిండి పెట్టు- జెఫ్ బెయిన్సు" దిక్కుతోచని వానివలె అతను బయటకు నడిచి, సైకిల్ దగ్గర ఆగి తిరిగి ఆ చీటీని చదివాడు. మట్టిబుర్ర అని ఉంది దీనిమీద. ఇలాంటి మాటకు మండిపడేవారు ఓడలో ఉన్న సిపాయిల్లో ఎంతమందో హారిజన్ మనస్సులో మెదిలారు. అంతలోనే అతని దృష్టి ఆ సమీపంలోనే ఉన్న మిఠాయి అంగడిమీదకు పోయింది. అద్దాల అరలోనుండి తినుబండారాలు నిండుగా కనబడ్తూ వున్నాయి. "సేట్ భోజనశాల" అని పైన పెద్దఅక్షరాలతో వ్రాసివుంది.

కడుపులో బాగా ఆకలివేయడంతో హోటలుకు వెళ్దామని నిశ్చయించుకున్నాడు హారిజన్. ఆ చీటిని భద్రంగా పెద్దల అస్తికల్లాగ పట్టుకొని హోటల్లో ప్రవేశించాడు. లోపల వరసగా ఉపాహారాలు పేర్చి ఉన్నాయి. వేడివేడిగా ఆవిర్లు చిమ్ముతున్నాయి. పళ్లాలు గలగల మోగుతున్నాయి. ఒక చలువరాతి బల్లదగ్గర పిల్లికళ్ళ యువతి

ఒకతె కూర్చుని ఉంది. హారిజన్ అక్కడ కూర్చుందామని వెళ్ళాడు. కుర్చీ లాక్కొని కూర్చుంటూ, "నీకు అభ్యంతరం లేదుగదా?" అని మర్యాదకని అన్నాడు. అందుకా అమ్మాయి, "అభ్యంతరమా!" అంటూ అతని చెవులవంక అదేపనిగా చూసింది. "అభ్యంతరమా— దేనికి అభ్యంతరం?-పిల్లలకా, కుక్కలకా, ముసలి చుట్టాలకా, వానలో వెళ్ళడానికా?" అని ప్రశ్నించింది.

"అబ్బే-నే నిక్కడ కూర్చుంటే నీకు అభ్యంతరమా అని అడిగాను అంతే."

"నా అభ్యంతరాలు నావి. నీకేం సంబంధం? ఇష్టం లేకపోతే నేను లేచిపోతాను. స్వేచ్ఛంటే అదేగదా."

"అదేలే!" అని తొట్రుపాటుతో కుర్చీలో కదిలాడు-తొందర పడి చదరంగపు ఎత్తువేసి, ఒక బంటుని పోగొట్టుకున్నట్లనిపించింది. మళ్ళీ మాటలు ఎలా ప్రారంభిద్దామా అని యోచిస్తూ చుట్టూ కలయ జూశాడు. తెల్లకోటు వేసుకొన్న ఒక బక్కపలచటి మనిషి ఒక పలపాఠరపు పళ్ళెం నిండుగా వేయించిన కోడి మాంసం, మూడు రకాల కొత్తకూరలు పేర్చి హారిజన్ ముందు పెట్టాడు. వాటిని చూడగానే హారిజన్‌కు మతిపోయింది. కోడిపేపుడు కళ్ళారా చూసి ఎన్ని సంవత్సరాలైందో అతనికి జ్ఞాపకం కూడా లేదు. పాడిచేసిన కాయగూరలు తప్ప, తాజాకూరలు చూసికూడా ఎన్నో నెలలైంది. అన్నీ ఒకేసారి అతని కండ్లకు కనబడగానే విభ్రాంతుడై చూడసాగాడు. వడ్డించే కుట్టువాడు హారిజన్ చూపుచూసి ఆ తినుబండారాలు అతనికి నచ్చవేమో అనుకొని "ఏం—ఇవి నీకు రుచించవా?" అని ప్రశ్నించాడు.

"రుచించ కేం? భేషుగ్గా రుచిస్తాయి," అంటూ హారిజన్ చీటిని ఆ కుఱ్ఱవాని కందించాడు. వాడు దాన్ని చదివి, అటు చివర ఫల హారాల పొగల్లో నిలబడ్డ ఒకని నుద్దేశించి. "జెఫ్ మెమో ఒకటి తీరి పోయింది,'' అని ఆ చీటీని సన్న ముక్కలుగా చించాడు. అక్కడ కూచున్న అమ్మాయంది," చాలా చురుగ్గా చేసేశావు. అతను నీకు భోజనం పెట్టాడు. దానికి బదులు నీవు ఆ చీటీ ఇచ్చావు. ఆసనికీ నీకూ చెల్లు. నా మెమోలు తీర్చుకోడాన్కి నేను పళ్ళాలు కడగాలి. లేదంటే, సేట్ ఎవరికైనా ఋణపడి వుంటే దాన్ని నా మీదకు విలియా వేసుకోవాలి."

"సామాన్ల కొట్టులో పళ్ళాలు సర్దానులే," అంటూ హారిజన్ కత్తి, చంచా అందుకున్నాడు. అతని నోరు తెగవూరింది" ఓడమీద కత్తులు, చంచాలూ, ఏమిలేవు-పొళ్లు మిక్కడాన్కి, మాత్రలు మింగ డాన్కి, యిలాంటి పనిముట్లు అనవసరం.

"ఇక్కడ ఏది కావాలో దాన్ని అడగవచ్చా. లేక మీ కేమిపెడ్తే అది తినితీరాలా ?'' అని హారిజన్ అడిగాడు.

"సేట్ మీద నీ మెమో ఉంటే అడగొచ్చు," అందా అమ్మాయి. అప్పుడు అతను నిన్ను తృప్తిపరిస్తేగాని ఆ మెమో తీరదు. రాగానే నీమెమో అతని మీదికి బదలాయించ వలిసింది. ఇప్పుడు విచారిస్తే ఏం లాభం ?'' అని ఆ అమ్మాయి బదులు చెప్పింది.

"అబ్బే నేను విచారించడం లేదే."

"అది నీ హక్కు-స్వేచ్ఛ అంటే అదేగా మరి!" అని ఆవిడకొంచెం ఆలోచించి తిరిగి మాట్లాడింది," సేట్పైన ముందుగా మెమో వేయ

డం నా వల్ల కావడం లేదు. ఒకవేళ ఎప్పుడైనా వేశానా, "మంచులో దాచిన అనాసపండు తీసుకురా," అని ఒక పొలికేక పెట్టాను. అతను పరుగెత్తుకొచ్చి అందిస్తాడు. అతని మొహం నామీద ఉన్నప్పుడు అతని ఆజ్ఞప్రకారం నేను పరుగులెత్తాలి. అలా అంటూ అతనివంక చూసింది ఆ పిల్లకు ఏదో సందేహంతోచినట్టు ముఖంచిట్లించి, "అలానిర్ఘాంత పోయిచూస్తావేం? ఇదంతా నీకు కొత్తగా ఉందా? ఈ వూరికి నీవు కొత్తగా వచ్చావా?" అని అడిగింది.

హరిజన్ నోటినిండా కోడికూర ఉండడం చేత బదులు మాట్లాడ లేక 'ఔ' నన్నట్లు తల వూపాడు. నోటిలో ముద్ద మింగి "ఆ అంత రిక్షు లోకనుండి వచ్చాను," అన్నాడు.

"అదా సంగతి!" అని కొంచెం ముడుచుకు పోయింది. గాంధీ వ్యాతిరేకి వన్నమాట! నేననుకో లేదు సుమా. చూస్తే మనిషిలాగే ఉన్నావు మరి.

అందుకు నేను ఎల్లప్పుడూ గర్విస్తూ ఉంటా,"అన్నాడు హరిజన్. కడుపు నిండిన కొద్దీ అతని బుద్ధి చురుగ్గా పనిచేయ నారంభించింది. ముద్దమీద ముద్ద నలుముతూ మింగుతూ అతను చుట్టూ చూశాడు. తెల్ల కోటు ు డుకున్న వడ్డనవాడు వచ్చి అతని కెదురుగా నిలిచాడు.

"తాగడానికి ఏముంది?" అన్నాడు హరిజన్.

"డిత్, ఘాటైన డిత్, పెమాక్, కాఫీ....."

"మంచి చిక్కటి కాఫీ తీసుకురా."

"పెమాక్ బాగుంటుంది" అని సలహా యిచ్చింది ఆ పిల్ల, వడ్డనవాణ్ణి వెళ్ళనిచ్చి - "అయినా, నే నెందుకు చెప్పాలి" అని సర్దుకుంది.

ఒక పైంటు పాత్రలో కాఫీ తెచ్చి బల్లమీద పెట్టాడు వడ్డన కుర్రవాడు. పైగా చెప్పాడు, "సేత్ తీర్చుకోవలసిన మొమో గనుక నీ యిష్టం వచ్చినవన్నీ అడిగి తినవచ్చు. కాఫీ తాగాక ఏం కావాలో చెప్పు – హల్వా, పాయసం, కీరు, పండ్లు – ఏం తెమ్మంటావు?"

"మంచులో దాచిన అనాసపండు."

"అహా" అంటూ హారిజన్ వంక చూసి రెప్పలార్చాడు. "ఇదంతా నీ గుర్రాలానే" అన్నట్టు ఆ పిల్లవంక నిందాపూర్వకంగా చూసి, అనాసపండు తెచ్చి హారిజన్ ముందు పెట్టాడు.

హారిజన్ దాన్ని ఆ పిల్లవైపుకు తోసి, "తృప్తిగా తిను" అన్నాడు.

"అది నీది."

"నా కడుపులో ఏమాత్రం ఖాళీలేదు," అంటూ హారిజన్ తిరిగి కోడికూర తిని, కాఫీ కలిపాడు తీరిగ్గా సేద దీర్చుకుంటూ.

"కడుపు పట్టినంత తిన్నా – ఇక తినలేను" అంటూ ఆ పిల్లకు సైగ చేశాడు.

"ఊరుకున్నావేం – తిను. లావెక్కుతావని భయపడకు. బాగా తిను" అని హెచ్చరించాడు.

"నాకొద్దు——" అంటూ ఆ పళ్ళాన్ని తిరిగి అతని వంకకు పెట్టింది. "నేను దీన్ని తిన్నానంటే ఒక మొమో బరువు నామీద పడుతుంది."

"అయితే ఏం?"

"కొత్త వాళ్ళని నామీద మొమోలు పారెయ్యనివ్వను."

"నిజమే-అలా ఉండడమే మంచిది," అని సమర్థించాడు హారిజన్, కొత్తవాళ్ళ అభిప్రాయాలు కూడా కొత్తగానే వుంటాయి."

"నీవైతే చాలా దేశాలు తిరిగావనుకో, అయినా అభిప్రాయాల్లో కొత్తదనం ఏముంటుందో నా కర్థం కాదు.

"నీకు పళ్ళాలు కడిగేపనా ?"

"ఔను - అయితే ?"

పళ్ళాలు కడిగే వారంతా నిరాశా వాదులు," అంటూ అనాస పండును తిరిగి ఆమె వంకకు తోశాడు హారిజన్.

"నేను నీ మీద 'మొమో' పారేస్తానని నీకు భయం అక్కర్లేదు. దాన్ని వెంటనే అతిసులభంగా చెల్లించెయ్యొచ్చు. నీవు నాకొక చిన్న సమాచారం చెప్పు. ఈ ప్రాంతానికి పెద్ద కోడి నాక్కావాలి.

"అదేముంది. పదవ వీథి మధ్యలో ఎలెక్ పీటర్సు అని ఒకడుంటాడు. అక్కడికి వెళ్ళు.

"ధన్యవాదాలు. ఇక్కడి వాళ్ళలో కాస్త బుర్ర ఉన్నవాళ్ళు అసలు లేరేమోనని అనుమానం కలిగిందిలే."

హారిజన్ భోజనం ముగించాడు. స్థిమితంగా కాళ్ళు జాపుకు కూర్చున్నాడు. తినక తినక తిన్న విందు భోజనంవల్ల అతనిబుద్ధి చురుకైంది. కొంచం సేపటికల్లా ఏదో సందేహం కలిగి అతని ముఖం వివర్ణమైంది. ఆపిల్ల నుద్దేశించి,

"పీటర్సు కోళ్ళవ్యాపారస్థుడా ఏమిటి కొంపదీసి?" అని ప్రశ్నించాడు.

"కాదామరి ?" అని, అనాసపండు తిని తృప్తిగా సంతోషంగా ఖాళీ పళ్ళాన్ని అవతలకు నెట్టింది అమ్మాయి.

హారిజన్ ఒకసారి నిస్పృహతో మూల్గి "ఈ ఊరి మేయర్ ఎక్కడ?" అన్నాడు.

"మేయరంటే ?"

"మొదటి పౌరుడు, అందరికీ పెద్ద, లేక షెరిఫ్. లేక పంచాయితీ అధ్యక్షుడు - ఎవరైనా సరే - మీ ఊరివారు అతన్ని ఎలా పిలుస్తారో-"

"నీ మాటలు నాకు బొత్తిగా బోధపడడంలేదు," నిజంగానే ఆ అమ్మాయికి హారిజన్ మాటలు ఏమీ అంతుపట్టలేదు.

"ఈ ఊరిని పరిపాలించేవాడు-అందరికీ నాయకుడు." అని మళ్ళీ వివరించాడు హారిజన్. "నాయకుడు, మార్గదర్శి, నడిపేవాడు."

ఎలాగైనా హారిజన్ అడిగిన సమాచారం చెప్పాలని ఆ అమ్మాయి తంటాలుపడుతు "ఇంకొంచెం వివరించి చెప్పు-ఈ పెద్దమనిషి ఎవరిని నడపాలి?" అని అడిగింది.

"నిన్ను, నేను-యిక్కడ వున్న యావన్మందినీ" అంటూ చేతితో అక్కడ ఉన్నవాళ్ళందరినీ ఒకేమారు చూపాడు హారిజన్.

ఆ అమ్మాయి ముఖం చిట్లించి, ఆశ్చర్యంతో అడిగింది— "మమ్మల్ని నడపాలా? ఎక్కడికి?"

"మీరెక్కడికి పోదలుచుకుంటే అక్కడికి."

ఇక ఆ అమ్మాయివల్ల కాలేదు - తెల్లకోటు వేసుకున్న వడ్డన కుఱ్ఱవాడ్ని అదేదో వినమని పిలిచింది.

"ఇదిగో నోయ్-మనం ఎక్కడికైనా వెళ్తున్నామా?" అని అతన్ని అడిగింది.

"ఏమో నాకేం తెలుసు?"

"అయితే సేత్‌ను కనుక్కో."

ఆ కుఱ్ఱవాడు సేత్‌ను అడిగి తిరిగి వచ్చాడు.

"సేత్ ఆరుగంటలకు యింటికి వెళ్తాడట. అయినా నీకెందు [illegible]న్నాడు."

"అతన్ని ఎవరైనా నడిపిస్తున్నారా?"

"అతితెలివి చాలించు-అతనికి దారి బాగా తెలుసు-ఒళ్ళు మరచి తాగనూ లేదు."

ఈ సంభాషణ వింటూవున్న హారిజన్ మాటల ఆమె కడ్డం వచ్చి, 'మీరెందుకింత కిందా మీదా పడుతున్నారో నాకు తెలియడం లేదు. [illegible]వరైనా ఉద్యోగిని-ఏ ఉద్యోగినైనా సరే, నే నెక్కడ కలుసుకో[illegible]లనో చెప్పమంటున్నా-అంతే-పోలీసు ప్రధానిగాని, కోశాధికారిగాని, న్యాయాధికారిగాని-కనీసం కాటికాపరిగాని-ఎవరైనా సరే [illegible]క ప్రభుత్వోద్యోగి-"అని తనకు చేతనైనంత విపులంగా చెప్పాడు.

ఆ కుఱ్ఱవాడికి యీ మాటలు బొత్తిగా బోధపడలేదు— 'ఉద్యోగా-ఉద్యోగి అంటే ఏమిటి?" అని హారిజన్‌ను ఎదురు ప్రశ్న వేశాడు.

"న్యాయాధికారి అంటే ఏమిటి?" అన్నది ఆ పిల్ల.

ఏ విధంగా తెలియజెప్పాలో హారిజన్‌కు పాలుపోలేదు. [illegible]ంచెం ఆలోచించి అడిగాడు- "ఈయిల్లు నిప్పంటుకొన్నదనుకోండి. [illegible]మి చేస్తారు?"

"ఏం చేస్తామా-మంట ఆరిపోకుండా విసురుతాం. తెలిసిందా?" [illegible]ంటూ, రుసరుసలాడాడు ఆ కుఱ్ఱవాడు. ఇల్లాంటి మతిలేనివాళ్ళతో

మాటల్లోపడి కాలం వృథా పుచ్చడం తనకేమాత్రమూ నచ్చలేదని-సూచిస్తూ వెళ్ళిపోయాడు.

"నిప్పు ఆర్పేస్తాడు." అన్నది ఆ అమ్మాయి. "చల్లార్చక పేరే ఏమిచేస్తాడని నీ అభిప్రాయం?"

"ఆర్పడం అతనివల్ల కాలేదనుకో—"

"సహాయాన్కి వేరెవరినైనా రమ్మంటాడు."

"మరి వాళ్ళు సహాయం చేస్తారా?"

"తప్పకుండా," అని హారిజన్ వంక జాలిగా చూసింది. "అలాటి అవకాశం చిక్కాలేగాని, వాళ్ళు వదలిపెడతారా? మంట లార్పేసి సేత్ మీద మంచి ఘాటైన మెమోలు పారేస్తారు."

"అది నిజమే!" అంటూ హారిజన్ కొంచం ఆగాడు. మళ్ళీ ఏం ప్రశ్న వెయ్యాలా అని ఆలోచించి, "ఒకవేళ మంటలు చాలా పెద్దవై, ఆలా దారినపోయేవాళ్ళకు ఆర్ప స్వాధీనం కాకపోతే—" అని మళ్ళీ అడిగాడు.

"సేత వెంటనే అగ్నిమాపకదళానికి కబురు చేస్తాడు."

దీనితో హారిజన్‌కు ఆను చిక్కింది అన్న ఆశ కలిగింది. "ఆ - అదే. అయితే ఇక్కడ అగ్నిమాపకదళం ఉన్నదన్నమాట—ఉద్యోగులు అంటే అలాటివారే. త్వరగా చెప్పు—వారు ఎక్కడ వుంటారో?"

"12-వ వీథి చివర—కనుక్కోడం చాలా సులభం."

"ధన్యవాదాలు" అంటూ వెంటనే లేచి, హారిజన్ సైకిల్ తొక్కుతూ త్వరత్వరగా వెళ్లాడు.

అది పెద్ద డిపో. అక్కడ నాల్గు పెద్ద నిచ్చెనలున్నాయి. ఎత్తైన రిజర్ వాయిర్ - రెండు పంపులు - అన్నీ అక్కడ పద్ధతి ప్రకారం

గుండ్రటి రబ్బరు బంతి చక్రాలమీద అమర్చి ఉన్నాయి. లోపలికి వెళ్లాడు హారిజన్.

విశాలమైన నిక్కరూ, చొక్కా తొడుక్కున్న ఒక పొట్టివాడు అతనికి ఎదురై "ఎవరు కావాలి?" అన్నాడు.

"ప్రధానాధికారి."

"అంటే ఎవరు?"

హారిజన్‌కు యిలాంటి ప్రశ్నలు యింపాటికే బాగా అలవాటయి నాయి. ఒక చిన్న పిల్లవానికి బోధపరిచే విధంగా హారిజన్ బదులు చెప్పాడు. "అబ్బాయీ! ఇలా విను - ఇది అగ్నిమాపకదళ కార్యా లయం. ఇక్కడ కాగితాలమీద సంతకాలు పెట్టి, ఎవరు ఏ పని చేయా లన్నది నిర్ణయించి, ఆజ్ఞలిచ్చేవాడు ఒకరుండాలి గదా! జీతాలు పెంచ వలసినప్పుడు పెంచి, పని ఎగకొట్టేవారిని మందలించి, జరిగిన పొర పాట్లకు బాధ్యత క్రిందవారికి పంచి, మెప్పూ గౌరవం మాత్రం తన సొంతం చేసుకునే ఆసామీ ఒకడుండాలిగా! నేను అతన్ని చూడడాన్కి వచ్చానోయి! అంటూ ఆ పొట్టివాని చాతీమీద వేలితో తాకుతూ వివ రించాడు హారిజన్.

"ఇక్కడ ఒకరు పెద్ద, మరొకరు చిన్న అని ఎందుకుంటుంది? అంతా సమానమేగా! నీకేదో మతిపోయినట్టుంది...." అన్నాడు పొట్టివాడు.

"నీవేమైనా అనుకో-కానీ, నే చెప్పేదేమంటే...." హారిజన్ మాట పూర్తి కాకముందే, గణగణ ఒక గంట మోగింది. క్షణం గారడీ లోవలె ఇరవై మంది అమాంతంగా ఒక అగ్నిమాపక యంత్రం మీదికి దూకి రయ్‌మని వెళ్ళిపోయారు.

మూకుళ్ళవంటి ఇనుప టోపీలు తప్ప యింక వారి దుస్తుల్లో సామ్యం ఏమీలేదు. దుస్తుల్లో ఎన్ని రకాలుండడానికి వీలుందో అన్ని రకాలూ వాళ్ళు ధరించారు. పొట్టివాడు సాహసించి ఒక పంపు చేత పుచ్చుకుని ఇంజన్ పైకి దూకాడు.

పంచరంగుల అంగరఖా తొడుక్కున్న ఒక లావాటి మనిషికీ, పసుపురంగు ధరించిన సన్నటి ఆసామీకి మధ్య కాలూదుకుందామని ప్రయత్నించి విఫలుడయ్యాడు. వాళ్ళతన్ని తోసేశారు. చెవుల జూకాలు ఊగుతుంటే మరో మనిషి వెనకాలే పరుగెత్తి పంపును పట్ట బోయాడు. కాని అతనికందకుండా సాగిపోయింది అగ్నిమాపక యంత్రం. నిస్పృహతో ఇనప టోపీ చేతులో తిప్పుతూ తెల్లబోయి చూస్తున్న హారిజన్‌తో అన్నాడు.

"నా దురదృష్టం-ఇలాంటి సదవకాశం ఈ సంవత్సరం ప్రారంభ మయ్యాక యిదే మొదటిసారిగా కలిగింది. ఒక పెద్ద సారా దుకాణం అంటుకుంది. వాళ్ళు ఎంత త్వరగా అక్కడికి వెళ్ళగలిగితే, అన్ని మంచి మొమోలు వేయడాన్కి వీలవుతుంది." అలా చెప్తూ ఒకసారి నోరు చప్పరించుకొని, ఒక హోస్‌పైన కూర్చొని "కానీలే, ఇదీ నా మంచికేనేమో!" అని మనసు సరిపెట్టుకొన్నాడు.

"హారిజన్ అతన్ని అడిగాడు - మీకు జీవనోపాధి ఏమిటి?"

"అదేమిటి అలా అడుగుతావు! కనపడడం లేదూ? నేనీ అగ్నిమాపక దళంలో వున్నానని!"

"అది సరే - మీకు జీతం ఎవరిస్తారు?"

"జీతమా!"

"దీనికంతా డబ్బు ఎవరిస్తారు?"

"నీవేదో వింత మాటలు చెప్తున్నావు. డబ్బేమిటి, డబ్బు?"

హారిజన్ కొంచెం సేపు బుఱ్ఱగోక్కున్నాడు. "డబ్బేమిటి అని అడుగుతాడేం?" అనుకొని యింకో విధంగా ప్రశ్నించాడు.

"మీ ఆవిడకు ఒక కోత్తకోటు కావాలనుకో - అది ఎలా వస్తుంది?"

"అగ్ని ప్రమాదపు మొమోలుపై బట్ట అంగడికి వెళ్తుంది. అక్కడ ఒకటి రెండు మొమోలకు బదులు ఒక కోటు తీసుకుంటుంది."

"ఒక వేళ ఏగుడ్డ లంగడికీ ఎప్పుడూ నిప్పంటుకో లేదనుకో!"

"నీవు కొత్తిగా అజ్ఞానివిగా కనపడ్తున్నావేమయ్యా?" ఏలోకం నుండి దిగావేం?" అన్నాడు. అంటూ వుంటే అతని జూకాలల్లల్లాడాయి. కొంచం సేపు హారిజన్ వంక చూసి," ప్రతి దుకాణానికి ఎప్పుడో ఒకప్పుడు అగ్ని ప్రమాదం కలిగే వుంటుంది. అంగడివారికి తెలివివుంటే, నెలకిన్ని 'మొమో' లని అగ్ని భీమాచేస్తారు, ఆవిధంగా కొన్ని మొమోలు మా మీద ఏస్తారన్నమాట. ప్రమాదం కలిగినప్పుడు మేము పనిచేయడంతో అవి తీరిపోగా మరికొన్ని మొమోలు అంగడి వారిపైన వేస్తాం - భీమా పద్ధతి వల్ల అంగడి వారు ఒక్కమారుగా ఋణగ్రస్తులు కాకుండా, కాపుదల ఇప్పుడైనా నీకు అర్థమైందా?"

"అవుతూంది - కానీ - "

"ఓహో అదా సంగతి! నీవా అంతరిక్ష నౌకనుండి వచ్చావా? నీవు గాంధీ వ్యతిరేకివి!"

"నేను భూమీయుణ్ణి," హారిజన్ సగర్వంగా అన్నాడు. "ఈ గ్రహానికి మొదట్లో వలసవచ్చిన వారంతా కూడా భూమీయులేగా!"

"నాకు చరిత్ర నేర్పాలనుకుంటున్నావా ?" అని అతను కొంచెం చీదరింపుగా అన్నాడు.

"నీది పొరపాటు నూటికి ఐదువంతులు అంగారక గ్రహం నుండి దిగిన వారు."

"అంగారక గ్రహాన్ని కూడా మొదట్లో భూమీయులే గదా కలస వెళ్ళింది?"

"అయితే మాత్రం. అది ఎప్పుడో పయుగంలోనో. ఈ మధ్య కాలంలో ఎన్ని మార్పులైనా కలుగవచ్చు - నీ వెరుగవేమో విను ఇక్కడ అంగారక వాసులు లేరు. భూమీయులు లేరు. ఆనౌకలో వున్న మీ గుంపుదప్ప. పిలవని పేరంటానికి మీరువచ్చారు. మేమంతా గాంధేయులం-ఇలా ఆక్రమణకు వచ్చే మీలాంట్లు గాంధీ వ్యతిరేకులు"

"మేము దేనికి వ్యతిరేకులం కాము. నీకా అభిప్రాయం ఎలా కలిగింది ?"

"అవాంతమేమో." అంటూ• ఇక మాట్లాడడం ఇష్టం లేదన్నట్లు టోపీని ఒక వంకకు విసిరికొట్టి నేలమీద ఉమ్మివేశాడు.

"ఏం."

"విన్నావుగా-నీ సైకిల్ తీసుకొని నీదారిని పో."

హరిజన్ ఏమీ చేయలేక, ముఖం చిన్నబుచ్చుకొని, సైకిల్ ఎక్కి నౌక దగ్గరకు వెళ్ళాడు.

ఘనత వహించిన రాయబారి కటువుగా ప్రశ్నించాడు-"తిరిగి రావడాన్కి ఇంత సేపయిందన్న మాట. ఎంతమంది వస్తున్నారు? ఎప్పుడు వస్తున్నారు?"

"ఎవ్వరూ రావటం లేదండీ." భయపడుతూ జవాబు చెప్పాడు హారిజన్.

"ఎవ్వరూ రారా!"— అని అడిగాడు రాయబారి. అతని కనుబొమలు ఆశ్చర్యంతో పైకి పోయాయి. "నా ఆహ్వానాన్ని అందరూ తిరస్కరించారని చెప్తున్నావా?"

"లేదండీ—"

రాయబారి ఒక నిమిషం ఊరుకొని, "మాట్లాడవేం?"—— ఎందుకిలా కళ్ళప్పగించి నిలుచున్నావు—ఏ సైకిల్ పదో పిల్లల్ని పెట్టినట్టు? వాళ్ళెవరూ నా ఆహ్వానాన్ని తిరస్కరించలేదంటావు—— మళ్ళీ ఎవరూ రావటంలేదంటావు. దీని అర్థం ఏమిటి?"

"నేను ఎవరినీ ఆహ్వానించలేదు."

"అయితే నీవు పిలవనేలేదా?"

గ్రేవర్, షెల్టన్, యింకా మిగతా అక్కడున్న వారి నుద్దేశించి "పిలవనే లేదట!" అని తిరిగి హారిజన్‌తో. "తెలిసింది—నీవు పూర్తిగా మైమరచి వుంటావు—సైకిల్ మీద స్వేచ్ఛగా తిరగడానికి సందు దొరికింది. రోడ్డు ప్రయాణపు మర్యాదలను పాటించకుండా, తప్పుకోమని గంటైనా కొట్టకుండా, గంటకు 18 మైళ్ళకు తగ్గని వేగంతో నీ యిష్టంవచ్చినట్టు నీవు పోతుంటే, పురజనులందరినీ హడల కొట్టావన్న మాట."

"నా సైకిల్‌కు గంటేలేదండీ—" అని సమాధానం చెప్పాడు. హారిజన్—రాయబారి మోపిన నిందలకు చిన్నబుచ్చుకున్నాడు. "వెనక చక్రం తిరిగినప్పుడు సన్నగా బూరా మోగుతుంది." అని ముగించాడు.

"చూశారా?" అన్నాడు రాయబారి. నిస్పృహతో కూర్చున్నాడు. "వాడికెవడికో కొబ్బరాకు బూరా ఉంటే వీడికేమో సైకిలు బూరా ఉన్నదట." అంటూ హరిజన్ వంక నిందాపూర్వకంగా వేలుపెట్టి చూపాడు.

"ఆ బూరా నేనే స్వంతంగా చేసుకున్నానండీ-" అని హరిజన్ తన ప్రతిభ తెలుపుకున్నాడు.

"సందేహంలేదు. నువ్వే చేసి ఉంటావు. నువ్వు కాకపోతే ఇంకెవరు చేస్తారు?" రాయబారి మళ్ళీ అడిగాడు-"ఇదిగో-అసలు ఏమి జరిగిందో చెప్పు-నా కొక్కడికే చెప్పు-ఎవరికీ చెప్పనులే." అని వంగి అతని చెవిలో రహస్యంగా అడిగాడు. అంత రహస్యంగా చెప్పిందీ అందరికీ వినపడ్డది.

"నీవు ఎందుకు పిలవలేదు?"

"ఎవరూ కనపడలేదండీ-ఎంతో ప్రయత్నం చేశా. నామాటలు అక్కడ ఎవరికీ బోధపడలేదు. తెలిసికూడా తెలియనట్టు నటించారో ఏమో!"

"అహా," అంటూ రాయబారి కిటికీలోంచి బయటికి చూశాడు. గడియారంలో టైమ్ చూశాడు.

"చీకటిపడ్తూ వుంది. రాత్రి ఏం చేస్తాం? ఇంక ఇవాళ ఏపని చేయడానికి టైమ్ చాలదు." విసుగ్గా ముక్కాడు.

"మరొకరోజు దండుగైంది. ఇక్కడ ఆగి రెండురోజులైంది. ఇంకా మనం గుడుగుడు గుంజాలాడుతూనే ఉన్నాం." హరిజన్ వంక చూసేటప్పుడు అతని కళ్ళు ఎరుపెక్కాయి-"సరే చెప్పవయ్యా—అసలు ఏం జరిగిందో. ఊరికే కాలం వృథాబుచ్చేబదులు నీవు చెప్పే కథైనా వింటాం. విన్నాక ఏదైనా విషయం తెలుస్తే తెలుస్తుంది."

జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పాడు హారిజన్. పిదకు ఇలా అన్నాడు "ఈ విధంగా వారాలతరబడి వాళ్ళతో మాట్లాడినా గాని, నా భావాలు వారు గ్రహించలేరన్న అభిప్రాయం కలిగింది. నా ధోరణి నాది-వాళ్ళ ధోరణి వాళ్ళది-ఒకటి ఉత్తర ధ్రువం-మరొకటి దక్షిణ ధృవం. ఏటికి కలయిక ఎలా? యుగాంతం వరకూ వారితో మాట్లాడినా కలిసి మెలిసి కాలక్షేపం చేసినా వారి మాట మనకూ మన మాట వారికీ అర్థమవడం అసంభవం."

"చూడగా అలానేవుంది" అని నిరుత్సాహంతో అన్నాడు రాయబారి. గ్రేడర్‌నుద్దేశించి, "నీవు చాలా తిరిగావు. ఎన్నో కొత్త లోకాల్ని చూశావు-దీని అర్థం ఏమంటావు."

"శబ్దార్థ శాస్త్రంలో ఒక సమస్య ఇది." అన్నాడు గ్రేడర్. పరిస్థితుల ఒత్తిడి వల్ల అతడాశాస్త్రం చదవవలసి వచ్చింది. భూమితో సంపర్కం తగ్గిపోయిన ప్రతి లోకంలోనూ ఈ సమస్య నెదుర్కొనవలసి వస్తూంది. శబ్దాలకూ అర్థాలకూ సంబంధం పూర్తిగా మారిపోతే దనుకోండి నేను చూసినంతవరకు". ఆలోచిస్తూ కాస్త సేపాగి అన్నాడు, "మీకు గుర్తుందా? బాసిలస్‌లో మనం కలుసుకున్న మొదటి వ్యక్తి ఏమన్నాడో? 'జోళ్లు విసర్జిస్తే సంతోషం' అన్నాడు. పరిశుద్ధమైన భాషే మాట్లాడుతున్నానని వాడి నమ్మకం."

"ఔను – దాని అర్థం ఏమిటి?"

"జోళ్లు వదిలి, లోపలకి వచ్చి, సంతోషంగా ఉండండి!" అని దాని అర్థం. స్వాగతం చెప్పడమన్నమాట – కొంచం ప్రయత్నిస్తే అర్థం చేసుకోడం అంత కష్టం కాదు, ప్రభూ!"

గ్రేడర్ సాలోచనగా హారిజన్ వంక చూచి. "ఇక్కడ పరిస్థితి మరీ విపరీతంగా మారిపోయినట్టుంది. భాష వినడానికి స్పష్టంగా

అంతా మన భాషలాగానే వుంది కాని అర్థాలు మారిపోయి నట్లున్నాయి. అభిప్రాయాలు మారాయి. ఆలోచన తీర్లు మారాయి. దానికితోడు ఇక్కడ మాండలిక పదాలు కొన్ని పుట్టి ఉంటాయి.

"అవామొమో వంటివి" అని రాయబారి అందించాడు.

"ఈ వింత పదం భూమి భాషనుంచి పుట్టినట్టు తోచదు. వాళ్ళు దీన్ని ఉచ్చరించే పద్ధతసలు నాకునచ్చలేదు. బొత్తిగా తిట్టులా గుంది. ఒకళ్ళమీద ఒకళ్లు పారేసుకునే ఆ 'మొమో'లకు దీనికి ఏదో సంబంధం ఉండి ఉంటుంది. మొమో మొగమోటమైతే అవామొమో అంటే మొగమోటానికి వ్యతిరేకమైనదేమో - మానం అవమానం లాగ. అంటే ఏమిటని నన్నడక్కండి.

"దానికీ దీనికీ సంబంధం ఏమీలేదండీ." హారిజన్ అన్నాడు. తన కథ మళ్ళీ ప్రారంభించాడు·" తిరిగి వస్తూ నన్ను ఎయిన్స్ దగ్గరకు పంపిన ఆమెను చూశాను. 'జెయిన్సును కలుసుకున్నావా ?' అని అడిగింది. 'ఔనన్నా'ను అవామొమో అంటే ఏమిటని ఆవిణ్ణి అడిగాను. అది ఇక్కడి పరిభాష అని చెప్పింది." హారిజన్ ఒకక్షణం ఆగాడు.

"చెప్పవోయి చెప్పు," రాయబారి. బ్లీడర్ గదిలోంచి వెలువడే ఘాటైన మాటలు విని భరించుకున్నాక, ఇంక ఏదన్నా తట్టుకోగలను. దాని అర్థం ఏమిటి ?"

"అ-వా-మొ-మో" అక్షరాలు విడమర్చి అన్నాడు హారిజన్. "అంటే అతివాగుడు మొదటికి మోసం."

"అదన్నమాట !" రాయబారి ముఖం కొంచెం ఎరుపెక్కింది. "అదన్నమాట - వాళ్లు యింతసేపు నాకు చెప్తూ వున్నది !"

"అదే అయుండాలంది."

"వాళ్ళకు బుద్ధి చెప్పాలి!" కోపంతో అతని మెడ న
పొంగాయి.

ఆవేశంతో బల్ల గుద్దుతూ "చెప్పితీరుతాను!" అన
రాయబారి.

"అంతేనండి," అన్నాడు హారిజన్. ఎప్పుడు బయటికి పోద
అన్న ఆత్రుతతో. "నేను వెళ్ళి నా సైకిల్ పని చూసుకోవచ్చాం

"నాకంటికి కనిపించకు. అవతలికిపో!" అని అరిచాడు
బారి. గ్రేడర్ వంకకు తిరిగి "బైసికిల్! ఇక్కడ ఎవరి దగ్గర
పంగలకర్ర ఉందా?" అని అడిగాడు.

"సందేహమే. అయినా కావాలంటే కనుక్కొని చెప్తాను.

"పద్దమ్మలాగా మాట్లాడకు. ఇప్పటికే మన చుట్టూ ము
పద్దమ్మలతో ఏగలేకుండా వున్నాము."

సమావేశం మరునాటి ఉదయానికి వాయిదా పడింది.
చాలా త్వరగా ముగిసింది. రాయబారి కూచున్నాడు,
జాచాడు, ముఖం చిట్లించి చుట్టూ చూసి అన్నాడు, "మళ్ళీ ఒ
తేలిన విషయాలు గుర్తుకు తెచ్చుకుందాం. ఇక్కడి గాడిదెలం
గాంధేయులమని చెప్పుకుంటున్నారు. వాళ్ళ పూర్వీకులు ఘూ
అన్న సంగతి ఒప్పుకోవడం లేదు సరిగదా - మనమేమో గాంధీ
రేకులంటున్నారు. మనం వాళ్ళకు విరోధులమని వాళ్ళ మన
బాగా హత్తుకొని పోయింది. మనం ఎప్పుడిక్కడకు వచ్చినా,
వ్యతిరేకమే చేస్తామని ఉగ్గుపాలతోనే వారికి బోధ జరుగుతూ
ట్టుంది."

"అసలు వారి ఆశయాలేమిటో, వారి అభిప్రాయాలేమిటో మనకు సూచనప్రాయంగా కూడా తెలియదు," అన్నాడు పెల్టన్. ఇప్పట్లో అతను కలుగజేసుకోడం అనవసరం. అతను సమావేశంలో పాల్గొంటున్నట్టు, ప్రసంగం వింటున్నట్టు మాత్రం రుజువైంది.

"ఆ విషయంలో మన అజ్ఞానాన్ని నే నెరక్కపోలేదు. వాళ్ళు చాలా గుట్టుగా ఉన్నారు. ఆ గుట్టేమిటో మనం బయట పెట్టాలి." రాయబారి గొంతు సవరించుకున్నాడు. "ఇక్కడ వాళ్ళకు డబ్బుతో పనిలేదు. అన్నీ సమృద్ధిగా ఉండడంవల్ల డబ్బు అవసరం లేకుండా కాలం గడుపుతున్నారు - జనాభా ఎక్కువై, కరువు వచ్చినప్పుడు వీరి విధానం పనిచేయదు. వీరి ఆర్థిక విధానం, సహకార పద్ధతులు, స్వంత వ్యాపారం, అరమరిక లేకపోవడంమీద ఆధారపడి వుంది. ఎప్సిలాన్ కూటమిలోని నాల్గుగ్రహాల్లో ఉన్న తిండి బ్యాంకులద్వారా సరఫరాచేసే విధానంకన్నా యిక్కడి ఆర్థిక విధానం మరీ పిచ్చిగా వుంది."

"అయినా, యీ విధానం చక్కగా పనిచేస్తూనే వుంది" అన్నాడు గ్రేడర్.

"ఏదో ఒక రకంగా చేస్తుంది. ఆచేట చెవుల యింజనీర్ సైకిల్ పని చెయ్యడంలేదూ, మరి మోటార్ సైకిల్‌కి దానికి సాపత్యమా ?" తన ఉపమానాన్ని మురిసిపోతూ ఒక క్షణం ఆగాడు రాయబారి. ఆదిలో వలసవచ్చిన వారుప్రారంభించిన పిచ్చి అలవాట్లు కొన్ని ఆఖరికి ఈ ఆర్థిక విధానంగా పరిణమించి ఉన్నాయి. ఇది ఏనాడో మార్పు చేయవలసింది. ఆ సంగతి వాళ్లకు తెలియక కాదు. మానసికంగా వాళ్ళు మూడువందల సంవత్సరాలు వెనుక బడివున్నారు.

మార్పన్నా, అభివృద్ధి అన్నా వాళ్ళకి అమిత భయం — వెనుకబడ్డ జాతులందరూ ఇదే తరహా. అదీగాక అభివృద్ధిని నిరోధించడంలో కొంత మందికి స్వలాభాపేక్ష కూడా వుంది.'' ముక్కుపుటాల ద్వారా తన అసహ్యాన్ని ప్రకటిస్తూ అన్నాడు, మారడానికి వాళ్ళకి మనసొప్పదు. అంచేత మన మంటే వాళ్ళకి పడదు.

తన మాట ఎవరైనా కాదనగలరా అని అధికారయుతంగా బల్లచుట్టూ కూచున్న వాళ్ళందరినీ రాయబారి ఒకసారి చూచాడు. ఎవరూ పెదవి మెదపలేదు—వాళ్ళకట్టుబాటు అలాంటిది. రాయబారి తిరిగి ప్రసంగం ప్రారంభించాడు. రాను రాను - ఇక్కడి విషయం బోధపరచుకున్నాక, మనం చాలా కష్టపడి పనిచేయవలసి వుంటుంది. వాళ్ళ మనస్సుల్లో నాటుకొని ఉన్న భూమియులను గూర్చిన వ్యతిరేక భావాలను వేళ్ళతో పెల్లగించి. ఆధునిక విధానాల్ని నాటాలి. ఎన్ని లోకాల్లోనో మనం యిలాంటిపని ఇదివరకు చేశాం. ఇక్కడ అంత కన్నా కొంచెం ఎక్కువ కష్టపడాలేమో.''

''కష్టపడతాం, సాధిస్తాం,'' అన్నాడొకడు. అతని మాటలక్ష్య పెట్టకుండానే రాయబారి చెప్పుకు పోయాడు. అయితే అదంతా భవిష్యత్తుకు సంబంధించింది. ప్రస్తుతం మనం తక్షణం పరిష్కరించవలసిన సమస్య ఒకటివుంది. ఇక్కడ పరిపాలన ఎటువంటిది? అధికారం ఎవరిచేతుల్లో వుంది. ఇది తెల్సుకోందే ముందుకు పోలేం. ఎలా తెల్సుకోడం?'' రాయబారి కుర్చీల్లో వెనక్కు జారిగిలబడి అందరినీ ఉద్దేశించి అన్నాడు,'' మీరందరూ కాస్త మీ బుద్ధులకు పదును పెట్టండి. చురుకైన ఉపాయాలేమన్నా తోస్తే చెప్పండి.''

కాప్టెన్ గ్రేడర్ లేచినిలబడ్డాడు. అతని చేతిలో తోలు ముడిచిన లావాటి పెద్ద పుస్తకం వుంది. ''ప్రభూ-మనం అంత శ్రమపడి

ఆలోచించడం అనవసరం. ఇక్కడివారిని కలుసుకోడానికి, ముఖ్యమైన సమాచారం తెలుసుకోడానికి క్రొత్తపంథాలు ఆలోచించక్కర లేదు. ఇప్పుడు మనం ఏం చెయ్యాలీ అన్నది అర్థమయ్యేవుంది."

"అంటే?"

"మన నావిక బృందంతో పాత పరివారం చాలామంది వున్నారు. వారందరికీ అంతరిక్ష న్యాయశాస్త్రం కంఠస్థం." చేతితో ఆ పుస్తకాన్ని పట్టి, "అంతరిక్షయానాన్ని, ఇతర గ్రహప్రవేశాన్ని గురించిన శాసనాలన్నీ నాకు తెలిసినంతా వారందరికీ తెలుసు. కొన్ని విషయాలు నాకన్నా వారికే బాగా తెలుసు ననిపిస్తూంది."

"అయితే........"

గ్రేడర్ పుస్తకం తెరిచాడు అన్నాడు, "ఇందులో 127 వ సూత్రం ప్రకారం, మనం దిగిన లోకం గనక మనకి వ్యతిరిక్తమైన దైతే తిరిగి అంతరిక్షంలోకి పోయేవరకూ, నౌకలోని నావికాబృందం యుద్ధ నిబంధనల ననుసరించాలి, అనుకూలమైనదైతే శాంతి నిబంధనల ననుసరించాలి."

"అయితే ఏమంటావు ?"

"131 వ సూత్రం ప్రకారం - శాంతినిబంధనల ననుసరించే నావికాబృందం, నౌక నేలమీదకి దిగిన తరువాత, భూమీయ కాలమానం ప్రకారం 72 గంటలలోగాని, సామగ్రిని నేలమీదికి దింపడం పూర్తి అయిన వెంటనేగాని - ఈ రెండు కాలమానాల్లో ఏది తక్కువైతే, ఆ వ్యవధిలో సెలవు తీసుకోడానికి అర్హులు. నౌక పరిశుభ్రం చెయ్యడానికి అవసరమైన సిబ్బందిని మాత్రమే మనం నౌకలో అట్టే పెట్ట గలం. మధ్యాహ్నానికి ఈ గడువు తీరిపోతుంది. నావికులందరూ సెలవు

మీద నౌక దిగిపోవడానికి తహతహలాడుతూ ఉంటారు. మనం శెలవు మంజూరుచెయ్యకపోతే గొడవలు తప్పవు.''

''తప్పవేం ?'' అన్నాడు రాయబారి నిరసనగా నవ్వుతూ. ''ఈ లోకం మనకి వ్యతిరిక్తమైనదని నేను నిర్ణయించాననుకో. వాళ్ళకి ఆట కట్టేనా ?''

గ్రేడర్ గంభీరంగా గ్రంథాన్ని తిరగవేసి అన్నాడు, ''148 వ సూత్రంలో వ్యతిరేకలోకం ఈవిధంగా నిర్వచించబడింది. భూమి సామ్రాజ్యపౌరుల్ని బలప్రదర్శనం ద్వారా ఎదుర్కొన్న లోకమే వ్యతిరేక లోకం.'' తరవాత పేజీ తిప్పి చదివాడు, ''ఈ సూత్రంలో పేర్కొనబడ్డ బలప్రదర్శనానికి అర్థం ఏమంటే, అటువంటి ప్రదర్శనం ద్వారా శరీరానికి బాధ కలిగించే అభిప్రాయం ప్రయోక్తకుండాలి - ఆ అభిప్రాయం నెరవేరలేకపోయినా సరే.''

''నేనొప్పుకోను'' అన్నాడు రాయబారి కోపంగా ముఖం చిట్లించి, ''బలప్రదర్శనం చెయ్యకపోయినా ఒక్కొక్క లోకం మానసికంగా మనకి విముఖత్వం చూపొచ్చు. ఈ లోకమే దానికి తార్కాణం. ఇది మనకి మిత్రలోకమా మరి ?''

''అంతరిక్ష నియమావళి ప్రకారం అసలు మిత్రలోకాలనేవి లేనే లేవు,'' అన్నాడు గ్రేడర్. ''ప్రతిలోకం, వ్యతిరిక్తమైనదైనా కావాలి. వ్యతిరిక్తం కానిదైనా కావాలి'' తోలు అట్టమీద తర్జనితో తట్టుతూ అన్నాడు, ''అంతా ఈ పుస్తకంలో ఉంది.''

''ఒక చచ్చుపుస్తకాన్నీ, దాన్ని ఆధారంగా చేసుకున్న ఈ నావికుల్నీ మనమీద అధికారం చెలాయించనిస్తే, మనంత దద్దమ్మలు వేరే ఎక్కడా ఉండరు. ఆ కిటికీలోనుంచి దాన్ని అవతలికి విసిరెయ్యి.

లేకపోతే పొయ్యిలో పెట్టు. నీ ఇష్టం దాన్నెలా రూపుమాపినా సరే. దాని సంగతి మరిచిపో."

"క్షమించాలి, ప్రభువుగారు. నేనలా చేయడానికి వీలులేదు." గ్రేడర్ ఆ గ్రంథాన్ని తెరిచాడు మళ్ళీ. మొదటిపుటలు పరిశీలించాడు, చదివాడు.

"ప్రాథమిక సూత్రాలు అ, ఆ, ఇ-లలో ఈ క్రింది విధంగా ఉదహరించబడి వుంది. నౌక అంతరిక్షంలో ఉన్నా, నేలమీద ఉన్నా, నౌకోద్యోగులంతా, కెప్టెన్ యొక్క ఏకైకాధిపత్యం క్రింద ఉండాలి. అతను లేకపోతే, అతని చేత నియోగించబడ్డ మరొక ఉద్యోగి ఆ అధికారం చలాయిస్తాడు. అంతరిక్ష నియమావళి ఒక్కటే వారికి అనుసరణీయం. భూమిమీద ఉన్న అంతరిక్షకమిటీకే వారు బాధ్యులు. అదే సూత్రం, నౌకలో ఉన్నా-అంతరిక్షంలో ప్రయాణం చేస్తున్నా, నేలమీద దిగి ఉన్నా-సాయుధ సేనలకూ, ఇతర ఉద్యోగులకూ, పౌరప్రయాణీకులకూ కూడా వర్తిస్తుంది, వారు ఏ తరహాకు చెందినవారైనా సరే."

"అంటే ఈ దుర్గానికి అధిపతివి నువ్వన్నమాట," అన్నాడు రాయబారి; కొంచెం అయిష్టం వ్యక్తపరుస్తూ "మీకు ఇష్టం లేకపోతే ఓడ దిగిపోవాలన్నమాట."

"తమ గొప్పతనాన్ని కాదనడం కాదుగాని, నిజానికి దాని అర్థం అంతే. నిబంధనలు నిబంధనలే–నేనేం చెయ్యగలను? మా జనానికి బాగా తెలుసు."

గ్రేడర్ పుస్తకం మూసేసి కొంచెం దూరంగా నెట్టాడు.

"మువ్వాతిక మూడు పీసాలు మా జనమంతా దుస్తులు శుభ్రం చేసుకుంటూ, తలలకు తైలసంస్కారం చేస్తూ, మధ్యాహ్నం సెలవు కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అప్పటికీ మనం ఏం చెయ్యకపోతే, నియమావళి ననుసరించి నా వద్దకు వచ్చి అడుగుతారు. అడక్కుండా నే నాపలేను. వాళ్ళ ప్రతినిధి ద్వారా సెలవు దరఖాస్తు నాకంద చేస్తారు." గ్రేడర్ నిట్టూర్చాడు. "నేను చెయ్యగలిగిందల్లా పేర్ల విషయంలో కాస్త పేచీ పెట్టొచ్చు, జాబితాలో మార్పులు చెయ్యొచ్చు. మొత్తం అందరికీ సెలవు నిరాకరించడానికి నాకు హక్కు లేదు."

"మనవాళ్ళంతా స్వేచ్ఛగా ఊరిమీద పడడం మంచిదనే తోస్తుంది నాకు," అన్నాడు కల్నల్ పెల్టన్, "నిద్రపోతున్న ఈ ఊరు కాస్త మేలుకుంటుంది. డజన్లకొద్దీ జనాన్ని కలుసుకుంటారు మన వాళ్లు. మనకి కావలిసింది కూడా అదే గదా!"

"మనకి కావలిసింది ఈ లోకాన్ని నడుపుతున్న నాయకులు" అని రాయబారి హెచ్చరించాడు, "ఆ నాయకులెవళ్లూ మనల్ని చూడ్డానికి మడత తలపాగాలు ధరించి ఎగబడుతున్నట్టు నాకు తోచదు. ఇంక కడుపులు చేతబట్టుకుని ఊరిమీదికి ఎగబడ్డ మన నావికుల్ని రండి నాయనలారా అని కౌగిలించుకుని స్వాగతం చెబుతారా?"

అతని ముఖంమీది కొవ్వు ముద్దలు బాధగా ముడుచుకున్నాయి.

"గడ్డిమేటంతా వెదికి సూదుల్ని బయటికి లాగాలి మనం. ఆకలిగా మీదపడి, ఆ మేటిని చెల్లాచెదరు చేసే దూడల మందవల్ల ఆ పని జరగదు." గ్రేడర్ అన్నాడు.

"నాకూ అల్లాగే తోస్తోంది. కాని మన జనానికి ఆ అవకాశం ఇచ్చి చూడ్డం తప్ప మరో మార్గం కనబడ్డంలేదు. వాళ్లు పోతామంటే ఆపడానికి నాకు అధికారం లేదు. నాకా అధికారం రావడానికి ఒకటే అవకాశం ఉంది."

"ఏమిటది ?"

"అంతరిక్ష నియమావళి నిర్వచనం ప్రకారం ఈ లోకం మనకి వ్యతిరిక్తమని నాకు సాక్ష్యం దొరకాలి."

"ఆ సాక్ష్యం ఎలాగైనా సృష్టించలేమా ?" అన్నాడు రాయబారి. ఇతరుల సలహాల కోసం ఎదురుచూడకండా తనే ప్రారంభించాడు, "ప్రతి నౌకాదళంలోనూ అల్లరి చిల్లరి మనిషెవడో ఒకడుంటాడు. మన దళంలో అటువంటివాడెవడో చూడండి. రెండు మూడు బ్రాందీలు అతని గొంతులో పొయ్యండి - మంచి జోరైన రకం చూసి. శలవిచ్చి ఊరిమీద వొదిలెయ్యండి. ఈ గాంధీయుల దృష్టిలో మనమంతా పెంట పురుగుల్లాంటి వాళ్ళం గనుక, మన ఆసామీ ఈ ఊళ్ళో తాగిన హుషార్‌కి తగిన సరదా అనుభవించలేడని మీ అనుమానమా ? ఫరవాలేదు. వాచిన దవడ, మూసిన కన్నుతో మనవాడు తిరిగొస్తాడు. వచ్చి తన శత్రువుకి ఏ ఏ అవయాలు లోపించాయో గర్వంగా చెప్పుకుంటాడు. అప్పుడీ లోకం వ్యతిరిక్త లోకమని నిర్ణయించండి.

ఇంత తేలికైన పద్ధతి తను చెప్పగలిగినందుకు హుషారుగా చెయ్యి ఊపుతూ అన్నాడు, "ఏముంది ? అంతే. శారీరకమైన బాధ. నియమావళి తు చ తప్పనక్కరలేదు."

"148 అ-సూత్రం ఈ విషయమై స్పష్టమైన వివరణ చేసింది. బలప్రయోగం పద్ధతి ప్రకారం జరగాలి. వ్యక్తుల మధ్య కొట్లాటలు ఆధారంగా, ఏ లోకమూ వ్యతిరిక్తమని నిర్ణయించడానికి వీల్లేదు."

రాయబారి తన ముఖంలో చిరాకు నింపి, ఆ ఉద్యోగి వేపు చూశాడు.

"నువ్వీసారి భూమికి తిరిగి వెళ్ళినప్పుడు - అసలు తిరిగి వెళ్ళడ మంటూ ఉంటే - ఈ నియమావళి నిర్ణయించే శాఖాధికారులతో చెప్పు - కుర్చీల్లో కూర్చుని పుస్తకాలు వ్రాయడం తప్ప మరొకటి చేత కాని పెద్దల తెలివితక్కువవల్ల, అంతరిక్షశాఖ అనేక ఇబ్బందులికి గురి అవుతోందనీ, అడుగడుగునా అడ్డంకులతో సతమతమవుతోందనీ, కాళ్ళూ చేతులూ కట్టేసినట్లౌతోందనీ స్పష్టంగా చెప్పు."

ఉద్యోగి ఆలోచించాడు, రాయబారికి నొప్పి తగలకండా, తన తరహా ఉద్యోగుల్ని ఎలా సమర్థించడమా అని. అతని ఆలోచన తెగక ముందే ఎవరో తలుపు తట్టారు. మార్గన్ అనే నావికుడు లోపలికొచ్చి సైనిక వందనంచేసి, కెప్టెన్ గ్రేడర్ చేతికి ఒక కాగితం అందించాడు.

"మొదటి సెలవుమీద వెళ్ళవలిసిన వాళ్ళ జాబితా సార్ ! తమరు అంగీకరిస్తే...."

మధ్యాహ్నం తిరగడంతోటే నాలుగువందల ఇరవైమంది ఊరి మీద విరుచుకు పడ్డారు. మామూలు ధోరణిలోనే సాగి వెళ్లారు, బంది ఖానానుంచి విడుదలైన ఖైదీల్లాగ ఆశగా, గాలీ వెలుతురూ కోసం తహతహలాడుతూ, సుఖం కోసం ఆత్రపడుతూ జంటలుగా, గుంపులుగా.

గ్లీడ్ హారిజన్‌తో జతపడ్డాడు. వాళ్ళ తరహా మనుషు లాగుంపులో లేరు. గ్లీడ్ ఒక్కడే సార్జంట్, హారిజన్ ఒక్కడే పడవ ఇంజినీర్. అదీగాక వాళ్ళస్థితి నీటినుంచి బయటపడ్డ చేపల్లా ఉంది. గ్లీడ్‌కిప్పుడు యూనిఫారం లేని వెలితి బాగా కనబడుతోంది. హారి జన్‌కి తన సైకిలు పక్కన లేకపోతే ఒక అవయవం లోపించినట్టుంది. వారి వారి ప్రత్యేకమైన అసంతృప్తులు వాళ్ళని ఆ ఒక్కరోజూ దగ్గరకు లాగాయి.

చాలా బాగుంది." అన్నాడు గ్లీడ్ ఉత్సాహం తెచ్చిపెట్టు కుని. "సెలవుదినాలు చాలా లోకాల్లో చూశానుగాని, ఇది అద్భుతం. తక్కిన లోకాలన్నింటిలోనూ మనజనానికి ఒకటే పెద్ద సమస్య- డబ్బుకు బదులు దేన్ని ఉపయోగించడమా అని. అంచేత కామధేనువు ల్లాగ కనపడ్డ వస్తువులన్నీ మోసుకుపోయేవారు పదన్నా అమ్మి కావలిసినవి కొనుక్కోవచ్చునని. ముప్పాతిక ముప్పైవంతు అవేవీ ఉపయోగపడేవే కాదు. మళ్ళీ అన్నీ వెనక్కి మోసుకురావలి సొచ్చేది."

హారిజన్ అన్నాడు," పారిసోఫేన్ లోకంలో ఒక మహా కాయుడు, నా సైకిల్‌కి ఇరవై కారట్ల వజ్రం ఇస్తానన్నాడు, మంచి నీలిచాయగల వజ్రం."

"నీతప్పల్చెక్కా, తీసుకోలేదా మరి?"

"ఏంలాభం? మళ్ళీ పదహారు వెలుగు సంవత్సరాలు వెనక్కి పోతేగాని మరో సైకిల్ దొరకదు."

"కొద్దిరోజులు సైకిల్ లేకపోతేనేం?"

కొద్దిరోజులు వజ్రం మాత్రం లేకపోతేనేం ? దాన్నెక్కి ఎలాగా తొక్కలేనుగదా."

"సైకిలమ్మి ఒక చంద్రమండల నౌకను కొనలేవుగదా?"

"ఎందుకొనలేనూ? ఈ మహానాయుడు పెద్దవజ్రాన్నే ఇస్తా నన్నాడు గదా!"

"చాలా తెలివి తక్కువ చేశావు నన్నడిగితే. నకిలీలేని వజ్రం గనకయితే, ఇరవై, పాతిక లక్షలొచ్చేది."

అంత డబ్బు ఊహించుకునే సరికి సార్జెంట్ గ్లిడ్ నోరూరింది. ఆశగా చప్పరించాడు." అన్నాడు.

"ఉబ్బు-దండిగా డబ్బుండాలయ్యా. అదీ నా కోరిక. ఈ మజిలీ చూశావూ, అందుకే మహానచ్చింది నాకు. ఇదివరకు మనం సెలవు మీద నౌక వదలి పోయేటప్పుడు గ్రేడర్ ఏమనేవాడు? 'ఈ లోకవాసులకు మీరంటే అనుకూలమైన అభిప్రాయం కలిగేటట్టు నడుచుకోండి. అంతరిక్ష యాత్రికుల మర్యాద నిలబెట్టండి.' అనేవాడు. ఈసారి? బహుమానాన్ని గురించి హెచ్చరించాడు,"

"రాయబారి చెప్పమన్నాడులే."

"ఎవరు చెపితేనేం, నాకు నచ్చింది," అన్నాడు గ్లిడ్. ఇక్కడి విషయాలు చెప్పగల మైనారిటీ తీరిన గాంధేయుణ్ణి—ఆడగాని, మగగాని—నౌకకితెచ్చిన వాళ్ళకి పది ప్రభుత్వ పత్రాలు, ఒక బ్రాందీ బుడ్డి, రెట్టింపు సెలవులూ బహుమానం."

"ఆ బహుమానం అంత సులభంగారాదు."

"ఈ ఊరి ప్రధానోద్యోగి పేరూ చిరునామా పట్టుకురా గలిగితే వంద ప్రభుత్వ పత్రాలు బహుమానం. ఈ లోకానికి ముఖ్య పట్టణం తాలూకు ఉనికి స్పష్టంగా చెప్పగలిగితే వెయ్యి పత్రాలు."

సంతోషంగా ఈలవేశాడు గ్లిడ్, "ఈ బహుమానాలు ఎవరి వొళ్ళోనో పడక తప్పదు. బిడ్‌వర్దికి మాత్రం ఆ అవకాశం లేదు. తలుపు తెరిచి నేనే పట్టుకున్నాను. అతనివతలికి రాలేదు,"

ఒక శలాక వంటి సుందరి ప్రక్కనించి నడిచి వెళ్ళిపోయింది. మాటలాపి ఆమెను చూస్తూ నిలబడ్డాడు గ్లిడ్. హారిజన్ అతన్ని చెయ్యి పట్టి లాగాడు.

"నేను చెప్పిన బెయిన్సు యిల్లు ఇదే. లోపలికి పోదాంరా?"

"వొస్తున్నానోయి," అన్నాడు గ్లిడ్ అయిష్టంగానే, వీధి వేపు చూస్తూనే లోపలికి వెళ్ళాడు.

"చాలా సుదినం." అన్నాడు హారిజన్ సంతోషంగా.

"అబ్బే." అన్నాడు జెఫ్ బెయిన్స్, "వ్యాపారం మందం. అవతల సెమిఫైనల్ నడుస్తోంది. ఊళ్లో సగం అక్కడున్నారు. నేను మూసేసిం తరవాతగాని వాళ్ళ తిండి సంగతి వాళ్ళకి గుర్తురాదు. బహుశా రేపు అంతా ఒక్కసారి ఒచ్చిపడతారు. వడ్డించలేక నేను చస్తాను."

"వ్యాపారం మందగిస్తే ఏం? బాగున్నప్పుడు నువ్వేం డబ్బు పుచ్చుకోవుగా," అన్నాడు గ్లిడ్, హారిజన్ చెప్పిన విషయాలు గుర్తుతెచ్చుకుని.

జెఫ్ చందమామల్లాంటి కళ్ళు తాపీగా గ్లిడ్‌ను పరికించాయి. తరవాత హారిజన్ వేపు తిరిగాయి.

"మీ పడవలో వొచ్చిన జంతువుల్లో ఇతనొకడన్నమాట. అతడనేదేమిటి?"

"డబ్బు," అన్నాడు హారిజన్. "వ్యాపారం సులభంగా సాగడానికి డబ్బు వాడతాం మేం. కాగితాలమీద అచ్చుగుద్ది ఉంటుంది. మీ మొహరాల లాంటిదే అనుకో. ఒకొక్క కాగితానికి ఒకొక్క విలువ ఉంటుంది."

"అర్థమయింది," అన్నాడు జెఫ్. "మీ జనంలో ఒకడిమీద ఒకడికి నమ్మకం లేదు. అంచేత ప్రతి మొహరా అచ్చువేసి రూఢి చేసుకుంటారు. అర్థమయింది. మిమ్మల్ని నమ్మడానికి వీల్లేదన్నమాట." తన ఎత్తుబల్ల దగ్గరకు ఈదుకుంటూ వెళ్ళి అతికష్టంమీద ఎక్కి కూచున్నాడు. ఆ శ్రమవల్ల ఆయాసం ఎక్కువైంది.

"మా పాఠశాలల్లో చెప్పేది నిజమేనన్నమాట. మీ గాంధీ వ్యతిరేకులంతా సంపద కోసం తమ తల్లి గొంతైనా కోసేస్తారని చదువుకున్నాంలే."

"మీరు చదువుకున్నదంతా తప్పు," అన్నాడు హారిజన్.

"కావచ్చు," అన్నాడు జెయిన్. అతనికి తర్కించవలిసిన అవసరం లేదు.

"అది నిజం కాదని మాకు రుజువయిందాకా, మా జాగ్రత్తలో మేముండాలిగదా," అంటూ వాళ్ళిద్దరినీ మరోసారి పరికించిచూశాడు.

"ఇంతకీ మీకేం కావాలి?"

"సలహా," అన్నాడు గ్లిడ్ ఆత్రంగా. "మేమేదో హాయిగా కాలం గడపడానికి బయలుదేరాం. కడుపుకి తిండీ, మనస్సుకి ఖుషీ వారికే చోటేదన్నా చెప్పగలవా?"

"ఎన్నాళ్ళు మీ సెలవు?"

"రేపు రాత్రిదాకా!"

"లాభం లేదు." జెఫ్ విచారంగా తల ఊపాడు. మీరడిగేది మీరు సంపాదించుకోవాలంటే ఎవరిమీదో దండిగా మొమోలు పారెయ్యాలి. రేపు రాత్రిదాకా మీకాపనే సరిపోతుంది. అదీగాక మీ గాంధీ వ్యతిరేకుల మొమో లెవ్వరూ మీద వేసుకోరు. మా వాళ్ళకి కొన్ని అభ్యంతరాలున్నాయి."

"చూడు," అన్నాడు హారిజన్. "పోనీ కడుపునిండా అన్న మైనా దొరకదా ?"

"ఏమో మరి," అని ఆలోచిస్తూ అన్నాడు జెఫ్, తన గడ్డాన్ని నిమురుకుంటూ, "ఆ మాత్రం దొరకొచ్చేమో. కాని నేను మాత్రం మీకేం చెయ్యలేను. నాకు మీ అవసరం ఏమీ లేదు. అంచేత నా మొమోలేవీ మీరుపయోగించుకోలేరు."

"ఇంకేదన్నా మార్గం సూచించగలవా ?"

"మీరీ లోకం మనుషులయితే సమస్యే లేదు. మీ ఇష్టమొచ్చి నన్ని మొమోలు మీమీద వేసుకుని తరవాత సావకాశంగా తీర్చుక వచ్చు; వీలుని బట్టీ, అవకాశాన్ని బట్టీ. ఈ వేళుండి రేపు పోయీ ఈ గాంధీ వ్యతిరేకుల మొమోలు ఎవడొప్పుకుంటాడు ?"

"ఈ వేళుండి రేపు పోవడమేమిటి?" అన్నాడు గ్లీడ్ చికాకుగా. "మా సామ్రాజ్య రాయబారి నిక్కడికి పంపారంటే, భూమీయులిక్కడ స్థిరంగా ఉంటారని అర్థం."

"ఎవరన్నారు ?"

"సామ్రాజ్యాధికారులు. మా సామ్రాజ్యంలో భాగమే గా మీరు ?"

"అబ్బే," అన్నాడు జెఫ్. "మే మెందులోనూ భాగం కాము. అవాలన్న కోర్కె అంతకన్నా లేదు. అంతేకాదు; దేంట్లోనూ భాగంగా మమ్మల్ని ఎవరూ చెయ్యలేరు."

గ్లిడ్ పరధ్యానంగా బీరువాలో ఉన్న మాంసం డబ్బా వేపు చూస్తూ ముందుకు వంగి అన్నాడు, "నేను చెప్పకూడదుగాని, ప్రస్తుతం సెలవుమీదున్నాను గనకా, నా ఉద్యోగ నిర్వహణలో లేను గనకా నీమీద సానుభూతికొద్దీ చెపుతున్నాను. మరో లోకం తాలూకు అధికారుల కింద బానిసత్వం చెయ్యడం నాకేం ఇష్టం ఉండదు. అయితే మా అధికారం కిందికి రాకండా తప్పించుకోడం మీ వల్ల కాదు. విషయం అది."

"మా ఆయుధం మాకుండగా మమ్మల్ని ఎవరూ లోబరుచుకోలేరు" అన్నాడు జెఫ్ అతి ధీమాగా.

"అంత పెద్ద ఆయుధాలు మీ దగ్గరెక్కడుంటాయి?" అన్నాడు చులకనగా గ్లిడ్. వెటకారం కోసం కాదు, జాలి పడుతూ. హారిజన్ అడిగాడు, "ఉన్నాయంటావా?"

"ఉన్నట్టు కనబడదు" అన్నాడు హారిజన్.

"పైని చూసి మోసపోవద్దు" అన్నాడు జెఫ్, "మీరూహించలేని ఆయుధం ఉంది మా దగ్గర."

"ఎల్లాంటిది?"

"ఎల్లాంటిదంటే—ఒకటే చెపుతాను. మనిషి మనసు ఊహించగల ఆయుధాలన్నింటిలోకి బలవత్తమమైనది మా దగ్గరుంది. మేం గాంధీయులం గదా! అంచేత నౌకలు, అణుబాంబులు వంటి ఆటవస్తువులు మాకక్కర్లేదు. అంతకంటె శక్తిమంతమైనది ఉంది మా దగ్గర.

అది ప్రయోగిస్తే ఇంక తిరుగులేదు. ఆ ఆయుధాన్నించి రక్షించుకోడం అసంభవం.''

''అదేమిటో నాకు చూడాలనివుంది." అన్నాడు గ్లిడ్. అంత శక్తిమంతమైన ఆయుధమేదన్నా నిజంగా వాళ్ళదగ్గరుంటే, దాని వివరాలు మేయరుగారి చిరునామాకంటె ముఖ్యమైనవిగదా. ఈ వివరాల ప్రాముఖ్యాన్ని చూసి ముగ్ధుడై గ్రేడర్ బహుమానాన్ని ఐదువేల పత్రాలవరకూ పెంచొచ్చు. కొంచెం వెటకారంగా అన్నాడు, "ఐతే, దాని తాలూకు రహస్యాలన్నీ మీరు బయట పెడతారని నేనాశించడం లేదు."

"అందులో రహస్యమేమీ లేదు.'' అన్నాడు జెఫ్. గ్లిడ్ ఆశ్చర్యపడ్డాడు. ''నీకెప్పుడు కావలిస్తే అప్పుడు ఊరికే నీ చేతులోకి వస్తుంది. గాంధీయుడెవడైనా సరే, నువ్వడిగితే చాలు, ఇస్తాడు. ఎంచేతో తెలుసా?"

''చెప్పు.''

"ఎంచేతంటే, అది ఒక వైపుకే పనిచేస్తుంది. మేం మీ మీద ప్రయోగించగలం. మీరు మామీద ప్రయోగించలేరు."

''అలాంటి ఆయుధం ఎక్కడా ఉండదు, ఒకరి చేతిలో పని చేసి మరొకరి చేతిలో పనిచెయ్యని ఆయుధం ఎవరూ కనిపెట్టలేరు."

''అంతేనంటావా ?"

"అంతే." అన్నాడు గ్లిడ్ అనుమానంలేకుండా, ధీమాగా. "నేనీ అంతరిక్షదళంలో ఇరవై ఏళ్లు పనిచేశాను. ఉండేలబద్దలు మొదలుకుని, హైడ్రోజన్ బాంబుల వరకూ అన్నింటితోటీ పరిచయ

ముంది. నన్ను టోకరా తినిపించడానికి ప్రయత్నించి లాభంలేదు, ఒకవేపుకే పనిచేసే ఆయుధం ఉండడానికి వీల్లేదు.''

''అతనితో వాదించి లాభంలేదు.'' అన్నాడు హారిజన్. ''అతను కళ్ళతో చూస్తేగాని ఏదీ నమ్మడు."

''తెలుస్తూనే ఉంది." అన్నాడు జెఫ్ బెయిన్స్. అతని ముఖం చిరునవ్వుతో ముడతలు పడింది. "మా వింత ఆయుధం అడగ్గానే నీకు కొరుకుతుందనే నన్నానుగా. అడగవేంమరి?"

"సరే అడిగాను," అన్నాడు గ్లీడ్ కొంచెం నిరుత్సాహంగా. అడగ్గానే అందుబాటులో కొచ్చే ఆయుధం, ఆఖరికి ఒక చిన్న మొమో అన్నా పారెయ్యకండా దొరికేది. ఏమంత పెద్దదై వుంటుంది? అతను ఆశపడ్డ అయిదువేల పత్రాలూ అయిదు కింద కుదించుకుపోయాయి, ఆఖరికి సున్నాగా హరించిపోయాయి.

"నా చేతికోసారియ్యి. ప్రయోగించి చూస్తాను.''

తన ఎత్తు బల్లమీద అతికష్టంతో వెనక్కు తిరిగి, గోడవేపుకి చెయ్యి జాచి, ఒక మేకుకి తగిలించి ఉన్న చిన్న బిళ్ళను తీశాడు. గ్లీడ్ కిచ్చాడు.

''నీదగ్గరే ఉంచుకోవచ్చు." అన్నాడు "నీకేం లాభం ఉండదులే."

గ్లీడ్ దాన్ని పరీక్షగా చూశాడు. వేళ్ళమీద ఇటూ అటూ తిప్పాడు. దంతంలాంటి పదార్థంతో చేసిన బిళ్ళ అది. అంతకన్నా ఏమీలేదు. ఒక పక్క నున్నగా ఉంది. రెండోపక్క లోతుగా స్ఫుటంగా చెక్కిన దిక్కురాలున్నాయి.

అతనికేమీ అర్థంకాక ముఖం పైకెత్తి అడిగాడు," ఇదో ఆయుధమా?"

"తప్పకుండా."

"నాకేమర్థంకాలే," అంటూ ఆ బిళ్ళ హారిజన్‌కి అందించాడు. "నీకర్థమయిందా?"

"నాకూనూ," అన్నాడు హారిజన్ దాన్ని పరీక్షగా చూస్తూ. జెఫ్‌తో అన్నాడు. "స్వే-నే-చే" అంటే ఏమిటి?"

"మొదటి అక్షరాలు," అన్నాడు జెఫ్, "అందరూ ఉపయోగించడం వల్ల ఈ సంకేతమే రూఢై పోయిదిం. ఈలోకంలో అంతటా ప్రచారంలో ఉంది. చాలా చోట్ల ఇది మీరు చూసి ఉండాలే."

"అక్కడక్కడ చూసాను. అదేమంత ముఖ్యమైనదని అనుకో లేదు. అవునవును. చాలాచోట్ల చూశాను. సేత్ ఇంట్లోనూ, ఆ అగ్ని మాపక కార్యాలయంలోనూ."

"ఆ వాహనంమీదా ఉండి-మనం జనాన్ని దింపడానికి ప్రయత్నించామే, దానిమీద" అన్నాడు గ్లిడ్, "నాకేమీ అర్థమున్నట్టు కనిపించలేదు."

"చాలా ఉంది అర్థం," అన్నాడు జెఫ్, "స్వాతంత్ర్యం-నేనాపని చేయను."

"చచ్చాను," అన్నాడు గ్లిడ్, "నీ ఆయుధం నన్ను చంపేసింది. ఇంకేం కదలగలను?" ఆ బిళ్ళ జేబులో వేసుకుంటున్న హారిజన్ని దీక్షగా చూశాడు. అన్నాడు, "బ్రహ్మపదార్థంలాంటిది. ఆహా! ఏం ఆయుధం!"

"అజ్ఞానమే బ్రహ్మానందం." అన్నాడు జెఫ్ చాలా నిర్లిప్తంగా.

"అమాయకమైన ఆదివస్తువనుకొన్నది, నిజానికి అంతా తారుమారు చేసే మహాయుధమైనప్పుడు, దాని సంగతి తెలియక పోవడమే మంచిది."

"సరే అయితే," అని సవాలు చేశాడు గ్లిడ్, "ఇదెల్లా పని చేస్తుందో చెప్పు."

"నేనా పనిచేయను," అన్నాడు జెఫ్. వెనకటి వింత చిరునవ్వు అతని ముఖాన్ని ఆవరించింది. ఏదో మహా సంతృప్తి వ్యక్తమయింది ఆ నవ్వులో.

"ఏడిసినట్టుంది," అన్నాడు గ్లిడ్. అతని మనసు నీరై పోయింది. అనుకున్న బహుమాన పత్రాలు అంతర్ధానమయిపోసరికి.

"ఒక పెద్ద పనిచేసే ఆయుధముందన్నావు. మూడడుగులున్న ఒక చిన్న బిళ్ళ నామీద పారేశావు. మూగనోము పట్టించావు. డబ్బాలు కొట్టడం ఎవడైనా చేస్తాడు. నువ్వన్నదాన్ని రుజువు చెయ్యగలవా?"

"నే నాపని చేయను," అన్నాడు జెఫ్. అతని చిరునవ్వు పెద్ద దయింది. వాళ్ళ వంక చూస్తున్న హారిజన్ వేపు తిరిగి అర్థవంతంగా కన్ను గీటాడు.

హారిజన్ మనసులో చటుక్కుని ఏదో మెరిసినట్టయింది. దిగ్భ్రాంతితో అతని నోరు తెరుచుకుంది. దానివేపు తెల్లబోయి చూశాడు. మొదటిసారి దాన్ని పరీక్షిస్తున్నట్టు.

"నాకిచ్చెయ్యి," అన్నాడు బెయిన్సు, అతని వంక చూస్తూ.

అది తన జేబులో పెట్టుకుంటూ హారిజన్ కచ్చితంగా చెప్పాడు. "నేనా పని చెయ్యను."

బెయిన్స్ నవ్వాడు. "కొన్ని బుర్రలకి తొందరగా ఎక్కుతుంది."

గ్లీడ్‌ని ఆ మాట పొడిచినట్టయింది. చెయ్యి జాపి హారిజన్‌తో అన్నాడు, "ఏదీ నాకోసారియ్యి మళ్ళీ చూస్తాను."

"నేనాపని చేయను." అన్నాడు నిర్భయంగా హారిజన్.

"ఏమిటోయి అది న్యాయం!" గ్లీడ్ అతన్ని దుయ్యబట్టబోయి మాట మధ్యలో ఆగిపోయాడు, క్షణంసేపు అలాగే నిలబడిపోయాడు. అతని కళ్ళు గాజు కళ్ళైపోయాయి. అతని మెదడు మెలికలు తిరిగింది. మెల్లని గొంతుకతో అన్నాడు, "అరిదీని—"

"అదే అదే," అన్నాడు బెయిన్స్. "అదే దీనిశక్తి. నీకు అంత చటుక్కుని బుర్రకెక్కలేదు."

"గ్లీడ్ బుర్రలో రకరకాల భావాలు విప్లవాలు రేకెత్తిస్తున్నాయి. గొంతుకలో ఏదో అడ్డు పడ్డట్టు అన్నాడు, "పోదాం పద ఇక్కణ్ణించి. నేను ఆలోచించుకోవాలి. కాస్త ప్రశాంతంగా ఆలోచించుకోవాలి."

అక్కడొక చిన్న పార్కుంది. చక్కని పచ్చిక పట్టులు, పూల మొక్కలు, కూర్చోడానికి సీట్లు, మధ్య నొక బుల్లి ఫౌంటెన్ అన్నీ ఉన్నాయి. ఆ ఫౌంటెన్ చుట్టూ చిన్నపిల్లలాడుతున్నారు. రంగుల తివాసీలా పరుచుకున్న వింత పువ్వులు విరగబూచిన చోటొకటి చూసుకుని కూర్చున్నారిద్దరూ, ఎవరిమానాన వారు ఆలోచించుకుంటూ.

కొంతసేపయాక గ్లీడ్ వ్యాఖ్యానించాడు, "ఒక్క మనిషి తనంతట తాను ఈ తత్వం అవలంబిస్తే, వాణ్ణి చంపెయ్యొచ్చు. కాని ఒక లోకం అంతా అవలంబిస్తే...." అతని గొంతు పల్చబడి శూన్యంలోకి తేలిపోయింది. కొంతసేపటికి తిరిగి వచ్చింది. "దీని పర్యవసానం

ఏమిటి అని చాలా దూరం ఆలోచించాను. ఈ పద్ధతి పు. చ. తప్పకుండా అనుసరిస్తే ఆఖరికి ఏమౌతుంది? కని విని ఎరగని పరిణామాలొస్తాయి."

హారిజన్ సమాధానం చెప్పలేదు. గ్లీ. చెప్పుకుపోయాడు.

"ఉదాహరణకి. నేను నౌకలో అడుగుపెడతాను. ఆ ఖడ్గమృగం ఉన్నాడే బిడవర్ధి, నాకొక ఆజ్ఞ జారీచేస్తాడు. స్తబ్ధులా మొగం ఎత్తి 'నేనా పని చేయను' అంటాను. బిడవర్ధి ఏం చేస్తాడు? చచ్చి ఊరుకుంటాడు. లేకపోతే నన్ను ఖైదులో పారేస్తాడు."

"నీకు తగిన శాస్తి జరుగుతుంది," అన్నాడు హారిజన్.

"ఉంహు, అది అంతటితో ఆగదు. నన్ను జైల్లో పెడితే ఏమయినట్టు? చెయ్యవలసిన పని అలాగే ఉందిగా? అంచేత బిడవర్ధి మరో ఇద్దర్ని పిలుస్తాడు. వాడికి ఈ వేదాంతం వంటపట్టించినుకా. కళ్ళల్లోకి నిర్భయంగా చూస్తూ. 'నేనా పని చేయను,' అంటాడు. వాణ్ణి జైల్లో పారేస్తాడు—నాతోడుగా. బిడవర్ధి ఇంకొకర్ణి పిలుస్తాడు; ఆ తరవాత ఇంకొకర్ణి. ఖైదులో జనం రద్దీ పెరుగుతుంది. అందులో ఇరవైమందికంటె పట్టరు. అంచేత ఏం చేస్తారు? ఎంజినీర్ల వంట గది జైలుగా మారుస్తారు."

"మా వంటగది జోలికి రాకు," అని ప్రార్థించాడు హారిజన్.

"మీ వంటగది జైలు కాక తప్పదు," అన్నాడు గ్లీ కచ్చితంగా. ఎంజినీర్ల మీద కసితీర్చుకోడానికి. "కొద్దిసేపట్లో అదీ కూడా 'నేనా పని చేయను,' గాళ్ళతో కిక్కిరిసి పోతుంది. బిడవర్ధి వరసగా ఒకొక్కళ్ళనే పంపిస్తుంటాడు లోపలికి—అంటే ఈ లోగా అతని రక్తనాళాలు ఒక డజను బద్దలు కాకపోతే సంగతి. అంచేత ఏం చేస్తారు? క్లీడర్ నావికుల గదులు పుచ్చుకుంటారు."

"మా మనుషుల జోలికి రాకు."

"ఆ గదుల్లో ఈసారి ఖైదీల్ని పడుకోబెట్టి కప్పుదాకా పేర్చు తారు," గ్లీడ్ తన ధోరణిలో పోతూనే ఉన్నాడు. ఈ ఆలోచనల వల్ల విలక్షణమైన సరదా ఏదో అతనికి కలుగుతోంది. "ఆఖరికి బీపీ వర్థీ ఏం చేస్తాడు? చేదలూ సబ్బునీళ్ళూ పట్టుకుని చతికిలబడి నేల తనే కడగాలి. గ్రేడర్, షెల్టన్ మొదలైనవాళ్ళంతా జైళ్ళకు కాపలా కాయాలి. ఇంక మహాఘనతవహించిన రాయబారిగారేం చేస్తారు? నీకూ నాకూ వంట చేస్తారు. ఆయనకి తోడ్పడ్డానికి ఆ చచ్చుగుమాస్తా పీనుగులు మిగిలితే మిగలొచ్చు. బొత్తిగా 'చిత్తం-చిత్తం' గాళ్లు వాళ్లే! ఆ దృశ్యం తలుచుకొంటే అతనికే గాభరా ఎత్తింది. "అమ్మ బాబో!" అన్నాడు.

రంగురంగుల బంతొకటి వాళ్ళవేపు దొర్లివచ్చింది. వంగి అది చేతుల్లోకి తీసుకున్నాడు. ఏడేళ్ళ కుర్రాడొకడు పరుగెత్తుకుంటూ వచ్చాడు వాళ్ళ దగ్గరకు. వాళ్ళవేపు గంభీరంగా చూస్తూ అడిగాడు.

"నా బంతి నాకియ్యి."

"నేనా పని చేయను," అన్నాడు గ్లీడ్ ఆ బంతిని వదలిపెట్ట కండా.

ఆ కుర్రవాడు మారాము చెయ్యలేదు, ఏడవలేదు. ముఖం కాస్త బోయిందంతే. వెళ్లిపోడానికి వెనక్కి తిరిగాడు.

"తీసుకో నాయనా! నీ బంతిదిగో," అని గ్లీడ్ బంతి అతని దగ్గరకు విసిరాడు. బంతి అందుకుని కుర్రవాడు వెళ్ళిపోయాడు. హారిజన్ అన్నాడు:

"ఈ విశ్వంలో వున్న ప్రతివ్యక్తీ — ప్రామీథియస్ మొదలు కాల్డన్ నాలుగు వరకూ ఈ పద్దెనిమిది వెలుగు సంవత్సరాల అంత

రితంలో ఉన్న లోకాల్లోని ప్రజల్లో ప్రతి ఒక్కడూ రాబడి పన్ను కట్టమని నోటీసొస్తే, 'నేనా పని చేయను' అని దాన్ని చింపేస్తా డనుకో, అప్పు డేమౌతుంది ?"

"వీళ్ళందర్నీ ఖైదు చెయ్యడానికి మరొక విశ్వాన్నీ, వీళ్ళకి కాపలా కాసే జనం కోసం మూడో విశ్వాన్నీ మనం కనిపెట్టాలి."

"అల్లకల్లోలమై పోతుంది," అన్నాడు హారిజన్. దూరంగా ఫౌంటెన్ చుట్టూ ఎందరో పిల్లలా డుకుంటున్నారు. వాళ్ళని చూపిస్తూ అన్నాడు. "కాని ఇక్కడ అల్లకల్లోలంగానూ, అరాచకంగానూ ఉన్నట్టు కనబడదు. అంచేత ఈ 'నేనాపని చేయను' - ఆయుధముందే, అది అస్త్రమానూ ఉపయోగించరనుకుంటాను. ఏ సందర్భంలో ఎవరి మీద అది ఉపయోగించాలో వాళ్ళలో వాళ్ళకొక ఒప్పందం ఉండి వుంటుంది. ఆ ఒప్పందం ఏ పద్ధతిననుసరించి ఉంటుందో మాత్రం నేనూహించలేకండా ఉన్నాను."

"నేనూను."

వయసుమళ్ళి నతనొకడు వాళ్ళదగ్గర ఆగాడు. అనుమానంగా చూశాడు. వాళ్ళు కాదనుకొని పక్కనున్న ఒక యువకుడి దగ్గరకు పోయి అడిగాడు.

"మార్టిన్స్ టౌనుకి పోయే వాహనం ఎక్కణ్ణించి బయలుదేరుతుంది ?"

"ఎనిమిదో వీధికి అవతలి కొసని. బయలుదేరేముందు మీకందరికీ సంకెళ్ళు వేసేస్తారు" అన్నాడు యువకుడు.

"సంకెళ్లా? ఎందుకు?" అని అడిగాడు ముసలతను ఆశ్చర్యంగా.

"ఆ వాహనం అక్కడున్న అంతరిక్షనౌక పక్కనించిపోతుంది. గాంధీ వ్యతిరేకులు ఎవరినవ్నా ఇవతలికి లాగేస్తారని...." అన్నాడు యువకుడు.

"ఓహో! అవునవును," అన్నాడు ముసలతను. గ్లిడ్ వేపూ హారిజన్ వేపూ చూస్తూ అక్కణ్ణించి కదులుతూ, తనలో తను అనుకున్నాడు.

"ఈ గాంధీ వ్యతిరేకుల గొడవ మహా ఎక్కువగా ఉంది."

"నిజంగానే," అన్నాడు గ్లిడ్. "హొండ్రా అని చెపితే వాళ్లు వినరే. "నేనాపని చేయను' అంటారు."

నడుస్తూ ముసలతని అడుగు తడబడింది. తట్టుకు నిలబడి సాభిప్రాయంగా వాళ్ళిద్దర్నీ ఒకసారి చూసి, తన దారిని వెళ్ళిపోయాడు.

"కొద్దిమంది మన ఉచ్చారణ ఇట్టే పసికట్టేస్తారు," అన్నాడు హారిజన్, "నేను సెత్ హోటల్లో భోజనం చేసినప్పుడు మాత్రం ఎవరూ పట్టుకోలేకపోయారు."

గ్లిడ్ చటుకుని లేచాడు. "ఒకసారి భోజనం చేసినచోట మరోసారి ప్రయత్నించవచ్చు. రా పోదాం. పోయేదేముంది?"

"పోయేది మన ఒర్పు," అన్నాడు హారిజన్. అయినా లేచాడు. "సేత్‌ని అడుగుదాం. అతనొప్పుకోకపోతే ఇక్కణ్ణించి జెండా ఎత్తేద్దాం. లేకపోతే ఆకలితో మాడి చస్తాం."

"సరిగ్గా అదే వాళ్ళు కోరేదీ అనుకుంటాను," అన్నాడు గ్లిడ్. "నేను చచ్చినా సరే వాళ్ళ ఆటలు సాగనివ్వను."

"అంతేలే," అన్నాడు హారిజన్, "నువ్వు చచ్చిన తరవాతనే వాళ్ళ ఆటలు సాగేది."

చేతిమీద తుండుగుడ్డ తనూ, మూర్ట్ వంట ఇంట్లోంచి ఇవతలి కొచ్చాడు.

"గాంధీ వ్యతిరేకులకు నేను వడ్డించను." అన్నాడు.

"ఇదివరకు నాకు వడ్డించావుగా?" అన్నాడు హారిజన్.

"అవుననుకో. ఆ నౌకలోంచి వచ్చావని అప్పుడు నాకు తెలియదు. ఇప్పుడు తెలుసు."

తుండుగుడ్డతో బల్లమీద ఒకమూల తుడిచాడు.

"గాంధీ వ్యతిరేకులకు నేనేం చెయ్యను."

"ఇంకెక్కడన్నా మాకు భోజనం దొరుకుతుందా?"

"ఎవరిమీదన్నా మీరు మొహమోలు పారెయ్యగలిగితే తప్ప దొరకదు. మీ సంగతి తెలిస్తే ఎవడూ ఆ అవకాశం మీకివ్వడు. తెలియనివాడెవడన్నా నాలాగే పొరబాటు పడొచ్చుననుకోండి."

మరోసారి బల్లతుడుపుతూ అన్నాడు, "ఒకే పొరబాటు రెండు సార్లు చెయ్యాన్నేను."

"ఇప్పుడొక పొరబాటు చేస్తున్నావు." అన్నాడు గ్లిడ్ తీక్షణంగా. అధికారయుతంగా. హారిజన్‌కి మాత్రం సంజ్ఞ చేశాను.

"చూసుకో," అంటూ ఒకపిస్తోలు జేబులోంచి తీసి మూర్ట్ గుండెలమీద పెట్టాడు."

"మామూలు పరిస్థితుల్లో నే నిలాంటి పనిచేశానని మా అధికారులికి తెలిస్తే నాకిబ్బంది రావచ్చు. కాని ఇప్పుడు పరిస్థితి వేరు.

వాళ్ళంతా మీమీద కారాలూ మిరియాలూ నూరుతున్నారు. పద, తక్షణం రెండు భోజనాలు తీసుకురా," అన్నాడు ఆయుధంతో జడిపిస్తూ.

"నే నాపని చేయను." అన్నాడు మాట్, పిస్తోలుని నిర్లక్ష్యం చేసి

గ్లిడ్ తాళంమీట నొక్కాడు. క్లిక్‌మంది పిస్తోలు.

"ఇంక మీటనొక్కానంటే ఢమాల్. త్వరగా కానియ్యి. పద."

"నే నాపని చేయను." అన్నాడు మాట్ కచ్చితంగా.

గ్లిడ్ చిరాకుగా ఆయుధాన్ని తిరిగి జేబులో పెట్టుకున్నాడు.

"నాటకమాడానంతే. దీంట్లో గుళ్లులేవు."

ఉంటే మాత్రం మునిగిపోయిందేముంది?" అన్నాడు మాట్, "నేను గాంధీవ్యతిరేకులికి వడ్డించను. అంతే."

"నాకు కోపం ఆగక నిన్ను తూట్లుపడేటట్లు పేల్చేశాననుకో."

"అప్పుడసలు మీకెలా వడ్డించగలను?" అని అడిగాడు మాట్.

"చచ్చిపోయిన తరవాత మనిషింక ఎందుకూ పనికిరాడుగా. మీలాంటి గాంధీవ్యతిరేకులు కాస్త హేతువాదం నేర్చుకోవాలి."

ఆఖరు విసురువిసిరి అతను వెళ్ళిపోయాడు.

"వాడన్నదాంట్లో నిజం లేకపోలేదు." అన్నాడు హారిజన్ నీరసంగా. "ప్రాణంలేని కట్టెచేత పనేం చేయించుకుంటావు? ఏమీ లేదు. అప్పుడసలు అందుబాటులోనే ఉండదు మనిషి."

"ఏమోలే. రెండుమూడు శవాల్ని చూస్తే మిగతావాళ్ళ కన్నా బుద్ధివస్తుందేమో. అప్పుడు మనం అడిగింది ఆత్రంగా చెయ్యొచ్చు!"

"వీళ్ళు భూమియుల్లాంటి వాళ్ళనుకుంటున్నావు." అన్నాడు హారిజన్, "అది పొరబాటు. వాళ్ళక్కడ్డించి ఇక్కడికి వచ్చినా, ప్రస్తుతం మామూలు భూమియులు మాత్రం కాదు. వాళ్లు గాంధీయులు."

కొంచెం సేపు ఆలోచించి అన్నాడు, "గాంధీయులంటే ఏమిటో నాకూ తెలియదనుకో. కాని వాళ్ళొకరకం మొండిఘటాలు. మహా విప్లవం రోజుల్లో ఇల్లాంటి మొండిఘటాలు కోట్లకొద్దీ భూమిమీద నుంచి ఈ లోకాల్లోకొచ్చిపడ్డారు. హైజియాలో జనం చూశావుగా?"

"ఒక మాటు హైజియాలో దిగానుగాని, వాళ్ళని చూడకుండా ఉండడానికి గట్టి ప్రయత్నం చేశాను. వాళ్ళ శరీరాలమీద ఆఖరికి ఆకుముక్కయినా ఆచ్ఛాదనలేదు. పైగా మనమంతా బట్టలు కట్టుకున్నాం గనక మనకి సిగ్గూ ఎగ్గూ లేదన్నారు. ఆఖరికి నేనుకూడా బట్టలు విసర్జించవలిసొచ్చింది. అక్కడ్డించి వొచ్చేటప్పుడు నేనేం ధరించానో తెలుసా?"

"దేవతా వస్త్రాలు." అన్నాడు హారిజన్.

"అవిన్నీ!- ఒక పెద్ద బిళ్లానూ - నా పేరూ ఉద్యోగం తెలియటానికి, ఒక వెండి పొదిగిన రాగిరేకది. అంతరిక్షదళంలో అందరికీ ఇస్తారు చూడు, అది." అన్నాడు గ్లిడ్, "చేతిమీదే రంగుతో మూడుగీతలు పూసుకున్నాను సార్జంట్ హోదా తెలియడానికి. మూర్తీభవించిన సార్జెంట్ లాగే ఉన్నాననుకో."

"నాకు తెలుసు. నేనక్కడొక వారం ఉన్నాను." అన్నాడు హారిజన్.

"మాకప్పుడు రియల్ అడ్మిరల్ ఒకడుండేవాడు." ఆనాటి సంగతులు పునశ్చరణచేస్తూ చెప్పాడు గ్లిడ్, "మహా అపురూపమైన

శరీరంలే. వేళ్ళాడదీసిన గుడ్డపీలికల్లా ఉండేవి కాళ్లూ చేతులూ. అతని నిజస్వరూపం బయటపడ్డాక ఇంక అతనిమీద గౌరవం ఎవరి కుంటుంది? భయం ఎవరికుంటుంది? అతని అధికారం నీరుకారిపోవడం చూచి, హైజీయాలనేవారు, 'మీది అబద్ధపు ప్రజాస్వామ్యంగనకే ఇల్లాంటి అర్హతలేనివాళ్ళంతా అధికారం చెలాయిస్తున్నారు. మాది అసలైన ప్రజాస్వామ్యం గనక ఆ పప్పులేమీ ఇక్కడ ఉండవు.' వాళ్ళన్నది నిజమనిపిస్తుంది నాకు."

"భూమీయసామ్రాజ్యం విస్తరించడంతోవే, అసందర్భమైన ఒక సూత్రానికి ప్రచారంలోకొచ్చింది," అన్నాడు హారిజన్ ఆలోచిస్తూ. "ఏమిటంటే - ఏ విషయంలోనైనా సరే భూమిదే ఒప్పు, మిగతా పదహారువందల నలభై రెండు లోకాలదీ తప్పు."

"కొంచెం రాజద్రోహం వేపు మొగ్గుతున్నట్టుంది నీ ధోరణి," అన్నాడు గ్లిడ్. హారిజన్ బదులు చెప్పలేదు. గ్లిడ్ అతనివేపు చూశాడు. అతని దృష్టి మరోవేపు ఆకర్షించబడి ఉండడం గమనించాడు. తను కూడా ఆ ఆకర్షణవేపు చూపులు మళ్ళించాడు. అందమైన అమ్మాయి ఒకతె అప్పుడే లోపలికి వస్తోంది."

"చక్కగా ఉంది," అన్నాడు గ్లిడ్; "అంత చిన్నా కాదు, అంత ముదురూ కాదు, అంత లావూ కాదు, అంత సన్నమూ కాదు. సరిపడా ఉంది."

"ఆమె నెరుగుదును," అన్నాడు హారిజన్. ఆమె దృష్టినాకర్షించడానికి చెయ్యి ఊపాడు. తేలిగ్గా అడుగులు వేస్తూ నడిచి వచ్చి వాళ్ళ బల్లదగ్గర కూర్చుంది ఆమె. హారిజన్ పరిచయం చేశాడు.

"నా స్నేహితుడు సార్జంట్ గ్లిడ్."

"ఆర్డర్," అని సరిదిద్దాడు గ్లిడ్. కళ్ళతో ఆమెను తినేస్తూ.

"నా పేరు ఎలిస్సా," అంది ఆమె, "సార్జంటంటే ఏమిటి?"

"ఒక మాస్టరు కిందున్నా పైనున్న కింద ఉద్యోగం," అన్నాడు గ్లిడ్, "పై వాళ్ళ ఆజ్ఞలు పని చేసే వాళ్ళకి అందిస్తాను."

ఆశ్చర్యంతో ఆమె కళ్ళు విప్పారాయి.

"నిజంగా! ఒకళ్ళ ఆజ్ఞ ప్రకారం మరొకళ్ళు పనిచేస్తారా?"

"తప్పకుండా. ఎందుకు చెయ్యరు?"

"నాకిది అయోమయంగా ఉంది." ఆమె దృష్టి హారిజన్ వేపు మళ్ళించింది, "నాకు నీ పేరు తెలుసుకునే అవకాశం మాత్రం లేనట్టుంది."

అతి గంభీరంగా తన పేరు చెప్పాడు హారిజన్. అన్నాడు,

"నువ్వు నాకెంతో నచ్చావు. జిమ్ అంటే బాగుంటుంది నాకు"

"అయితే జిమ్మనే ఉంచుదాం," అని ఇటూ అటూ చూసింది. అడిగింది, "సూట్ మనుష్యుల్ని చూశాడా?"

"ఆఁ. మాకు మాత్రం వడ్డించనన్నాడు."

నా కేం పట్టనట్టు భుజాలు కుదించింది. "అతని ఇష్టం. నిరాకరించడానికి అందరికీ హక్కుంది. స్వేచ్ఛంటే అదే గదా!"

"దాన్ని మేం తిరుగుబాటంటాం," అన్నాడు గ్లిడ్.

"చిలిపితనం కట్టిపెట్టు," అందామె. లేచి వెడుతూ అంది, "ఇక్కడే ఉండండి. అతని చూసి వస్తా."

"చిత్రంగా ఉందే ఇది," అన్నాడు గ్లిడ్, ఆమె వెళ్ళిపోయాక. "ఆ ఫలాహారశాలలో ఉన్న బొండం ఏమన్నాడు? మనం ఏమడిగినా

ఇవ్వకండా మనం ఇక్కణ్ణించి జెండా ఎత్తేసేలాగ చెయ్యడం వాళ్ళ ఆశయమన్నాడు. ఈ పిల్ల చూస్తే కాస్త సుముఖంగా ఉంది. ఆమె ధోరణి...." అంటూ మాట కోసం కొంచెం తడుముకుని అన్నాడు, "అంత గాంభీర్యంగా లేదు."

"అదేం కాదు," అన్నాడు హారిజన్. "నే నాపని చేయను అన డానికి అందరికీ హక్కుంది. ఇప్పుడామె వాళ్ళు చేసేపని చెయ్యకూడ దనుకుంది,"

"ఔనే. నాకది తోచలేదు. అరే, అయితే దాన్ని ఎవళ్ళిష్ట మొచ్చినట్టు వాళ్లు తిప్పుకోవచ్చు, హాయిగా."

"అంతే, అదుగో వస్తోంది."

తన కుర్చీలో కూర్చుని, ఆమె జుట్టు సవరించుకుంది. అంది,

"సెత్ స్వయంగా మనకి వడ్డిస్తాట్ట."

"మరో దేశద్రోహి," అన్నాడు గ్లిడ్ నవ్వుతూ. అది లెక్క చెయ్యకండా ఆమె అంది.

"అయితే ఒక షరతు. భోజనమయాక అతను చెప్పేది పూర్తిగా విని మళ్ళీ వెళ్లాలి మీరు."

"అయితే భోజనం చాలా చవక," అన్నాడు హారిజన్. చటు క్కుని అతనికో విషయం స్ఫురించింది. అడిగాడు.

"అంటే ఈ మూడు భోజనాలకి మొమోలు నువ్వు తీరు స్తున్నావా?"

"లేదు—ఒక్క నా భోజనానికే."

"అదెల్లా?"

"నేతకి కొన్ని అభిప్రాయాలున్నాయి." గాంధీవ్యతిరేకులంటే అతనికి సరిపడదు. అందరిలాగే.

"మరయితే...."

"కాని అతనికి తనభావాలు మరొకరికి బోధించాలన్న గట్టి కోరికుంది. గాంధీవ్యతిరేకులందరికి ఒకటే భూతవైద్యం చెయ్యడం అతనికిష్టంలేదు. పొత్తిగా మూర్ఖులకీ, పూర్తిగా పొగరుబోతులకీ ఆ వైద్యం అట్టేపెట్టి, మిగతావారిని మంచి చేసుకుని మార్చాలని అతని ఉద్దేశం."

స్త్రీ ఆ వేపు చూసి చిరునవ్వు నవ్వింది. అతని తలవెంట్రుకలు నాట్యమాడాయి.

"తెలివైన ప్రతి గాంధీవ్యతిరేకీ, గాంధీయుడవడానికి అవకాశముందని అతని నమ్మకం."

"ఇంతకీ గాంధీయుడంటే ఏమిటి?" అని అడిగాడు హరిజన్.

"ఈ లోకంలో నివసించే మనిషన్న మాట."

"అదికాదు. అసలీ పేరెక్కణ్ణించి వచ్చింది?"

"గాంధీనించి," అంది ఆమె.

హరిజన్ ముఖం చిట్లించి అడిగాడు, "వాడసలు ఎవడూ అని."

"వెనకటి కాలంనాటి భూమీయుడు. ఈ ఆయుధం కనిపెట్టినవాడు."

"మే మెప్పుడూ వినలేదే!"

"ఆశ్చర్యమేముంది?" అంది ఆమె.

"ఏమీలేదా?" అతనికి కొంచెం కోపమొచ్చింది, "నీకు తెలుసో లేదో-ఈ రోజుల్లో భూమిమీద మా విద్యావిధానం, ఏ లోకంలో విద్యావిధానానికీ—"

"శాంతించు జిమ్," అందామె అతన్ని సముదాస్తూ, "నే నన్న దేమంటే, బహుశా అతని పేరు మీ చరిత్ర పుస్తకాల్లోంచి తీసేసి వుంటారు. అతని భావాలు ప్రచారమైతే మీ అధికారులకు ప్రమాదం చూడండి. అసలు దాని సంగతే మీకు తెలియకపోతే, మీరేం పోగొట్టు కున్నారో మీకేం తెలుస్తుంది?"

"భూమియుల చరిత్రలో కొన్ని భాగాలు ఎవరో కావాలని మాపేశారంటే నేను నమ్మను" అన్నాడతను.

"నమ్మకపోవటం నీ హక్కు. అదేగదా స్వేచ్ఛంటే."

"కొంతవరకే. మనిషికి కొన్ని బాధ్యతలున్నాయి. అవి కాదనడానికి మాత్రం అతనికి హక్కు లేదు."

"లేదా?" అందామె కొంటెగా అందమైన కనుబొమలు పైకెత్తి, "ఆ బాధ్యతలు నిర్వహించేది ఎవరు? అతనా? పాలకులా?"

"అతనిపై వాళ్ళు."

"ఒక మనిషికి మరొక మనిషి పైవాడెల్లా అవుతాడు? ఒక మనిషి బాధ్యతలు నిర్ణయించడానికి మరోమనిషికి అధికారం లేదు." కొంచెంసేపు అతన్ని సాభిప్రాయంగా చూసి అంది, "అలాంటి మూర్ఖపు అధికారాలు భూమిమీద ఎవరన్నా చలాయిస్తున్నారంటే, దానికి కారణం కొందరు మూర్ఖులు ఆ అధికారానికి లోబడివున్నారు గనక. వాళ్ళకి స్వేచ్ఛంటే భయం. ఒకరు చెప్పినట్టునడుచుకోవటమే వాళ్ళకిష్టం. ఏం మనుష్యులు మీరు!"

"నీమాటలు వింటే ప్రమాదం." అన్నాడు గ్లెన్ మధ్యలో అందుకుని. పల్చని అతని ముఖం ముడతలుపడింది. "నువ్వెంత అందమైనదానివో అంత కొంటెదానివి."

"నీ బుర్రలో ఆలోచనలు నీకే భయం పుట్టిస్తున్నాయా?" అని అపహాసించిందామె, తన అందాన్ని గురించిన అభినందనాన్ని గుర్తించనట్టే.

అతని ముఖం ఎర్రబడింది. "అదేం కాదు. కాని నేను.... అతని వాక్యం పూర్తికాలేదు. సెత మూడు గుట్టల్లో సమృద్ధిగా తినుబండారాలు తప్పి ఎల్లమీని పెట్టాడు.

"సరిపడా వచ్చి కలుసుంటాం." అని జ్ఞాపకం చేశాడు సెత. మధ్యస్థరకం పరిమాణం అతనిది. అతని ఆకారం పల్చగా తీర్చిదిద్దినట్టుంటుంది. ముదుక్కైన నెళ్ళు. "మీతో మాట్లాడాలి."

జనాలు పూర్తియాక కొద్దిసేపటికి సెత వచ్చి ఒక కుర్చీలో కూచున్నాడు. వాళ్లనోసారి కలయజూశాడు.

"మీకెంత వరకు తెలుసు?" అని అడిగాడు.

"వాదించడానికి అవసరమైనంతా తెలుసు." అంది ఎలిన్నా. "వాళ్లు బాధ్యతల విషయమై తికమక పడుతున్నారు అని నిర్ణయించేదెవరు? నిర్ధారించేదెవరు? అని."

"గట్టి కారణముంది," అన్నాడు పరిజన్, "మీరు మాత్రం బాధ్యతలనెల్లా తప్పించుకోగలరు?"

"అంటే——" అన్నాడు సెత.

"ఈ లోకం ఒక విచిత్రమైన సూత్రంమీద నడుస్తోంది - మొగమాటాల్ని బదలాయించుకునే పద్ధతిమీద. ఎవరైనా తనమీదున్న

మొగమాటాన్ని ఎందుకు తీరుస్తాడు? అది తీర్చడం తన బాధ్యత అని గుర్తించే కదా!"

"బాధ్యత అనేదేమీ లేదిందులో," అన్నాడు సెత్, "ఒక వేళ ఉన్నా, ఆ బాధ్యత ఎవడిమట్టుకు వాడు నిర్ణయించుకున్నదే. 'ఇది నీ బాధ్యత' అని ఒకడినొకడు హెచ్చరిస్తే, అది భరించరాని పొగరుబోతు తనమన్నమాట. చెప్పి చేయించడమనేది ఇక్కడ అసంభవం."

"అలా అయితే కొందరికిది మరీ సుఖం." అన్నాడు గ్లెన్, "వాళ్ళు మొగమాటాలు తీర్చకపోతే అడిగేదెవరు? నిజాయితీలేని పౌరుడి విషయంలో మీరేం చేస్తారు?"

"అదేమంత పెద్ద విషయం?"

"సోమరి జాక్ కథ వాళ్ళకి చెప్పు," అని సలహా యిచ్చింది ఎలిసా.

"అది చంటిపిల్ల కథ" అన్నాడు సెత్, "ఈ లోకంలో పిల్లలందరికీ ఈ కథ కంఠస్థం. చాలా పురాతన కథ. ఎల్లాంటిదంటే...." అని కొంతసేపు జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించి అన్నాడు, "మొదటిభూమీయులిక్కడికి పట్టుకొచ్చిన కథలు నేను మరిచిపోయాను."

"రెడ్ రైడింగ్ హుడ్," అన్నాడు హారిజన్.

"ఆఁ! అల్లాంటిది," అన్నాడు సెత్. "చిన్నపిల్లల కథ. ఈ సోమరి జాక్ చంటిపిల్లవాడుగా ఉన్నప్పుడు భూమ్మీదనించి ఇక్కడికొచ్చాడు. కొత్త ప్రపంచకాన్ని చూశాడు. ఇక్కడ ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకున్నాడు. అతి తెలివి ఉపయోగించొచ్చు ననుకున్నాడు. గాదికింద పందికొక్కులా బతకొచ్చుననుకున్నాడు."

"గాదికింద పందికొక్కంటే?" అని అడిగాడు గ్లిడ్.

"తేరగా ఇతరుల మొమోలన్నీ మీద వేసుకుని, తీర్చకండా ఎగ గొట్టేవాడు, వచ్చినంతవరకూ రాబట్టుకుని, ఇవ్వడానికి నిరాకరించే వాడు."

"అర్థమైంది. అలాంటి వాళ్ళని నేనూ ఎరుగుదును."

"పదహారేళ్లొచ్చేదాకా జాక్ బాగానే కాలక్షేపం చేసేశాడు. కుర్రవాడు గదా! కుర్రవాళ్ళకా గుణం ఉంటుంది. అంచేత అదంత మేం లక్ష్యపెట్టం. పదహారేళ్లూ దాటాక అతనికొచ్చింది పెద్ద ఇబ్బంది."

"ఎల్లా?" అని అడిగాడు హారిజన్ తన కుతూహలాన్ని దాచ డానికి ప్రయత్నిస్తూ.

"ఊరంట తిరిగేవాడు. దొరికినన్ని మొమోలు మీద వేసుకునే వాడు. తిండి, బట్ట, ఇంకా అవసరమైనవన్నీ అడగ్గానే దొరికేవి మొదట్లో. ఈ ఊరు చిన్నది. అసలు ఈ లోకంలో ఊళ్ళన్నీ చిన్నవే. అంచేత ఊళ్ళో జనం ఇంచుమించు ఒకరి నొకరు ఎరిగే ఉంటారు. మూడు నాలుగు నెల్లయ్యేసరికి జాక్ గాదికింద పందికొక్కని అందరికీ తెలిసిపోయింది."

"తరువాత," అన్నాడు హారిజన్, అతని కుతూహలం మిన్ను ముట్టింది.

"చటుకుని అన్నిదారులూ మూసుకుపోయాయి," అని చెప్పుకుని పోయాడు సెత్, "జాక్ ఎక్కడికి పోయినా, 'నే నాపని చేయను' ఎదురయ్యేది. జనం ఆ ఆయుధం అతనిమీద ప్రయోగించేవారు. స్వేచ్ఛంటే అదే గదా! తిండి లేదు, గుడ్డ లేదు, సుఖం లేదు, స్నేహి తులు లేరు, ఏమీ లేదు. ఆకలి దహించుకుని పోతోంది. ఒక రాత్రి

ఒకరి వంట ఇంటికి కన్నంపెట్టి కడుపునిండినంత తినేశాడు. వారం రోజుల తరవాత అదే అతని మొదటి భోజనం."

"అప్పుడేం చేశారు?"

"ఏం చెయ్యలేదు."

"ఏం చెయ్యకపోతే అతను అదే పని ప్రారంభిస్తాడు."

"ఎలా?" అన్నాడు నన్నగా నవ్వుతూ సెత్, "అదేం లాభం లేకపోయింది. మరునాడు మళ్ళీ కడుపు ఖాళీ గదా! ఎవరింటికో కన్నం వెయ్యాలి. ఆ మరునాడూ అంతే. ఎన్నాళ్ళని ఇలా? జనం జాగ్రత్త పడ్డారు. కట్టుదిట్టాలు చేసుకున్నారు. అంతకంతకి అతనికి బ్రతకడం మరి కష్టమైపోయింది. ఎంత కష్టమైందంటే ఆ ఊరు వదిలి, మరో ఊరు పోతే నయమనుకున్నాడు. సోమరి జాక్ మరో ఊరు పోయాడు."

"మళ్ళీ అక్కడా అదే పని చేశాడు." అన్నాడు హారిజన్.

"మళ్ళీ అదే కారణంవల్ల అదే అవస్థలో పడ్డాడు." అన్నాడు సెత్, "అక్కణ్ణించి మూడో ఊరు, నాలుగో ఊరు-అల్లా ఇరవై ఊళ్ళు తిరిగాడు. శుద్ధ మూర్ఖుడు గనక ఇదేం లాభంలేదని గ్రహించ లేక పోయాడు."

"అతనికి గడిచిపోతోంది గదా." అన్నాడు హారిజన్, "ఒక ఊరి నించి మరో ఊరికి కదలడం తప్ప, మరోపని ఏమీచెయ్యనక్కర లేకండా పొట్టగడిచిపోతోంది."

"అదేలేదు. చెప్పానుగా. మా ఊళ్ళు చిన్నవని. ఒక ఊరి జనం మరో ఊరికి తరుచు వస్తూపోతూ ఉంటారు. రెండో ఊళ్ళో, మొదట ఊరి జనం ఎవరన్నా తన్ని చూస్తారేమోనని తప్పించుకు

తిరగాల్సి వచ్చింది జాక్. ఊరినించి ఊరు-పోయినకొద్దీ ఈ సమస్య మరీ క్లిష్టమైపోయింది. ఇరవయ్యో ఊళ్ళో, పందొమ్మిది ఊళ్ళ తాలూకు జనాన్నించి తప్పించుకు తిరగాల్సి వచ్చింది."

సెత్ ముందుకి వంగి ప్రతి అక్షరం నొక్కి ఉచ్ఛరిస్తూ అన్నాడు, "ఇరవై ఏడు ఊళ్ళయాయి. ఇరవై ఎనిమిదో ఊరు అతను చేరుకో లేకపోయాడు."

"ఏం?"

"ఇరవై అయిదో ఊళ్లో రెండు వారాలు కాలక్షేపం చేశాడు. ఇరవై ఆరులో ఎనిమిది రోజులు, ఇరవై ఏడులో ఒక్కరోజు. అంతే-అదే ఆఖరు ఇంచుమించుగా."

"తరవాత ఏం చేశాడు?"

"అడవులకు అడ్డు పడ్డాడు. అడవి పళ్ళతోటీ, కందమూలాలతోటీ కడుపునింపుకోడానికి ప్రయత్నించాడు. ఆఖరికి ఒకరోజుని దారిని పోతున్న వాళ్ళవళ్లో చూశారతన్ని, ఒక చెట్టుకొమ్మకి ఉరేసుకుని వేళ్లాడుతున్నాడు. శరీరం పూర్తిగా శుష్కించిపోయింది. గుడ్డలు పీలికలై పోయాయి. ఏకాకి అయిపోయాడు. తన్ను తాను కాపాడుకునే శక్తిపోయింది. చచ్చిపోయాడు. అదీ సోమరి జాక్ కథ. ఇరవై పళ్లు నిండకండానే కథ ముగిసిపోయింది."

"భూమిమీద మాత్రం, సోమరులైనంత మాత్రాన్ని మనుష్యుల్ని ఉరి తీయం," అన్నాడు గ్లిడ్.

"మేమూ తియ్యం," అన్నాడు సెత్, "వాళ్ళంతట వాళ్ళు ఉరి వేసుకోడానికి స్వేచ్ఛ ఇస్తాం." వాళ్ళిద్దరినీ చురుగ్గా చూశాడు.

"మీరేం కంగారు పడకండి. ఈ మధ్యకాలంలో ఎవరూ ఉరి వేసుకునే స్థితికి రాలేదు-నేను విన్నంతవరకూ. జనం తమమీద ఉన్న మొమోలు మామూలుగా ఎందుకు పాటిస్తారంటే-వాళ్ళకేదో తమ బాధ్యత నిర్వహించాలన్న పట్టుదల ఉండికాదు. అలా పాటించడం వాళ్ళకి ఆర్థికంగా అవసరం. పాటించకపోతే బతకలేరు. ఒకరినొకరు ఆజ్ఞాపించరు. దండించరు. కాని ఈ లోకంలో జీవన విధానంలోనే ఒక రకమయిన బలవంతం ఇమిడి ఉంది. మనుషులు నిజాయితీతో వ్యవవహారించాలి. లేకపోతే వాళ్ళకి బాధలు తప్పవు. బాధలు ఎవడు కోరి తెచ్చుకుంటాడు ? ఎంత మట్టి బుర్రైనా ?"

"అవున్లే. నువ్వు చెప్పింది సబబుగానే ఉంది," అన్నాడు హారిజన్. అతని మనస్సు మధనపడుతోంది.

"సబబే కాదు. అక్షరాలా నిజం," అన్నాడు సెత్, "అయితే నేను మీతో చర్చించదలుచుకున్నది ఈ విషయం కాదు. ఇంతకన్నా ముఖ్యమైనది. అసలు జీవితాశయం ఏమిటి ?"

"శరీరానికి మోసం రాకండా, అంతరిక్షంలో యధేచ్ఛగా యాత్రలు సాగించడం," అన్నాడు గ్లిక్ అనుమానం లేకండా.

"నాదీ అంతే," అన్నాడు హారిజన్.

"నేననుకున్నాను. అల్లాంటి కోరికలేకపోతే మీరసలు అంతరిక్ష దళంలో ఎందుకు చేరుతారు ? కాని ఎల్లకాలం అంతరిక్షంలో ఎలా ఉండగలరు ? అన్ని సరదాలూ ఎప్పుడో ఒకప్పుడు ఆఖరు కావలిసినవే. ఆ తరవాత ?"

హారిజన్ ఇబ్బందిగా ఇటూ అటూ మెదిలాడు, "అవన్నీ ఇప్పుడు ఆలోచించాలని లేదు నాకు."

"ఎప్పుడో ఒకప్పుడు ఆలోచించక తప్పదు," అన్నాడు సెత్. "ఇంకా ఎన్నాళ్లుంది మీకుద్యోగం ?"

"భూమీమానంలో నాలుగున్నర సంవత్సరాలు."

సెత్ గ్లిడ వేపు చూశాడు.

"మూడేళ్ళు."

"దగ్గరకొచ్చేసింది," అన్నాడు సెత. "మీకింక ఆట్టే రోజు లుండదని నే ననుమానించాను. అంతరిక్షంలో ఇంక మారుమూలకి వచ్చే నౌక నడపడానికి బాగా అనుభవమున్న నావికులు తప్ప మిగతా వారు పనికిరారు. అంటే వాళ్లు పింఛను పుచ్చుకునే రోజులు దగ్గర పడ్డా యన్నమాట. బాగా అనుభవమున్న వాళ్ళకే మరీ గడ్డు పనులు. భూమికి మీ నౌక తిరిగి చేరుకునేసరికి మీలో చాలామందికి నౌకరీలు ఆఖరై పోతాయి. అవునా ?"

"నాకు ఆఖరే," అని ఒప్పుకున్నాడు గ్లిడ. తలుచుకుంటే అందనికే దిగులుగా ఉంది.

"కాలం ఉండే-వయసు ముళ్ళినకొద్దీ మరీ తొందరగా కదిలి పోతుంది. కాని నౌకరీలోంచి విరమించేటప్పటికి మీరింకా నడి వయస్సులోనే ఉంటారు."

అతని ముఖంమీద చిరునవ్వు వాళ్ళని వెక్కిరిస్తున్నట్టు పొడు స్తోంది.

"బహుశా మీరు అప్పుడొక అంతరిక్ష నౌక సొంతంగా కొనుక్కొని యాత్రలు సాగిస్తారనుకుంటాను."

"అది అసంభవం," అన్నాడు గ్లిడ్, "ఎంత ధనవంతుడైనా ఏదో చంద్రమండలానికి పోగలిగిన చిన్న నావలు కొనుక్కోగలడు అంతే. అంతరిక్షంలో నక్షత్రమండలాలు చుట్టివచ్చిన వాడికి ఈ చిన్న గ్రహాలమధ్య తిరగడంలో ఏం సరదా ఉంటుంది? లోకంలో అందరి కన్నా ధనవంతుడైనా, ఈ అంతరిక్ష నౌకల్లో అతి చిన్నదాన్ని కొన లేడు. ఒక్క ప్రభుత్వాలే వాటిని నిర్మించగలవు."

"ప్రభుత్వాలంటే నీ అభిప్రాయం జాతులు-జనసమూహాలు అవునా?"

"ఒకరకంగా అంతే."

"మరయితే ఈ అంతరిక్ష యాత్రలు అరికట్టడంతోటే మీరం చేయదలచుకున్నారు?"

"మా చేటచెవుల స్నేహితుడికీ నాకూ తేడావుంది." అన్నాడు గ్లిడ్ హారిజన్ వేపు వేలుపెట్టి చూపిస్తూ "నేనొక సైనికుణ్ణి సాంకేతిక పరిజ్ఞానం నాకేం లేదు. అంచేత అతనికన్నా నా కవకాశాలు తక్కువ."

ఒకసారి గడ్డం ఆలోచనా పూర్వకంగా సవరించాడు.

"నేను పుట్టింది పొలాలమధ్య. వ్యవసాయం నేనింకా మరిచి పోలేదు. ఒక చిన్న పొలం కొనుక్కొని సాగుచేసుకొని బ్రతకాలని వుంది."

"ఆపని నీవల్ల అవుతుందా?" అని అడిగాడు సెత్, అతన్ని పరీక్షగా చూస్తూ.

"ఫాల్డర్, హైజియా, నార్గన్ స్వర్గంలాంటి వెనకబడ్డ గ్రహాల్లో ఫరవాలేదు. భూమిమీద మాత్రం అసంభవం, నేను కూడ

పెట్టింది చాలదు. భూమ్మీద ఖరీదులు మహా ఎక్కువ."

"అంటే చాలినన్ని మొమోలు కూడబెట్టలేవన్నమాట."

"నావల్ల కాదు." అని ఒప్పుకున్నాడు గ్లిడ్, కొంచెం ఆముదం తాగినట్టుగా, "నాలుగు మూరలు తెల్లగడ్డం పెరిగేదాకా నన్ను నౌకరీ చెయ్యనిచ్చినా అంతడబ్బు కూడబెట్టలేను."

"అంటే భూమిమీద అంత నమ్మకంగా నౌకరీ చేసినందుకు ప్రతిఫలం అదన్నమాట. నీ ఆశలన్నా వొదులుకోవాలి, భూమినన్నా వదలిపోవాలి."

"నోరు ముయ్యి."

"నే నాపని చెయ్యను," అన్నాడు గ్లిడ్. బల్లమీదికి వంగాడు వాళ్ళకి దగ్గరగా అన్నాడు, "రెండు లక్షలమంది భూమీయులు ఈ లోకంలోకి ఎందుకు వలసవచ్చారో తెలుసా? శాంతిమతస్థులు హైజ యాలే, బౌద్ధులూ జైనులూ మరో లోకంలోకి ఎందుకు పోయారు? ఎందుకంటే, న్యాయంగా బ్రతికే తన పౌరులికి భూమి ఇచ్చే ఆజ్ఞ ఏమిటి? ఇక్కడుండి చావండి, లేకపోతే బయటికి పొండి. అంచేత మేం బయటికి పోయాం."

"ఏమయితేనేం? అదీ మంచిదే అయింది." అంది ఎలిస్సా, "మన చరిత్ర పుస్తకాల ప్రకారం, భూమ్మీద జనాభా హద్దుమీరి పెరిగిపోయింది. మనం వచ్చెయ్యడంవల్ల కాస్త రద్దీ తగ్గింది."

"అదికాదు విషయం," అన్నాడు సెత్ ఆమెను మందలిస్తూ. గ్లిడ్‌తో మళ్ళీ అన్నాడు, "నీకో పొలం కావాలి. నీకెంత కోరికగా ఉన్నా భూమిమీద సంపాదించడం నీతరం కాదు. భూమి నిన్నవతలికి

పోమ్మంటుంది. అంచేత మరోలోకంలో వెతుక్కోవాలి." ఈ మాటలు అతని మనసులోకి ఇంకేదాకా కొంచెం ఆగాడు. అన్నాడు,

"ఇక్కడన్నావా, అడగ్గానే దొరుకుతుంది పొలం. సునాయాసంగా." సులభమని సూచించడానికి వేళ్ళు టక్కున విరిచాడు.

"నన్నలా టోకరా తినిపించలేవు," అన్నాడు గ్లీడ్, అతని ధోరణి మాత్రం టోకరా తినడానికి ఆత్రపడుతున్నట్టుంది.

"అందులో ఏదో అడ్డుపుల్ల ఉంటుంది."

"ఈ లోకంలో - ఏ పొలంగాని, స్థలంగాని, దాన్ని అనుభవిస్తూన్న వాడికి చెందుతుంది. ఆ అనుభవిస్తున్నంత కాలం దాని మీద హక్కు అతనిదే. నువ్వు చెయ్యవలసిందేమిటంటే- కాస్త అటూ ఇటూ తిరిగి చూసుకో. ఎవరూ ఆక్రమించని నేల-వ్యవసాయానికి అనుకూలంగా ఉండేది-ఎన్నుకో. అలాంటి నేల కావలసినంత ఉంది. దాన్ని అనుభవిస్తూ ఉండు. అది నీదై పోతుంది. ఆనాటినుంచి దాన్ని సాగుచెయ్యడం మానేసి నువ్వందులోంచి వెళ్ళిపోయావనుకో. అది నీతరవాత ఎవడాక్రమించుకుంటే వాడిది."

"అరె దీని తస్సల్ చెక్కా!" అన్నాడు గ్లీడ్ ఆశ్చర్యంగా.

"అంతే కాదు. కాస్త శ్రమపడి జాగ్రత్తగా నాలుగు చోట్లా తిరిగి చూశావంటే, సాగులో ఉన్న నేల నీకు సులభంగా దొరకొచ్చు. ఆ నేల సాగుచేస్తున్న ఆసామి అనేక కారణాల వల్ల దాన్ని వొది లెయ్యొచ్చు. అతను చచ్చిపోవచ్చు. అనారోగ్యంవల్ల వదిలెయ్యొచ్చు. మరోచోటికి పోయి ఉండవచ్చు. అంతకన్నా మంచి పొలం దొరికి ఉండవచ్చు. అలాంటి పొలం దొరికితే అదృష్టం పండిందన్న మాటే. చదును చేసి గట్లు వేసిన చేలు, నీటి సదుపాయాలు, దూడలసాలలు

అన్నీ అమరి ఉంటాయి. అందులో ముందు-నువ్వడుగు పెట్టగలిగితే ఇంక అది నీదే.

"పాతకామందుకి నేను పరిహారం ఏమివ్వాలి?" అని అడిగాడు గ్లిడ్.

"ఏమీలేదు. ఒక్క మొమో నీమీదుండదు. నువ్వెందుకివ్వాలి? వాడు వొదిలేసి పోయాడంటే, ఇంతకన్నా మంచిది వాడికి తేరగా దొరికిందన్నమాటేగా. రెండు వేపులా లాభం ఎల్లాగ? ఒకటొస్తే ఒకటి పోవాలి."

"నాకిదేమీ అర్థం కావడం లేదు. ఇందులో ఎక్కడో తిరకాసుంది. ఎవరికో ఒకరికి నా ఆర్జనంతా ఇవ్వాలి. లేదా తీర్చలేనన్ని మొమోలు బాకీ పడాలి."

"మొమోలు మీదవేసుకోక తప్పదు. సాగు ప్రారంభిస్తావు. ఇరుగు పొరుగు జనం వొచ్చి నీకిల్లు కట్టుకోడంలో సాయం చేస్తారు. నీమీద మొమోలు కుప్పతిప్పలుగా పడతాయి. వడ్రంగి రెండు సంవత్సరాలపాటు ధాన్యం పప్పులూ తన కుటుంబానికిమ్మంటాడు. ఇస్తావు. మరో రెండు సంవత్సరాలిస్తూనే పోతావు. ఇచ్చి అతనిమీద మొమో పారేస్తావు. నీ ఇంటికేదన్నా మరమ్మతు చేసో, చుట్టూ దడి బాగుచేసే అతను ఆ మొమో తీర్చుకుంటాడు. అందరి విషయంలోనూ అంతే-ఎరువు, విత్తులు అమ్మేవాళ్ళు, ట్రాక్టర్లమ్మే వాళ్ళు, సామాన్లు చేరవేసినవాళ్ళు ఎవరైనా సరే."

"అందరికీ నా ఆవులపాలూ, నా పొలంలో బంగాళా దుంపలూ అక్కర్లేకపోతే?" అని అడిగాడు గ్లిడ్.

"బంగాళాదుంప లేమిటి? నే నెప్పుడూ విన లేదు."

"ఏదైతేనేం. నేను పండించేవన్నీ ఆ ఆసామీ మరొకరి దగ్గర్నుంచి అప్పుడే పుచ్చుకుంటున్నాడనుకో. అప్పుడు అతని మొమో నే నెల్లా తీర్చగలను?"

"దానికేముంది?" అన్నాడు సెత్, "కమ్మరి నీకు ఇనపకవ్వాలు చేసి ఇచ్చాడు. ఆహార పదార్థా లతనికక్కర్లేదు. అవన్నీ ఇంకో చోటి నించి అతను తెచ్చుకున్నాడు. తిండెక్కువై వాడి భార్యకి ముగ్గురు కూతుళ్ళకి ఒళ్ళు పెరిగింది. అది తగ్గించడానికి నిరాహారం అలవాటు చేస్తున్నాడు. ఇంక నీ పొలంలోంచి కూడా ధాన్యం అవీ వచ్చిపడితే వాళ్లు చస్తారు. ఏమయితేనేం ఫలానా కమ్మరికి నీ పొలంలో పండేవి ఏవీ అక్కర్లేదు"."

"అక్కర్లేదు."

"కాని ఈ కమ్మరి తాలూకు దర్జీవాడో, లేక జోళ్లు కుట్టేవాడో పిడిమీద ఎప్పుడో మొమోలు పారేసుకుంటారు. ఈ కమ్మరికి వాటిని తీర్చే అవకాశం రాలా. అంచేత వాళ్ళ మొమోలు నీమీద పారేస్తా డీ కమ్మరి. నీకవకాశమున్నప్పుడు ధాన్యమో, పప్పులో, పాలో, పళ్ళో, దర్జీకో, జోళ్ళు కుట్టేవాడికో సరఫరా చేస్తావు. అప్పుడు నువ్వు కమ్మరికీ, కమ్మరివాడు దర్జీకి బాకీ ఉన్న మొమోలు అన్నీ తీరి పోతాయి.

సంతృప్తిగా చిరునవ్వు నవ్వుతూ ముగించాడు, "అంతా సుఖంగా ఉంటారు."

గ్లీడ్ ఇదంతా అతిగా తిని జీర్ణం చేసుకుంటున్నాడు. చిరాకుగా ముఖం చిట్లించాడు.

"నాకాశ పెడుతున్నావు నువ్వు. నువ్వలా చెయ్యకూడదు. అంతరిక్షోద్యోగి మనసు మార్చి అతన్ని విధి నిర్వహణనుంచి వేరుచేస్తే అది పెద్ద నేరం. రాజద్రోహం. భూమి రాజద్రోహాన్ని సహించదు."

"సహించక చస్తుందా?" అన్నాడు సెత్ అపహాస్యంగా. "ఇక్కడ అమలులో ఉన్నవి గాంధీ శాసనాలు."

"నువ్వు చెయ్యవలసిందేమిటంటే," అంటూ మృదువుగా ప్రారంభించింది ఎలిస్సా, "తప్పకండా తిరిగి ఆ నౌకలోకి పోవాలి. పోవడం నీ విధి అనుకోవాలి. నువ్వు లేకపోతే నౌక గాని, భూమి గాని నడవ్వనుకోవాలి." ముందుకు వాలిన ముంగురొకటి చేత్తో వెనక్కి సర్దుకుంది. తాపీగా అంది, "అప్పుడు స్వతంత్రుడవు కావాలి. ధైర్యంగా 'నేనాపని చేయను' అనాలి."

"వాళ్ళు నా చర్మం వొలిచేస్తారు. బిడ్‌వర్ధి స్వయంగా దగ్గరుండి ఆ కార్యక్రమం నడిపిస్తాడు."

"నేనలా అనుకోను," అన్నాడు సెత్. "ఈ బిడ్‌వర్ధి బహుశా కొంచెం చిర్రూ బుర్రూ అనే రకం గాబోలు. అయినా సరే. అతనూ, అతనితోబాటు నీ తక్కిన అనుచరులూ, అందరూ చీలుదార్ల మొగ దగ్గరకొచ్చారు—నీలాగే. అతనిముందు దారి రెండుగా చీలిపోయింది. ఈ రెంటిలో ఏదో ఒకదారి అతను ఎన్నుకోవాలి. మూడో దారి ఏదీ లేదు. నేడు కాకపోతే రేపయినా అతను ఇంటిముఖమన్నా పట్టాలి—పోయి ఏం చెయ్యాలీ అని పై పెదవి కొరుక్కుంటూ, లేకపోతే ఇక్కడేదో వాహనం చూసుకుని, నీకమతంలోపాలు నలుగురికి పంచి పెట్టాలి. మనస్సు లోలోపల అతనికిలాంటి కోరిక ఉండడం సహజం. అతనూ మనిషే గనక."

"అతని విషయం నీకంత బాగా తెలియదు," అన్నాడు గ్లీడ్ విషాదంగా, "అతని గుండెకాయ ఉండవలిసినచోట పాత ఇనప గుండుంది."

"చిత్రం చూడు," అన్నాడు హారిజన్. "నిన్ను గురించి కూడా నేనలాగే అనుకునేవాణ్ణి- ఈనాటి వరకూ."

"నే నిప్పుడు డ్యూటీలో లేనుగా," అన్నాడు గ్లీడ్, రహస్య మంతా అందులో ఉన్నట్టు. "సెలవులో ఉన్నాను. హాయిగా మనస్సుని ఇష్టమొచ్చినట్టు విహారించనిస్తాను."

చటుకుని లేచాడు. పెదవి బిగించాడు, అన్నాడు, "కాని నే నిప్పుడు వెనక్కి వెళ్ళిపోతున్నాను. ఇప్పుడే!"

"రేపు సాయంత్రందాకా నీకు శలవుంది," అని జ్ఞాపకం చేశాడు హారిజన్.

"కావచ్చు. అయినా సరే వెళ్ళిపోతున్నాను."

ఎలిస్సా ఏదో అనబోయింది. సెత్ ఆమెను మోచేత్తో తాకి హెచ్చరించాడు. గ్లీడ్ దృఢంగా అడుగులువేస్తూ వెళ్ళిపోతుంటే అంతా మౌనంగా కూర్చున్నారు.

"సూచనలు బాగానే కనబడుతున్నాయి." అన్నాడు సెత్ సంతృప్తిగా "మనస్సులో అతి మెత్తనిచోట తగిలింది గట్టి దెబ్బ."

తనలో తను నవ్వుకున్నాడు. హారిజన్ వేపు తిరిగి అన్నాడు

"నీ జీవితాశయం ఏమిటి?"

"భోజనం పెట్టినందుకు ధన్యవాదాలు. చాలా బాగుంది. నా కవసరం కూడా," అంటూ లేచి నిలబడ్డాడు.. ముఖంలో కలవ

పోతుంది. తలుపువేపు చూపిస్తూ అన్నాడు, "అతన్ని పట్టుకోవాలి. అతను ఓడలోకి పోతుంటే, నేనూ పోవడం మంచిది."

సెత్ మళ్ళీ ఎలిస్సాని మోచేత్తో పొడిచాడు. హారిజన్ వెళ్ళి పోతూ జాగ్రత్తగా తన వెనకాల తలుపు మూసేశాడు.

"గొర్రెలు," అంది ఎలిస్సా ఎందుకో అసంతృప్తిగా, "ఒక దాని వెనక ఒకటి పోతాయి గొర్రెల్లాగే."

"అలా కాదు" అన్నాడు సెత్, "మనుషులే వాళ్ళు. వాళ్ళ మనస్సుల్లో ఒకే రకం ఆందోళనలు, వాళ్ళ గుండెల్లో ఒకే రకం ఆవేదనలు. సచ్ఛంగా ఈ లోకానికి వచ్చిన మన పూర్వీకుల స్థితిలో ఉన్నారు వాళ్ళు."

తన కుర్చీలో అతి కష్టంమీద వెనక్కి తిరిగి మాట్‌ని పిలిచి అన్నాడు, "రెండు పర్బతులు తీసుకురా!" తరవాత ఎలిస్సాతో అన్నాడు,

"నా కింక తోస్తుందంటే, ఇక్కడింక ఆట్టే కాలం ఆ ఓడ ఉండదు. ఉండి లాభం లేదు గనక."

యుద్ధనౌకలో అకారాదిగా పేర్లు పిలవబడుతున్నాయి, అధికార పూర్వకంగా.

"ఫాన్‌షా, ఫాల్సన్, ఫుల్లర్, గార్సన్ గ్లీడ్, గ్రిగరీ, హాన్స హారిజన్, హార్ప ....——"

జనం చీమలబారుల్లా సన్నని సందుల్లోంచి, నడవల్లోంచి అంతరిక్ష పటాలున్న గదివేపు సాగుతున్నారు. ఆ గది ముందు చిన్న చిన్న గుంపులుగా గుమిగూడారు. మెల్లని గొంతుకలలో గుసగుసలాడుకుంటున్నారు.

"మనతో మరేం మాట్టాడరు. పలకరిస్తే 'అవామెుమో' అంటారు. నాకు విసుగెత్తిపోయింది. వొచ్చేశాను."

"మీరు విడివిడిగా వెళ్ళవలిసింది, మాలాగా. ఊరి చివర ఆ సినీమా ఉందే – వాళ్ళకి భూమీయుడెలా ఉంటాడో తెలియదు. నేను మెల్లగా వెళ్ళి ఒక కుర్చీలో కూర్చున్నాను."

"మీకిన్ సంగతి విన్నావా? ఇంటికప్పెక్కడో కారుతుంటే బాగు చేశాట్ట. దానికి బదులు సారాబుడ్డిచ్చార్రట. కాళీ చేశాడు. వెల్లగిల పడిపోయి ఉన్నాడు మేం చూసేసరికి. మోసుకొచ్చాం."

"కొందరి అదృష్టం అలాంటిది. మా ముఖాలెక్కడ కనబడ్డా వాళ్ళు ముఖాలు తిప్పేసుకున్నారు. చాలా బాధేసింది."

"నేను చెప్పినట్టు విడివిడిగా వెళ్ళవలిసింది."

"సగం జనమింకా తిరిగి రాలేదు. ఏ రోడ్ల మీద దొర్లుతున్నారో!"

"గ్రేడర్‌కి పిచ్చికోపం వస్తుందిలే. ముందే తెలిస్తే ఈ పొద్దున్న వెళ్ళిన సిబ్బందికి సెలవిచ్చేవాడే కాదు."

మార్గన్ మాటిమాటికి తలుపు తెరిచి ఒకొక్క పేరూ మళ్ళీ మళ్ళీ పిలుస్తున్నాడు. జవాబిచ్చిన పేర్లు చాలా తక్కువ.

"హారిజన్!" అని అరిచాడీసారి.

కలవరపడుతూ లోపలికి వెళ్ళాడు హారిజన్. ఒక బల్ల వెనక కుర్చీలో కూర్చున్నాడు గ్రేడర్. తన ముందున్న జాబితాను చూస్తున్నాడు. కల్నల్ పెల్టన్ కర్రలా ఒకపక్క నిలబడి ఉన్నాడు. మేజర్ హోమ్ కొంచెం అతని వెనక ఉన్నాడు. ఏదో దుర్వాసనను అతి కష్టం మీద భరిస్తున్నట్టుంది వాళ్ళ ముఖాల తీరు.

మహాఘనత వహించిన రాయబారి బల్లముందు పచారుచేస్తూ తన అనేక గడ్డాల లోతుల్లో గొణుక్కుంటున్నాడు. "అయిదు రోజులు కాలేదు. అప్పుడే కంపు గొడుతోంది."

హారిజన్ లోపలకి రాగానే అతనిమీద బాణాల్లా వదిలాడు ప్రశ్నలు, "నువ్వా తమ్ముడూ! సెలవులోంచి ఎప్పుడు తిరిగొచ్చావు?"

"మొన్నసాయంత్రం సార్."

ఏం ముందొచ్చేశావన్న మాట. ఆశ్చర్యమే. ఏదన్నా గాలి గీలి పోయిందా?"

"లేదండి. నా సైకిల్ తీసికెళ్ళలేదిసారి."

"మంచిపని చేశావు," అన్నాడు రాయబారి, "సైకిల్ తీసికెళ్ళి ఉంటే ఈపాటికో వెయ్యిమైళ్లు దాటేసి ఇంకా గట్టిగా తొక్కుతుండేవాడివి."

"ఎందుకండి?"

"ఎందుకా? నన్నెందుకని అడుగుతాడు చూడండి. అది తెలుసుకోవాలనే తాపత్రయం, ఎందుకో నాకు తెలియాలి." కొంచెం బుసలు కొట్టాడు. తరవాత అడిగాడు, "నువ్వా ఊళ్లోకి ఒంటరిగా వెళ్ళావా, ఎవరన్నా తోడున్నారా?"

"సార్జంట్ గ్లీడ్ నాతో ఉన్నాడు సార్."

"అతన్ని పిలు," అని ఆజ్ఞాపించాడు రాయబారి. మార్గన్ తలుపు తెరిచి,

"గ్లీడ్! గ్లీడ్!" అని అరిచాడు.

జవాబు లేదు.

మళ్ళీ ప్రయత్నించాడు. ఫలితం లేకపోయింది. అతని పేరు నౌకలో అన్ని గదుల్లోకి రేడియోద్వారా ప్రసారం చేశారు. అతను రావడానికి నిరాకరించాడు.

"అసలు నౌకలోకి తిరిగి వచ్చాడా?"

గ్రేడర్ జాబితా చూశాడు. "ముందే వచ్చాడు. రావలసిన దానికంటె ఇరవై నాలుగు గంటలు ముందు. రెండో సిబ్బందితో మళ్ళీ మెల్లగా అవతలికి జారిపోయి ఉంటాడు, ఈ ఉదయం. అది పెద్ద నేరం."

"నేరం సంగతి అలా ఉంచు, అతను నౌకలో లేకపోతే బయట వుండాలి"

"అవును ప్రభూ." అన్నాడు నిరుత్సాహంగా.

"గ్లిడ్!" అని దీర్ఘంగా మరోసారి గదిబయట అరిచాడు మార్గన్. కొంతసేపయాక లోపలికొచ్చాడు.

"మహాప్రభూ! గ్లిడ్ నౌకలో లేడట. ఎందుకంటే, ఒక సైనికుడు ఇంతక్రితమే అతన్ని ఊళ్ళో చూశాడట." అన్నాడు.

"వాణ్ణి పంపించు లోపలికి," అన్నాడు రాయబారి. హారిజన్ని చికాకుగా మందలించాడు, "కదలకండా నిలబడు. ఆ చేటచెవులెందుకల్లా ఆడిస్తావు? నీతో పనింకా పూర్తికాలేదు."

ఒక పొడుగాటి కోతి ముఖం లోపలికొచ్చింది. పెద్ద అధికార్లను చూసి కొంచెం బెదిరింది.

"సార్జంట్ గ్లిడ్ విషయం నీకేం తెలుసు?" అని అడిగాడు రాయబారి.

వాడు పెదవులు తడుపుకున్నాడు. అసలు గ్లీడ్ పేరెందుకెత్తానా అనుకున్నాడు.

"ఏం జరిగిందంటే మహాప్రభూ!...."

"నన్ను సర్ అని సంబోధించు."

"సరే సర్." అతని కంగారు మరీ ఎక్కువైంది. "రెండో సిబ్బందితో ఈ పొద్దున్న నేను బయటికి వెళ్ళానండి. నాకు కడుపులో గాభరాగా ఉంటే తిరిగొచ్చేశానండి. రెండు గంటలైందండి. సార్జంట్ గ్లీడ్ నాక్కనపడ్డాడండి. అతన్ని పలకరించానండి."

"ఎక్కడ? ఎప్పుడు?"

"ఊళ్ళోనండి. దూరప్రయాణం చేసే ఈ పెద్ద బస్సుల్లేవండీ, అందులో కూర్చున్నాడండి. నాకు చిత్రంగా అనిపించిందండి."

"తొందరగా అసలు కథ చెప్పవోయి చవటా! అతను నీతో ఏమన్నా అన్నాడా? ఏమన్నాడు?"

"పెద్ద అంతగా ఏమీలేదండి. ఎందుకోగాని మహాహుషారుగా ఉన్నాడండి. ఎక్కడో రెండువందల యెకరాలు ఎవరో విధవావిడ చూసుకోలేక కష్టపడుతోందిట. ఆమెను గురించి ఎవరో చెప్పారట. చూద్దామని పోతున్నాడట." తరవాత కొంచెం సందేహించి అన్నాడు "నాకతనింక కనబడ్డం అసంభవమున్నాడు సార్."

"మీ దళంలో ఒకడు," అన్నాడు రాయబారి కల్నల్ షెల్టన్‌తో, "మంచి సైనికుడు, క్రమశిక్షణ గలవాడు, పాత ఉద్యోగి, సార్జంటయాడు. పెన్షనుండి అతనికి రాబోయేది." ఆ తరవాత ఈ కబురు తెచ్చిన సైనికుడివైపు చూసి అడిగాడు, "ఎక్కడికి వెడుతున్నాడో ఏమన్నా చెప్పాడా?"

"లేదు సార్. నే నడిగాను. నవ్వి 'అవామొమో' అన్నాడండి. నేను నౌకకి తిరిగొచ్చాశానండి."

"సరే. నువ్వింక పోవచ్చు." రాయబారి అతనువెళ్ళిపోయే దాకా అతనివేపు చూశాడు. తరవాత హారిజన్‌తో అన్నాడు. "బయటికి పోయిన సిబ్బందిలో మీది మొదటిది."

"అవును సర్"

"తమ్ముడూ! ఒక సంగతి చెపుతాను విను. నాలుగువందల ఇరవై మంది సెలవు మీద వెళ్లారు. రెండు వందలే తిరిగొచ్చారు. అందులో నలభై మంది సారా మగతలో ఉన్నారు-రకరకాల స్థితుల్లో. అందులో పదిమంది జైల్లో ఉన్నారు. అంతా గొంతుకలు కలిపి, 'నేనాపని చేయను' అని పాడుతున్నారు, విధి విరామం లేకండా. కాస్త తిక్క తిరిగేదాకా వాళ్ళిపాట పాడుతూనే ఉంటారు."

హారిజన్ వేపు రాయబారి తేరిపార చూశాడు, దీనికి బాధ్యత అతనిదే నన్నట్టు. అన్నాడు, "ఇందులో ఏదో అసందర్భముంది. తాగిన వాళ్ళ సంగతి తెలుస్తూనే ఉంది. నేలమీదికి దిగిన మొదటి రోజుని కాస్త ఒళ్ళు మరిచిపోయే రకం కొద్దిమంది ఉంటారు. కాన మామీద దయతలిచి నౌకకు తిరిగి వచ్చిన రెండువందల మందిలో సగంమంది ముందుగానే తిరిగొచ్చారు నీలాగ. వాళ్ళంతా ఒకే కారణాలు చెప్పారు. ఊళ్లో జనం సుముఖంగా లేరు. వీళ్ళని దెయ్యాలని చూసి నట్టు చూశారు. వీళ్లు విసుగెత్తి తిరిగొచ్చేశారు."

హారిజన్ ఏవీ అనలేదు.

"అంచేత వీళ్ళ అనుభవాలు రెండు రకాలు. రెండూ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి." రాయబారి ఎవరిమీదో నేరం ఆరోపిస్తున్నట్టు

న్నాడు, "ఒక గుంపేమో ఊరేమో అసహ్యం వేస్తోందని తిరిగొచ్చే శారు. మరో గుంపుకి మంచి ఆదరం లభించినట్టు కనబడుతుంది. అందులో కొందరు ఆనందం పట్టలేక అతిగా తాగేశారు, మరికొందరు స్వప్నాలోనే ఉండి, మన ఉద్యోగాలకు నీళ్లొదిలి వెళ్ళిపోయారు. దీని అర్థం ఏమిటో నాకు తెలియాలి. అర్థం ఉండాలి గదా! నువ్వు రెండుసార్లు ఊళ్ళోకి వెళ్లి వచ్చావు. నువ్వేమన్నా చెప్పగలవా?"

హారిజన్ జాగ్రత్తగా అన్నాడు. "మనం భూమీయులమని తెలిసిపోతే ఈ జనం ఒకలా చూస్తారు, తెలియకపోతే ఒకలా చూస్తారు. అంతేగాకండా మనం కలుసుకున్న గాంధీయులికి మనల్ని మార్చాలన్న ఆకాంక్ష ఉంటే, మన అనుభవం ఒకలాగుంటుంది, మనల్ని చీదరించు కునే గాంధీయులైతే మరోలా ఉంటుంది." ఒక క్షణం ఆగి, అన్నాడు: "మన యూనిఫారాలవల్ల ఇట్టే బయట పడిపోతున్నాం."

"అంటే యూనిఫారాలంటే కిట్టదా?"

"కిట్టదనుకుంటానండి."

"కారణం చెప్పగలవా?"

"రూఢిగా చెప్పలేను. వాళ్ళ సంగతి అంత బాగా తెలియదు. నేననుకోడం ఏమిటంటే, ఏ భూమీ పరిపాలననించి వాళ్ళ పూర్వీకులు విముక్తి పొందారో, ఆ దుష్పరిపాలనకు ఈ యూనిఫారములు చిహ్న లనుకుంటున్నారేమో. అల్లాంటి భావాలు చిన్నతనంనించీ వాళ్ళకి నేర్పి ఉండొచ్చు."

"విముక్తేమిటి వాళ్ళ బొంద." అన్నాడు రాయబారి కోపంగా. "భూమీయులు కనిపెట్టిన యంత్రాల్ని, పద్ధతుల్ని, నిర్మాణ

కౌశలాన్నీ ఉపయోగించుకున్నారు. కాస్త విశాలంగా తిరగొచ్చు గదా అని ఇక్కడికొచ్చి పడ్డారు." హారిజన్ వేపు కొరకొరా చూస్తూ అడిగాడు.

"వాళ్ళ కి యూనిఫారములవంటివి లేవా ?"

"నేను చూసినంతవరకు లేవండి. ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్ళు కనబడ్డం వాళ్ళకి సరదా అనుకుంటాను. కొందరికి పిలకలుంటాయి, కొందరు ఎర్రజోళ్ళు తొడుక్కుంటారు. గాంధీయులలో ఒకరి దుస్తుల్లాంటివి మరొకడు తొడగడు. అందరూ ఒకలాంటి దుస్తులు తొడుక్కోడం వాళ్ళ దృష్టిలో పెద్ద విచిత్రం. అదసలు బానిసత్వ చిహ్నమని వాళ్ళ నమ్మకం."

"గాంధీయులంటున్నావే వాళ్ళ ? ఆ పేరు వాళ్ళకెల్లా వచ్చింది ?"

హారిజన్ ఎలిస్సా తనకి చెప్పినదంతా గుర్తు తెచ్చుకుంటూ చెప్పాడు. చెపుతూ ఆమెను కూడా గుర్తు తెచ్చుకున్నాడు. అతని మనోనేత్రముందామె ప్రత్యక్షమయింది. సెత్ ఇల్లు, ఆ బల్లలు, ఆ కుర్చీలు వెనకాల వంట ఇంట్లో వెచ్చని ఆవిరి, కమ్మని నోరూరజేసే వాసనలు అన్నీ ప్రత్యక్షమయాయి. ఆ దృశ్యం అపురూపంగా, ఈ నౌకలాంటి దాంట్లో ఎన్నడూ ఉండడానికి వీల్లేనిదిగా అగుపించింది.

"ఆ పెద్దమనిషి వళ్ళు ఆయుధమనేదాన్ని కనిపెట్టాడట," అని ముగించాడు.

"హుం! అతను భూమీయుడని వాళ్ళ వాదం. ఎల్లా ఉంటాడతను. అతని ఫోటో గాని, విగ్రహం గాని చూశావా ?"

"వాళ్ళెవరికీ విగ్రహాలు చేయించరు సార్! ఒక మనిషికంటె మరొక మనిషి ముఖ్యుడని వాళ్లొప్పుకోరు."

"పడిశారు," అన్నాడు రాయబారి, ఆ అభిప్రాయాన్ని దగ్గరకే చేరనివ్వకూడదన్నట్టు. "ఈ అద్భుతాయుధం ఆ పెద్దమనిషి ఎప్పుడు ప్రయోగించాడో ఆ వివరాలేమన్నా కనుక్కున్నావా?"

"లేదు సర్," అన్నాడు హారిజన్, "అదంత ముఖ్యమైనదని నేననుకోలేదు."

"ఎందుకనుకుంటావు? మీలో కొందరు, దేని బొమ్మన్నా వేసి దాని కింద పేరు రాసినా చెప్పుకోలేరు. అంతరిక్ష నౌకల్ని నడపడంలో మీ చాకచక్యాన్ని నేను కాదనడం లేదు. కాని బుద్ధి బలం ఉపయోగించవలిసిన రాచకార్యాల్లో మాత్రం మీ వల్ల గడ్డిపరకంత ప్రయోజనం ఉండదు."

"పొరబాటైపోయింది, సర్!" అన్నాడు హారిజన్.

"పొరబాటట్రా దొంగ గాడిదా!" అంది మనస్సులో లోపల మరో గొంతు, "నీ పొరబాటేముంది? నువ్వెందుకు క్షమార్పణ చెప్పుకోవాలీ బొండానికి? తల్లక్రిందులైనా ఒక్క మొమో వెయ్యగలడా ఎవరిమీదైనా? నీకన్నా వారి గొప్పేమిటి? ఆ హైజీయా లోకంలో గంతులేస్తూ తిరిగే కుర్రకుంకల్ని అడుగు. గుండిగలా పొట్టాం వీడూ, నీకూ వీడికి పోలికా, నీకన్నా వాడెంతో తీసికట్టంటారు. అయినా వాడి గుండిగ పొట్టవేపు అణకువగా చూసి, 'సర్, సర్' అంటావు, పొరబాటంటావు. ఏదీ నీ సైకిలిచ్చి ఒక్కసారి తొక్కమను. పది గజాలు వెళ్ళకముందే పడిపోతాడు. వెళ్ళు. ముఖంమీద ఉమ్మేసి చెప్పు, 'నేనాపని చేయను' అని. ఏం - భయమా వాడంటే?"

"లేదు" అన్నాడు హారిజన్ పైకి నిశ్చయంగా.

కెప్టెన్ గ్రేడర్ అతని వంక చూశాడు, "ప్రశ్నలడక్కుండానే నువ్వు సమాధానాలు చెప్పడం ప్రారంభిస్తే, నువ్వొక వైద్యుణ్ణి చూడ్డం మంచిది. లేక ఏ ప్రేతాలతోనన్నా సంభాషణ సాగిస్తున్నావా?"

"ఆలోచిస్తున్నాను," అన్నాడు హారిజన్.

"అది మంచి కృషే," అన్నాడు రాయబారి. గోడలో ఉన్న అరల్లోనించి రెండు మూడు పెద్ద పుస్తకాలు ఇవతలికి లాగాడు. కాగితాలు తిరగవేస్తూ అన్నాడు, "అవకాశం దొరికినప్పుడల్లా కాస్త ఘాటుగా ఆలోచిస్తూండు. అలవాటైపోతుంది. అంతకంతకి అది చాలా సులభమైపోతుంది. నిజానికి కొంత కాలం పోయేసరికి ఆలోచిస్తూంటే ఏం బాధ పెట్టదు."

ఆ పుస్తకాల అరలో పెట్టేశాడు. మరో రెండు మూడు ఇవతలికి లాగాడు. తన పక్కనున్న మేజర్ హామ్‌తో అన్నాడు,

"చచ్చిన కాలేజీలో బొమ్మలాగ గాజుకళ్ళతో అలా నిలబడకపోతే నాక్కాస్త సహాయం చెయ్యకూడదూ! ఈ జ్ఞానభాండారం లోంచి ఒక విషయం ఇవతలికి లాగాలి. గాంధీని గురించిన వివరాలు కావాలి. మూడు వందల సంవత్సరాల వెనక, వెయ్యి సంవత్సరాల లోపల చూడు."

హామ్ కదిలాడు. కొన్ని పుస్తకాలు ఇవతలికి లాగాడు. కల్నల్ పెల్టన్ కూడా వెతకడం ఆరంభించాడు. కెప్టెన్ గ్రేడర్ మాత్రం బల్ల దగ్గరే కూర్చుని తిరిగిరాని పరివారాన్ని గురించి విచారిస్తున్నాడు.

"ఆఁ ఇదిగో ఇక్కడుంది, నాలుగువందల డెబ్బై ఏళ్ళక్రితం."

రాయబారి లావాటి తన చూపుడు వేలితో పంక్తుల్ని వెతుకుతూ చదువుతున్నాడు, "గాంధీ, బాపు అని కూడా అనేవారు. బాపు అంటే తండ్రి. హిందూ దేశస్థుడు. రాజకీయ తత్వవేత్త. సహాయనిరాకరణమనే వింత ఆయుధాన్ని ఉపయోగించి ప్రభుత్వాన్ని ఎదురుకున్నాడు. మహా విప్లవంలో అతన్ని గురించిన వివరాలు మాయమై పోయాయి. అయితే మనకందుబాటులోలేని ఏ గ్రహంలో నన్నా ఇంకా ఆ తత్వం సజీవంగా ఉండొచ్చు."

"ఉండొచ్చేమిటి? ఉంది." అన్నాడు గ్రేడర్ నిస్పృహతో.

"సహాయనిరాకరణం !", అన్నాడు రాయబారి ఆలోచిస్తూ. తలక్రిందై పోయిన దాన్ని దేన్నో సరిగ్గా తిప్పి చూడాలని ప్రయత్నిస్తున్నట్టు కనబడుతున్నాడాయన.

"ఒక సమాజాన్ని ఆ సూత్రం ఆధారంగా ఎలా నిర్మిస్తారు? అది పనిచెయ్యదే."

"పనిచేస్తుంది." అన్నాడు హారిజన్. 'సర్' అనడం మరిచి పోయాడు."

"నే నన్నది కాదంటున్నావా?"

"ఉన్న విషయం చెపుతున్నాను."

"ప్రభూ! ఒకపని చేస్తే-" అనబోయాడు గ్రేడర్.

"నాకొదిలిపెట్టు ఈ విషయం." అన్నాడు రాయబారి. అతన్ని వారిస్తూ. రాయబారి ముఖం కందగడ్డలాగయింది. కోపంగా హారిజన్ వేపు చూస్తూ అన్నాడు.

"ఆర్థిక సాంఘిక శాస్త్రాల్లో నువ్వేమీ పట్టాలు పుచ్చుకో లేదు. పండితుడవంతకన్నా కావు. ఆ సంగతి గుర్తుంచుకో తమ్ముడూ, నీలాంటివాళ్ళు పై మెరుగులు చూసి ఇట్టే భ్రమలోపడిపోతారు."

"అది పనిచేస్తుంది." అని రెట్టించాడు హారిజన్. అంత ధైర్యం తనకెలా వచ్చిందని అతనికే ఆశ్చర్యంగా ఉంది.

"నీ పిచ్చి బైసికిలూ పనిచేస్తుంది. నీదసలు బైసికిలు తత్వం."

హారిజన్ మెదడులో ఏదో తెగిపోయింది. అచ్చంగా అతని గొంతుకలాంటిదే చటుకుని అంది, "నీ బొంద," అని. ఈ విచిత్రానికి దిగ్భ్రమచెంది అతని చేటచెవులు నిక్కబొడుచుకు నిలబడ్డాయి.

"ఏమిటన్నావు?"

"నీబొంద." అని మళ్ళీ అన్నాడు హారిజన్. అన్నదేదో అనేశాడు. అదింక సద్దుకోవడం అసంభవం, అనవసరం.

ఇంకా ఎర్రబడుతున్న రాయబారి ముఖం చూసి గ్రేడర్ తన అధికారాన్ని వినియోగించాడు.

"ఇకముందు నీకున్న శలవంతా-ఒకవేళ ఉంటే-రద్దుచేయబడింది.. నువ్వు ఓడదాటి బయటకు పోవడానికి వీల్లేదు మేం ఆజ్ఞ ఇచ్చేదాకా. ఇంకపో అవతలికి."

హారిజన్ వెళ్ళాడు. అతని మనస్సు అల్లకల్లోలమై పోయింది, కాని అతనిలో వింత సంతృప్తి నిండింది. గదిబయట మార్గన్ అతని వేపు కొరకొరా చూశాడు.

"నువ్వొక్కడవే రోజల్లా లోపలకూచుంటే, ఇంక ఈ జాబితా అంతా ఎప్పటికి పూర్తవుతుందని నీ అభిప్రాయం?" ఉడుకుబోతు

తనం అతని గొంతుకలో మార్మ్రోగింది. నోటికి రెండు ప్రక్కలా చేతులు గొట్టంలా పెట్టి శక్తికొద్దీ అరిచాడు.

"హలోవ్! హలోవ్!!" అని.

జవాబు లేదు.

"హలోవ్ ఇంక వదులుకున్నాం." అందొక గొంతు కొంటెగా

"తిమ్మిరెక్కిందా ఒళ్ళు?" అని గుడ్లురజేశాడు మార్గన్

"వొదులుస్తానుండండి."

మళ్ళీ చేతులు గొట్టంలా చేసి నోటిదగ్గర పెట్టి అరిచాడు,

"హైలాండ్! హైలాండ్!!"

ఇంకో నాలుగు రోజులు ఈడ్చుకుంటూ, అతి నెమ్మదిగా గడిచాయి. వాటితో కలిపి తొమ్మిదిరోజులయింది నేలమీద ఓడ దిగి.

ఓడలో గొడవ ఎక్కువైంది. సెలవు ఇవ్వవలసిన మూడు నాలుగు సిబ్బందీల జనం ఇంక విసుగెత్తిపోతున్నారు. అధికారులు వాళ్ళ సెలవు వాయిదావేస్తూ గడుపుతున్నారు. వాళ్ళకి చిరాకెత్తుతోంది.

"మార్గన్ మళ్ళీ ఈ ఉదయం మూడో సిబ్బంది జాబితా పట్టుకువెళ్ళాడు. మళ్ళీ అదే సమాధానం. ఇది వ్యతిరిక్త లోకంగా పరిగణించడానికి వీల్లేదనీ, మనం ఇష్టం వచ్చినట్టు తిరగొచ్చుననీ గ్రేడర్ ఒప్పుకున్నాడు."

"మరయితే ఆ నియమాన్ని ఎందుకు పాటించడు? అవి ఉల్లంఘిస్తే అంతరిక్ష కమిషన్ అతన్ని డొక్క చీలుస్తారే."

"ఒకటే వంక. అతను సెలవు ఇవ్వనని అనడంలేదట, వాయిదా వేస్తున్నాట్ట. దాటెయ్యడానికి తెలివైన దారే చూసుకున్నాడు. మాయమైపోయిన జనం తిరిగి రావడంతోటే మనకి సెలవిస్తాట్ట."

"వాళ్ళసలు రాకపోతే? వాడిమొహంమండ. వాళ్ళవంక బెట్టి మనకి సెలవు తువరం చెయ్యడం ఏం న్యాయం?"

వాళ్ళ వాదంలో న్యాయమూ ఉంది, బలమూ ఉంది. వారాలు, నెలలు, సంవత్సరాలు అదిరిపోయే ఆ అంతరిక్షనౌకలో బందీలుగా ఉన్నారు వాళ్ళు-నౌక ఎంత పెద్దది కానివ్వండి. కొద్ది సేపయినా ఆ బందిఖానాలోంచి బయటపడాలని ఉంటుంద వాళ్ళకి. నేలమీద నడవాలి, గాలి ధారాళంగా పీల్చుకోవాలి. విశాలమైన ఆకాశం, దిఙ్మండలం కంటి కగుపించాలి, కడుపు పగిలేటట్టు తినాలి, కొత్తముఖాలు చూడాలి. కాస్త అందమైనపిల్ల సాహచర్యం కావాలి.

"మనకి కాస్త పరిసరాలు అలవాటై చనువేర్పడే సరికి తలుపులు బిగించేస్తాడు. ఏంలేదు. ఆ గాంధీయుల్లా దుస్తులు వేసుకుని వాళ్ళతో కలిసిపోయి తిరగాలి. అదీమజా. మొదటి సిబ్బందీ అప్పుడే రెండో సెలవకి తొందరపడుతున్నారు."

"అమ్మో! గ్రేడర్ మాత్రం ఆ పని జరగనివ్వడు. ఇప్పటికే చాలామంది మాయమైపోయారు. ఇంకో సిబ్బంది సెలవు మీద వెళ్ళి అందులో సగంమంది అంతర్ధానమైతే, ఇంక ఓడ నడపడానికి జనం చాలరు. అంతా ఇక్కడే ఉండిపోవాలి. నీకెలా ఉంటుందిప్పుడు."

"నాకు బాగానే ఉంటుంది."

"ఈ పెద్ద ఉద్యోగస్థులు కాస్తపనన్నా నేర్చుకుంటారు. ఇప్పటికైనా వాళ్ళోంచి పనిచెయ్యకపోతే ఎల్లా?"

"మూడేళ్ళుపడుతుంది వాళ్ళు నేర్చుకునేసరికి. నీపని నువ్వు నేర్చుకోడానికి పట్టలా?''

హారిజన్ ఒక కవరు పట్టుకుని వచ్చాడు. కనబడగానే ముగ్గురతన్ని దుయ్యబట్టారు.

"చూడండి. దొరగారు అతన్నికూడా మనలాగే ఓడదాటిపోవద్దన్నారు."

"అదే నాకు సరదాగా ఉంది," అన్నాడు హారిజన్, "ఏ తప్పూ చెయ్యకండా శిక్ష అనుభవించడం కన్న, తప్పుచేసి అనుభవించడం నయం."

"ఇది ఆట్టే కాలం సాగదులే. చూస్తావుగా....ఎంత కాలం ఈ మూసిన తలుపులు మధ్య ఉంటాం? త్వరలో మేం ఏదో చేసి తీరుతాము"

"ఏం చేస్తారు?"

"అదే ఆలోచిస్తున్నాం,'' అని తప్పించుకున్నాడు ఎదటిమనిషి. ఇంత యిలా ప్రశ్నలడగడం అతనికి నచ్చలేదు. హారిజన్ చేతిలో ఉత్తరం చూశాడు.

"చేతిలో ఏమిటది? టపా వొచ్చిందా?"

"అబ్బ! ఎంత బాగా కనిపెట్టావు!" అన్నాడు హారిజన్.

"పోనీలే. నీ కిష్టం లేకపోతే చెప్పకు. తెలుసుకోవాలని నేనేం పడి చావడంలా. ఏదన్నా జీతం గీతం వచ్చిందేమో అనుకున్నాను. మీ ఇంజనీర్లకి దండిగా ముడుతుంటాయి ప్రభుత్వ పత్రాలు."

"నిజంగా ఇది టపాయే," అన్నాడు హారిజన్.

"చాల్లేవయ్యా. పిశ్చాంతరాళంలో ఈ మారుమూలకి నీకు టపా ఎక్కణ్ణుంచి వొచ్చింది?"

"నాకొచ్చింది."

"ఎలా వొచ్చింది?"

"వారెల్ తెచ్చాడు ఊళ్లోంచి. ఒక గంటైంది. నా స్నేహితు డొకడు ఇతనికి భోజనం పెట్టాడు. ఆ మెమో తీర్చడానికి ఈ ఉత్తరం పట్టికెళ్ళి నా కిమ్మన్నాడు." అతని చేట చెవుల్లో ఒకటి గర్వంగా కదిలింది."

"పలుకుబడి ఉండాలయ్యా! అదే మీకు లేదు."

ఒకడికి ఒళ్ళు మండి అడిగాడు, "వారెల్ ఓడ దాటి ఎల్లా వెళ్లాడు? వాడికేమన్నా ప్రత్యేక హక్కులున్నాయా?"

"ఒక రకంగా ఉన్నాయి. అతనికి పెళ్ళాం, ముగ్గురు పిల్లలు."

"అయితే?"

"రాయబారి దృష్టిలో కొంతమంది మిగతా వాళ్ళకంటే నమ్మదగిన వాళ్లు. వాళ్ళకి బాధ్యతలున్నాయి గనక, బంధాలున్నాయి గనక చటుకుని మాయమైపోలేదు. అంచేత అల్లాంటి వాళ్ళని కొద్ది మందిని ఏరి, మాయమైపోయిన జనాన్ని గురించి ఆచూకీ తియ్యడానికి పంపించారు."

"ఏమన్నా ఆచూకీ దొరికిందా?"

"అంతేమీ దొరకలేదు. వారెల్ దానివల్ల ఏం లాభం లేదంటాడు. అక్కడా అక్కడా కొద్దిమంది - మనవాళ్ళతనికంట బడ్డారట.

వాళ్ళని తీసుకొద్దామని ప్రయత్నించాడు. అంతా ఒకటె సమాధానం. 'నేనాపని చేయను.' గాంధీయులంతా 'అవా మెుమో' అన్నారట. అదీ సంగతి."

"అందులో ఏదో ఉండి ఉంటుంది" అని నిర్ణయించాడొక సైనికుడు. ఆలోచిస్తూ అన్నాడు, "అదేమిటో స్వయంగా వెళ్ళి చూడాలని ఉంది."

"బ్రిగేడర్ భయం అదే."

"అంతకంటే పెద్ద భయాన్నే ఎదుర్కోవాలతను. మాకు తొందరగా సెలవియ్యకపోతే. అంతకంతకి మా ఓర్పు సన్నగిల్లి పోతుంది."

"తప్పు తప్పు" అన్నాడు హారిజన్ తల అడ్డంగా తిప్పుతూ, వాళ్ళని మందలిస్తున్నట్టు. "అది రాజద్రోహం. ఏమిటి మీరిలా పాడైపోతున్నారు?"

సన్నటి నడవగుండా నడిచి వెళ్ళి హారిజన్ తన గది చేరుకున్నాడు. ఉత్తరాన్ని ఒక క్షణం పరీక్షించాడు. లోపల దస్తూరి ఆడవాళ్ళదేమో! అయితే బాగుండుననుకున్నాడు. కవరు చించి ఉత్తరం పైకి తీశాడు. అది ఆడదస్తూరీ కాదు.

సంతకం గ్లిడది. ఉత్తరంలో ఉన్నది ఇది:

"నే నెక్కడుంటేనేం? ఏం చేస్తుంటేనేం? – ఉత్తరం పొరబాటుని మరొకళ్ళ చేతులో పడుతుందేమోనని వ్రాయలేదు. కొంచెం పరిచయం బలపడేదాకా ఓపిక పడితే, నేను అద్భుతంగా,

హాయిగా ఇక్కడ స్థిరపడి పోతాను. అంతవరకే నన్ను గురించి చెప్పగలను. ఇక మిగతాది నీ విషయం."

"ఆఁ!" అనుకున్నాడు హారిజన్. పరుపుమీద వెనక్కి చేర్లబడ్డాడు. ఉత్తరం మీద వెలుతురు బాగా పడేటట్టుగా.

"ఇక్కడొక కాళీ దుకాణం ఉంది. ఒక పొట్టి బొండం అది ఆక్రమించుకున్నాడు. ఒక కర్మాగారం తరఫున వాడది ఆక్రమించుకున్నాట్ట. రెండు రబ్బరు బంతులమీద నడుస్తాయి. చూశావా – సైకిళ్లు? అవి తయారు చేస్తుందట ఆ కర్మాగారం. ఈ కాళీ దుకాణంలో వాటి అమ్మకానికీ, మరమ్మతుకీ ఒక కార్ఖానా లాంటిది ప్రారంభించాలని వాళ్ళ ఉద్దేశ్యం. ఈరోజు వరకూ ఆ బొండానికి నాలుగు దరఖాస్తులొచ్చాయట. అయితే అందులో ఎంజినీరింగ్ తెలిసినవాడొకడూ లేడు. ఈ ఉద్యోగం సంపాదించుకున్నవాడు ఈ ఊరిమీద 'బహుళార్థ సాధకమొమో' పారేస్తాట్ట. అంటే ఏమిటో నాకు తెలియదనుకో. ఏమయితేనేం? ఆ ఉద్యోగంలో చేరితే ఇంక ఆ దుకాణం నీది. పిచ్చి అభ్యంతరాలు మనసులోకి రానీయకు. ఎగిరి గంతేసి వచ్చెయ్యి. ఇక్కడ నీకు అద్భుతంగా ఉంది."

"ఆరి దీనమ్మ కడుపు బంగారంగానూ." అనుకున్నాడు హారిజన్. సంతకం కింద ఇంకా ఏదో ఉంది. చదివాడు.

**తా.క: చిరునామా సెత్ నీకిస్తాడు. తా. తాక: ఈ ఊరుందే నీ స్నేహితురాలి పుట్టిల్లు. ఇక్కడికొచ్చేద్దామనుకుంటోంది. ఆమె**

అక్కగారి దగ్గరుండాలని ఉందట. నాకూ ఉంది. అక్కగారు చాలా బాగుంటుందట!"

పక్కమీద అటూ ఇటూ అస్థిమితంగా దొర్లాడు. ఇంకోసారి ఉత్తరం చదివాడు. లేచి ఆ చిన్నగదిలో పచారు చేశాడు. భూమీ సామ్రాజ్యంలో చేరినవి పన్నెండు వందల లోకాలున్నాయి. అందులో పదోవంతు అతను చూశాడు. అంతరిక్ష యాత్రికుడెవడూ తన జీవితకాలంలో అన్నీ చూడలేడు. అంచేత అంతరిక్షసామ్రాజ్యాన్ని అనేక శాఖలుగా విభజించారు. ఒక్కొక్క శాఖను పరిపాలించడానికి ఒక్కొక్క సిబ్బందీ ఉంది.

ఇతర శాఖల్లో స్వర్గాలూ, కృత్రిమ స్వర్గాలూ ఎన్నున్నాయో అతనికి తెలియదు. వినికిడి ద్వారా తప్ప, వివరంగా తెలిసే అవకాశం లేదు. విన్న విషయాల్లో నిజమెంతో, కల్పన ఎంతో. ఎవరి మాటలో నమ్మి ఏదో ఒక లోకానికి పోయాక, అది చివరికి తను అనుకున్నట్టు లేకపోతే? అందరి అభిరుచులూ ఒకలాగ ఉండవు. ఒకడికి అమృతమైతే, మరొకడికి విషం కావచ్చు.

పింఛను పుచ్చుకోడమంటే-తిరిగి జీవితం కొత్తగా ప్రారంభించడమన్నమాట. ఉద్యోగంలో ఉన్నప్పటికంటె ఎక్కువశ్రమపడాలి. అన్ని వస్తువుల ఖరీదులూ ఆకాశం ఎత్తున ఉన్న భూమిమీదనైనా స్థిరపడాలి, లేకపోతే తన శాఖకు ఏదో ఒక లోకాన్నైనా ఎన్నుకోవాలి. ఎప్సిలాన్‌కూటం ఉంది. కాని అక్కడి గ్రహాల ఆకర్షణ శక్తికి తట్టుకోవాలి. శరీరం ఏనుగంత బరువెక్కిపోయి, అడుగుతీసి అడుగు వెయ్యడమే చచ్చినంతపనైపోతుంది. నార్టన్ స్వర్గ మొకటుంది. అక్కడ సెప్టిమస్ నార్టన్ మహారాజ పదవిని అంగీకరించి అతని దర్బారులో వంగి వంగి సలాములు పెట్టాలి.

పాలపుంతకు చిట్టచివర ఒక గ్రహంలో మాతృస్వామ్య వ్యవస్థను కొందరు మగరాయళ్ళైన స్త్రీలు స్థాపించారు. ఇంకో గ్రహంలో మానసికోద్వేగాలవల్ల కూరగాయల్ని కాపించే మనుషులున్నారు. సుమారు నలభై వెలుగు సంవత్సరాల దూరంలో పరుచుకుని ఉన్నాయి ఈ లోకాలు. బ్లీడర్ చోదనం ఉన్న నౌకల్లో తప్ప వాటిని చేరడం అసంభవం.

అతను స్వయంగా చూసిన లోకాలు ఒక వదంపైగా ఉన్నాయి. అన్నీ కలిపి ఈ విశ్వాంతరాళంలో ఒక చిన్న ముక్క అనుకోండి, అన్నిటిలోనూ కొన్ని కొన్ని జీవితసౌకర్యాలున్నాయి, పాటి మానవులున్నారు. కాని ఈ గాంధీలోకంలో మిగతావాటిలో లేని దొకటుంది. ఇది కంటెదట ఇప్పుడు స్పష్టంగా కనబడుతోంది. ఇప్పుడతనున్న వాతావరణంలో అదొక భాగం. తనకి అందుబాటులో ఉన్న వివరాలన్నీ బేరీజు వేసుకుని ఒక నిర్ణయానికి రావడానికి వీలుందిక్కడ. మిగతాలోకాలు అలాక్కాదు. అవన్నీ పూరంగా ఉన్నాయి.

చాటుమాటుగా బ్లీడర్ గదిలోకి వెళ్ళాడు. తన సైకిల్ని తుడిచాడు. నూనె వేశాడు. తిరిగి గదిలో కొచ్చేసరికి చీకటిపడుతోంది. జేబులో బిళ్ళతీసి గోడకి తగిలించాడు. దాన్ని చూస్తూ పక్కమీద పడుకున్నాడు.

'స్వే-నే-చే'

ఆజ్ఞాప్రసారక యంత్రం గట్టిగా అరిచింది.

"అందరికీ రేపుదయం ఆజ్ఞలు జారీచేయబడును. ఎనిమది గంటలకల్లా సిద్ధంగా ఉండాలి.''

"నేనాపని చేయను," అన్నాడు హారిజన్. కళ్లు మూశాడు- ఉదయం ఏడూ ఇరవై అయింది. అయితే ఎంత పొద్దో ఎవరికీ తెలియదు. అంతరిక్ష యాత్రికులు పొద్దు సంగతి మరిచిపోతారు. వాళ్ళకి పొద్దన్నదానికి అర్థంలేదుకూడా. మళ్ళీ వాళ్ళకది గుర్తు రావాలంటే ఓడ భూమివేపు మళ్లాలి. ఒక నెల్లాళ్ళపాటు వాళ్లు సూర్యుడు ఉదయించడం అస్తమించడం చూడాలి.

అంతరిక్ష పటాలగది కాళీగా ఉంది. యంత్రాగారంలో మాత్రం హడావిడిగా ఉంది. గ్రేడరున్నాడు. పెల్టన్, హోమ్, కర్ణధారి ఆడమ్సన్, పెర్త్, యేట్స్, అంతా. రాయబారి కూడా ఉన్నాడు.

"ఇలాంటి దుర్దినం వస్తుందని నేనెన్నడూ అనుకోలేదు." అని వాపోయాడు రాయబారి. నక్షత్రమండల పట్నంవేపు ముఖం చిట్లించి చూశాడు. "ఇంకా రెండు వారాలు పూర్తికాలేదు. ఓడి పోయినట్టు ఒప్పుకుని తిరిగిపోతున్నాం."

"తమరు క్షమిస్తే, నేను మీతో ఏకీభవించలేను." అన్నాడు గ్రేడర్, "మనల్ని ఓడించగలిగినవాళ్ళు శత్రువు లొక్కళ్ళే. వీళ్ళు శత్రువుల నిర్వచనంలోకిరారు అదే వీళ్ళ విషయంలో మనకొచ్చిన పెద్ద చిక్కు. వీళ్ళు వ్యతిరేకులనడానికి వీల్లేదు."

"అయుండొచ్చు. అయినా సరే, ఇది ఓటమే అంటాను. లేక పోతే ఇంకేమనాలి ?"

"అసందర్భమైన పరిస్థితివల్ల మన ప్రయత్నాలు నిష్ఫలమై పోయాయి. మనం ఇప్పుడు చెయ్యగలిగిందేమీలేదు. తనతో మాట్లాడ లేదన్న కారణంచేత ఎవడూ తన బిడ్డల్ని పట్టుకుని కొట్టలేదు గదా!"

"నౌకాధికారివి గనక నీ అభిప్రాయం అది. నీ దృష్టిలో చెయ్య వలసిందేమంటే, వెనక్కి తిరిగి వెళ్ళి జరిగిన విషయం అధికారులకు అందజెయ్యాలి. నీకిది మామూలు విషయం. అసలు మీ శాఖే అల్లాంటిది." రాయచారి నక్షత్రపటంవేపు బాధగా, అయిష్టంగా చూశాడు.

"నా హోదా, నా బాధ్యతలూ వేరు. నేను తిరిగి వెళ్ళిపోతే రాజకీయ పరిభాషలో అది ఓటమే. భూమియొక్క గౌరవమర్యాదలకు అది పెద్ద దెబ్బ. వెళ్ళిపోవడం మంచిదికాదని నాకు తోస్తుంది. నేనిక్కడ ఉండడమే నా కర్తవ్యమేమో! ఉంటే వాళ్ళవల్ల మరికొన్ని అవమానాలకు గురి కావచ్చు. అది వేరే విషయం."

"ఏది మంచిదో తమకు సలహా ఇవ్వడానికి నాకధికారంలేదు" అన్నాడు గ్రేడర్, "నాకు తోచింది ఇది: ఇక్కడ రక్షణ కార్యక్రమం కోసం మనం సైన్యాన్ని, ఆయుధాల్ని తీసుకురావచ్చు, ఉపయోగించవచ్చు. కాని ఈ గాంధీయులు అరాజక కృత్యాలు చెయ్యనంతకాలం వాటిని వీళ్ళమీద ప్రయోగించడానికి నాకధికారంలేదు. అదీగాక కోటీ ఇరవై లక్షల మందిని అదుపాజ్ఞల్లో ఉంచడానికి మన బలం చాలదు. దానికో పెద్ద నౌకాబలం కావాలి. మనం యుద్ధం చేసేది అంతరిక్షానికి ఒక కొసలో, భూమికి ఎంతో దూరాన్ని. విజయం సంపాదించినా మనకి లభించేది నిరుపయోగకరమైన ఒక లోకం."

"అవన్నీ నాకు గుర్తు చెయ్యనక్కరలేదు. ఈ విషయాలు నా బుర్రలో తిరిగి తిరిగి పిచ్చెక్కిస్తున్నాయి."

గ్రేడర్ నేనేం చెయ్యనన్నట్టు భుజాలు కుదించాడు. అంతరిక్షంలో ఏదన్నా చెయ్యవలసిందంటే చెయ్యడం అతని పని. అతనికున్నది కార్యదీక్ష. అంతర్గ్రహ రాజకీయాలతో అతనికి సంబంధం లేదు. అంతరిక్షం అతని రాజ్యం. ఇప్పుడు నేలను వదలి ఆకాశంలోకి

పోయే ముహూర్తం దగ్గర పడుతోంది గనక, అతనికి ఆత్రం ఎక్కువైంది. ఆ కార్యక్రమానికి అడ్డంకులు వస్తే అతనికి చిరాకు పెరుగుతుంది. అతనికి సంబంధించినంతవరకూ, ఈ గాంధీలోకం అన్ని లోకాల్లాంటిదే. ఒకసారి చూసేసి వెళ్ళిపోవాలి. ఇంకా చూడవలసినవి ఎన్నో లోకాలున్నాయి.

"ప్రభూ! తమరిక్కడ ఉండిపోవడమా, నాతో రావడమా అన్న విషయమై తమకు సందేహం ఇంకా తీరకపోతే, ఎంత త్వరలో వీలైతే అంత త్వరలో తమరొక నిర్ణయానికి వచ్చి నాతో చెప్పినట్టయితే సంతోషిస్తాను. మార్గన్ నాకొక విషయం అతి స్పష్టంగా సూచించాడు. మూడో సెలవు సిబ్బందికి పదిగంటలలోగా నేను శలవు ఇవ్వకపోతే, వాళ్ళు నా ఆజ్ఞను ధిక్కరించి ఓడ దిగిపోవడానికి నిర్ణయించుకున్నారట!"

"అటువంటి పనిచేస్తే వాళ్లు పెద్ద ఆపత్తు కొని తెచ్చుకున్నట్టు కాదూ?"

"ఆపత్తేగాని, అంత పెద్దదేం కాదు," అన్నాడు గ్రేడర్, "నేను నియమావళికి తల్లక్రిందు అర్థాలు చెప్పానని తప్పు నా మీదికి తిప్పుతారు. నేను వాళ్ళకి శలవు నిరాకరిస్తూ ఆజ్ఞ జారీ చెయ్యలేదు. అంచేత వాళ్లు వెళ్లిపోవడం తిరుగుబాటు కింద రాదు. నేనూరికే శలవు వాయిదా వేశానంతే. అంతరిక్ష కమిషను ముందు, నేను కావాలని నియమావళి నుల్లంఘించానని వాళ్ళు వాదించవచ్చు. పై అధికారులు తమ ఆధిక్యాన్ని నిరూపించుకోవడానికి, వాళ్ళ వాదన అంగీకరించవచ్చు.

"ఆ కమిషన్ చేత ఇల్లాంటి అంతరిక్షయాత్రలు కొన్ని చేయించాలసలు," అని తన అభిప్రాయంగా అన్నాడు రాయబారి. "ఊరికే కుర్చీల్లో కూర్చుని తీర్పులిచ్చేటప్పటికంటె, కొన్ని కొత్త సంగతులు వాళ్ళు నేర్చుకుంటారు." పై అధికారులమీద తను ఇచ్చిన తీర్పు సమంజసంగా ఉందా లేదా అన్నట్టు అందర్నీ ఒకసారి కలయజూశాడు.

"వాళ్ళని తీసుకొచ్చి, ప్రమాదవశాత్తూ నౌకలోంచి అంతరిక్షంలోకి తోసేసే మార్గం ఏమీ లేదేం? అటువంటి ప్రమాదం అంతరిక్ష యాత్రలకీ, మానవజాతికీ కాస్త మేలు చేకూర్చవచ్చు."

"ఆ ఆలోచన నాకు గాంధీయంగా కనబడుతోంది," అన్నాడు గ్రేడర్.

"అబ్బే? గాంధీయులికిది తట్టదు. వాళ్ళ పద్ధతేమిటంటే ఇది చేయను; అది చేయను; అని భీష్మించుకుని కూర్చోడం. కాని ఇక్కడ వాళ్ళు సాధించిన ఫలితాలు చూస్తే చాలురా నాయనా అనిపిస్తోంది."

రాయబారి ఒకసారి తీక్షణంగా తన ఇబ్బందిని గురించి మనసులో తర్కించుకుని, ఒక నిర్ణయాని కొచ్చేశాడు.

"నేను మీతో వచ్చేస్తున్నాను. అసలిది నా తత్వానికి విరుద్ధం. ఎంచేతంటే ఇది ఓడిపోయినట్టు ఒప్పుకోడమే. ఇక్కడుంటే వాళ్ళని ధిక్కరించినట్టౌతుందిగాని, దానివల్ల ప్రస్తుత స్థితిలో మనం సాధించేదేముంది?"

"మంచిది మహాప్రభూ!" అన్నాడు గ్రేడర్. ఓడ కిటికీ దగ్గరకు వెళ్ళి అందులోంచి ఊరువేపు చూశాడు.

"ప్రస్తుతం నా దళంలో నాలుగు వందలమంది తక్కువయ్యారు. కొందరింక తిరిగిరారు. మిగతావాళ్ళ మనం కనిపెట్టుకుని

ఉంటే ఎప్పటికైనా రాకపోరు. ఎక్కడో కాస్త అనుకూలమైన ఆతిథ్యం దొరికుంటుంది వాళ్ళకి. ఏ బల్లకిందో కాళ్లుజాపుకుని కూర్చుని కులాసాగా కాలక్షేపం చేస్తూవుంటారు. ఆ సరదా తీరేదాకా సెలవు పొడిగిస్తారు. అసలు సమయానికి రాలేకపోయాక ఇంకెప్పుడొస్తే ఏం? శిక్ష ఎలాగా అనుభవించక తప్పదు. ఈ దీర్ఘ ప్రయాణాల్లో ఇలాంటి ఇబ్బంది నాకు తప్పదు. భూమికి దగ్గరగా ఉన్న గ్రహాలైతే ఇంత అన్యాయం ఉండదు.''

ఎవరైనా తిరిగొస్తున్నారేమోనని కనుచూపుమేర బయలంతా వెతికాడు. ఒక్కపిట్ట కనబడలేదు.

''అయితే వాళ్ళకోసం ఆగడానికి వీల్లేదు. ముఖ్యంగా ఈ లోకంలో."

"నిజమే వీల్లేదు."

''ఇంకా ఇక్కడే అంటిపెట్టుకుని ఉంటే, మరో వందో రెండు వందలో మనకి కాకుండా పోతారు. ఇంక నౌకను అంతరిక్షంలో నడపడానికి జనం చాలరు. వాళ్ళకా అవకాశం ఇవ్వకుండా దాటెయ్యాలంటే ఒకటే మార్గం. వెంటనే నౌకను అంతరిక్షంలోకి తీసుకుపోవడానికి ఏర్పాట్లు చెయ్యాలి. ఆ ఆజ్ఞ జారీచేసిన క్షణంనించీ, వాళ్ల కే శలవు నిబంధనలు వర్తించవు. నౌకాయాన నియమావళికి వాళ్లు కట్టుబడి ఉండాలి."

గ్రేడర్ తన తెలివితేటల్ని సూచించడానికి వంకరగా నవ్వాడు.

"అంతరిక్ష న్యాయవాదులప్పుడు ఏం చెయ్యాలో తోచక బుర్రగోక్కోవాలి.''

"నీ ఇష్టం," అన్నాడు రాయబారి అతనితో ఏకీభవిస్తూ. తను కూడా నౌక కిటికీ దగ్గరకొచ్చి గ్రేడర్ ప్రక్కని నిలబడ్డాడు. దూరాన కనబడుతున్న రోడ్డు వంక చూశాడు. మూడు గాంధీయ వాహనాలు ఆగకండా వేగంగా దొర్లిపోయాయి. అతని ముఖం ముడుచుకు పోయింది. పర్వతమంత నౌక పక్కనుంచే దాన్ని కన్నెత్తైనా చూడ్డం లేదు వాళ్ళు. వాళ్ళ మనస్తత్వాలేమిటో అతనికర్థం కాలేదు. అతని చూపులు మరో పక్కకు మళ్ళాయి. చటుకుని బిగిసిపోయాడు.

"వాళ్ళవతల ఏం జేస్తున్నారు ?"

గ్రేడర్ గిరుక్కున అటు తిరిగాడు. ఆజ్ఞాప్రసారక యంత్రాన్ని నోటి దగ్గరగా లాగి అరిచాడు.

"తక్షణం అంతా లోపలికి వచ్చి నౌకాయానానికి సన్నాహాలు ప్రారంభించాలి."

రెండు మూడు ప్లగ్గులు ఇటూ అటూ మార్చి కేకవేశాడు.

"ఎవరక్కడ ? సార్జంట్ బిడ్వర్దీయా ? చూడు సార్జంట్ మేజర్ ! నౌకాగర్భానికి అవతల ఒక అరడజను మంది ఉన్నారు. వాళ్ళని తక్షణం లోపలికి రప్పించు. అంతా సిద్ధమైతే ఇంక నౌకను లేపెయ్యాలి."

ముందూ వెనకా ఉన్న నిచ్చెనలు అప్పుడే పైకెత్తేశారు. తెలివైన కింది ఉద్యోగి ఎవడో, ఇంక జనం దాటెయ్యడానికి వీల్లేకండా నౌకా గర్భం దగ్గరున్న తిరుగుడు మెట్లు పైకి లాగేశాడు. అంచేత పారిపోవాలనుకున్న జనాభాతోపాటు బిడ్వర్ది కూడా లోపలే చిక్కుపడి పోయాడు.

బిడ్‌వర్ధీ గత్యంతరం లేక పక్కనున్న మెట్లపక్క గంత దగ్గర నిలబడి అవతలి జనాన్ని తేరిపార చూశాడు. అతని మీసాలు నిక్క బొడుచుకోడమే కాకండా అదిరాయి. అందులో ఐదుగురు నేరస్థులు మొదటి సెలవు సిబ్బందిలోవాళ్లు. అందులో ఒకడు దళాధిపతి. అతని రక్తం వేడెక్కింది. దళాధిపతి కూడానా! ఆరోవాడు హారిజన్-మెరుస్తున్న సైకిల్‌తో సహా.

చూపుల్తో వాళ్ళనందర్నీ - ముఖ్యంగా దళాధిపతిని—భస్మం చేస్తూ బిడ్‌వర్ధీ అరిచాడు. రండి లోపలికి. ఇది ఆజ్ఞ. దీనికి తిరుగు లేదు. ఆజ్ఞనుల్లంఘిస్తే ఊరుకోం. నౌక కదులుతుంది.''

"విన్నావా?" అన్నాడొకడు పక్కవాడితో. "ఓడలోకి ఎక్కాలట! ముప్ఫయి అడుగులు గెంతలేకపోతే ఇంక రెక్కలు కట్టుకుని ఎగరాలి.

"చాలించు నీ పొగరుబోతుతనం" అన్నాడు బిడ్‌వర్ధీ, "నేను ఆజ్ఞ జారీచేయాలి."

"ఒకళ్ళ ఆజ్ఞకు కట్టుబడి పనిచేస్తాట్ట!" అన్నాడు దళాధిపతి, "ఎన్నేళ్లొస్తే ఏం లాభం?"

"అదే నా కర్థంకాలేదు," అన్నాడింకొకడు బిడ్‌వర్ధీని చూసి జాలిపడుతూ.

బిడ్‌వర్ధీ ఆవేశంతో తూలిపోయాడు. పట్టుకోడానికేదయినా దొరుకుతుందేమోనని తడుముకున్నాడు, ఒక మేకో, ఒక అంచో, ఒక గడియో ఏదన్నా సరే.

"ఇదిగో నన్నాట్టే విసిగించారంటే ఏంచేస్తానో...."

"బిడ్డీ, అనవసరంగా ఆయాసపడకు." అన్నాడు దళాధిపతి, "నేనింక గాంధీయుణ్ణి." ఆమాట అనేసి అతను రోడ్డు వెంబడి గబ గబా నడిచి వెళ్ళిపోయాడు. నలుగురతన్ని అనుసరించారు.

హారిజన్ సైకిల్ మీద కూర్చుని సైకిల్ తొక్కబోయాడు. అతని వెనక చక్రం తుస్సుమని చతికిలబడింది.

"రండి వెనక్కి" అని అరిచాడు బిడ్ వర్దీ, వెళ్ళిపోతున్న అయిదుగురినీ ఉద్దేశించి. చేతులతో రకరకాల సర్కస్ సంజ్ఞలు చేశాడు. తిరుగుమెట్లు పట్టుకు ఊడబీకెయ్యాలన్నట్టు లాగాడు. ఇంతలో నౌకలోంచి సన్నని కూత వినబడింది. దానితో అతని రక్తపుపోటు రెట్టింపయింది.

"వినపడిందా లేదా?" అని గర్జించాడు బిడ్ వర్దీ హారిజన్ని ఉద్దేశించి. హారిజన్ వెనక చక్రం వాల్వు సరిజేసుకుని గాలికొట్టు కుంటున్నాడు.

"ఇదిగో, మేమింక వెళ్ళిపోతున్నాం. ఆఖరుసారి...."

మళ్ళికూత. ఈసారి కీచుగా అయిదారుసార్లు మోగింది. గంత మూత కిందికొస్తుంటే బిడ్ వర్దీ చటుక్కున వెనక్కి దూకాడు. గంత మూసుకుపోయింది. హారిజన్ సైకిలెక్కాడు. ఒక పెడల్ మీద కాలూనాడు. నౌకను చూస్తూ సీటుమీద కూర్చున్నాడు. ఆలోహ కళేబరం తలనుంచి తోకదాకా అదిరింది. మెల్లగా నిశ్శబ్దంగా పైకిలేచింది. ఆ మహాకాయం అంత సునాయాసంగా పైకి లేవడంలో ఒక ఠీవి ఉంది. క్రమంగా పైకిపోయే వేగం పెరిగింది. అంతకంతకీ చిన్నదిగా అయిపోతూ అంతరిక్షంలో కలిసిపోయింది.

క్షణంపాటు హారిజన్ మనస్సు పీకింది, సందేహాలతో, సంకో చాలతో. మళ్ళీ స్థిరపడింది. రోడ్డువేపు తిరిగాడు.

ఐదుగురు కొత్త గాంధీయులూ ఒక బస్సులో చోటు సంపాదించుకున్నారు. బహుశా నౌక వెళ్ళిపోయింది గనక వాళ్ళకా మాత్రం ఆదరం లభించి ఉంటుంది. దిట్టమైన వాళ్లు వీళ్లు. పెద్ద రబ్బరు బంతుల చక్రాలమీద బస్సు అతని ప్రక్కనుంచి దొర్లి పోయింది. అందులో ఐదుగురూ వెళ్ళిపోయారు. ఇంకో పంఖా సైకిలు రయ్ మని రెండో దిక్కుకి వెళ్లిపోయింది.

"నీ స్నేహితురాలు," అని వ్రాశాడు గ్లిడ్ ఉత్తరంలో. అతనికా అభిప్రాయం ఎందుకు కలిగింది? ఒకవేళ తన చేట చెవుల విషయం ప్రస్తావించకండా ఆమె తన్ను గురించి ప్రస్తావిస్తే, గ్లిడ్ దురభిప్రాయ పడ్డాడేమో!

ఆఖరుసారి నౌక ఉన్న వేపు తిరిగిచూశాడు. పన్నెండడుగుల లోతున పెద్దగొయ్యి మాత్రం మిగిలిందక్కడ. రెండు వేల భూమీయులు దిగారక్కడ.

ఆ తరవాత పద్దెనిమది పందలయారు.

తరవాత పదహారు.

మరో అయిదు తగ్గారు.

"ఒకడు మిగిలాడు—అది నేను," అన్నాడు. ఒకసారి నిట్టూర్చి సైకిలుముందుకి తొక్కాడు. ఊరివేపు. ఇంక అక్కడెవరూ మిగల లేదు.

---

(ఎరిక్ ఫ్రాంక్ రసెల్ రచన-

**AND THEN THERE WERE NONE**

అనే వైజ్ఞానిక కల్పిత కథా సంకలనంనుండి అనూదితము)